

'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 17 | సంచిక: 334

సోమవారం 24-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



దాయాదిపై విరాట్ విజయం

విశ్వవ్యాప్త ప్రేక్షకులు... ఇరు దేశాల అభిమానులు... క్రికెట్ విశ్లేషకులు... విమర్శకులు... దిగ్గజాలు... పలురంగాల ప్రముఖులు... ఇలా యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిన మ్యాచ్‌లో టీమిండియా దంచేసింది. డిఫెండింగ్ చాంపియన్ పాకిస్తాన్‌పై అలవోక విజయంతో సెమీఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది.

కీలకపోరులో పాకిస్తాన్‌పై భారత్ ఘనవిజయం • విరాట్ కోహ్లి అజేయ సెంచరీ

అందరూ ఎదురుచూసిన చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో రోహిత్ శర్మ సారథ్యంలోని భారత్ 6 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. 2017లో తమపైనే ఫైనల్లో గెలిచి కప్‌ను లాక్కెళ్లిన పాక్ జట్టును టీమిండియా ఈసారి పెద్ద దెబ్బే కొట్టింది. అసలు కప్ రేసులో పడకముందే లీగ్ దశలోనే నిష్క్రమించేలా ఓడించింది. ఇంట (పాక్‌లో) జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో... దుబాయ్‌లో జరిగిన పోరులో భారత్ చేతిలో... చిత్తుగా ఓడిన పాకిస్తాన్‌కు ఇక ఆతిథ్య మురిపెమే మిగలనుంది. సెమీఫైనల్‌కు వెళ్లే దారైతే మూసుకుపోయింది. 2017 విజేత పాక్ గ్రూప్ 'ఎ'లో అందరికంటే ముందే నిష్క్రమించే జట్టుగా అట్టడుగున పడిపోనుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (76 బంతుల్లో 62; 5 ఫోర్లు), రిజ్వాన్ (77 బంతుల్లో 46; 3 ఫోర్లు) రాణించారు. కుల్దీప్ 3 వికెట్లు, హార్దిక్ పాండ్యా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 42.3 ఓవర్లలో నాలుగే వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసి గెలిచింది. సులువైన విజయం ముంగిట విరాట్ కోహ్లి (111 బంతుల్లో 100 నాటౌట్; 7 ఫోర్లు) బౌండరీ కొట్టి సెంచరీని పూర్తి చేసుకోగా, భారత్ కూడా లక్ష్యాన్ని అధిగమించింది. శ్రేయస్ అయ్యర్ (67 బంతుల్లో 56; 5 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (52 బంతుల్లో 46; 7 ఫోర్లు) రాణించారు. షాహీన్ షా అఫ్రిది 2 వికెట్లు తీశాడు. కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' లభించింది. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను మార్చి 2న న్యూజిలాండ్‌తో ఆడుతుంది.

14లో

ఆశలు గల్లంతు!

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి 40 గంటలు దాటినా తెలియని కార్మికుల జాడ

సొరంగం లోపలికి మూడు బృందాలుగా వెళ్లిన సహాయక సిబ్బంది

అక్కడి భీతావహ పరిస్థితి చూసి ఆశలు వదిలేసుకున్న యంత్రాంగం



సొరంగంలో సహాయక సిబ్బంది

- కార్మికులపై మట్టి, శిథిలాలు పడి ఉండవచ్చనే అనుమానాలు.. లేకుంటే మట్టితో మూసుకుపోయిన భాగం అవతలి వైపు ఉండొచ్చనే భావన
- ఏదైనా అద్భుతం జరిగితేనే వారు ప్రాణాలతో ఉంటారని చర్చ..
- పైకప్పు కూలిన చోట 200 మీటర్ల మేర మట్టి, రాళ్లతో నిండిపోయినట్టు అంచనా
- ఆ ప్రాంతానికి 100 మీటర్ల సమీపం వరకు మాత్రమే వెళ్లగలిగిన రెస్క్యూ సిబ్బంది
- భారీగా నీటి ఊట, బురద, శిథిలాల వల్ల ముందుకు కదలలేని పరిస్థితి
- వీటన్నింటినీ తొలగించే ప్రయత్నం చేస్తే... పైకప్పు మళ్లీ కూలవచ్చనే ఆందోళన



పరిస్థితి ఆశాజనకంగా లేదు: జూపల్లి



రంగంలోకి ర్యాట్ హోల్ మైనర్స్!

2లో

టన్నెల్ తవ్వే మెషీన్ పనికొస్తుందో లేదో చెప్పలేం

'సాక్షి'తో సొరంగం నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ ఎండీ పంకజ్ గౌర్ వెల్లడి



సహాయక చర్యలకు నీటి లీకేజీ అడ్డంకి

- టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం: మంత్రి ఉత్తమ్
- ఆర్మీ, నేవీ, డిజాస్టర్ టీమ్స్ నిపుణులతో రెస్క్యూ ఆపరేషన్.. ఈ అంశంపై బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తోందని మండిపాటు

2లో

ఆదివారం ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సుదర్శన చక్రం వద్ద పూజలు చేస్తున్న వానమామలై రామానుజ జీయర్ స్వామి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు



వైభవంగా మహాకుంభాభిషేక సంప్రోక్షణ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరణ

- మహాకుంభాభిషేక సంప్రోక్షణ చేసి ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వానమామలై రామానుజ జీయర్ స్వామితో కలిసి లక్ష్మీనృసింహుడికి అంకితం

సాక్షి, యాదాద్రి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ విమాన గోపురం ఆవిష్కరణ మహోత్సవం పంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం వైభవంగా సాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా దివ్య స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించారు. వానమామలై రామానుజ జీయర్ స్వామితో కలిసి రేవంత్.. శ్రీ సుదర్శన చక్రానికి మహాకుంభాభిషేక సంప్రోక్షణ చేసి, స్వర్ణ విమాన గోపురాన్ని లక్ష్మీనృసింహుడికి అంకితమిచ్చారు.

సంప్రోక్షణ మహోత్సవం సాగిందిలా..

మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా పంచకుండాత్మక యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 11:24 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సతీసమేతంగా యాగశాలకు చేరుకోగా రుత్విక్కులు వారికి

మిగతా 3వ పేజీలో ▶



దేవభూమిలో వేసవి విహారం

సాక్షి ప్లస్‌లో

'ఆరోగ్య భారతం' అత్యావశ్యకం



- 'మన్ కీ బాత్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- దేశంలో స్థూలకాయులు పెరిగిపోతుండడం ఆందోళనకరం
- ఒబేసిటీపై మనమంతా యుద్ధం చేయాల్సిందే
- వంటనూనెల వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించుకోవాలి
- వచ్చే నెల 8న నా సోషల్ మీడియా ఖాతాలను మహిళలకే అప్పగిస్తా
- వారు తమ విజయాలను అందులో పంచుకోవచ్చు

6లో

అరిగె మౌనిక.. ఎల్బీనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. 'అపార్' నమోదు కోసం బర్త్ సర్టిఫికెట్ (జనన ధ్రువీకరణ పత్రం) సమర్పించాలని స్కూల్ నిర్వాహకులు స్పష్టం చేయడంతో.. తండ్రితో కలసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లింది. కానీ పదిహేనేళ్ల క్రితంనాటి ఆ రికార్డులు లేవని మున్సిపల్ అధికారులు చెప్పారు. అయితే అక్కడే ఉన్న మీసేవ కేంద్రం నిర్వాహకుడు జోక్యం చేసుకుని రూ.10 వేలు ఇస్తే బర్త్ సర్టిఫికెట్ ఇప్పిస్తానని చెప్పారు. మౌనిక తండ్రి రూ.8 వేలకు బేరం మాట్లాడుకుని రెండు రోజుల్లో జనన ధ్రువీకరణ పత్రాన్ని సంపాదించి పాఠశాలలో సమర్పించారు.

..పాఠశాల విద్యార్థుల కోసం తెచ్చిన అపార్ విధానం ఇలా మధ్యవర్తులకు కాసులు కురిపిస్తోంది. ప్రధానంగా బర్త్ సర్టిఫికెట్ జారీ చేసే కార్యాలయాల ఉద్యోగులు, మీసేవ, ఆధార్ నమోదు కేంద్రాల నిర్వాహకులు, స్థానిక సంస్థల కార్యాలయాల వద్ద ఉన్న మధ్యవర్తులు విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉచితంగా అందించాల్సిన పౌర సేవల కోసం అందినకాడికి దండుకుంటున్నారు.



అవస్థల 'అపార్'!

విద్యార్థుల విశిష్ట గుర్తింపునకు ఇక్కట్లు ఎన్నెన్నో..

ఆధార్, స్కూల్ రికార్డు, యూడైస్‌లలో వివరాలు ఒకేలా ఉంటే సరే..

ఎక్కడ చిన్న పొరపాటు ఉన్నా 'అపార్' నమోదు సాధ్యమవని పరిస్థితి

- పొరపాట్ల సవరణ కోసం స్థానిక సంస్థలు, ఆధార్, మీసేవ కేంద్రాల చుట్టూ తల్లిదండ్రుల చక్కర్లు
- దరఖాస్తుదారుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న దళారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు


- వివరాలు 16లో

రేపటి నుంచి బయో ఏషియా

- రెండు రోజులపాటు సదస్సు నిర్వహణ
- హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్
- సదస్సును ప్రారంభించనున్న సీఎం రేవంత్, కేంద్ర మంత్రి పీయూష్

సాక్షి, హైదరాబాద్: బయో ఏషియా సదస్సుకు హైదరాబాద్ ముస్తాబైంది. మంగళవారం నుంచి రెండు రోజులపాటు నగరంలోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్‌ఐసీసీ)లో జరగనున్న బయో ఏషియా 22వ ఎడిషన్ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దాదాపు 50 దేశాలకు చెందిన 3 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈసారి బయో ఏషియా సదస్సుకు 'క్యాటలిస్ట్ ఆఫ్ ఛేంజ్..ఎక్స్‌పాండింగ్ గ్లోబల్ హెల్త్‌కేర్ ఫ్రాంటియర్స్' (మార్పు సాధిద్దాం..ఆరోగ్య సంరక్షణలో హద్దులు చెరిపేద్దాం) అనే

మిగతా 5వ పేజీలో ▶



ఇవాంటుకోత



చప్పుడు లేకుండా రయ్‌రయ్

రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ వాహనాల సంఖ్య

- ఏడాదిన్నరలో లక్షకుపైగా రోడ్లపైకి.. 3 నెలల్లోనే దాదాపు 15 వేల ఈవీల కొనుగోలు
- విద్యుత్ వాహన పాలసీతో ఒక్కసారిగా పెరిగిన డిమాండ్
- ఇంధన ఖర్చులో ఆదా, రాయితీల ప్రకటనతో కొనుగోళ్లు పైపైకి

రాష్ట్రంలో ఈవీల లెక్కలు ఇవీ..

2020-21	2,603
2021-22	14,785
2022-23	39,111
2023-24	61,507
2024-25	58,916
మొత్తం	1,76,922



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరగడంతో ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగాయి. నాలుగేళ్ల కిందట 3 వేలలోపు ఉన్న ఈవీల సంఖ్య ప్రస్తుతం సుమారు 1.77 లక్షలకు చేరింది. ముఖ్యంగా విద్యుత్ ద్విచక్ర వాహనాలు సాధారణ పెట్రోల్ టూవీలర్ల విక్రయాలకు పోటీనిచ్చే దిశగా సాగుతుండటం విశేషం. ఏప్రిల్ నాటికి వాటి సంఖ్య లక్షన్నర కంటే పెరగనుండటం విశేషం. మరోవైపు ఈవీ చార్జింగ్ కేంద్రాలను పెంచడంపై ప్రభుత్వం అంతగా శ్రద్ధ చూపకపోవడంతో విద్యుత్ కార్లు కొనేందుకు వినియోగదారులు సంకోచిస్తున్నారు. దీంతో వాటి సంఖ్య పరిమితంగానే ఉంటోంది.

ఈవీ పాలసీ రాకముందు అంతంతే..

రాష్ట్రంలో 2021కి ముందు వరకు నామమాత్రంగానే విద్యుత్ ద్విచక్ర వాహనాలు ఉండేవి. వాటి కొనుగోళ్లపై ప్రజల్లో అవగాహన సైతం అంతంత మాత్రంగానే ఉండేది. విద్యుత్ వాహనాలు అంత సురక్షితం కాదని.. వాటి చార్జింగ్ ఇబ్బందికరంగా ఉంటుందని.. మధ్యలో బ్యాటరీ డిశ్చార్జి అయితే తిరిగి చార్జింగ్ చేయడం కష్టమనే భావన ఉండేది. అదే సమయంలో కొన్ని ద్విచక్రవాహనాల్లో బ్యాటరీలు పేలుతుండటం వారిలో అనుమానాలు, భయాన్ని మరింత పెంచింది. ఫలితంగా వాటి సంఖ్య ఆశించిన

మిగతా 3వ పేజీలో ▶

మద్యంలో మరిన్ని బ్రాండ్లు

- కొత్త లిక్కర్ బ్రాండ్ల సరఫరా కోసం నోటిఫికేషన్
- ఇప్పటికే రిజిస్టర్ అయిన కంపెనీలతో పాటు కొత్త కంపెనీలకూ చాన్స్
- దరఖాస్తులకు మార్చి 15 వరకు గడువు



సాక్షి, హైదరాబాద్: విదేశాలతో పాటు దేశీయంగా తయారయ్యే కొత్త మద్యం బ్రాండ్లను తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ (టీజీబీసీఎల్)కు కొత్త బ్రాండ్లను సరఫరా చేసేందుకు కంపెనీలను ఆహ్వానిస్తూ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం.. ఇప్పటివరకు రాష్ట్రంలో మద్యం (బీర్, లిక్కర్) సరఫరా చేస్తున్న కంపెనీలతో పాటు కొత్త కంపెనీలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో ఈ దరఖాస్తులు సమర్పించేందుకు మార్చి 15వ తేదీ వరకు గడువు ఉంది. విదేశాల్లో, దేశీయంగా తయారయ్యే మద్యం బ్రాండ్లను సరఫరా చేసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే టీజీబీసీఎల్‌కు మద్యాన్ని

మిగతా 12వ పేజీలో ▶



సహాయక సామగ్రి తీసుకుని లోకో ట్రైన్‌లో సొరంగం లోపలికి వెళుతున్న రెస్క్యూ బృందాలు


ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కూలిన ప్రదేశానికి ముందు భాగంలో భారీగా పేరుకుపోయిన శిథిలాలు, బురద


సొరంగంలో ప్రమాదం జరిగిన స్థలానికి ముందున్న శిథిలాలు తొలగిస్తున్న సహాయక సిబ్బంది

సొరంగంలో ఆశలు గల్లంతు!

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి 40 గంటలు దాటినా కార్మికుల జాడ తెలియని స్థితి

సొరంగం లోపలికి మూడు బృందాలుగా వెళ్లిన సహాయక సిబ్బంది

అక్కడి భీతావహ పరిస్థితి చూసి ఆశలు వదిలేసుకున్న ప్రభుత్వ యంత్రాంగం

పైకప్పు కూలిన చోట 200 మీటర్ల మేర మట్టి, రాళ్లతో నిండిపోయిన సొరంగం

ఆ ప్రాంతానికి 100 మీటర్ల సమీపం వరకు మాత్రమే వెళ్లగలిగిన రెస్క్యూ సిబ్బంది

భారీగా నీటి ఊట, బురద, శిథిలాల వల్ల ముందుకు కదలలేని పరిస్థితి

వీటన్నింటినీ తొలగించే ప్రయత్నం చేస్తే... పైకప్పు మళ్లీ కూలవచ్చనే ఆందోళన

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్/ సాక్షి, నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) తొలి సొరంగం పైకప్పు కుప్పకూలడంతో గల్లంతైన 8 మంది కార్మికుల ఆచూకీ తెలియరాలేదు. కార్మికులను బయటికి తీసుకొచ్చేందుకు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సింగరేణి, ఆర్మీ సహాయక బృందాలు ఆదివారం రోజంతా చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రమాదం జరిగి 40 గంటలైనా కార్మికుల జాడగానీ, వారి యోగక్షేమాలుగానీ తెలియకపోవడంతో... వారు సురక్షితంగా బయటపడే అవకాశం తక్కువనే చర్చ జరుగుతోంది. ఆదివారం ఎన్డీఆర్‌ఎఫ్, ఇతర రెస్క్యూ బృందాలతో కలసి లోకో ట్రైన్ ద్వారా సొరంగం లోపలికి వెళ్లి.. సుమారు 6 గంటల తర్వాత తిరిగి వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా.. పరిస్థితి నిరాశాజనకంగా ఉందని పేర్కొన్నారు. సొరంగం లోపలి వరకు వెళ్లి బయటికి వచ్చినవారు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌లెట్ నుంచి 13.93 కిలోమీటర్ల లోపల పైకప్పు కూలిన చోట దాదాపు 200 మీటర్ల మేర మట్టి, బురద నీరు, శిథిలాలతో సొరంగం మూసుకుపోయింది. ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో 12 కిలోమీటర్ల వద్ద సైతం మోకాలి లోతు నీళ్లు ఉన్నాయి. కూలిన మట్టి, శిథిలాలను తొలగిస్తేగానీ గల్లంతైన కార్మికులను చేరుకోలేని పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటివరకు అలాంటి ప్రయత్నాలేమీ ప్రారంభం కాలేదు.

ఏదైనా అద్భుతం జరిగితే కానీ..

సొరంగం లోపల పరిస్థితి భీతావహంగా ఉండటం, మళ్లీ పైకప్పు కూలవచ్చనే ఆందోళనల నేపథ్యంలో రెస్క్యూ కష్టసాధ్యంగా మారింది. దోమలపెంట వద్దనున్న ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఇన్‌లెట్ నుంచి ప్రమాద స్థలానికి చేరుకునేందుకు ఒక్క లోకో ట్రైన్ మాత్రమే ఆధారం. దాని ద్వారా 12.6 కిలోమీటర్ల దూరం వరకు మాత్రమే ప్రయాణించేందుకు వీలుంది. అక్కడి నుంచి కన్వేయర్ బెల్టు మీద లోపలికి చేరుకోవాల్సి వస్తోంది. సొరంగం కుప్పకూలిన ప్రాంతానికి 100 మీటర్ల సమీపం వరకే సహాయక బృందాలు వెళ్లగలిగాయి. శిథిలాలు కొట్టుకురావడంతో వాటిని తొలగించకుండా ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. ఎప్పటికప్పుడు పెరుగుతున్న నీటి ఊటను మోటార్ల సాయంతో తొలగిస్తున్నారు. నిమిషానికి 10 వేల లీటర్ల నీటిని ఎత్తిపోసే మోటార్లను వినియోగిస్తున్నారు. లోపలికి వెళ్లి బయటికి వచ్చిన రెస్క్యూ బృందాలతో 'సాక్షి' మాట్లాడింది. గల్లంతైన కార్మికుల మీద కాంక్రీట్ సెగ్మెంట్లు, మట్టి, శిథిలాలు పడి ఉండవచ్చని వారు పేర్కొన్నారు. లేదా వారు సొరంగం కూలిన ప్రాంతానికి ఆవలివైపు చిక్కుకుని ఉన్నా.. రెండు వైపులా మూతపడి ఉండటంతో ఆక్సిజన్ లభించడం కష్టమేనని భావిస్తున్నట్టు చెప్పారు. ఏదైనా అద్భుతం జరిగితేనే వారు ప్రాణాలతో ఉంటారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సొరంగం కూలిన ప్రాంతానికి 100 మీటర్ల సమీపం దాకా వెళ్లిన రెస్క్యూ సిబ్బంది.. కార్మికులను ఉద్దేశించి గట్టిగా అరుస్తూ పిలిచినా ఎలాంటి స్పందన రాలేదని అంటున్నారు.

తీవ్ర ఉత్కంఠ మధ్య..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం–1 ఇన్‌లెట్ నుంచి 13.93 కిలోమీటర్ల లోపల శనివారం ఉదయం 8.30 గంటలకు పైకప్పు కూలిపడింది. ఆదివారం అర్ధరాత్రి సమయానికి 40 గంటల కీలక సమయం గడిచిపోయింది. దీనితో కార్మికుల క్షేమంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. తీవ్ర ఉత్కంఠ మధ్య ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సింగరేణి, అగ్నిమాపక శాఖ, ఆర్మీకి చెందిన రెస్క్యూ సిబ్బంది మూడు వేర్వేరు బృందాలుగా ఏర్పడి సొరంగం లోపలికి లోకో ట్రైన్ ద్వారా వెళ్లారు. వారు తిరిగి వచ్చి గల్లంతైన కార్మికుల యోగక్షేమాల గురించి చెబుతారేమోనని.. సొరంగం బయట అధికారులు, నేతలు, మీడియా ప్రతినిధులు ఉత్కంఠగా ఎదురు చూశారు. కానీ మంత్రితోపాటు రెస్క్యూ సిబ్బంది నిరాశ వ్యక్తం చేశారు.

సహాయక చర్యల్లో ఆర్మీ

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యల కోసం సైన్యం కూడా రంగంలోకి దిగింది. సికింద్రాబాద్ నుంచి ఆర్మీ బైసన్ డివిజన్‌కు చెందిన ఇంజనీర్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నట్టు అధికారులు తెలిపారు. ఆర్మీ వైద్య బృందాలను సైతం టన్నెల్ వద్ద అందుబాటులో ఉంచారు. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా ఆర్మీ అధికారులు రెస్క్యూ ఆపరేషన్లను సమన్వయం చేస్తున్నారు.

శిథిలాలు, బురద తొలగించేదెలా?

సొరంగం కూలిపడి పేరుకుపోయిన మట్టిని, శిథిలాలను తొలగించనిదే కార్మికుల వద్దకు రెస్క్యూ బృందాలు చేరుకోలేని పరిస్థితి. కానీ నీటి ఊటల కారణంగా.. మట్టిని తొలగించిన కొద్దీ పైకప్పు మళ్లీ కూలే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సొరంగం భూఉపరితలం నుంచి సుమారు 400 మీటర్ల దిగువన ఉందని, కూలిన చోట మట్టిని తీసిన కొద్దీ.. పైన వదులుగా ఉన్న మట్టి మళ్లీ సొరంగంలోకి పడిపోతుందని రెస్క్యూ సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే సొరంగంపైన భూమి ఉపరితలం నుంచి డ్రిల్లింగ్ చేసి కార్మికులను బయటికి తీసుకువచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపినా.. 400 మీటర్ల లోతున రంధ్రం చేయడానికి చాలా రోజుల సమయం పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సొరంగంలో పేరుకున్న మట్టి, నీళ్లు, ఇతర శిథిలాలను తొలగించేందుకూ కొన్ని రోజుల సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

పైకప్పు కూలిన చోట.. కాంక్రీట్ సెగ్మెంట్ లేదు!

సొరంగంలో ప్రమాదం జరిగిన చోట పైకప్పుకు రక్షణగా కాంక్రీట్ సెగ్మెంట్లు లేవని తెలిసింది. టన్నెల్ చివరన పనులు జరిగిన చోట సుమారు 100 మీటర్ల మేర కాంక్రీట్ సెగ్మెంట్లను ఏర్పాటు చేయలేదని సమాచారం. అంతేగాకుండా సొరంగంలో నాలుగేళ్లుగా నీటి ఊటలు (సీపేజీ) కొనసాగుతుండటంతో మట్టి వదులుగా మారడం, తవ్వకం పనుల్లో రక్షణ గోడ నిర్మించకపోవడం, భద్రతా ప్రమాణాలను పాటించకపోవడంతో పైకప్పు కుప్పకూలిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏదైనా వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంటేనే..

సొరంగం లోపల చిక్కుకున్న కార్మికులను బయటికి తెచ్చేందుకు ఏదైనా వ్యూహాన్ని సిద్ధం చేసుకుని ఆచరణలో పెడితేనే ఫలితమిచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రత్యేక వ్యూహం లేకుండా రెస్క్యూ బృందాలు లోపలి వరకు వెళ్లి వచ్చినట్టు తెలిసింది. సొరంగంలో పేరుకున్న మట్టిని తొలగించి కన్వేయర్ బెల్టుల ద్వారా, లేదా లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపితే గానీ చిక్కుకున్న కార్మికుల జాడ కనుక్కోలేని పరిస్థితి నెలకొంది. అడ్డంకులన్నీ అధిగమించి కార్మికులను చేరుకునేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

టీబీఎం మెషీన్ దగ్గరికి చేరుకోవడమే కష్టంగా ఉంది



సొరంగంలో పైకప్పు కూలిన చోట ఉన్న టీబీఎం మెషీన్ వద్దకు చేరుకోవడమే కష్టంగా ఉంది. ఇప్పటివరకు రెండు సార్లు లోపలికి వెళ్లి వచ్చాం. మెషీన్ వద్ద 200 మీటర్ల దాకా భారీగా బురద పేరుకుని ఉంది. దాన్ని దాటడం వీలుపడటం లేదు. టన్నెల్ పైకప్పు మళ్లీ కుంగకుండా సేఫ్టీ కోసం రాక్ బోల్టింగ్ చేస్తున్నాం. నీటి తొలగింపు కొనసాగుతోంది.

– కలేందర్, సింగరేణి మైనింగ్ సేఫ్టీ సూపర్‌వైజర్

వారి జాడ కనిపించలేదు..



టన్నెల్‌లో భారీగా మట్టి, శిథిలాలు పేరుకుపోవడంతో మెషీన్ దగ్గరికి వెళ్లేందుకు కుదరడం లేదు. చిక్కుకున్న వారి జాడ ఏదీ కనిపించలేదు. ఎలాంటి అరుపులు సైతం వినిపించలేదు.

– రాండేవ్, సుబేదార్, ఆర్మీ

రాళ్లు, నీరు, బురదతో నిండిపోయింది



టన్నెల్ రాళ్లు, నీరు, బురదతో నిండిపోయింది. 200 నుంచి 500 మీటర్ల మధ్య టన్నెల్ బోరింగ్ మెషీన్ బురదలో కూరుకుపోయింది. 35 మందిమి సహాయక చర్యలకు అవసరమైన సామగ్రి తీసుకొని వెళ్లాం. రాత్రంతా కష్టపడి దగ్గరకు చేరుకోగలిగాం.

– రవినాయక్, ఎన్డీఆర్‌ఎఫ్ టీం, విజయవాడ

పెద్ద శబ్దంతో నీళ్లు వచ్చాయి..



మేం పనుల కోసం టన్నెల్ చివరికి చేరుకుంటున్న సమయంలోనే ఒక్కసారిగా పెద్ద శబ్దంతో నీళ్లు వచ్చాయి. సిమెంట్ దిమ్మెలు కూలి, పెద్ద ఎత్తున మట్టి కుంగింది. మేమంతా భయంతో వెనక్కి పరుగెత్తుకు వచ్చాం. చేతులు, కాళ్లు, ముఖానికి చిన్న గాయాలయ్యాయి.

– చమేల్ సింగ్, ప్రమాదం నుంచి బయటపడిన ఫోర్‌మెన్

ఏం జరుగుతోందో అర్థం కాలేదు



శనివారం ఉదయం టన్నెల్‌లో ఒక్కసారిగా శబ్దం వచ్చింది. ఏం జరుగుతోందో అర్థం కాలేదు. మా వాళ్లు కొందరు మెషీన్ వైపు ఉన్నా, ఏమీ చేయలేక భయంతో వెనక్కి వచ్చాం. వాళ్లు మట్టి, బురదలో మునిగారు. ప్రాణాలతో బయటికి వస్తారో, లేదో తెలియదు.

– ఎడుమల్లై, ప్రమాదం నుంచి బయటపడ్డ కన్వేయర్ బెల్ట్ ఫోర్‌మెన్

మా వాళ్ల పరిస్థితి ఏంటో తెలియదు..



టీబీఎం ముందు భాగంలో 8 మంది ఉన్నారు. మేం వెనక భాగంలో ఉన్నాం. ఒక్కసారిగా పైకప్పు కూలడంతో భయాందోళన నెలకొంది. మాతో కలసి పనిచేసే వాళ్ల పరిస్థితి ఏమిటో తెలియదు. చాలా బాధగా ఉంది.

– జగదీశ్ పాండా, ప్రమాదం నుంచి బయటపడ్డ మెకానికల్ ఫోర్‌మెన్

పరిస్థితి ఆశాజనకంగా లేదు

టన్నెల్ లోపలికి వెళ్లి వచ్చిన అనంతరం మంత్రి జూపల్లి


లోపల పరిస్థితి భయానకంగా ఉందని వెల్లడి


టన్నెల్ లోపల పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి, అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ''పరిస్థితి ఆశాజనకంగా లేదు. టన్నెల్ లోపల చాలా భయానకంగా ఉంది. చివరి ప్రయత్నంగా సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నాం. టన్నెల్ చివరన 200 మీటర్ల మేర బురద, నీరు చేరింది. అక్కడి వరకు చేరుకోవడమే కష్టమవుతోంది. అందులో ఇప్పటివరకు 100 మీటర్ల వరకు చేరుకున్నాం. అంతకన్నా ముందుకు వెళ్లలేకపోతున్నాం..''అని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రెస్క్యూ బృందాలతో కలసి టన్నెల్ లోపలికి వెళ్లిన ఆయన.. సహాయక చర్యలను, లోపల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను స్వయంగా దగ్గరకు వెళ్లి చూశానని.. సొరంగంలో భారీగా మట్టి పేరుకుని ఉందని మంత్రి జూపల్లి తెలిపారు. ''కొన్ని వేల టన్నుల మట్టి, నీటి ప్రవాహం కనిపిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు లోపల చిక్కుకున్న వారిని తీసుకురావడం సాధ్యం అనిపించడం లేదు. అన్ని ప్రయత్నాలు, చర్యలు చేపడుతున్నాం. ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి ఉంది. చిక్కుకున్నవారు ఎప్పుడు బయటికి వస్తారో చెప్పలేకపోతున్నాం. 6 గంటలైనా పట్టొచ్చు.. ఒకరోజైనా పట్టొచ్చు''అని పేర్కొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై గవర్నర్ ఆరా

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన జిష్ణుదేవ్ వర్మ



సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో శ్రీశైలం ఎడమగట్టు సొరంగం (ఎస్‌ఎల్‌బీసీ)లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు జరుగుతున్న సహాయక చర్యలపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆ జిల్లా కలెక్టర్‌ను ఆదివారం ఫోన్‌లో వాకబు చేశారు. టన్నెల్‌లో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందాలు, సైనికులు, ఇతర నిపుణులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నట్లు కలెక్టర్ గవర్నర్ దృష్టికి తీసుకువచ్చారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి అన్నిరకాల సహాయక చర్యలు చేపట్టాలని, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని కలెక్టర్‌ను గవర్నర్ ఆదేశించారు.



సహాయక చర్యల కోసం సామగ్రితో సొరంగంలోకి వెళుతున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, భారత ఆర్మీ బైసన్ డివిజన్ బృందాలు ఇవి. మొత్తం మూడు దఫాలుగా సహాయక బృందాలు టన్నెల్ లోపలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాయి.

రంగంలోకి ర్యాట్ హోల్ మైనర్స్!

- గతంలో ఉత్తరాఖండ్ సొరంగం లోపల చిక్కుకున్న 41 మందిని రక్షించిన ఘనత వీరి సొంతం
- హైదరాబాద్ చేరుకున్న ఆరుగురు.. నేడు ఉదయం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు..



సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ర్యాట్ హోల్ మైనర్స్‌ను రంగంలోకి దింపింది. ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీ సిల్కియారా సొరంగం కుప్పకూలి లోపల చిక్కుకున్న 41 మంది కార్మికులను.. ఈ ర్యాట్ హోల్ మైనర్స్ 17 రోజుల తర్వాత సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వీరికోసం ఫ్లైట్ టికెట్లు బుక్ చేసి ప్రత్యేకంగా రప్పించింది. నసీం, ఖలీల్ ఖురేషీ, మున్నా, మహమ్మద్ రషీద్, ఫిరోజ్ ఖురేషీ, మహమ్మద్ ఇర్షాద్.. ఈ ఆరుగురితో కూడిన ర్యాట్ హోల్ మైనర్స్ బృందం ఢిల్లీ నుంచి ఆదివారం రాత్రి 11.45 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. సోమవారం ఉదయం వారు ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్దకు చేరుకుని, లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేపట్టనున్నారు.

కేవలం ఒక్కరోజులో బయటికి తెచ్చి..: 2023 నవంబర్ 13న సిల్కియారా సొరంగం ముఖద్వారం కుప్పకూలడంతో 41 మంది లోపల చిక్కుకున్నారు. అధికారులు, రెస్క్యూ సిబ్బంది ఎన్ని ప్రయత్నాలు చేసినా వారిని బయటకు తీసుకురాలేకపోయారు. చివరికి ప్రభుత్వం ర్యాట్ హోల్ మైనర్స్‌ను రంగంలో దింపింది. వారు కేవలం ఒక్క రోజులోనే కార్మికులను సురక్షితంగా బయటికి తీసుకురాగలిగారు. ఇప్పుడు హైదరాబాద్‌కు చేరుకున్న బృందమే ఉత్తరాఖండ్ ఆపరేషన్‌లో పాల్గొనడం గమనార్హం.

ఏమిటీ ర్యాట్ హోల్ మైనింగ్?

మేఘాలయ వంటి రాష్ట్రాల్లోని బొగ్గు నిక్షేపాలున్న ప్రాంతాల్లో ఎలుక బొరియలు చేసినట్లుగా రంధ్రాలు తవ్వి.. భూగర్భం నుంచి బొగ్గును వెలికి తీయడాన్ని ర్యాట్ హోల్ మైనింగ్ అంటారు. ఇది అత్యంత ప్రమాదకరమైనప్పటికీ జీవనోపాధి కోసం వందల మంది ర్యాట్ హోల్ మైనింగ్ చేస్తున్నారు. 2019లో సుప్రీంకోర్టు ర్యాట్ హోల్ మైనింగ్ అక్రమమని, సురక్షితం కాదని కూడా ప్రకటించింది. కానీ ఇప్పుడు వారే సహాయక చర్యలకు దిక్కుకానున్నారు.

టన్నెల్ తవ్వే మెషీన్ పనికొస్తుందో లేదో చెప్పలేం

'సాక్షి'తో సొరంగం నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ ఎండీ పంకజ్ గౌర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కూలిపడటంతో మట్టి, శిథిలాల కింద కూరుకుపోయిన టన్నెల్ బోర్ మెషీన్ (టీబీఎం) పరిస్థితి ఏమిటనే సందేహాలు వస్తున్నాయి. ప్రమాదంలో టీబీఎంకు బాగా నష్టం జరిగితే పనికిరాకుండా పోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెస్క్యూ శ్రీ ఆపరేషన్ తర్వాత తిరిగి టన్నెల్ తవ్వకం పనులు కొనసాగాలంటే టీబీఎం యంత్రం పనిచేయాల్సిందే. దీనిపై జేపీ అసోసియేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ గౌర్‌ను 'సాక్షి' ప్రశ్నించగా.. టీబీఎం పరిస్థితిపై ఇప్పుడే ఏమీ చెప్పలేమన్నారు. మట్టి, శిథిలాలు తొలగించి పరీక్షించిన తర్వాతే మెషీన్ పనికి వస్తుందా? లేదా? అన్నది గుర్తించగలమని చెప్పారు. అందుకు ఎంత సమయం పడుతుందో కూడా చెప్పలేమన్నారు. ప్రస్తుతానికి సొరంగంలో చిక్కుకున్నవారిని బయటికి తేవడమే తమ ధ్యేయమని తెలిపారు. సమస్యలన్నీ అధిగమించి సొరంగం నిర్మాణ పనులను పునరుద్ధరిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సహాయక చర్యలకు నీటి లీకేజీ అడ్డంకి..

టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం: ఉత్తమ్

- ఆర్మీ, నేవీ, డిజాస్టర్ టీమ్స్ నిపుణులతో రెస్క్యూ ఆపరేషన్
- ఈ అంశంపై బీఆర్‌ఎస్ రాజకీయం చేస్తోందని మండిపాటు


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నాగర్‌కర్నూల్/అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకుపోయిన వారిని రక్షించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సహాయక చర్యలకు భారీగా వస్తున్న నీటి ఊట అడ్డంకిగా మారుతోందని తెలిపారు. ఆ నీటిని తొలగించడానికి ప్రయత్నిస్తూనే.. లోపలున్న వారికోసం నిరంతరం ఆక్సిజన్‌ను పంపింగ్ చేస్తున్నామని వివరించారు. ఉత్తమ్ ఆదివారం మంత్రి జూపల్లితో కలసి టన్నెల్ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ''టన్నెల్‌లో నీటి ప్రవాహం పెరుగుతోంది. రాతిపొరలు వదులై మట్టి కూలడంతో అక్కడి నుంచి కూడా నీరు వస్తుండటంతో అంతా బురదమయంగా మారింది. రెస్క్యూ ఆపరేషన్‌కు సవాలుగా మారుతోంది. చిక్కుకున్న వారిని రక్షించేందుకు సాంకేతిక నిపుణులు 24 గంటలపాటు ప్రయత్నిస్తున్నారు. భారీ యంత్రాలను టన్నెల్‌లోకి పంపి రక్షించే పరిస్థితి లేదు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో తలమునకలై ఉన్నారు. మట్టి కుప్పలను తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. సహాయక చర్యలను సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, ప్రధాని మోదీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కూడా సీఎంతో మాట్లాడారు..''అని ఉత్తమ్ తెలిపారు.

ఘటనపై బీఆర్‌ఎస్ రాజకీయం..

ప్రమాదం విషయం తెలియగానే ప్రభుత్వం రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించిందని, ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఈ ఘటనపై చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ ప్రాజెక్టుపై తనకు పూర్తి విశ్వాసం ఉందని.. టన్నెల్ పనులను పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా...

'రెండోసారి సర్వే'ను సద్వినియోగం చేసుకోండి

బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



ఇందిరాపార్కులో వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో మొదటిసారి పాల్గొననివారికోసం ఈ నెల 28వరకు మరోసారి సర్వే కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. బీసీలలో వాస్తవ జనాభాను గుర్తించడానికే ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. ఆదివారం ఆయన ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ ఇందిరాపార్కులో వాకర్స్‌తోపాటు దోమలగూడ, మండమైసమ్మ నగర్, కవాడిగూడ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి కులగణన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఈ ప్రాంతంలో కులగణన సరిగా చేయలేదని స్థానికులు నిరంజన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కులగణనలో పాల్గొనాలనుకునేవారు 040-21111111 నంబర్‌కు కాల్ చేస్తే ఎన్యూమరేటర్‌లు ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని, వార్డ్ ఆఫీసుల్లో కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మరోసారి బెదిరింపు కాల్స్



అబిడ్స్ (హైదరాబాద్): గోషామహల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను మరోసారి ఫోన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించారు. గతంలో పాకిస్తాన్‌తో పాటు పలు అరబ్ దేశాల నుంచి ఆగంతకులు రాజాసింగ్‌ను చంపుతామంటూ బెదిరించారు. కాగా ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు, మరోసారి 3.54 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి బెదిరించారు. 'ఈ రోజు కాకపోతే రేపైనా నీ తల నరికేస్తాం.. ఇన్షాఅల్లా' అని వారు వార్నింగ్ ఇచ్చారు. ఈ విషయంపై ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సంప్రదించగా రెండుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయని వివరించారు. గతంలో పలుసార్లు బెదిరింపు కాల్స్ రావడంతో తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా తీసుకోలేదన్నారు. దీంతో ఆదివారం వచ్చిన ఫోన్ కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఇలాంటి బెదిరింపులకు తాను భయపడనని రాజాసింగ్ స్పష్టం చేశారు.

బీసీల పార్టీ బీజేపీ: కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: దేశంలో పూర్తిస్థాయిలో బీసీల కోసం పనిచేస్తోంది భారతీయ జనతా పార్టీ మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఆయన ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఒక బీసీని ప్రధానమంత్రిని చేసిన బీజేపీపై.. ఇప్పుడు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పక్కా బీసీ అని ఆయన స్పష్టం చేశారు. బీసీల కోసం మోదీ అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ప్రధానిపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు సరికావన్నారు. తెలంగాణలో రాబోయే ప్రభుత్వం బీజేపీదేనని స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బీసీ అభ్యర్థులకు మద్దతివ్వండి

కేసీఆర్‌కు జాజుల లేఖ

సాక్షి, హైదరాబాద్: శాసన మండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బరిలో లేనందున.. బీసీ అభ్యర్థులకు మద్దతివ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. బీసీ అభ్యర్థులకు మద్దతిచ్చి బీసీలపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. బీసీ వాదంతో వస్తున్న కవిత.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు పూల రవీందర్, ప్రసన్న హరికృష్ణ, మల్క కొమురయ్యలకు మద్దతు ఇవ్వాలని కోరారు.

నేటి భవితలో..

- టాప్ స్టోరీ: డిజైన్ కెరీర్‌కు కేరాఫ్ ఎఫ్‌డీడీఐ వినూత్నమైన కెరీర్ అవకాశాలు కోరుకునే వారికి సరైన వేదిక.. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)! డిజైన్, ఫ్యాషన్ రంగంలో.. నిష్ణాతులను తీర్చిదిద్దేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్ ఇది!! డిజైన్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయిలో పలు కోర్సులను అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 12 ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌ల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ)కు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ-2025 దరఖాస్తుకు అర్హతలు, యూజీ, పీజీ కోర్సు లు, ప్రవేశ పరీక్ష విధానం తదితర వివరా లతోపాటు విద్య,ఉద్యోగ సమాచారం..

నేటి భవిత పేజీ కోసం సాక్షి ప్లస్ (ఈ పేపర్) ను చూడండి



స్వర్ణ దివ్య విమాన గోపురం



స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించి మొక్కుతున్న సీఎం దంపతులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, సీఎస్ తదితరులు

వైభవంగా మహాకుంభాభిషేక సంప్రోక్షణ

▶ మొదటి పేజీ తరువాయి

స్వాగతం పలికారు. ఆపై ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తున్న పూర్ణాహుతిలో సీఎం దంపతులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకులు సంకల్పం చెప్పారు. ఆ తరువాత కలశంలో నాలుగు రోజులుగా పూజలు నిర్వహించిన 14 నదుల జలాలను తీసుకొని వానమామలై పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తర రాజగోపురం నుంచి ప్రధానాలయంలోకి ప్రవేశించారు. అక్కడి నుంచి ప్రాకార మండపం మీదుగా స్వామివారి శిరస్థానమైన ఆలయ పంచతల స్వర్ణ విమాన రాజగోపురం వద్దకు చేరుకున్నారు. స్వర్ణ విమాన గోపురం చుట్టూ ఉన్న తెరలను తొలగించి 11:32 గంటలకు దేశంలోనే ఎత్తయిన దివ్య స్వర్ణ విమాన గోపురాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఆ తరువాత స్వర్ణ విమాన గోపురంపై ఉన్న సుదర్శన చక్రం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి చేతుల మీదుగా నదీజలాలతో పూజలు నిర్వహించిన నవ కలశ స్నపన తీర్థంతో ఆలయ శిఖరంపై సుదర్శన చక్రానికి కుంభాభిషేకం చేశారు. ఉదయం 11:54 గంటలకు మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ ముహూర్తాన స్వర్ణగోపురాన్ని స్వామివారికి అంకితం చేశారు.

గర్భాలయంలో సీఎం దంపతుల పూజలు

సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంభాభిషేక మహోత్సవం పూర్తికాగానే తూర్పు రాజగోపురం ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. వారికి అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. సీఎం మొదటగా క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. అక్కడి నుంచి ధ్వజస్తంభం వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం స్వయంభూవులను దర్శించుకున్నారు. వారిని అర్చకులు అష్టోత్తరంతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో సీఎం దంపతులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆ తరువాత వానమామలై రామానుజ జీయర్ స్వామి ఆశీర్వచనం తీసుకున్నారు. సీఎంను జీయర్ స్వామి శాలువాతో సత్కరించారు. ముఖ్యమంత్రికి దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు విమాన గోపురం ప్రతిమను అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పలకరింపు..

పడమటి రాజగోపురం మీదుగా ఆలయం నుంచి సీఎం దంపతులు బయటకు వచ్చారు. కాలినడకన వస్తూ కొండపైన పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పలకరించారు. కొండపైన ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. అంతా బాగుందని.. భక్తులు అధికంగా వస్తున్నారని సీఎంకు వారు చెప్పారు. అనంతరం ఈఓ కార్యాలయానికి వెళ్లి స్వామివారి ప్రసాదం తీసుకున్నారు. కాగా, ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు నిర్వహించిన స్తపతి రవీంద్రన్, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బంగారు కడియాలు తొడిగారు. మరోవైపు కొండపై కల్యాణమండపం నిర్మించాలని సీఎం రేవంత్‌ను కోరగా అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

బాల్యమిత్రుడి కుమార్తె వివాహానికి హాజరు

గుట్ట ప్రెసిడెన్షియల్ సూట్‌లో తన చిన్ననాటి స్నేహితుడు భాష్యం ఎదుమోహన్-కల్యాణి దంపతుల కుమార్తె శ్రీలిపి, వరుడు జయసూర్య విశ్వనాథ్‌ల వివాహానికి ముఖ్యమంత్రి దంపతులు హాజరయ్యారు. అక్కడే భోజనం చేసి హైదరాబాద్‌కు రోడ్డుమార్గంలో తిరుగుపయనం అయ్యారు.

పాలకులే మారారు..పాలన కాదు

- అప్పులు, దోపిడీలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ ఇద్దరే
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ ఓటమి ఖాయం: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



కైలాస్‌నగర్: రాష్ట్రంలో పాలకులు మాత్రమే మారారు.. పాలన తీరు ఏ మాత్రం మారలేదని కేంద్ర గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. అప్పులు, ఆర్థిక దోపిడీలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ ఇద్దరే అని విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆయన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన తీరుపై ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ మాటలు కోటలు దాటగా, కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలు సచివాలయ గేటు కూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. వందరోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల్లో ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. హామీలను ఎప్పటి వరకు అమలు చేస్తారనే కార్యాచరణ కూడా ప్రభుత్వం వద్ద లేదని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం మొండిహస్తంగా మారిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి తమ అసమర్థపాలనతో రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి, రాష్ట్ర భవిష్యత్‌ను అంధకారం చేశారని ఆరోపించారు. 14 నెలల పాలనలోనే ఈ ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీల్లో 20 శాతం కూడా అమలు చేయని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ పాలనపై బహిరంగచర్చకు రావాలని అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోదీ పాలనను విమర్శించే అర్హత రేవంత్, రాహుల్‌గాంధీలకు లేదని చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామనే ప్రభుత్వ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే దీనిని అమలు చేయకుండా కేంద్రంపై నెపం మోపేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలను గ్రహించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

- అందుకే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తప్పుకుంది
- పట్టభద్రుల స్థానంలో గెలుపు కాంగ్రెస్‌దే: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని, పదేళ్ల అధికారంలో ఉన్నంతకాలం ఆ రెండు పార్టీలు పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే, ఈసారి పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ కోసమే బీఆర్ఎస్ తప్పుకుందని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బీసీలపై నిబద్ధత ఉంటే బీజేపీ రాజ్యాంగ సవరణ చేయాలని సవాల్ విసిరారు. ఆదివారం కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మాకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్. వీరి దోస్తీ పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ కోసం బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టలేదు. మేం ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. బీసీలకు న్యాయం చేసేందుకు 42 శాతం రిజర్వేషన్‌కు సంకల్పించాం. ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమం చేశాం. ఈ రెండు ప్రధాన అంశాలపై నిర్ణయం తీసుకోవాల్సిన ధర్మం బీజేపీపై ఉంది. 50 శాతం మించకుండా రిజర్వేషన్ కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయడానికి బీజేపీ సిద్ధమా? మేం తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరుతున్నాం. ముస్లిం రిజర్వేషన్లు 2005 నుంచి ఉన్నాయి. ఈ విషయం బీజేపీకి ఇప్పుడు గుర్తుకొచ్చిందా' అని ప్రశ్నించారు. పట్టభద్రులకు ఏం చేస్తారో బీజేపీ చెప్పకుండా దుష్ప్రచారం చేస్తోందన్నారు. కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ పట్టభద్రుల స్థానంలో నరేందర్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు.

రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంగా బీజేపీ

- అమృత్ నుంచి పౌర సరఫరాల వరకు స్కామ్‌లు చేస్తున్నా కాపాడుతున్నారు
- కాళేశ్వరం గురించి ఆగమేఘాలపై స్పందించారు.. సుంకిశాల, టన్నెల్ గురించి స్పందించరేం
- సరైన సమయంలో బీజేపీలోకి వస్తానని హామీ ఇచ్చాడేమో: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం.. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంగా నిలుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాజకీయంగా కొట్లాడుతూనే కాంగ్రెస్ సీఎంకు బీజేపీ కాపు కాస్తోందని, ఎన్ని కుంభకోణాలకు పాల్పడుతున్నా, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకుండా కేంద్ర పెద్దలు మౌనం వహిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు ఆదివారం కేటీఆర్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'దాదాపు 15 నెలల పాలనలో తెలంగాణలోని ప్రభుత్వం, కాంగ్రెస్ సీఎం అనేక కుంభకోణాలకు పాల్పడ్డారు. అమృత్ స్కీమ్ నుంచి పౌర సరఫరాల వరకు ఎన్ని స్కామ్‌లకు పాల్పడినా, కేంద్రం పట్టించుకోవడం లేదు. మేం సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేసినా మౌనమే తప్ప ఎలాంటి చర్యలూ లేవు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రమాదంపై ఆగమేఘాల మీద స్పందించి కేంద్ర బృందాలను దించారు. విచారణల పేరుతో వేధింపులకు పాల్పడ్డారు. మరి సుంకిశాల ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కూలిన ఘటన, ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన పెను ప్రమాదంపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు. దేశవ్యాప్తంగా బీజేపీపై కొట్లాడుతున్నానని రాహుల్‌గాంధీ చెప్పుకొని తిరుగుతున్నారు. కానీ, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయి. ఈ విషయం అనేకసార్లు స్పష్టమైంది. తెలంగాణలోని రియల్ ఎస్టేట్ సంస్థల నుంచి చదరపు అడుగుకు రూ.150 వసూలు చేస్తున్నారని స్వయంగా ప్రధాని మోదీ ఆరోపించారు. ఇప్పటిదాకా దానిపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. రాష్ట్ర మంత్రి పొంగులేటిపై ఈడీ దాడులు చేసి ఐదు నెలలు దాటినా ఇంతవరకు కనీసం ప్రకటన కూడా లేదు. అసలు రేవంత్‌రెడ్డిని బీజేపీ కాపాడుతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సరైన సమయంలో బీజేపీలోకి వస్తానని ఆయన లోపాయికారి హామీ ఇచ్చి ఒప్పందం చేసుకొని ఉంటాడు. అందుకే తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు రేవంత్‌కు రక్షణ కవచంగా నిలుస్తున్నారు.' అని ఆ ప్రకటనలో కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

ఆర్టీసీలో తొలిసారి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు డ్రైవర్లు!

- మొత్తం 1,500 మంది నియామకానికి సంస్థ సర్క్యులర్
- ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజీలో నమోదైన వారికి కాంట్రాక్టు పద్ధతిలో..
- మ్యాన్‌పవర్ సప్లయర్స్ నుంచి అయితే ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలు
- తీవ్రమైన డ్రైవర్ల కొరత నేపథ్యంలో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: బస్సులు నడిపేందుకు ఆర్టీసీ తొలిసారి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో డ్రైవర్లను సమకూర్చుకోనుంది. గతంలో పలు సందర్భాల్లో డిపోల్లో బస్సులను పార్క్ చేయటం, అటూ ఇటూ మార్చటం కోసం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొంతమందిని నియమించుకున్నారు. కానీ రూట్లలో నడిపేందుకు మాత్రం తీసుకోలేదు. ప్రస్తుతం డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉండటం, శాశ్వత నియామక ప్రక్రియ ఇప్పట్లో జరిగే పరిస్థితి లేకపోవటంతో ప్రైవేటు ఏజెన్సీల నుంచి ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజీల్లో నమోదైన వారిని నియమించుకోవాలని నిర్ణయించింది. 1,500 మంది డ్రైవర్లను వెంటనే నియమించుకుని, రెండు వారాల శిక్షణ ఇచ్చి బస్సులు అప్పగించనుంది. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసింది.

పెరుగుతూ వచ్చిన కొరత

భవిష్యత్తులో సొంతంగా బస్సులు అంతగా కొనాల్సిన అవసరం లేకుండా అద్దె ప్రాతిపదికన పెద్ద సంఖ్యలో బస్సులు (ఎలక్ట్రిక్ సహా) సమకూర్చుకుంటున్న ఆర్టీసీ, సిబ్బంది విషయంలోనూ భారం లేకుండా చూసుకుంటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఆర్టీసీలో సగటున నెలకు 50 మంది చొప్పున డ్రైవర్లు రిటైర్ అవుతున్నారు. మరోవైపు చాలాకాలంగా నియామకాలు లేకపోవటంతో క్రమంగా డ్రైవర్లకు కొరత పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం 1,500 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు లెక్క తేలింది. ప్రత్యేక సందర్భాల్లో అదనపు బస్సులు తిప్పేందుకు డ్రైవర్లు లేని పరిస్థితి ఎదురవుతోంది. వేసవి సెలవుల్లో రద్దీ భారీగా ఉంటుంది. వీలైనన్ని ఎక్కువ బస్సులు తిప్పాల్సి ఉంటుంది. 1,500 మంది డ్రైవర్ల కొరతతో ఇది సాధ్యం కాదు. ఇప్పటికే చాలామంది డ్రైవర్లకు అవసరాన్ని బట్టి డబుల్ డ్యూటీలు వేయాల్సి వస్తోంది.

నియామక ప్రక్రియ జాప్యంతో..

దాదాపు ఏడాది క్రితమే 3 వేల డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించగా, 2 వేల పోస్టుల భర్తీకి అనుమతి వచ్చింది. అయితే ఆర్టీసీ కాకుండా పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి సంబంధించి టీఎస్‌పీఎస్సీ, మెడికల్ సిబ్బందికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియామక ప్రక్రియలు చేపడతాయని పేర్కొంది. కానీ ఆ మూడు సంస్థలు ఇప్పటివరకు జాబ్ కేలండర్‌ను ప్రకటించలేదు. ఆర్టీసీ సిబ్బంది కోసం ఎదురు చూస్తూనే ఉంది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో నియామక ప్రక్రియల్లో మరింత జాప్యం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఔట్‌సోర్సింగ్ పద్ధతి తెరపైకి వచ్చింది.

4 నెలల కాలానికే..

భవిష్యత్తులో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు, సాధారణ అద్దె ప్రాతిపదికన డీజిల్ బస్సులు తీసుకోనున్నందున, ఆర్టీసీకి సొంత డ్రైవర్ల అవసరం తగ్గుతుంది. బస్సులను అద్దెకు ఇచ్చే సంస్థలే డ్రైవర్లను ఏర్పాటు చేసుకోనుండటం దీనికి కారణం. ఈ నేపథ్యంలోనే డ్రైవర్లను నియమించుకోవటం కంటే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవటం మంచిదనే అభిప్రాయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. దీనివల్ల ఆర్టీసీపై జీతాల భారం తగ్గుతుంది. ఇప్పుడు తీసుకోబోతున్న 1,500 మంది డ్రైవర్ల ఉద్యోగ కాలం మార్చి నుంచి జూన్ వరకు అని ఆర్టీసీ సర్క్యులర్‌లో పేర్కొంది. తదుపరి అవసరాలను బట్టి వీరి కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. అయితే వీరిని భవిష్యత్తులో కూడా కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

నియామకం ఇలా..

- ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజీలో నమోదైన అర్హులను నేరుగా కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది.
- మ్యాన్‌పవర్ సప్లయింగ్ సంస్థల నుంచి తీసుకుంటే ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకుంటారు.
- హెవీ వెహికిల్ లైసెన్స్, భారీ వాహనాలు నడపడంలో 18 నెలల అనుభవం ఉండాలి. ఎత్తు 160 సెం.మీ.కు తగ్గకుండా ఉండాలి. ఏదైనా ప్రాంతీయ భాషలో చదవటం, రాయటం వచ్చి ఉండాలి. 60 ఏళ్లలోపు వారై ఉండాలి.
- వీరికి 2024లో నిర్ధారించిన నెలవారీ కన్సాలిడేటెడ్ రెమ్యునరేషన్ రూ.22,415 చెల్లించనున్నారు. ప్రతి డ్యూటీకి బత్తాగా జంటనగరాల పరిధిలో అయితే రూ.200, జంట నగరాల వెలుపల అయితే రూ.100 చొప్పున చెల్లిస్తారు.
- ఎంపికైన వారికి ఆర్టీసీ శిక్షణ సంస్థల్లో 15 రోజుల పాటు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తారు. ఆ సమయంలో రోజుకు రూ.200 చొప్పున చెల్లిస్తారు.
- డ్రైవర్ల అర్హతలు పరిశీలించేందుకు డిపో స్థాయిలో అధికారుల కమిటీ, డ్రైవింగ్ నైపుణ్యం అంచనా వేసేందుకు ఓ టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్

- నిజామాబాద్, మంచిర్యాలలో సమావేశాలు...
- కరీంనగర్‌లో బహిరంగసభ

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి మంచిర్యాల: కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించనున్నారు. వాస్తవానికి, మూడు రోజుల పాటు ఈ ప్రచారంలో పాల్గొనాలని తొలుత నిర్ణయించినా అనివార్య కారణాలతో సీఎం షెడ్యూల్‌లో మార్పులు జరిగాయి. తాజా షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం మధ్యాహ్నం 12 గంటలకు నిజామాబాద్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2:30 గంటలకు మంచిర్యాలలో ప్రచార సమావేశం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో కరీంనగర్‌కు చేరుకోనున్న రేవంత్‌రెడ్డి అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం బయలుదేరి హైదరాబాద్ చేరుకోనున్నారు. షెడ్యూల్ ప్రకారం నిర్మల్ జిల్లాలో సభ నిర్వహించాలని అనుకున్నా తర్వాత రద్దు చేశారు.

వరి వద్దనడం విడ్డూరం

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో తెలంగాణ ఎడారిలా మారుతోంది



ఖిలా వరంగల్: తెలంగాణలో వరి వేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వరి వేస్తే ఉరేనన్న కేసీఆర్‌ను రాజకీయంగా రైతులు ఉరేశారని వ్యాఖ్యానించారు. వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వరంగల్ బొల్లికుంట ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉపాధ్యాయ ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు పుష్కలంగా పడి నదుల్లో నీళ్లున్నా.. కాంగ్రెస్ చేతగానితనం వల్ల వాడుకోలేకపోయారని సంజయ్ ధ్వజమెత్తారు. కృష్ణా నీటిని ఏపీకి కట్టబెట్టడం వల్ల దక్షిణ తెలంగాణ, కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేయడం వల్ల ఉత్తర తెలంగాణ ఎడారిలా మారుతోందన్నారు.

చప్పుడు లేకుండా రయ్‌రయ్!

▶ మొదటి పేజీ తరువాయి

స్థాయి పెరగలేదు.

ఈవీల పెరుగుదలకు దోహదపడ్డ కారణాలు ఇవీ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో విద్యుత్ వాహన విధానాన్ని ప్రకటించి నిర్ధారిత సంఖ్యలో వాహనాలకు రాయితీలను ప్రకటించడం ప్రజలను ఈవీలవైపు ఆకర్షించింది. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పాలసీకి సవరణలు చేస్తూ మెరుగైన రాయితీలను ప్రకటించడం ప్రజల్లో మరింత జోష్ నింపింది. ముఖ్యంగా రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు లేకపోవడం విద్యుత్ వాహనాల కొనుగోళ్లకు మరింతగా ఊతమిస్తోంది. అదే సమయంలో బ్యాటరీల నాణ్యత పెరగడం మరింత సమర్థంగా పనిచేసే బ్యాటరీలు అందుబాటులోకి రావడం.. దేశీయంగా వాటి తయారీ కూడా మొదలవడం.. ప్రముఖ వాహన తయారీ కంపెనీలు కూడా ఈవీల తయారీ రంగంలోకి ప్రవేశించడంతో వాటి సంఖ్య అమాంతం పెరిగింది. పెట్రోల్‌తో నడిచే ద్విచక్రవాహనాలతో పోలిస్తే 60 శాతానికిపైగా ఇంధన ఖర్చు ఆదా అవుతుండటంతో ప్రజలు ఎలక్ట్రిక్ టూవీలర్ల వైపు మొగ్గుచూపుతున్నారు. ఇంధనం ఆదాతోపాటు పన్నులు, ఫీజులు కూడా లేకపోవడంతో వాహన కొనుగోలు ధరలోనూ ఆదా కనిపిస్తోంది. దీంతో బైక్ ట్యాక్సీదారులు, చిరు వ్యాపారులు, డెలివరీ బాయ్స్ ఎక్కువగా ఎలక్ట్రిక్ టూవీలర్లను కొంటున్నారు.

చార్జింగ్ కేంద్రాలు పెరిగితే పెరగనున్న కార్ల కొనుగోళ్లు..

రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 13 వేల విద్యుత్ కార్లు పరుగులు పెడుతున్నాయి. ఇంధన వ్యయంలో ఆదా, రాయితీలు, శబ్దం లేకుండా నడవడం, కాలుష్యరహితం లాంటి ప్రయోజనాలతో ఈవీ కార్లవైపు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 435 చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. వాటి సంఖ్య త్వరలో 800కు.. మరో ఏడాదిలో 3 వేలకు చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ఈవీల విడిభాగాలు, బ్యాటరీ కాంపోనెంట్లపై రాయితీలను ప్రకటించడంతో వాటి ధరలు తగ్గనున్నాయి. ఇది కూడా విద్యుత్ కార్ల కొనుగోళ్లు పెరిగేందుకు దోహదపడనుంది.

2024 నవంబర్ 16 నుంచి 2025 జనవరి 31 మధ్య ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు, కొనుగోలుదారులకు పన్ను మినహాయింపులు (రూ.లక్షల్లో)

కేటగిరీ	వాహనాల కొనుగోళ్లు	పన్ను మినహాయింపు మొత్తం
ద్విచక్ర వాహనాలు	11,113	1,292.10
సొంత కార్లు	2,762	8,524.38
క్యాబ్స్	369	716.32
ఆటోలు	410	4.10
తేలికపాటి సరుకు వాహనాలు	242	2.42
బస్సులు	75	13.87
మొత్తం	14,971	10,553.19

ఇతర రాష్ట్రాల్లో ఈవీలు ఇలా..

- కర్ణాటకలో 5,800 చార్జింగ్ కేంద్రాలున్నాయి. ఆ సంఖ్యను 8 వేలకు పెంచేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో సుమారు 3 లక్షల విద్యుత్ వాహనాలు ఉన్నాయి.
- ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్యాపరంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర దేశంలోకెల్లా తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. యూపీలో 5 లక్షలు, మహారాష్ట్రలో 3.5 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.
- తమిళనాడు, ఢిల్లీ, బిహార్, రాజస్తాన్ క్రమంగా పోటీ పడుతూ తదుపరి స్థానాల్లో ఉన్నాయి. దేశంలో అత్యధిక ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఆరో స్థానంలో ఉంది.

రాష్ట్రంలో విద్యుత్ వాహన పాలసీ తర్వాత ఈవీల కొనుగోళ్లు ఇలా..

ఏడాది	ఫోర్ వీలర్	టూ వీలర్	ఇతర వాహనాలు
2020-21	312	2,071	220
2021-22	1,201	12,734	850
2022-23	3,718	33,539	1,854
2023-24	7,018	51,949	2,540
2024-25	5,528	49,287	4,101



ఒక ఇంటికి ఆభరణంగా నిలిచేది ఆ ఇంటికి తరచుగా వచ్చే స్నేహితులే.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 24 ఫిబ్రవరి 2025

వాక్కాలుష్యం

మాటల గురించి చెప్పడమంటే, మాటలు కాదుగాని, మాటల గురించి కాస్త మాట్లాడుకుందాం. మాటలు రకరకాలు. ఇతరుల మనసులను గాయపరచే ఈటెల్లాంటి మాటలు; గాయపడ్డ మనసులకు ఊరటనిచ్చే ఊరడింపు మాటలు; ఎదుటివారిని మునగ చెట్టెక్కించే మెరమెచ్చు మాటలు; జనాలను ఇట్టే బోల్తా కొట్టించే బురిడీ మాటలు; సొంత డప్పు మోగించుకోవడంలో కోటలు దాటే మాటలు; కపటబుద్ధులాడే కల్లబొల్లి మాటలు; బుద్ధిహీనుల పొల్లు మాటలు; ఈర్ష్యాళువుల ద్వేషపు మాటలు; ఉబుసుపోవడానికి చెప్పుకొనే ఊకదంపుడు మాటలు– మాటల గురించి చెప్పుకోవాలంటే, ఇలా ఎన్ని మాటలైనా ఉంటాయి.

మాటలాడే తీరును బట్టి మనిషిని అంచనా వేయవచ్చు. ఎంతటి స్ఫురద్రూపులైనా కావచ్చు; మరెంతటి నానాలంకారభూషితులైనా కావచ్చు; భాషణ నైపుణ్యం కొరవడితే మాత్రం ఎన్ని ఆభరణాలను దిగేసుకున్నా, ఎన్ని అలంకారాలు చేసుకున్నా, ఎవరూ పట్టించుకోరు. 'కేయూరాణి న భూషయంతి పురుషం హారాః న చంద్రోజ్జ్వలాః/ న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః/ వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే/ క్షీయంతేఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణం' అన్నాడు భర్తృహరి. ఇదే శ్లోకాన్ని ఏనుగు లక్ష్మణకవి 'భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగద తార హారముల్/ భూషిత కేశ పాశ మృదు పుష్ప సుగంధ జలాభిషేకముల్/ భూషలు గావు పురుషుని భూషితు జేయు పవిత్రవాణి వా/గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించునన్నియున్' అని తెలుగులోకి అనువదించాడు.

మనకు 'వేషభాషలు' అనే పదబంధం ఉంది. వేషం ఒక్కటే చాలదు, అందుకు తగిన భాష కూడా ఉన్నప్పుడే రాణిస్తుంది. దర్పానికి చిహ్నమైన భుజకీర్తులు, మెడలో ధగధగలాడే సువర్ణహారాలు, కేశపాశాలకు సొగసైన అలంకారాలు, శరీరాన్ని ఘుమఘుమలాడించే పన్నీటి స్నానాలు, ఒంటికి పూసుకునే మైపూతలు – ఇవేవీ మనిషికి అలంకారాలు కాలేవు. సంస్కారభరితమైన, సందర్భోచితమైన మృదువాక్కులే మనిషికి అసలైన ఆభరణాలు. భర్తృహరి సారాంశం ఇదే! అసమాన పదసంపద, అనర్గళ వక్తృత్వ ప్రాభవం, అన్నింటికీ మించి బహిరంగ వేదికలపై వాక్కుకు తగిన అభినయ చాతుర్యం వంటి ప్రతిభా పాటవాలెన్ని ఉన్నా, కించిత్ సందర్భశుద్ధి కూడా ఉండాలి. అప్పుడు మాత్రమే వాగ్భూషణం మిలమిలలాడుతుంది. సమయ సందర్భాలను పట్టించుకోకుండా, నోటికొచ్చినట్లు మాట్లాడితే సభలలో రసాభాస తప్పదు. పద్మభూషణ పద్మవిభూషణాది సగౌరవ భూషణాలు ఎన్ని ఉన్నా, సందర్భశుద్ధి లేని వాచాలత ప్రదర్శించినట్లయితే, సదరు మనుషుల వాగ్భూషణం వెలవెలబోతుంది.

అనవసర ప్రసంగాలు, అసందర్భ ప్రలాపాలు, పరుష పదప్రయోగాలు వాగ్భూషణానికి కిలుములా పట్టి, దానిని వెలవెలబోయేలా చేస్తాయి. వాగ్భూషణం వన్నె తరగకుండా ఉండాలంటే, ఎప్పుడు మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో, ఎప్పుడు మౌనం పాటించాలో తెలుసుకోగల ఇంగితం కలిగి ఉండాలి. సూక్ష్మంగా ఈ లక్షణాన్ని వాగ్వివేకం అనవచ్చు. వాగ్వివేకం కలిగినవాళ్లు లోకంలో ఉత్తములుగా, ఉన్నతులుగా సముచిత గౌరవం పొందుతారు.


'మాట్లాడటం కన్నా మౌనంగా ఉండటమే సురక్షితం' అన్నాడు గ్రీకు తత్త్వవేత్త ఎపిక్టీటస్. మనోభావాల శకంలో ఆయన సలహా పాటించదగినదే! 'మౌనేన కలహం నాస్తి' అని మన పూర్వ సుభాషితం కూడా చెబుతోంది. అయినా, మాట్లాడక తప్పని పరిస్థితులు ఎదురైనప్పుడు ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలుసుకోవడమే వాగ్వివేకం. ఇదే సంగతిని 'అనర్గళ వాగ్ధార కన్నా మాట్లాడటంలో విచక్షణ ముఖ్యం' అని ఇంగ్లిష్ రాజనీతిజ్ఞుడు ఫ్రాన్సిస్ బేకన్ ఏనాడో చెప్పాడు. 'సకాలంలో పాటించే మౌనం వాగ్ధాటి కంటే గొప్పది' అని ఇంగ్లిష్ కవి మార్టిన్ టప్పర్ అన్నాడు. విచక్షణ లోపించిన మాటలు మాట్లాడేవారు ఎంతటి ఘనసంపన్నులైనా సమాజం నుంచి గౌరవ మర్యాదలను సంపాదించుకోలేరు.

వాగ్ధాటికి, వాచాలతకు ఉన్న విభజనరేఖను తెలుసుకుంటే చాలు– మాటలాడే కళలో రాణించడం పెద్ద కష్టమేమీ కాదు. ఇంత చిన్న సంగతి తెలుసుకోలేకపోవడం వల్లనే ప్రజాజీవితంలో ఉన్న నానా రంగాల ప్రముఖులు అనవసర ప్రసంగాలతో, అసందర్భ ప్రలాపాలతో అభాసుపాలవుతున్న సందర్భాలు ఇటీవలి కాలంలో తరచుగా తారసిల్లుతున్నాయి. ఇదొక పరిస్థితి అయితే, వాగ్దూషణా దురితచరితుల సంఖ్య కూడా సమాజంలో పెచ్చరిల్లుతోంది. ముఖ్యంగా రాజకీయ, వినోదరంగాల్లో వాక్కాలుష్యం దుర్భరంగా మారి, సామాన్యులకు మనశ్శాంతి లేకుండా చేస్తోంది. వాక్కాలుష్య ప్రభావం ఏ స్థాయిలో ఉందో ఇటీవల వస్తున్న సినిమాలు, టీవీ కార్యక్రమాలు, ఓటీటీ ప్రదర్శనలు చూస్తే, ఇట్టే అర్థమైపోతుంది.

'ఆది నుంచి ఆకాశం మూగది/ అనాదిగా తల్లి ధరణి మూగది/ నడుమ వచ్చి ఉరుముతాయి మబ్బులు/ నడమంత్రపు మనుషులకే మాటలు/ ఇన్ని మాటలు' అన్నారు వేటూరి. నడమంత్రపు సిరివర్గం, మిథ్యామేధావి వర్గంలోని మనుషుల వల్లనే సమాజంలో వాక్కాలుష్యం ప్రబలుతోంది. పర్యావరణంలోని నానా రకాల కాలుష్యాల నివారణ కోసం ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు తమ వంతు చర్యలు చేపడుతూనే ఉన్నాయి. అయితే, వాక్కాలుష్య నివారణ చర్యలు తీసుకునే నాథులే కరవయ్యారు. వాక్కాలుష్య నివారణతోనే వాగ్భూషణానికి పునర్వైభవం సాధ్యం.

న్యాయ వ్యవస్థకు తాడు మీద నడక

అభిప్రాయం



సంజయ్ హెగ్డే

రణవీర్ అలహాబాదియా కేసు ఎంత సంక్లిష్టమో సుప్రీంకోర్టు దాన్ని డీల్ చేసిన తీరు తేటతెల్లం చేస్తోంది. ఈ విచారణ... నైతిక ఆగ్రహానికీ, రాజ్యాంగ ఔచిత్యానికీ నడుమ తాడు మీద చేసిన నడకను తలపిస్తోంది. వాదప్రతివాదాలు విన్న తర్వాత యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్ రణవీర్‌కు ఊరట కల్పిస్తూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

రణవీర్ సామాజిక మాధ్యమాల్లో ప్రముఖ వ్యక్తి. 'ఇండియా గాట్ లేటెంట్' అనే వెబ్ టాలెంట్ షోలో అతను చేసిన వ్యాఖ్యలపై అనేక ఎఫ్ఐఆర్‌లు దాఖలు అయ్యాయి. ఆ వ్యాఖ్యలు సరదా కోసమే చేసినప్పటికీ వాటిపై దేశవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబికింది. మీడియా సంస్థలు, రాజకీయ నేతలు గగ్గోలు పెట్టడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. రణవీర్ భాష ఎంత అసహ్యకరంగా ఉంది అన్నది న్యాయపరంగా ప్రధాన ప్రశ్న కాదు, అది భారతీయ చట్టాల ప్రకారం నేరపూరిత అపరాధం అవుతుందా అవ్వదా అన్నదే ముఖ్యం. ఆయన న్యాయవాది అభినవ్ చంద్రచూడ్ న్యాయస్థానంలో చేసిన ఈ వాదన ఎంతైనా సమంజసం.

వారికీ రాజ్యాంగ రక్షణ అవసరం

కానీ కోర్టు ఇలాంటి సూక్ష్మ అంశాలను పట్టించుకునే మూడ్‌లో లేదు. భాష 'డర్టీ'గా, 'పర్వర్టెడ్'గా ఉందంటూ విచారణ ఆసాంతం ఆ వివాదాస్పద వ్యాఖ్యలపై తన ఏహ్యభావం వ్యక్తం చేసింది. ఒక దశలో న్యాయమూర్తి కల్పించుకుని, "ఇలాంటి భాషను మీరు సమర్థిస్తున్నారా?" అని చంద్రచూడ్‌ను ప్రశ్నించారు. నిజానికి డిఫెన్స్ లాయర్ పాత్ర... అత్యంత తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న నిందితుడికి సైతం న్యాయవ్యవస్థ ద్వారా చట్టపరమైన రక్షణ లభించేట్లు చూడటమే!

సుప్రీంకోర్టు సమాజ నైతికతకు సంరక్షకురాలు కాదు. భావ ప్రకటన స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి రాజ్యాంగ హక్కులను కాపాడటమే దాని ప్రాథమిక విధి. భావప్రకటన స్వేచ్ఛను పరిరక్షించడం అంటే జనామోదం పొందిన భావప్రకటనను పరిరక్షించడం అనుకోకూడదు. అప్రియమైన, జనాదరణ లేని భావప్రకటన చేసినప్పుడు అలాంటి వారికి రాజ్యాంగపరమైన రక్షణ అవసరం అవుతుంది.

అభినవ్ చంద్రచూడ్ ఈ విచారణ సందర్భంగా న్యాయ సూత్రాల మీదకు కోర్టు దృష్టిని మరల్చారు. అపూర్వ అరోరా వెబ్ సిరీస్ (కాలేజ్ రొమాన్స్) కేసును ఉదహరిస్తూ, అసభ్యత మాత్రమే అశ్లీలత అవ్వదన్న సుప్రీం తీర్పును ఆయన ప్రస్తావించారు. ఒకరి భావప్రకటన ఇతరుల లైంగిక వాంఛలను ప్రేరేపించడానికి ఉద్దేశించినదా, హద్దులు దాటి నేరపూరితమైన అశ్లీలతకు అది కారణమైందా అనే అంశాల ప్రాతిపదికగా దాన్ని పరీక్షకు పెట్టాలని ఈ తీర్పు చెబుతోంది. న్యాయస్థానం దీన్ని పట్టించుకున్నట్లు లేదు. "ఇది అశ్లీలత కాకుంటే, మరేది అశ్లీలత అవుతుంది?" అని ప్రశ్నించింది. కోర్టులు నైతిక శూన్యంలో పని చేయాలని అనడం లేదు. అలా అని వాటి నైతిక పరమైన ఏహ్యత... న్యాయ తర్కాన్ని కప్పివేయకూడదు. అరోరా కేసు "మీరు ఏదనుకుంటే అది మాట్లాడేందుకు లైసెన్స్ ఇచ్చిందా?" అని కోర్టు ప్రశ్నించడం గమనార్హం. తన వ్యక్తిగత మర్యాద భావన నుంచి వాక్ స్వాతంత్ర్య సంరక్షణను వేరు చేయడానికి కోర్టు విముఖంగా ఉన్నట్లు ఈ ప్రశ్న సంకేతాలు ఇచ్చింది.



న్యాయమూర్తులు కూడా మనుషులే. అందరి లానే వారికీ అసహ్యం, కోపం, అనైతికత పట్ల ఏహ్యభావం ఉంటాయి. కాని వారి వృత్తి... భావోద్వేగాలకు లోనై తీర్పులు చెప్పేది కాదు. రాగద్వేషాలకు అతీతంగా నిష్పక్షపాతంగా న్యాయాన్ని పరిరక్షించాలి. జనాభిప్రాయం వేరేలా ఉన్నప్పుడు ఈ విధి కష్టతరంగానే ఉంటుంది. కత్తి మీద సాములా వారు తమ విద్యుక్త ధర్మం నిర్వర్తించాల్సి వస్తుంది.

పితృస్వామ్య కథనం

రణవీర్‌ను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నట్లు ఆయన న్యాయవాది చంద్రచూడ్ కోర్టు దృష్టికి తీసుకురాగా, జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్య ప్రస్తుత హియరింగ్‌లో అత్యంత కలవరం కలిగించిన అంశం! ఈ తరహాలో చౌకబారు ప్రచారం పొందాలని మీరు ప్రయత్నించినట్లే, బెదిరింపుల ద్వారా చౌకబారు ప్రచారం సంపాదించాలని ప్రయత్నించే వారు కూడా ఉంటారు అని ఆయన వ్యాఖ్యానించారు. రణవీర్ మాటలు ఎంత అభ్యంతరకరమైనవి అన్నది పక్కనపెడితే, చంపేస్తామనే బెదిరింపులు వాటికి పర్యవసానం కారాదు.

రణవీర్ వ్యాఖ్యలు తన తల్లిదండ్రులకు అవమానం కలిగించాయని విచారణలో కోర్టు పదేపదే ప్రస్తావించింది. భారతీయ సాంస్కృతిక నియమాలను ఈ పితృస్వామ్య నెరేటివ్ ప్రతిఫలిస్తుంది. రాజ్యాంగంలో దీనికి చోటు లేదు. న్యాయస్థానాలు నైతికతకు పునరావాస కేంద్రాలు కావు. రణవీర్ నేరం చేశాడా లేదా అన్నదానికి... అతడు తన కుటుంబాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేశాడన్నది సంబంధం లేని విషయం. సామాజిక తిరస్కారాన్ని చట్టపరమైన నేరారోపణతో ముడిపెట్టడం అనేది కోర్టులు దాటకూడని ప్రమాదకమైన రేఖ.

కోర్టు చిట్టచివరకు రణవీర్‌కు మధ్యంతర ఉపశమనం మంజూరు చేసింది. ప్రతివాదులకు నోటీసు జారీచేసి వారి సమాధానం కోరింది. ఇది సరైన నిర్ణయం. రణవీర్ వ్యాఖ్యలకు అభ్యంతరకర స్వభావం ఉన్నప్పటికీ, వాటిని నేరంగా గుర్తించడానికి అది చాలదు.



వివాదాస్పద వ్యాఖ్యలతో కేసు ఎదుర్కొంటున్న 'యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్' రణవీర్ అలహాబాదియా

'ఇండియా గాట్ లేటెంట్' వెబ్ షో వివాదం, పెద్దలకు మాత్రమే ఉద్దేశించిన ఈ కార్యక్రమ స్వభావం సందర్భపరమైన ఒక ముఖ్యమైన అంశం లేవనెత్తింది. రణవీర్ వ్యాఖ్యల క్లిప్ అసందర్భంగా లీక్ అయ్యింది. ఆ విషయం కోర్టుకూ తెలిసినట్లే ఉంది. అయినా విచారణలో ఈ ఎరుక ప్రభావం కనిపించలేదు. భావప్రకటన స్వేచ్ఛ కేసుల్లో సందర్భానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. మూక ప్రేరేపిత నైతిక భయాందోళనల నుంచి కోర్టులు వాక్ స్వేచ్ఛను పరిరక్షించాలి.

న్యాయస్థానాలు తమ విచారణలో ఎంత సంయమనం పాటించాల్సి ఉంటుందో గుర్తు చేసేందుకు రణవీర్ కేసు చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది. న్యాయమూర్తులు కూడా మనుషులే. అందరి లానే వారికీ అసహ్యం, కోపం, అనైతికత పట్ల ఏహ్యభావం ఉంటాయి. కాని వారి వృత్తి... భావోద్వేగాలకు లోనై తీర్పులు చెప్పేది కాదు. రాగద్వేషాలకు అతీతంగా నిష్పక్షపాతంగా న్యాయాన్ని పరిరక్షించాలి. జనాభిప్రాయం వేరేలా ఉన్నప్పుడు ఈ విధి కష్టతరంగానే ఉంటుంది. కత్తి మీద సాములా వారు తమ విద్యుక్త ధర్మం నిర్వర్తించాల్సి వస్తుంది.

విచారణ జరగాల్సిన తీరు

వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించడానికి రాజ్యాంగానికి లోబడి అంతిమంగా తాను ఏం చేయాలో అదే మన సర్వోన్నత న్యాయస్థానం చేసింది. మధ్యంతర ఉపశమనం మంజూరు చేస్తూ ఉత్తర్వు జారీ చేసింది. అయితే, ఈ క్రమంలో అది వ్యవహరించిన తీరు ప్రజలకు అస్పష్ట సంకేతాలు పంపింది. న్యాయవ్యవస్థ నిన్ను కాపాడుతుంది... కానీ ఆ పని నిన్ను అవమానానికి గురి చేసిన తర్వాతే, అసంతృప్తితోనే నీ హక్కులను గౌరవిస్తున్నట్లు నీకు స్పష్టం చేసిన తర్వాతే, నీ మీద తన నైతిక ఆధిక్యతను రుజువు చేసుకున్న తర్వాత మాత్రమే జరుగుతుందని చెప్పకనే చెప్పింది.

రాజ్యాంగబద్ధ న్యాయస్థానాలు పని చేయాల్సిన తీరు ఇది కాదు. జనామోదం కొరవడిన వారికీ, అభ్యంతకరమైన వారికీ, ఆఖరుకు పెర్వర్ట్ అయిన వారికీ ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛ ఉంటుంది. దాన్ని కాపాడేందుకే సుప్రీం కోర్టు ఉన్నది. అసభ్యత నుంచి సమాజాన్ని శుద్ధి చేయడం తన బాధ్యత కాదనీ, తనకు దీపస్తంభంలా నిలవాల్సింది చట్టమే కాని నైతికత కానేకాదనీ న్యాయస్థానం గుర్తు పెట్టుకోవాలి. అలా గుర్తు పెట్టుకుంటూ ఈ కేసు విచారణ కొనసాగిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

మారాల్సిన మనస్తత్వం



ఇండియా చారిత్రకంగా ఎప్పుడూ సముద్రయానం మీద పట్టున్న దేశం. కానీ పాకిస్తాన్, చైనా వల్ల, స్వాతంత్ర్యానంతర భారతదేశం తనకు తాను భూపరివేష్టిత దేశపు మనస్తత్వాన్ని అలవర్చుకుంది. దీనివల్ల దేశపు వ్యూహాత్మక ప్రయోజనాలు సన్నగిల్లాయి. చుట్టూ భూమి ఉన్న దేశం కాకపోయినా మనం అలాగే వ్యవహరిస్తూ వచ్చాం.

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

గమనిస్తున్నామా?



ఆస్ట్రేలియా తీరానికి అతి దగ్గరలో టస్మాన్ సముద్రంలో చైనా ఫైర్ డ్రిల్ నిర్వహించింది. తర్వాత అది బంగాళాఖాతంలో నిర్వహిస్తుండవచ్చు. ఎందుకంటే అక్కడ చైనీస్ గస్తీ ఓడలు తిరగడం రొటీన్ అయింది.

– యూసుఫ్ ఉంఝావాలా, సంపాదకుడు

ఎడబాటు గాయం



మా నాన్న తన 42వ యేట చనిపోయారు. అది 1982 ఫిబ్రవరి 22. హఠాత్తుగా వచ్చిన గుండెపోటు దానికి కారణం. అప్పుడు నాకు పదేళ్లు. జరిగి 43 ఏళ్లు గడిచిపోయినా అది ఇప్పటికీ బాధిస్తుంది. తల్లిదండ్రులను కోల్పోయిన నష్టం నుంచి మనం ఎన్నటికీ ఎదగలేం. ఆ ఎడబాటు గాయం నుంచి కోలుకోవడంలో మనం ఎప్పుడూ ఆ చిన్నారి బాలికగానే ఉంటాం.

– కిరణ్ మన్‌రాల్, రచయిత్రి

మళ్లీ గొప్పగా...



యూరప్‌ను మళ్లీ గొప్పగా మార్చాలంటే, మనం జననాల రేటును పెంచాలి. పిల్లల్ని కనే మహిళలు అందరికీ పన్ను మినహాయింపులు ఇవ్వాలి. సంప్రదాయ కుటుంబ విలువలకు తిరిగి రావాలి.

– పీటర్ ఇమాన్యుయల్‌సేన్, స్వీడన్ జర్నలిస్ట్

ఐడియా ఉంటే...



మంచి ఐడియాలు ఉన్నవాళ్లకు ఏఐ (కృత్రిమ మేధ) కాలంలో చాలా అడ్వాంటేజీ ఉంటుంది.

– గుయిలెర్మో రౌచ్, ఇంటర్నెట్ పర్సనాలిటీ

ఇన్ బాక్స్

జ్ఞాపకాల స్టేషన్

'నూటా ఏభై ఏళ్ళ క్రితం, నిజాం రాజు మహబూబ్ అలీ ఖాన్ కట్టించిన సికింద్రాబాదు రైల్వే స్టేషన్ భవనం జమీన్ దోస్త్'. పేపర్లో ఈ వార్త చదివి, అనుకోకుండా అర శతాబ్దం వెనక్కెళ్ళాను నేను. ఎలాగా..? పాఠశాల విద్యార్థి దశ రోజులు. వేసవి సెలవులు ఊళ్ళో పూర్తి చేసుకుని బొంబాయికి తిరుగు పయనం ఆ రోజుల్లో సికింద్రాబాదు స్టేషన్ నుండే!

మా ఊరు దాచారం. ఈ స్టేషన్‌కి 115 కి.మీ. దూరం. ఊరినుండి ఒకే ఒక ప్రైవేటు బస్సు ఉదయం 6 గంటలకు బయల్దేరి భువనగిరికీ, అటునుండి ప్యాసింజర్ రైలెక్కితే పగటి పూట ఏ ఒంటిగంటకో సికింద్రాబాదు స్టేషన్‌కూ చేరుకునే వాణ్ణి అమ్మా నాన్నలతో (ఒకో సారి బంధువులతో). రాత్రి 8 గంటలకు బొంబే ఎక్స్‌ప్రెస్. అప్పటి వరకు మా మకాం, ఇప్పుడు నేలమట్టమవుతున్న ఈ విశాల ప్రాంగణంలోనే. 1వ నంబర్ ప్లాట్‌ఫారంకు ఆనుకుని ఉండే ఈ విశాల భవంతి మూడు ప్లాట్‌ఫారాలకు ముఖ్య ద్వారం. వచ్చీ పోయే ప్రయాణికులతో అది హమేషా హడావుడి. హాలుకు కుడివైపు బుకింగ్ కౌంటర్లు, ఎడమ వైపు ఖాళీ స్థలం. ఆ ఖాళీ స్థలం మాలాంటి గరీబ్ బాట సారులకు విడిది. అక్కడే లగేజి దించి, వెంట తెచ్చుకున్న విస్తరిలోని చద్దన్నం తలా ఇంత తినేసి పెద్ద వాళ్ళు అలా లగేజికి ఆనుకుని నడుం వాల్చి పడుకుంటే, నేనేమో ఆ ప్రాంగణం అంతా, దానికి దగ్గరున్న మూడు ప్లాట్ ఫారమ్‌లు కలియ తిరుగుతూ... కనిపించే బుక్‌స్టాల్లోని 'విజయ చిత్ర', 'సినిమా రంగం' లాంటి సినీ పత్రికలు తీసి ఓ రెండు మూడు నిమిషాలు తిరగేసి మళ్ళీ పెట్టేసేవాణ్ణి (డబ్బులు ఉండేవి కాదు మరి కొనటానికి). ప్లాట్‌ఫారం గుమ్మాలకు అతికించిన అలనాటి 'అంతస్తులు', 'ధర్మదాత', 'కథానాయకుడు', 'అదృష్ట వంతులు', 'గూఢచారి 116', 'వీరాభిమన్యు' లాంటి తెలుగు సినిమా పోస్టర్లను... వచ్చినప్పుడల్లా అలాగే చూస్తూ నిలుచోవటం ఇప్పటికీ గుర్తే (అవి ముంబాయి వీధుల్లో కనిపించేవి కాదు).



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

ఇక అడపా దడపా తెలుగు ప్రాంతాల నుండి వచ్చే రైళ్ళలోని ప్రయాణికుల కోలాహలం, వారి కట్టూ–బొట్టు, మాటల యాస ఆసక్తితో గమనించే వాణ్ణి. అదో తీయని దృశ్యం. బంబయ్యా కా హిందీ లానే మన తెలుగునూ ఇక్కడ మనం మాట్లాడేది. కాని తెలుగునాట ఎన్ని యాసలో, ఆ స్టేషన్‌లోనే విన్నాను! ఆధునీకరణ పేరుతో ఇది ఇప్పుడు జమీన్ దోస్త్ అవుతున్నా... ఈ వయసులోనూ నా మనో ఫలకంపై భద్రంగానే ఉంది.

– జిల్లా గోవర్ధన్, మాజీ పీఎఫ్ కమిషనర్, ముంబై

ఈ యుద్ధంలో అంతిమ విజయం అమెరికాదే?

సందర్భం



బుడ్డిగ జమిందార్

గత మూడు సంవత్సరాలుగా జరుగుతున్న ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఆపే ప్రయత్నంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 90 నిమిషాలపాటు పుతిన్‌తో టెలీఫోనులో సంభాషించిన తర్వాత శాంతి చర్చల ప్రారంభానికి సౌదీ అరేబియా రాజధాని రియాద్‌ను ఎన్నుకొన్నారు. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ నాయకత్వంలో ఫిబ్రవరి 18 తేదీన మంతనాలు జరిపి తొందరలోనే ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించాలనుకొన్నారు. ట్రంప్ మాత్రం ఈ సంప్రదింపులలో పాల్గొనవలసిందిగా అటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని గానీ, ఇటు యూరప్ దేశాలను కానీ ఆహ్వానించక పోవటంతో పారిస్‌లో పోటీగా శాంతిచర్చలకు యూరప్‌లోని ప్రధాన దేశాధినేతలు సమావేశమవ్వటంతో ఒక్కసారిగా నాటో దేశాల మధ్య అనైక్యత బయటపడింది.

యుద్ధాన్ని ఆపితే ప్రతిఫలంగా కొన్ని తాయిలాలను ట్రంప్ రష్యాకు ఇస్తానన్నారని అనధికార వార్తలు వస్తున్నాయి. వీటిల్లో ముఖ్యమైనవి ఉక్రెయిన్‌కు భవిష్యత్తులో నాటో సభ్యత్వం ఇవ్వరు. అలాగే ఇప్పటి వరకూ యుద్ధంలో రష్యా స్వాధీనం చేసుకున్న ఉక్రెయిన్ ప్రాంతం, లోగడ తీసుకొన్న క్రిమియా భాగం రష్యా ఆధీనం కిందకు వస్తుంది. అమెరికా, ఉక్రెయిన్‌లు ఈ ప్రాంతాల్ని దౌత్యపరంగా గుర్తించాలి. రష్యా ఆధీనంలో ఉన్న భూభాగంలోని 50,000 కోట్ల డాలర్ల విలువ చేసే లిథియం, టైటానియం నిక్షేపాలను అమెరికా పొందుతుంది. పశ్చిమాసియాలో రష్యా అమెరికాలు ఒకరికొకరు మద్దతునిచ్చుకొని అవసరమైతే చైనా వ్యతిరేక కూటమి ఏర్పాటుకు సన్నాహాలు చేయవచ్చు. పాలస్తీనియన్లను గాజా నుండి పారదోలటంలోనూ, ఇరాన్‌పై యుద్ధం చేస్తే రష్యా మద్దతును పొందడానికే ట్రంప్ ప్రయత్నం చేయవచ్చు.

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదనలను తోసిపుచ్చి, ఉక్రెయిన్, అమెరికా వలసవాద దేశం కాజాలదన్నాడు. ట్రంప్ విధానాలు యూరప్‌పై దాడిగా ప్రముఖ యూరప్ పత్రికలు రాశాయి. ఈ విధానాలు 'ట్రాన్స్ అట్లాంటిక్ కూటమి' పతనానికి దారి తీస్తుందని వ్యాఖ్యానించాయి. యూరప్ భద్రతా సవాళ్లను చర్చించి మిలిటరీ పరంగా యూరప్ దేశాలు తమ జీడీపీ నుండి 3 నుండి 5 శాతం వరకూ ఖర్చు చేయాల్సి వస్తుందని దేశాధినేతలు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే యూరపు ఆర్థికవ్యవస్థలు ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో తిరోగమన దిశలో పయనిస్తున్నాయి. ఇంకా మిలిటరీ ఖర్చు పెరిగితే ప్రజలపై అదనపు భారం పడే ప్రమాదముంది.

ఉక్రెయిన్ ఆన్‌లైన్ పత్రిక 'స్ట్రానా' ట్రంప్, పుతిన్‌ల శాంతి ఒప్పందాలను లీక్ చేసింది. దీన్ని అనుసరించి ఏప్రిల్ 20 నాటికి పరిపూర్ణ కాల్పుల విరమణ జరగాలని, ఉక్రెయిన్ ఆక్రమించిన రష్యా భూభాగం కుర్స్క్‌ను తిరిగి రష్యాకు ఇవ్వాలని, తొందరలోనే పుతిన్, ట్రంప్‌లు మాస్కోలో, వాషింగ్టన్‌లో కల్సుకొంటారని, జెలెన్‌స్కీ, పుతిన్‌లు సౌదీ అరేబియాలో కలుసుకోవచ్చని అభిప్రాయపడింది. అధికారికంగా ఈ షరతులన్నీ మే 9 నుండి అమలులోకి రావచ్చని తెలిపింది. అయితే ఇవేవీ జరుగలేదు. నిన్న శనివారం కూడా యుద్ధం కొనసాగింది. రష్యా కొత్తగా ఉక్రెయిన్ గ్రామాన్ని ఒక దాన్ని ఆక్రమించుకుంది.

చైనాను ఎదుర్కొనే వ్యూహం

తాను అమెరికా అధ్యక్షునిగా ఉండి ఉంటే అప్పట్లో యుద్ధాన్ని జరిపించే వాడిని కాదని ట్రంప్ ఇప్పటికే అనేకసార్లు చెప్పారు. 3 సంవత్సరాల యుద్ధంతో ఉక్రెయిన్ తీవ్ర నష్టాల పాలయ్యింది. సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందిన ఈ యూ దేశాల ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలో కూరుకోవటం, తిరుగులేని అణుశక్తిగా, మిలిటరీశక్తిగా ఇప్పటికే రష్యా ఉండి, అపారమైన ఖనిజ సంపద కల్గి ఉండటంతో ట్రంప్ రష్యాపై మొగ్గు చూపుతున్నారు. భౌగోళికంగా వ్యూహాత్మకంగా రష్యా సహాయంతో చైనాను చుట్టు ముట్టటం తేలిక అనుకోవటం ట్రంప్ ఆలోచన కూడా కావచ్చు. ఉక్రెయిన్‌కు ఆర్థిక సహాయాన్ని అందించటం కూడా అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారం కావటం మరొక కారణం కాగా, అమెరికా మార్కెట్లకు రష్యా కొత్తద్వారాలను తెరుస్తుందని ఆశ పడటం మరొక కారణం కావచ్చు.

అసలు యుద్ధం ప్రారంభించటానికి ప్రధాన కారణం రష్యాను ముక్కలుగా చేసి, దాని అపార ఖనిజసంపదను దోచుకోవటానికే ననేది జగమెరిగిన సత్యం. శాంతి చర్చలతో రష్యా అధ్యక్షుడు పుతిన్ విజేతగా నిలువనున్నాడు. అమెరికా ఉక్రెయిన్‌కు మద్దతు పలికి ఓటమిపాలవుతూ ఇప్పుడు ట్రంప్ రూపంలో శాంతి ఒడంబడిక ద్వారా నెగ్గే ప్రయత్నం చేస్తోంది. రష్యాకి సంబంధించిన 30,000 కోట్ల డాలర్లను అమెరికా బ్యాంకుల్లో స్తంభింపజేసి, ఉక్రెయిన్‌లో ఖనిజ సంపదపై కన్నేసిన అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థ నైజాన్ని ప్రపంచానికి తెలిపింది. తాజా వార్తలు అందే సమయానికి ట్రంప్ తన సహజధోరణిలో మాట మార్చి ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగిందని ప్రకటించారు. యుద్ధ పరిసమాప్తి గురించి వాషింగ్టన్... రష్యాతో చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ఉక్రెయిన్ తమతో ఖనిజ ఒప్పందాలను కుదుర్చుకుంటుందని ప్రకటించారు. మొత్తానికి ఈ యుద్ధం వల్ల అమెరికా ప్రయోజనాలు నెరవేరబోతున్నాయన్నమాట!



నేటితో రష్యా – ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు

2025 ఫిబ్రవరి 24 నాటికి రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై మూడేళ్లవుతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో చోటు చేసుకున్న భయంకర యుద్ధం ఇదే. ఉక్రెయిన్‌లో 20 శాతం భూభాగాన్ని రష్యా ఆక్రమించింది. ఈ యుద్ధం వల్ల 2024 నవంబర్ నాటికి ఉక్రెయిన్‌కు సంభవించిన మొత్తం ఆస్తి నష్టం 170 బిలియన్ డాలర్లు అని 'కేఎస్ఈ ఇనిస్టిట్యూట్' అంచనా. ఉక్రెయిన్ సైనికులు 80 వేల మంది చనిపోయినట్టు, 4 లక్షల మంది గాయపడినట్టు 'వాల్ స్ట్రీట్ జర్నల్' అంచనా. రష్యా పౌరులు కొద్దిమందే మరణించినా సైనికులను మాత్రం పెద్ద సంఖ్యలోనే కోల్పోయిందని వార్తలు. అందుకే అది కిరాయి సైనికులను రంగంలోకి దించింది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, కె.ఎల్. యూనివర్సిటీ । 98494 91969

గ్రహం అనుగ్రహం: శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.10.46 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ సా.4.36 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.12.42 నుండి 2.18 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.39 నుండి 1.27 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.33 నుండి 1.13 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.26, **సూర్యాస్తమయం:** 6.01.

తెల్లవారితే పెళ్లి... గుండెపోటుతో వరుడి తండ్రి మృతి


సత్యనారాయణ

సిద్దిపేట జోన్: తెల్లవారితే వివాహం.. ఆ ఇంట్లో ఎటు చూసినా పెళ్లి సందడి. వచ్చిన కుటుంబ సభ్యులతో ఇల్లు కళకళలాడుతోంది. అంతలోనే విధి చిన్నచూపు చూసింది. వరుడి తండ్రి గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో మంగళవాయిద్యాలు మోగాల్సిన ఆ ఇంట్లో విషాదం నెలకొంది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన రాగుల సత్యనారాయణగౌడ్, జయ దంపతులు మూడేళ్లుగా సిద్దిపేట పట్టణం రాఘవేంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేసిన సత్యనారాయణ ఏడాది క్రితం పదవీ విరమణ పొందారు. ఆయన ఇద్దరు కుమారులలో పెద్ద కుమారుడు శ్రీనివాస్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. ఆదివారం ఉదయం దుబ్బాకలోని ఒక ఫంక్షన్ హాల్‌లో వీరి పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సత్యనారాయణకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

కిరోసిన్ పోసుకొని... ఇద్దరి ఆత్మహత్య

- దర్యాప్తు చేపట్టిన పోలీసులు


లక్ష్మి


శ్రీధర్

కొండపాక (గజ్వేల్): వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన సిద్దిపేట సిల్లా కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారికి సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి ఆటోలో వచ్చిన ఇద్దరు గ్రామ శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న హోటళ్ల వద్ద రాత్రి దిగారు. కొద్దిదూరంలో ఉన్న చెట్ల పొదల వద్దకు వెళ్లి వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నారు. దీంతో ఒక్కసారిగా మంటలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తూనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అప్పటికే మహిళ మృతి చెందగా, మరో వ్యక్తి కొన ఊపిరితో ఉన్నాడు. అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపట్లోనే మృతి చెందాడు. ఘటనా స్థలంలో లభించిన బ్యాగులలో దొరికిన ఆధార్ కార్డుల ఆధారంగా వారిని సిద్దిపేటలోని సాయి విద్యానగర్ కాలనీకి చెందిన శిరోద్కర్ లక్ష్మి (65), రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ ఆదర్శనగర్‌కు చెందిన టెక్లేకర్ శ్రీధర్ (45)లుగా గుర్తించారు. లక్ష్మి భర్త చందు, శ్రీధర్ తండ్రి నర్సోజిలుగా ఆధార్ కార్డులో నమోదై ఉంది. మృతుల విషయంలో ఎలాంటి సమాచారం తెలిసినా సీఐ లతీఫ్ 8712667342, ఎస్సై శ్రీనివాస్ 8712667345లకు సమాచారం అందించాలని కోరారు.

కన్నతండ్రి కళ్లెదుటే.. సోదరుడిని కడతేర్చారు

- ఆస్తి కోసం దారుణానికి పాల్పడ్డ చెల్లెళ్లు


శ్రీనివాస్

జగిత్యాల క్రైం: ఆస్తి కోసం కన్న తండ్రి ఎదుటనే సొంత అన్నను అంతమొందించారు అతడి చెల్లెళ్లు. ఈ సంఘటన జగిత్యాల జిల్లాలో ఆదివారం చోటు చేసుకుంది. జగిత్యాల పోచమ్మవాడకు చెందిన జంగిలి బసవయ్యకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు సంతానం. అందరికీ వివాహాలు అయ్యాయి. బసవయ్య కుమారుడు శ్రీనివాస్ ఆర్టీఏ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. మరో కుమారుడు గతంలోనే మరణించాడు. శ్రీనివాస్ పెద్ద సోదరి భారతపు వరలక్ష్మి భర్త చనిపోవడంతో 22 ఏళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. చిన్న సోదరి వొడ్నాల శారద కూడా భర్తను వదిలేసి పుట్టింట్లోనే ఉంటోంది. వీరిద్దరూ శ్రీనివాస్ ఇంటి పక్కనున్న వంద గజాల భూమిని తమకు రాసివ్వాలని తండ్రి బసవయ్య, సోదరుడు శ్రీనివాస్‌తో కొంతకాలంగా గొడవ పడుతున్నారు. వంద గజాల భూమి శ్రీనివాస్‌కే రాసిస్తానని బసవయ్య పదేళ్ల క్రితమే చెప్పడంతో వరలక్ష్మి, శారద కోర్టులో కేసు వేశారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో నడుస్తోంది. హనుమాన్‌వాడలో అద్దెకు ఉంటున్న శ్రీనివాస్ ఆదివారం సెలవు దినం కావడంతో తల్లిదండ్రులను చూసేందుకు పోచమ్మవాడకు వచ్చాడు. తండ్రితో మాట్లాడుతుండగానే అక్కడే ఉన్న వరలక్ష్మి, శారద ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీనివాస్‌ను రోడ్డుపై పడేసి కట్టెలతో దాడి చేశారు. దీంతో స్పృహ కోల్పోయిన శ్రీనివాస్‌ను జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు వరలక్ష్మి, శారదపై హత్య కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

40 కి.మీ.. నిమిషాలు

ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో

- పెద్ద గోల్కొండ, తుక్కుగూద, రావిర్యాల మీదుగా ఫ్యూచర్ సిటీకి..
- పెద్ద గోల్కొండ, బహదూర్‌గూడల్లో అధునాతన మెట్రో స్టేషన్లు
- ముందుచూపుతో ఓఆర్‌ఆర్‌లో మెట్రోకు స్థలం కేటాయించిన దివంగత సీఎం వైఎస్
- నలభై కిలోమీటర్లలో చాలావరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణమే..
- డీపీఆర్ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి కేవలం 40 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఎయిర్‌పోర్టు నుంచి స్కిల్స్ యూనివర్సిటీ వరకు నిర్మించనున్న 40 కిలోమీటర్ల మెట్రో కారిడార్ అత్యాధునిక సదుపాయాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో అందుబాటులోకి రానుంది. ప్రపంచ వ్యాప్తంగా అద్భుతమైన నగరాల్లోని మెట్రో ప్రయాణ అనుభవాలు స్ఫురించే విధంగా ఈ కారిడార్‌లో మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. 40 కి.మీ ఫోర్త్ సిటీ మెట్రోలో చాలావరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. హెచ్‌ఎండీఏ నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో కొంతభాగంలో మాత్రం ఎట్‌గ్రేడ్ మెట్రో (భూతలంపైన) నిర్మాణం చేపట్టనున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భవిష్యత్ దార్శనిక దృష్టి మేరకు.. ప్రస్తుత ఔటర్ రింగ్ రోడ్డు మార్గంలో మెట్రో అందుబాటులోకి రానుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఓఆర్‌ఆర్ నిర్మాణంలో భాగంగా భవిష్యత్తులో నిర్మించే మెట్రో అవసరాలకు అనుగుణంగా ఆయన ఓఆర్‌ఆర్‌లో 20 మీటర్లు మెట్రో కోసం కేటాయించిన విషయం గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ మార్గంలోనే మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు.

సర్వే పనుల పరిశీలన

మెట్రో రెండో దశలో ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) రూపకల్పనలో భాగంగా ఎన్వీఎస్ రెడ్డి.. హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ అధికారులతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్స్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారు చేసేందుకు జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు. కొంగర కలాన్ దాటిన తర్వాత రోడ్డు లేకపోవడంతో కాలినడకనే కొండలు, గుట్టలు దాటుతూ పర్యటన కొనసాగించారు. ప్రపంచంలోనే ఒక గొప్ప నగరంగా ఆవిష్కృతం కానున్న ఫోర్త్‌సిటీ మెట్రో సేవలు కూడా అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ఉంటాయని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. సుమారు 15 వేల ఎకరాల్లో విస్తరించనున్న భవిష్య నగరిని కాలుష్య రహిత నగరంగా రూపొందించాలన్నది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు.

ఫ్యూచర్ సిటీ కారిడార్ ఇలా...

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం సుమారు 40 కిలోమీటర్లు ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుంచి మొదలై కొత్తగా నిర్మించనున్న మెట్రో రైల్ డిపో పక్క నుంచి ఎయిర్‌పోర్ట్ సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గం నిర్మించనున్నారు.
- మన్సాన్‌పల్లి రోడ్డు మార్గంలో 5 కిలోమీటర్లు ముందుకు సాగిన తర్వాత పెద్ద గొల్కొండ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్‌కు చేరుతుంది. బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండలలో రెండు మెట్రో స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆకర్షణీయంగా నిర్మించనున్నారు.


- పెద్ద గోల్కొండ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల్ ఎగ్జిట్ వరకు సుమారు 14 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ మెట్రో కారిడార్‌గా నిర్మించనున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుపై 'ఎట్ గ్రేడ్ మెట్రో'

- రావిర్యాల్ ఎగ్జిట్ నుండి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్స్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగర కలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగుడా, మీర్‌ఖాన్ పేట్ వరకు హెచ్‌ఎండీఏ 100 మీటర్లు (328 అడుగులు) వెడల్పున గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మించనుంది.ఈ రోడ్డు మధ్యలో 22 మీటర్లు (72 అడుగులు) మెట్రోరైల్‌కు కేటాయించారు. ఇక్కడ భూ తలంపై (ఎట్ గ్రేడ్) మెట్రో అభివృద్ధి చేయనున్నారు.
- ఈ విశాలమైన రోడ్డు మధ్యలో అదే ఎత్తులో మెట్రో రైల్ ఉంటే దానికి ఇరువైపులా మూడు లేన్ల ప్రధాన రహదారి ఉంటుందని, మెట్రోను, ప్రధాన రహదారిని విభజిస్తూ ఆకర్షణీయమైన చెట్లను, గ్రీనరీని అభివృద్ధి చేస్తామని, ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు సర్వీస్ రోడ్లు ఉంటాయని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.


క్షేత్రస్థాయి సర్వేలో ఎన్వీఎస్ రెడ్డి ఇతర అధికారులు

వైఎస్ భవిష్యత్ దృష్టి

ఓఆర్‌ఆర్ నిర్మాణ సమయంలో మెట్రో రైల్‌కు కొంత భూమిని కేటాయించాలన్న తన ప్రతిపాదన మేరకు అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఓఆర్‌ఆర్‌లో అంతర్భాగంగా 20 మీటర్లు మెట్రోకు కేటాయించారని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. అయితే ఓఆర్‌ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కేవలం కాగితాలకే పరిమితమవుతాయని, ఆచరణ సాధ్యం కాదంటూ అపహాస్యం చేశారని, కానీ ప్రస్తుతం ఓఆర్‌ఆర్‌తోపాటు, మెట్రో కూడా కార్యరూపం దాల్చిందన్నారు. సుమారు రూ.22 వేల కోట్లతో మొట్టమొదటి పీపీపీ ప్రాజెక్టుగా 69 కిలోమీటర్ల మెట్రో మొదటి దశను విజయవంతంగా నిర్మించామని, అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి దార్శనికత మేరకు హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ, మెట్రో రైల్ సంస్థలు సంయుక్తంగా రెండో దశ నిర్మాణం చేపడతాయని చెప్పారు. నార్త్ సిటీలోని మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లతో పాటు, ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్‌ను మార్చి నెలాఖరుకు పూర్తి చేసి, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

భూ వివాదంతోనే రాజలింగమూర్తి హత్య

- హతమార్చింది నలుగురు.. సహకరించింది ఆరుగురు
- ఏడుగురి అరెస్ట్ చూపించిన భూపాలపల్లి పోలీసులు
- పరారీలో ముగ్గురు.. అందులో ఒకరు బీఆర్‌ఎస్ నేత


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్యకు భూ వివాదమే కారణమని వెల్లడైంది. హత్యలో పాల్గొన్న, సహకరించిన ఏడుగురిని అరెస్ట్ చేశామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే చెప్పారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి(50)కి, రేణుకుంట్ల సంజీవ్, అతని బంధువులకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఎకరం భూమి విషయంలో వివాదం నెలకొనగా, కోర్టులో కేసు నడుస్తుంది. అయితే రాజలింగమూర్తిని చంపితేనే మనం భూమి దక్కించుకోగలమని సంజీవ్ తమ బంధువులకు చెప్పి, వారి సహకారం అడిగాడు. ఇందుకు వారు అంగీకరించడంతో రెండు నెలల క్రితం వరంగల్‌లో రెండు కత్తులు, ఒక రాడ్ కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. ఈనెల 19న రాజలింగమూర్తిని హత్య చేయాలని భావించి, అతడి కదలికలను గమనిస్తూ, సాయంత్రం సుమారు 6.45 గంటల సమయంలో ఆయన రెడ్డికాలనీలోని తన ఇంటికి బైక్‌పై వెళుతుండగా.. రేణుకుంట్ల సంజీవ్, సేమంత్(బబ్లూ), మోరె కుమార్, కొత్తూరి కిరణ్‌లు మంకీ క్యాప్‌లు ధరించి రాజలింగమూర్తి బైక్‌ను ఆపి కళ్లలో కారం చల్లి రాడ్‌తో తలపై కొట్టి.. కడుపులో కత్తులతో పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. హత్య చేసిన నలుగురితోపాటు వారికి సహకరించిన ఆరుగురిపై కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం ఏడుగురు నిందితులు భూపాలపల్లిలో ఉన్నారని, సమాచారం అందగా, పట్టుకున్నామని ఎస్పీ వెల్లడించారు.

పరారీలో బీఆర్‌ఎస్ నేత హరిబాబు

రాజలింగమూర్తి హత్య కేసులో మొత్తం పదిమంది నిందితులు కాగా, పోలీసులకు ఏడుగురు చిక్కారు. మరో ఇద్దరితోపాటు ఏ8 గా ఉన్న భూపాలపల్లి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, బీఆర్‌ఎస్ నేత కొత్త హరిబాబు ఇంకా పోలీసులకు చిక్కలేదు. పరారీలో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు.


భూమి కోసం హత్య జరగలేదు: మృతుడి భార్య సరళ


సరళ

తన భర్త హత్యకు భూవివాదం కారణం కాదని సరళ పేర్కొంది. ఆమె తన ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై కేసు వేశారని, 20వ తేదీన కోర్టులో కేసు విచారణ ఉండగా, 19వ తేదీన హత్య చేయించారని ఆరోపించింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు.. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి చెప్పి హత్య చేయించారని ఆరోపించింది.

భారీ గుండుతో సమాధి పైకప్పు

- 3,500 ఏళ్ల క్రితం నాటి అరుదైన డాల్మెన్ గుర్తింపు


సమాధి వద్ద ఈమని శివనాగిరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: దాదాపు 3,500 ఏళ్ల క్రితం నాటి అరుదైన సమాధిని గుర్తించారు. సాధారణంగా ఆ కాలంలో గూడు సమాధుల(డాల్మెన్)ను ఏర్పాటు చేసేవారు. మూడు వైపులా రాళ్లను ఏర్పాటు చేసి.. వాటిపై చతురస్రాకారంలో కప్పు రాతిని ఉంచేవారు. కానీ, కప్పు రాతి సల్ప బదులు భారీ గుండును ఏర్పాటు చేయటం ఇక్కడ ప్రత్యేకతగా నిలుస్తోందని.. దాన్ని గుర్తించిన చరిత్ర పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా గుడిపల్లి మండల కేంద్రం శివారులోని గుట్టపై దీన్ని గుర్తించినట్టు వెల్లడించారు. గుడిపల్లికి చెందిన బోయ శ్రీనివాసరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు.. ఆదివారం అక్కడికి వెళ్లి దాన్ని పరిశీలించినట్టు పేర్కొన్నారు. దీంతోపాటు సమీపంలోని పొలాల్లో ఏడడుగుల ఎత్తున్న రెండు మెన్హిర్ (స్మారక నిలువురాళ్లు) లను కూడా గుర్తించామని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ మెన్హిర్‌ల సంఖ్య ఎక్కువగా ఉండేదన్నారు. ఆ రాళ్లను తొలగించి తీసుకుపోగా రెండు మాత్రమే మిగిలాయని చెప్పారు. వాటిని, గుట్టపై అత్యంత అరుదైన గూడు సమాధిని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శివనాగిరెడ్డి వెంట కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు యూనస్ ఫర్హాన్, స్థానికులు సైదులు, బోయ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోకుంటే తాగునీటి ఎద్దడే!

- ఇతర అవసరాలకు నీటి సరఫరా నియంత్రించాలంటున్న ప్రభుత్వ వర్గాలు
- అప్రమత్తమైన సర్కారు.. కృష్ణా, గోదావరి బేసిన్‌ల కనీస నీటిమట్టం నుంచి తాగునీరు తీసుకోవాలని ఆదేశం
- మొత్తంగా 58.72 టీఎంసీలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారి ఎండలు ముదరక ముందే పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తప్పకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. కొన్ని రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలు మార్చి, ఏప్రిల్ చివరి వరకే తాగునీటికి సరిపోతాయని పేర్కొన్నాయి. ప్రధానంగా గోదావరి బేసిన్ కింద ఉన్న మంచినీటిని సరఫరా చేయడానికి ఉన్న నీటివనరుల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి బేసిన్‌ల పరిధిలోని రిజర్వాయర్లలో కనీస నీటిమట్టం నుంచి తాగునీరు తీసుకోవడానికి ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా బేసిన్ నుంచి 23.44 టీఎంసీలు, గోదావరి బేసిన్ కింద 35.28 టీఎంసీలను కలిపి మొత్తంగా 58.72 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం కేటాయించింది. హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు మిషన్ భగీరథ పథకం కింద ఈ నీటి కేటాయింపులు చేసింది.

తాగునీటి అవసరాలపై అధికారుల లెక్కలు ఇలా..

- ప్రస్తుతం జూరాలకు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అయితే ఫిబ్రవరి చివరి నాటికి ఇన్‌ఫ్లోలు ఆగిపోతాయని, ప్రస్తుతం ఉన్న అవుట్‌ఫ్లో కొనసాగినా ఏప్రిల్ వరకే నీరు అందించడానికి వీలవుతుందని... అప్పుడు సంగంబండ నుంచి నీటి సరఫరా చేస్తే తప్ప తాగునీరు సరఫరా చేయని పరిస్థితులు తలెత్తుతాయని స్పష్టం చేశారు.
- ఎల్లంపల్లిలో రోజుకు 0.20 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు. అలా చేస్తే మార్చి నెలాఖరు వరకే నీరు సరిపోతుంది. అందుకని ఇతర అవసరాలకు ఎల్లంపల్లి నీటి వినియోగాన్ని ఆపేయాలి. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్ వరకు 7 టీఎంసీల నీరు నిల్వలు ఉండేలా చూడాలి.
- మిడ్‌మానేరు నుంచి రోజుకు 0.20 టీఎంసీల నీరు వినియోగిస్తున్నారు. ఇలా కొనసాగిస్తే ఏప్రిల్ వరకు మాత్రమే నీరు రిజర్వాయర్‌లో ఉంటాయి. ఆ తరువాత ఇక్కట్లు తలెత్తుతాయి. మిడ్‌మానేరు నీరు కలుషితం కాకుండా ఉండాలంటే కనీసం ఆరు టీఎంసీల నిల్వ ఉంచాలి. ఇతర అవసరాలకు వినియోగాన్ని తగ్గించాలి.
- లోయర్ మానేరు నుంచి రోజుకు 0.13 టీఎంసీలు నీరు వాడుతున్నారు. అలా వాడితే ఏప్రిల్ వరకే నీరు అందుబాటులో ఉంటుంది. అందుకని ఇతర వినియోగాన్ని తగ్గించాలి.
- రామన్‌పాడు, వనపర్తి నుంచి 46 హ్యాబిటేషన్లు, రెండు మునిసిపాలిటీలకు ఏప్రిల్ చివరి వరకు నీటి సరఫరా చేయాలంటే 0.20 టీఎంసీల నీటిని నిల్వ చేయాలి.


నాగార్జున సాగర్ జలాశయం (ఫైల్)

- పాలేరు–ఖమ్మం రిజర్వాయర్‌లోకి ఏప్రిల్ నెలాఖరు వరకు 1.90 టీఎంసీ నీటి నిల్వ ఇన్‌ఫ్లో కొనసాగించి అవుట్‌ఫ్లో నిలిపివేయాలి.
- నల్లగొండ జిల్లాలోని ఏకేబీఆర్ రిజర్వాయర్ నుంచి 999 ఆవాసాలు, 5 మునిసిలిటీలకు తాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నీరు కేవలం 22 రోజులకు మాత్రమే సరిపోతుంది. దీనికి ఎన్ఎస్‌పీ నుంచి నీటి సరఫరా చేయాలి. అలాగే పెండ్లిపాకల నుంచి 67 హ్యాబిటేషన్లకు నీటి సరఫరా 38 రోజులకు సరిపడా మాత్రమే ఉంది. దీనికి కూడా ఎన్ఎస్‌పీ నుంచి నీటి సరఫరా చేయాలి.
- ఎస్ఆర్ఎస్‌పీ నిజామాబాద్ నుంచి రోజుకు 0.46 టీఎంసీల నీరు అన్ని అవసరాలకు వాడుతున్నారు. మిగిలిన అవసరాలకు నీటిని తగ్గించాలి. ఏప్రిల్ చివరి నాటికి 6 టీఎంసీలు నిల్వ ఉండేలా చూడాలి.

కైలాశ్.. మీ ప్రయత్నం అభినందనీయం

- ఆదిలాబాద్ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ప్రధాని మోదీ ప్రశంస
- అంతరించిపోతున్న గిరిజన భాషల పరిరక్షణకు పాటుపడుతున్నారని 'మన్ కీ బాత్'లో వెల్లడి


కైలాశ్

సాక్షి, న్యూఢిల్లీ: అంతరించి పోతున్న గిరిజన భాషల పరిరక్షణకు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తొడసం కైలాశ్ చేస్తున్న కృషిని ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. తన మాసాంతపు రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో ఈ విషయాన్ని శ్రోతలతో పంచుకున్నారు. 'అంతరించిపోయే దశలో ఉన్న గిరిజన భాషలను కాపాడేందుకు కైలాశ్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. ఏఐని ఉపయోగించి కొలామి భాషలో కైలాశ్ పాటను కంపోజ్ చేశారు. డిజిటల్ పాటలు, సంగీతంపట్ల ఆయనకున్న ఆసక్తి ఆదివాసీ భాషలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఏఐ సాధనాల సాయంతో కొలామి భాషలో పాటను కంపోజ్ చేయడం ద్వారా కైలాశ్ అద్భుతాలు చేశారు. ఆదివాసీలు సామాజిక మాధ్యమాల్లో ఆయన ట్రాక్‌లను చాలా ఇష్టపడుతున్నారు' అని మోదీ తెలిపారు. మరోవైపు ఏపీకి చెందిన అథ్లెట్ జ్యోతి యర్రాజీ పేరును సైతం ప్రధాని ప్రస్తావించారు. 'ఖేలో–ఇండియా' ప్రచారం ఫలితంగానే జ్యోతి లాంటి చాలా మంది క్రీడాకారులు బయటి ప్రపంచానికి తెలిశారన్నారు.

మనం ఫిట్‌గా ఉంటే దేశం ఫిట్‌గా ఉంటుంది: నిఖత్ జరీన్



'మన్ కీ బాత్'లో తెలంగాణకు చెందిన ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ ఆడియో సందేశం ద్వారా ఊబకాయం వల్ల వచ్చే రుగ్మతలు, శారీరక ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రజలంతా ఊబకాయాన్ని నివారించేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని సూచించారు. రోజూ ఉద్యోగానికి, పనికి వెళ్లే సాధారణ ప్రజలంతా రోజువారీ శారీరక శ్రమ చేయాలని కోరారు. దీనివల్ల గుండెపోటు, కేన్సర్ వంటి వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. 'మనం ఫిట్‌గా ఉంటే భారతదేశం ఫిట్‌గా ఉంటుంది' అని నిఖత్ జరీన్ పేర్కొన్నారు.

యూరియా కొరత లేదు

- ఈ వారంలో 81,800 మెట్రిక్ టన్నులు వస్తోంది: వ్యవసాయ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులెవరూ ఆందోళనకు గురికావొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ వారంలో రాష్ట్రానికి మరో 81,800 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వెల్లడించారు. రాష్ట్రంలో యూరియా లభ్యత, రైతులకు సరఫరాపై వ్యవసాయ శాఖ అధికారులతో ఆదివారం మంత్రి తుమ్మల టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గత యాసంగితో పోలిస్తే రాష్ట్రంలో ఇప్పుడు వరి, మొక్కజొన్న పంటల విస్తీర్ణం 10 శాతం వరకు పెరిగిందని, ఈ మేరకు గత యాసంగి కంటే 1.9లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా వినియోగమైందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం 1.29 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఈ వారంలో 81,800 మెట్రిక్ టన్నులు అదనంగా వస్తుందని చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ యూరియా సరఫరా విషయంలో రైతులకు ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విమర్శలొద్దు.. యూరియా ఇప్పించండి

గత యాసంగిలో ఫిబ్రవరి 20 నాటికి 6.9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేస్తే ఈసారి 8.80 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నారని మంత్రి తుమ్మల చెప్పారు. గత ఏడాది ఫిబ్రవరి నెలలోనే 1.99 లక్షల మెట్రిక్ టన్నులు కొంటే, ఈసారి 2.59 లక్షల మెట్రిక్ టన్నులను కొన్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ సీజన్‌లో 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 6.81 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చిందని, మిగిలిన దాని కోసం నిరంతరం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రంలోని పరిస్థితిని వివరిస్తున్నామన్నారు. కేంద్రం నుంచి 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువ వచ్చినా, మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న 3.08 లక్షల మెట్రిక్ టన్నుల లభ్యత నుంచి అవసరాన్ని బట్టి జిల్లాలకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. కేంద్రం నుంచి యూరియా కోసం ఇప్పటికే ఢిల్లీలోని అధికారులను కలిశామని, తాను కూడా కేంద్ర మంత్రికి లేఖలు రాశానన్నారు. రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలు యూరియా సరఫరాపై విమర్శల కంటే, కేంద్రం నుంచి రావాల్సిన యూరియాను తీసుకురావడంపై దృష్టి సారించాలని మంత్రి తుమ్మల హితవు పలికారు.

రేపటి నుంచి బయో ఏషియా

▶ మొదటి పేజీ తరువాయి

ఇతివృత్తాన్ని ఎంచుకున్నారు. సదస్సు ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, క్వీన్స్‌ల్యాండ్ గవర్నర్ డాక్టర్ జీనెట్‌యంగ్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, జీ20 షెర్పా అమితాబ్‌కాంత్‌లు పాల్గొంటారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో వస్తున్న అధునాతన మార్పులు, శాస్త్ర పురోగతిపై చర్చిస్తారు. హెల్త్‌కేర్ రంగంలో ఏఐతో వచ్చిన మార్పులు, లైఫ్‌సైన్సెస్ భవిష్యత్‌ను నిర్దేశించే కొత్త ఆవిష్కరణలు, గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేయడం, ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మోడల్స్ తదితరాలను ఎజెండా అంశాలుగా నిర్ణయించారు. బయో ఫార్మాస్యూటికల్స్, డిజిటల్ హెల్త్, వైద్య పరికరాలు, అధునాతన చికిత్స విధానాలు, అత్యాధునిక వైద్యం, ఆరోగ్య సంరక్షణ విధానాలపై చర్చించనున్నారు. ప్రపంచస్థాయిలో హెల్త్‌కేర్ ఇన్నోవేషన్ హబ్‌గా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలకపాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బయో ఏషియా–2025 సదస్సు లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలవనుంది.

ఇన్నోవేషన్ జోన్ ప్రత్యేకం: ఈ సదస్సులో ప్రత్యేకంగా ఇన్నోవేషన్ జోన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలతో రూపొందించిన దాదాపు 700 స్టార్టప్‌లు దీనికి దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో ఎంపిక చేసిన 80 స్టార్టప్‌లను ఈ సదస్సులో ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. హెల్త్‌కేర్ రంగంలో మెడికల్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే లక్ష్యానికి అనుగుణంగా వీటిని ఎంపిక చేశారు. కొత్త స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి గుర్తింపుతోపాటు, అద్భుతమైన అవకాశాలను ఈ సదస్సు అందించనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది.

ఇది అత్యంత ప్రభావవంతమైన సదస్సుగా నిలుస్తుంది: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

చరిత్రలోనే ఇది అత్యంత ప్రభావవంతమైన సదస్సుగా నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, ఆలోచనలన్నీ ఒకే వేదికపై పంచుకునే అరుదైన అవకాశాన్ని బయో ఏషియా అందిస్తుందన్నారు. ● ఈ సదస్సుకు కొత్త స్టార్టప్‌ల నుంచి అంచనాలకు మించిన స్పందన వచ్చిందని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. పేరొందిన కంపెనీలు, ప్రముఖ సంస్థలు ఈ సదస్సులో భాగస్వామ్యం పంచుకోవటం ఉత్సాహంగా ఉందన్నారు.

- లైఫ్‌సైన్సెస్ రంగంలో తెలంగాణ ఇప్పటికే ముందంజలో ఉందని బయో ఏషియా– 2025 సీఈఓ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తెలిపారు. ఈసారి సదస్సు ల్యాండ్‌మార్క్ ఎడిషన్ ఉండబోతుందని చెప్పారు.

'నాటో'లో చేర్చుకుంటే పదవి వదులుకుంటా..



- శాంతిని, నాటో సభ్యత్వాన్ని కోరుకుంటున్నాం
- కూటమి రక్షణ కింద ఉక్రెయిన్ భద్రంగా ఉండాలన్నదే మా ఉద్దేశం
- జెలెన్‌స్కీ సంచలన ప్రకటన

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన ప్రకటన చేశారు. ఉక్రెయిన్‌ను 'నాటో' కూటమిలో చేర్చుకుంటే అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడానికి తాను సిద్ధమేనని తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌లో శాంతిని, నాటో సభ్యత్వాన్ని కోరుకుంటున్నామని ఉద్ఘాటించారు. ఆదివారం రాజధాని కీవ్‌లో ప్రభుత్వ అధికారుల సమావేశంలో జెలెన్‌స్కీ మాట్లాడారు. ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం దండయాత్ర ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం నిర్వహించారు. భేటీ అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. నాటో సైనిక కూటమి రక్షణ కింద ఉక్రెయిన్ భద్రంగా ఉండాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. నాటో ఛత్రఛాయలో ఉక్రెయిన్‌లో శాశ్వతంగా శాంతియుత పరిస్థితులు నెలకొంటాయని భావిస్తున్నట్లు తెలిపారు. శాంతి కోసం పదవి నుంచి దిగిపోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ''ఉక్రెయిన్‌లో శాంతిని సాధించడానికి నేను అధ్యక్ష పదవిని వదుకోవాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందంటే, అందుకు సిద్ధంగా ఉన్నాను'' అని స్పష్టంచేశారు. అధ్యక్షుడిగా పదేళ్లు అధికారంలో ఉండాలన్నది తన కల కాదని వ్యాఖ్యానించారు. 'జెలెన్‌స్కీ ఒక నియంత' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలపైనా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలను అభినందనగా భావించడం లేదని తేలిగ్గా కొట్టిపారేశారు. సోమవారం యూరోపియన్ నేతలతో జరిగే సమావేశం 'టర్నింగ్ పాయింట్' అవుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. తమకు ఇప్పుడు సహకారం అవసరమని అన్నారు. తమ స్వాతంత్ర్యాన్ని, గౌరవాన్ని కోల్పోయే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించాలన్న లక్ష్యంతో ఉన్నారు. ఉక్రెయిన్‌లో ఎన్నికలు నిర్వహించాలని ట్రంప్‌తోపాటు రష్యా అధినేత పుతిన్ అంటున్నారు. ప్రస్తుతం యుద్ధం జరుగుతుండడంతో ఉక్రెయిన్‌లో మార్షల్ లా విధించారు. ఎన్నికలపై నిషేధం అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో పదవి నుంచి తప్పుకోవడానికి అభ్యంతరం లేదని జెలెన్‌స్కీ స్వయంగా ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా అమెరికా నుంచి వస్తున్న ఒత్తిళ్లతో ఆయన ఈ ప్రకటన చేసినట్లు తెలుస్తోంది.

వారిది బానిస మనస్తత్వం



సంస్కృతి, సంప్రదాయాలపై దాడులు చేస్తున్నారు

- విదేశీ శక్తుల అండతోనే రెచ్చిపోతున్నారు
- దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయడమే వారి అసలు లక్ష్యం
- నిప్పులు చెరిగిన ప్రధాని నరేంద్ర మోదీ
- శ్రీబాగేశ్వర్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు పునాదిరాయి

ఛాత్రాపూర్: మహా కుంభమేళాపై ఆరోపణలు చేస్తున్నవారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. బానిస మనస్తత్వం కలిగిన ఓ వర్గం నేతలు మన మత విశ్వాసాలు, సంప్రదాయాలపై దా చేస్తున్నారని ఆరోపించారు. విదేశీ శక్తుల అండతోనే వారు రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాను 'ఐక్యతా మహాకుంభ్'గా అభివర్ణించారు. ఆదివారం మధ్యప్రదేశ్ రాష్ట్రం ఛాత్రాపూర్ జిల్లాలోని బాగేశ్వర్ ధామ్‌లో శ్రీబాగేశ్వర్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు ప్రధాని మోదీ పునాదిరాయి వేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. మన మతాన్ని ఇటీవల కొందరు నాయకులు అవహేళన చేస్తున్నారని ఆక్షేపించారు. మత విశ్వాసాలను కించపర్చడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసి, ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే వారి అసలు లక్ష్యమని ఆరోపించారు. మన మాతృదేశాన్ని బలహీన పర్చడానికి విదేశీ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, ఇందులో భాగంగా మతంపై దాడి చేస్తున్నాయని, ఇందుకోసం మన దేశంలోని వ్యక్తులనే ఉపయోగించుకుంటున్నాయని చెప్పారు. దేశంలో హిందువుల నమ్మకాలను ద్వేషించేవారు శతాబ్దాలుగా వేర్వేరు మారువేషాల్లో సంచరిస్తున్నారని తెలిపారు. మన విశ్వాసాలు, ఆలయాలు, యోగులు, సంస్కృతులు, సంప్రదాయాలపై దాడి చేసేవారంతా బానిస మనస్తత్వం కలిగిన వ్యక్తులేనని స్పష్టం చేశారు. వారి అజెండా ఏమిటో అందరికీ తెలుసని అన్నారు. మన మతంపై బురద చల్లడానికి వారు ఏమాత్రం వెనుకాడడం లేదని మండిపడ్డారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని వివరించారు.

'సబ్‌కా ఇలాజ్, సబ్‌కో ఆరోగ్య'

మహా కుంభమేళాకు విశేషమైన ప్రాధాన్యం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి కుంభమేళా మళ్లీ 114 ఏళ్లకు వస్తుందన్నారు. కుంభమేళాను విజయవంతం చేయడానికి పారిశుధ్య కార్మికులు, పోలీసులు ఎంతగానో శ్రమిస్తున్నారని చెప్పారు. ఇదొక ఐక్యతా వేడుక అని ఉద్ఘాటించారు. వేలాది మంది వైద్యులు, వలంటీర్లు అంకితభావంతో సేవలందిస్తున్నారని ప్రశంసించారు. హిందూ ఆలయాలు, మఠాలు, ధామాలు వందల ఏళ్లుగా ఆరాధన స్థలాలుగానే కాకుండా శాస్త్ర పరిశోధనా కేంద్రాలుగానూ సేవలందిస్తున్నాయని వెల్లడించారు. హిందూ యోగులు, గురువులు యోగ, సైన్స్ పరిజ్ఞానాన్ని ప్రజలకు అందించారని తెలిపారు. మన దేశంలో పుట్టిన యోగాను ప్రపంచం అనుసరిస్తోందని గుర్తుచేశారు. యోగా మనకు గర్వకారణమని వ్యాఖ్యానించారు. ఎల్లవేళలా 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' అనే ఆశయంతో పని చేస్తున్నానని, ఇప్పుడు దానికి 'సబ్‌కా ఇలాజ్, సబ్‌కో ఆరోగ్య' అనే ఆశయాన్ని జోడిస్తున్నానని స్పష్టం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి తగిన చికిత్స అందించి, స్వస్థత చేకూర్చడమే తన లక్ష్యమని తెలియజేశారు. క్యాన్సర్‌పై జరుగుతున్న పోరాటాన్ని ప్రస్తావించారు. రాబోయే మూడేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో క్యాన్సర్ డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. క్యాన్సర్ ఔషధాలను తక్కువ ధరకే అందించేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ''మోదీ మీ బిడ్డ. ఎప్పటికీ మీకు సేవ చేస్తూనే ఉంటాడు'' అని ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి పేర్కొన్నారు. శ్రీబాగేశ్వర్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో భాగంగా 100 పడకల క్యాన్సర్ ఆసుపత్రి కూడా నిర్మించబోతున్నారు. ఇందుకు బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి ధీరేంద్ర శాస్త్రి సహకారం అందిస్తున్నారు.

'ఆరోగ్య భారతం' అత్యావశ్యకం

'మన్ కీ బాత్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

- దేశంలో స్థూలకాయుల సంఖ్య పెరిగిపోతుండడం ఆందోళనకరం
- ఒబేసిటీపై మనమంతా యుద్ధం చేయాల్సిందే
- వంటనూనెల వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించుకోవాలి
- పది మందికి సవాలు విసురుతున్నా..
- ఆ పది మందిలో ఒక్కొక్కరు మరో పది మందికి సవాలు విసరాలి
- వచ్చే నెల 8న నా సోషల్ మీడియా ఖాతాలను మహిళలకే అప్పగిస్తా
- వారు తమ విజయాలను అందులో పంచుకోవచ్చు

న్యూఢిల్లీ: దేశంలో స్థూలకాయుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుండడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. ఒబేసిటీ నేడు అతిపెద్ద సమస్యగా మారిందని అన్నారు. దేశంలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు స్థూలకాయంతో బాధపడుతున్నట్లు పరిశోధనల్లో తేలిందని గుర్తుచేశారు. ఇండియాలో గత కొన్నేళ్లలో స్థూలకాయుల సంఖ్య రెండు రెట్లు పెరిగిందని చెప్పారు. ప్రధానంగా చిన్నారుల్లో స్థూలకాయ సమస్య విపరీతంగా పెరగడం నిజంగా ఆందోళనకరమేనని తెలిపారు. ఇండియా చక్కటి ఆరోగ్యకరమైన, దృఢమైన దేశంగా మారడం అత్యావశ్యకం అని ఉద్ఘాటించారు. ఆరోగ్య భారతం కోసం స్థూలకాయ సమస్యపై పోరాటం చేయాలని, ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ వంటనూనెల వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించుకోవాలని సూచించారు. ఈ సూచన పాటించాలంటూ 10 మందికి తాను సవాల్ విసురుతున్నానని, ఆ 10 మందిలో ఒక్కొక్కరు మరో 10 మందికి ఇదే సవాల్ విసరాలని స్పష్టంచేశారు. ఈ శృంఖలాన్ని కొనసాగించాలని, అంతిమంగా ప్రజలంతా వంటనూనెల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని, తద్వారా ఆరోగ్యానికి ఎనలేని మేలు జరుగుతుందని పిలుపునిచ్చారు. ఒలింపిక్ గోల్డ్ మెడల్ విజేత నీరజ్ చోప్రా సహా పలువురు ప్రముఖులు ఆడియో సందేశాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా వినిపించారు. స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి వారు ఇచ్చిన సలహాలు, సూచనలు ఇందులో ఉన్నాయి. ప్రధాని మోదీ ఆదివారం 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతరిక్షం నుంచి క్రీడల దాకా పలు అంశాలను ప్రస్తావించారు. ఆయన ఏం మాట్లాడారంటే...

మహిళల స్ఫూర్తిని గౌరవించుకోవాలి

''వేర్వేరు రంగాల్లో మన మహిళలు ఎన్నో విజయాలు సాధించారు. వారిచ్చిన స్ఫూర్తిని మనం గౌరవించుకోవాలి. వచ్చే నెలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోబోతున్నాం. ఈ సందర్భంగా భారతదేశ నారీశక్తికి నా సెల్యూట్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 8వ తేదీన నా సోషల్ మీడియా ఖాతాలను మహిళా విజేతలకే అప్పగిస్తా. వారు తమ కార్యాచరణ, ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు, అనుభవాలను అందులో పంచుకోవచ్చు. ప్రజలకు సందేశం ఇవ్వొచ్చు. ఇందులో మీరు పాల్గొనాలంటే నమో యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోండి. నేడు ఎన్నో కీలక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండడం సంతోషంగా ఉంది. 'ఒక్కరోజు సైంటిస్టు'గా మారడానికి విద్యార్థులు, యువత ప్రయత్నించాలి. ఈ నెల 28వ తేదీన నేషనల్ సైన్స్ డే సందర్భంగా రీసెర్చ్ ల్యాబ్‌లు లేదా ప్లానిటోరియమ్స్‌ను సందర్శించాలని కోరుతున్నా.

'ఇస్రో' సెంచరీ హర్షణీయం

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు అభిమానులను అలరిస్తున్నాయి. ఎక్కడ చూసినా క్రికెట్ వాతావరణం, అభిమానుల సందడి కనిపిస్తోంది. క్రికెట్‌లో మన జట్టు సెంచరీ సాధిస్తే కలిగే ఆనందం అందరికీ తెలిసిందే. అంతరిక్ష రంగంలో మన దేశం ఇటీవలే సెంచరీ సాధించింది. గత నెలలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) 100వ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు. స్పేస్‌సైన్స్‌లో నిత్యం కొత్త శిఖరాలను అధిరోహించాలన్న మన పట్టుదల, అంకితభావానికి ఇదొక ప్రతీక''.

జింక మహిళ అనూరాధ రావు

అనూరాధ రావు గురించి మీకు చెప్పాలి. అండమాన్ నికోబార్ దీవుల్లో జంతువుల సంరక్షణ కోసం ఆమె ఎంతగానో శ్రమిస్తున్నారు. చిన్నప్పటి నుంచే జంతువుల సేవలో నిమగ్నమయ్యారు. జంతుజాలం సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేశారు. ప్రజలు ఆమెను 'జింక మహిళ' అని పిలుస్తుంటారు. వచ్చే నెలలో 'వరల్డ్ వైల్డ్‌లైఫ్ డే' నిర్వహించుకుంటాం. జంతుజాలం పరిరక్షణ కోసం శ్రమిస్తున్నవారిని ప్రోత్సహించండి'' అని ప్రధాని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఢిల్లీ అసెంబ్లీ

ప్రతిపక్షంగా ఆతిశీ ఎన్నిక

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మొట్టమొదటి శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమవుతున్నాయి. 24 ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగా, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ ఎన్నిక ఉంటాయి. 25న లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సభనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఎల్జీ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటాయి.

ఆతిశీ ఏకగ్రీవ ఎన్నిక

అసెంబ్లీలో ప్రతిపక్ష నేత(ఎల్‌వోపీ)గా మాజీ సీఎం ఆతిశీని ఆప్ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఎన్నికైన మహిళగా ఈమె రికార్డు నెలకొల్పారు. ఆదివారం జరిగిన సమావేశానికి ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఆ పార్టీకి చెందిన మొత్తం 22 మంది శాసనసభ్యులు హాజరయ్యారు. భేటీ అనంతరం ఆప్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు గోపాల్ రాయ్ మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం ఆతిశీని ఎల్‌వోపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

పనామా నుంచి ఢిల్లీకి.. 12 మంది వలసదారులు

న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వం పనామాకు పంపించిన 12 మంది భారతీయ వలసదారులు ఆదివారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నారు. తుర్కియే ఎయిర్‌లైన్స్ విమానంలో ఇస్తాంబుల్ మీదుగా ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చారు. ఒప్పందం ప్రకారం ..ఎలాంటి పత్రాలు లేని ఆసియా వలసదారులను అమెరికా ప్రభుత్వం పనామా, కోస్టారికాలకు తరలిస్తుంది. అక్కడి నుంచి ఆయా దేశాలే వీరిని సొంత దేశాలకు పంపే బాధ్యతను తీసుకుంటాయి. అమెరికా ప్రభుత్వం పంపించిన 299 మంది అక్రమ వలస దారుల్లో మొదటి విడతలో పనామా తాజాగా 12 మందిని మన దేశం పంపించిందని అధికారులు తెలిపారు. వీరిలో నలుగురు పంజాబ్‌కు చెందిన వారు కాగా హరియాణా, యూపీలకు చెందిన ముగ్గురేసి చొప్పున వలసదారులున్నారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. పంజాబ్‌లోని వేర్వేరు జిల్లాలకు చెందిన నలుగురిని వెంటనే విమానంలో అమృత్‌సర్‌కు పంపించేశారు అధికారులు. కాగా, అమెరికా గత వారం పనామాకు మూడు విమానాల్లో పంపించిన 299 మందిలో భారత అక్రమ వలసదారుల సంఖ్య ఎంతనేది ఇప్పటికీ స్పష్టం కాలేదు. అయితే, వీరిలో 171 మంది మాత్రమే సొంత దేశాలకు వెళ్లేందుకు సుముఖత చూపారని పనామా ప్రభుత్వం తెలిపింది. అమెరికా ప్రభుత్వం పంపించిన జాబితాలోని 299 మంది పేర్లు, ఇతర వివరాలను పరిశీలిస్తున్నామని విదేశాంగ శాఖ అంటోంది. పరిశీలన పూర్తయ్యాక మన వాళ్లను వెనక్కి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేపడతామని చెబుతోంది. కాగా, అమెరికా ఇప్పటికే మూడు విడతలుగా 332 మంది వలసదారులను నేరుగా భారత్‌కు ప్రత్యేక విమానాల్లో తరలించడం తెల్సిందే.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదివారం క్రికెట్ ఆడారు. సుప్రీంకోర్ట్ అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్(ఎస్‌సీఏవోఆర్ఏ) ఎలెవెన్ జట్టుతో సీజేఐ ఎలెవెన్ జట్టు తలపడిన సందర్భంగా సీజేఐ ఇలా బ్యాటింగ్ చేశారు.

పోప్ స్పృహలోనే ఉన్నారు

ఆయనకు ఆక్సిజన్ అందిస్తున్నాం • వాటికన్ వర్గాల వెల్లడి



రోమ్: 'పోప్ ఫ్రాన్సిస్(88) స్పృహలోనే ఉన్నారు. అయితే, సంక్లిష్టమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది'అని వాటికన్ ఆదివారం తెలిపింది. శనివారం రాత్రి శ్వాసలో ఇబ్బందులు తలెత్తడంతోపాటు, రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోయాయి. పూర్తి స్థాయిలో శ్వాస తీసుకోలేని కారణంగా ప్రారంభించిన ఆక్సిజన్ సరఫరాను ఆదివారం కూడా కొనసాగించారు. రక్తం ఎక్కించినట్లు వాటి కన్ వర్గాలు వివరించాయి. 'రాత్రి ప్రశాంతంగా గడిచింది. ఆయన విశ్రాంతి తీసుకున్నారు'అని పేర్కొన్నాయి. మరికొన్ని వైద్య పరీక్షలను నిర్వహించినట్లు వెల్లడించింది. పోప్ బెడ్‌పై నుంచి లేచారా, ఏమైనా ఆహారం తీసుకున్నారా అనే విషయాలను మాత్రం వాటికన్ ప్రస్తావించలేదు. బ్రాంకైటిస్ తీవ్ర రూపం దాల్చడంతో పోప్ ఈ నెల 14వ తేదీన గెమెల్లి ఆస్పత్రిలో చేరడం తెలిసిందే.

వాటికన్‌లో ప్రత్యేక ప్రార్థనలు

ఆదివారం ఉదయం సెయింట్ పీటర్స్ బసిలికాలో పోప్ ఫ్రాన్సిస్ హోలీ ఇయర్ ప్రారంభ వేడుకలను ప్రారంభించాల్సి ఉంది. ఆయన ఆస్పత్రిలో ఉన్న కారణంగా ఆర్చ్ బిషప్ రినో ఫిసిచెల్లా ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోప్ ఫ్రాన్సిస్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమం చేపట్టారు. 'ఆస్పత్రిలో బెడ్‌పై ఉన్నా పోప్ ఫ్రాన్సిస్ మనకు సన్నిహితంగా మనమధ్యే ఉన్నట్లుగా ఉంది'అని ఫిసిచెల్లా అన్నారు.

ఫ్రాన్సిస్ రాజీనామా చేయబోరు

తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో పోప్ ఫ్రాన్సిస్ పదవికి రాజీనామా చేయనున్నారంటూ వస్తున్న వదంతులను వాటికన్ అధికార వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. పోప్ తన విధులను నిర్వహించలేని సమయంలో ప్రత్యామ్నాయం ఏమిటన్న దానిపై ఎటువంటి స్పష్టత లేదు. ఇలాంటి సందర్భం తలెత్తినప్పుడు ఏం చేయాలన్న దానిపై పోప్ స్పష్టత ఇచ్చినట్లు చెబుతున్నాయి. వైద్యపరమైన అశక్తత ఏర్పడితే రాజీనామా లేఖ రాసి ఉంచినట్లు గతంలోనే పోప్ ఫ్రాన్సిస్ చెప్పిన విషయాన్ని ఆ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఆస్పత్రిలో ఉన్న పోప్ ఫ్రాన్సిస్‌ను వాటికన్ ఉన్నతాధికారులు కొందరు రహస్యంగా కలిసినట్లు వస్తున్న వార్తలను సైతం తోసిపుచ్చాయి. ఫ్రాన్సిస్ ఆరోగ్యం, ఆయన కోలుకోవడం, తిరిగి వాటికన్ రావడంపైనే మాట్లాడుకోవాలే తప్ప, ఇటువంటి అవసరం లేని అంశాలంటూ స్పష్టం చేశాయి.

కొత్త మలుపు తీసుకున్న యూఎస్‌ఎయిడ్ వివాదం

- ఆ నిధులకు 'ఓటర్ల సంఖ్య పెంపు'నకు సంబంధం లేదన్న ఆర్థికశాఖ నివేదిక
- 7 ప్రాజెక్టుల కోసం 75 కోట్ల డాలర్లు కేటాయించారని వివరణ

న్యూఢిల్లీ: భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అమెరికా నుంచి యూఎస్‌ఎయిడ్ తరఫున 2.1 కోట్ల డాలర్ల నిధులు వచ్చాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్న వేళ మోదీ ప్రభుత్వం కొత్త విషయాన్ని బయటపెట్టింది. 2023–24 ఆర్థికసంవత్సరంలో భారత్‌లో ఏడు ప్రాజెక్టుల కోసం యూఎస్‌ఎయిడ్ 75 కోట్ల డాలర్ల నిధులను సమకూర్చిందని భారత ఆర్థికశాఖ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ''మొత్తంగా 75 కోట్ల డాలర్ల విలువైన ప్రాజెక్టులను భారత ప్రభుత్వ భాగస్వామ్యంలో యూఎస్‌ఎయిడ్ చేపట్టింది. అందులో 2023–24 కాలంలో 9.7 కోట్ల డాలర్లను ఖర్చుచేశారు. ఇందులో ఓటర్ల సంఖ్య పెంచేందుకు ఉద్దేశించిన ప్రాజెక్ట్ లేదు. వ్యవసాయం, ఆహార భద్రత, నీరు, శుభ్రత(వాష్ ప్రోగ్రామ్), పునరుత్పాదక ఇంధనం, విపత్తు నిర్వహణ, ఆరోగ్యం, సుస్థిర అడవులు, పర్యావరణ అనుకూల కార్యక్రమాలు, ఇంధన సమర్థ వినియోగ సాంకేతికలను అందుబాటులోకి తేవడం, ఇన్నోవేషన్ ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి'' అని వార్షిక నివేదిక పేర్కొంది. 1951 ఏడాదిలో మొదలైన ద్వైపాక్షిక అభివృద్ధి సాయంలో భాగంగా భారత్‌కు అమెరికా ఇప్పటిదాకా 555కుపైగా ప్రాజెక్టుల్లో ఏకంగా 17 బిలియన్ డాలర్ల సాయం అందించిందని వార్షిక నివేదిక పేర్కొంది. ద్వైపాక్షిక నిధుల వ్యవహారాలను చూసే కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని ఆర్థికవ్యవహారాల విభాగం సైతం ఈ వివరాలను వెల్లడించింది.

వేడుకలు లేకుండా బందీలను విడుదల చేయాలి

- హామీ ఇస్తేనే పాలస్తీనా ఖైదీలను విడిచిపెడతాం
- స్పష్టం చేసిన ఇజ్రాయెల్.. ఖండించిన హమాస్


టెల్ అవీవ్: ఇకపై బందీల విడుదల సమయంలో ఎలాంటి వేడుకలు నిర్వహించబోమంటూ హామీ ఇస్తేనే వందలాది మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెడతామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. లేకుంటే ఖైదీల విడుదల ఆలస్యమవుతుందని తెలిపింది. బందీల విడుదల సమయంలో చేపట్టే వేడుకలు అవమానకరంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయం ఆదివారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేసింది. అంతకుముందు, ఒఫెర్ జైలు నుంచి పాలస్తీనా ఖైదీలను తీసుకుని బయలుదేరిన వాహనాలు కొద్ది దూరమే వెళ్లి తిరిగి జైలుకు చేరుకున్నాయి. ఈ పరిణామాలతో ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు అంశం ప్రశ్నార్థకంగా మారింది. హమాస్ శనివారం ఆరుగురు ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయడం తెలిసిందే. బదులుగా ఇజ్రాయెల్ తన జైళ్లలో ఉన్న 620 మంది పాలస్తీనియన్లను విడుదల చేయాల్సి ఉంది. మాస్కులు ధరించిన హమాస్ సాయుధులు బందీలను ప్రదర్శనగా వెంట తీసుకుని వేదికపైకి చేరుకోవడం, అక్కడ పెద్ద సంఖ్యలో పాలస్తీనియన్లు గుమికూడటం వంటి వాటిపై ఐరాస, రెడ్‌క్రాస్‌లతోపాటు ఇతరులు కూడా అభ్యంతరం తెలిపారు. 'ఇటువంటి వేడుకలు మా బందీల గౌరవాన్ని తక్కువ చేయడమే. సొంత ప్రచార ప్రయోజనం కోసం వారిని క్రూరంగా ఉపయోగించుకోవడమేనని ఇజ్రాయెల్ ఆరోపించింది. అయితే, ఈ వ్యాఖ్యలను హమాస్ ఖండించింది. కాల్పుల ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని హమాస్ ప్రతినిధి అబ్దుల్ లతీఫ్ పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారంటూ బెంజమిన్ నెతన్యాహూపై ఆయన మండిపడ్డారు. ఒప్పందం ప్రకారమే మొదటి దశ ఒప్పందం గడువు ముగిసేలోగా వచ్చే వారం నలుగురు బందీల మృతదేహాలను అందజేస్తామన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశపై చర్చలు ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు. మిగిలి ఉన్న బందీలను సజీవంగా లేదా నిర్జీవంగా తీసుకువచ్చే విషయమై ప్రధాని నెతన్యాహూ భద్రతా సలహాదారులతో చర్చించి, నిర్ణయించనున్నారని ఓ అధికారి తెలిపారు.

యుద్ధానికి మూడేళ్లు.. ఉక్రెయిన్‌పైకి 267 డ్రోన్లు

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధానికి సోమవారంతో సరిగ్గా మూడేళ్లవుతున్న సందర్భంగా రష్యా ఆదివారం పేట్రేగిపోయింది. శనివారం రాత్రి రికార్డు స్థాయిలో 267 డ్రోన్లను ఉక్రెయిన్‌పైకి ప్రయోగించింది. మొత్తం 13 ప్రాంతాల్లోని పౌర, సైనిక లక్ష్యాలపైకి దూసుకురాగా వీటిలో 138 డ్రోన్లను కూల్చేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ ప్రకటించింది. మరో 119 ఎలక్ట్రానిక్ జామర్ల కారణంగా గురి తప్పాయని తెలిపింది. 200కు పైగా ఇరాన్ తయారీ షహీద్ డ్రోన్లు తమ నగరాలు, పట్టణాల్లో విధ్వంసం సృష్టించాయని జెలెన్‌స్కీ తెలిపారు. 3 బాలిస్టిక్ మిస్సైళ్లను కూడా ప్రయోగించిందని, క్రీవ్యీరిహ్‌లో ఒకరు చనిపోయారని ఉక్రెయిన్ తెలిపింది. మొత్తమ్మీద వారం వ్యవధిలోనే 1,150, 1,400 గైడెడ్ ఏరియల్ బాంబులు, 35 క్షిపణులను తమపైకి ప్రయోగించిందని జెలెన్‌స్కీ ఆరోపించారు.

తదుపరి జర్మనీ చాన్స్‌లర్ మెర్జ్!

ఎగ్జిట్ పోల్స్‌లో అత్యధిక ఓట్లు సాధించిన సీడీయూ, సీఎస్‌యూ కూటమి




మెర్జ్

బెర్లిన్: క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్(సీడీయూ) నేత ఫ్రెడరిక్ మెర్జ్ తదుపరి జర్మనీ చాన్స్‌లర్‌గా అధికార పగ్గాలు చేపట్టడం దాదాపు ఖాయమైంది. జర్మనీ పార్లమెంట్(బండేస్టాగ్)కు ఆదివారం జరిగిన ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో ఫ్రెడరిక్ మెర్జ్ సారథ్యంలోని క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్(సీడీయూ), మార్కస్ సోడర్ సారథ్యంలోని క్రిస్టియన్ సోషల్ యూనియన్(సీఎస్‌యూ) కూటమి ముందంజలో నిలిచింది. దీంతో తమ కూటమి త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుందని సీడీయూ/సీఎస్‌యూ కూటమి ముఖ్యనేతలు ప్రకటించారు. జర్మనీ ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ ఏఆర్‌డీ, జెడ్‌డీఎఫ్ పబ్లిక్ టెలివిజన్ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం సీడీయూ,సీఎస్‌యూ కూటమికి 29 శాతం ఓట్లు పడ్డాయి. ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీకి 19.6 శాతం ఓట్లు పడ్డాయని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. ఇన్నాళ్లూ ఒలాఫ్ షోల్జ్ సారథ్యంలో అధికారంలో కొనసాగిన సోషల్ డెమొక్రటిక్ పార్టీ(ఎస్‌డీపీ) కేవలం 16 శాతం ఓట్లతో మూడోస్థానానికి పరిమితమైంది. దీంతో ఒలాఫ్ షోల్జ్ తన ఓటమిని అధికారికంగా అంగీకరించారు. ''ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితాలొచ్చాక ప్రభుత్వ ఏర్పాటుకు ఏమాత్రం ఆలస్యం చేయబోం'' అని ఎగ్జిట్ పోల్స్ తర్వాత ఆదివారం బెర్లిన్‌లో ఫ్రెడరిక్ మెర్జ్ వ్యాఖ్యానించారు.



సిగరెట్ అమ్మినా సీరియస్ యాక్షన్

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు కేవలం మాదకద్రవ్యాల విక్రయాల పైనే కాదు.. సిగరెట్ల అమ్మకాల్లో జరుగుతున్న ఉల్లంఘనల పైనా దృష్టి పెడుతున్నారు. -8లో



ఆనతి నీయరా..

ఆనతి నీయరా హరా.. సన్నిధి చేరగా.. అన్నట్లు శివరాత్రి ఉత్సవాలకు నగరం చుట్టుపక్కల ఉన్న పలు శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.0/20.0

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 36, కనిష్ఠంగా 20 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు నేడే అంకురార్పణ

కీసర: ప్రఖ్యాత శైవ క్షేత్రం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివ రాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 1వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. టీటీడీ వేద పాఠశాల ఆచార్యులు పుల్లేటికుర్తి గణపతి శర్మ ప్రధాన సంధానకర్తగా వైదిక కార్యక్రమాలు కొనసాగుతాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ దంపతులచే విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి ప్రతిష్ఠాపనం తదితర కార్యక్రమాలను వైదికులు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠాపన, బేరిపూజ, ధ్వజారోహణ, ద్వాత్రింశతి రాగాలాపన, హారతి, రాత్రి 7 గంటలకు మంత్ర పుష్పం, పరాకస్తవం, తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి 8 గంటలకు శ్రీస్వామివారిని కీసరగుట్ట నుంచి కీసర గ్రామానికి ఊరేగింపుగా తీసుకువస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సుమారు 5 లక్షల వరకు యాత్రికులు వస్తారని అంచనా. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రీడోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభం కానున్నాయి.



హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు దక్కేవేమో..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



యశ్వంత్ మృతదేహం

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి– భువనగిరి జిల్లా బీబీనగర మండలం జమిలాపేట్‌కు చెందిన మడిపడిగే యశ్వంత్ (18) ఇంటర్ చదివి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి ఘట్‌కేసర్ వైపు స్కూటీపై వస్తుండగా అగస్త్య ఫామ్‌హౌజ్ సమీపంలో మితిమీరిన వేగంతో వచ్చిన లారీ యశ్వంత్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యశ్వంత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. యశ్వంత్ హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణం పోయేది కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కాంక్రీట్ లారీ ఢీ.. కారు నుజ్జునుజ్జు

యువకుడి దుర్మరణం



నాగ వంశీ (ఫైల్)

దుండిగల్: ఎదురుగా వస్తున్న కారును కాంక్రీట్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆదివారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దూలపల్లి ప్రాంతానికి చెందిన దున్నాల నాగ వంశీ (22) ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. ఆదివారం ఉదయం కారులో మియాపూర్ నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో గండిమైసమ్మ నుంచి ప్రగతినగర్ వైపు వస్తున్న కాంక్రీట్ లారీ బౌరంపేట స్నేక్ పార్క్ చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న నాగ వంశీ కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో నాగ వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంతో బైక్‌పై వస్తున్న బాచుపల్లికి చెందిన చిట్టూరి వెంకట సురేంద్ర, గోపాల్ కారును వెనుక నుంచి ఢీకొట్టారు. సురేంద్రకు కాలు విరిగిపోవడంతో సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కారులో ఇరుక్కుపోయిన నాగవంశీ మృతదేహాన్ని జేసీబీ బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. లారీ డ్రైవర్ రాములు పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



కారులో ఇరుక్కున్న నాగవంశీ మృతదేహం





సూపర్ మచ్చీ!

నగరంలోని ముషీరాబాద్ చేపల మార్కెట్‌కు ఆదివారం కొనుగోలుదారులు పోటెత్తారు. నిన్నా మొన్నటి దాకా కొరమీను కిలో రూ.400 నుంచి రూ.450కి అమ్మగా.. ఆదివారం రూ.500 నుంచి రూ.600కు విక్రయించారు. బొచ్చ చేపలు మొన్నటి వరకు కిలో రూ.170- 180 ఉండగా రూ.200 ధర పలికాయి. రవ్వా చేప కిలో రూ.130 నుంచి రూ.140కి విక్రయించగా రూ.150 నుంచి 160కి వినియోగదారులు కొనుగోలు చేశారు. రొయ్యలు కిలోకు రూ.450కి విక్రయించారు. బర్డ్‌ఫ్లూ భయంతోనే చేపలకు గిరాకీ ఏర్పడిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. - ముషీరాబాద్


అనుబంధాలపై ఉన్మాదం!

మంటగలుస్తున్న మానవత్వం.. పెరుగుతున్న హింసా ప్రవృత్తి

- మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలై అఘాయిత్యాలు
- డబ్బుపై వ్యామోహం, వివాహేతర సంబంధాలూ కారణమే
- ఇటీవల నగరంలో అత్యంత పాశవికంగా హత్యలు

1 • తన ప్రేమ వివాహం చెడిపోవడానికి కారణమయ్యాడని కన్నతండ్రినే నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశాడు కన్న కొడుకు. బుద్ధి చెప్పాల్సిన తండ్రే వ్యసనాలకు బానిస కావడంతో అతనిపై కోపం పెంచుకున్నాడు కొడుకు సాయికుమార్. ఎలాగైనా తండ్రి మొగిలిని అంతమొందించాలని నిర్ణయించుకొని.. నడిరోడ్డుపై చుట్టూ జనం చూస్తుండగానే కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి చంపేశాడు.

2 • అకారణంగా భార్య వెంకట మాధవితో గొడవ పెట్టుకొని, ఆమె గొంతు నులిమి చంపేశాడు భర్త గురుమూర్తి. ఇల్లాలి కాళ్లు, చేతులు, శరీరం, తల నాలుగు భాగాలుగా నరికి, వాటర్ హీటర్‌తో నీళ్లు మరిగించి శరీర భాగాలను ఉడకబెట్టాడు. ఆ తర్వాత వాటిని స్టవ్‌పై కాల్చి, రోకలి బండతో దంచి పోడి చేశాడు. ఆ పొడిని ప్లాస్టిక్ బకెట్‌లో తీసుకెళ్లి జిల్లెలగూడ చెరువులో పారబోశాడు.



3 • తనను కాదని కంపెనీలో డైరెక్టర్‌గా మరొకర్ని నియమించారని, ఆస్తిలో వాటా ఇవ్వలేదని తాత మీద కక్ష పెంచుకున్నాడు మనవడు. చంద్రశేఖర జనార్దన్ రావు ఇంట్లోకి చొరబడిన కూతురు కొడుకు కార్తి తేజ.. వెంట తెచ్చుకున్న కత్తితో తాతను విచక్షణారహితంగా పొడిచి చంపేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తల్లి సరోజపైనా దాడికి తెగబడ్డాడు.



4 • భార్యను, పిల్లలను వేధిస్తున్న అన్నను అంతమొందించారు తమ్ముళ్లు. ఎప్పటి లాగే మద్యం మత్తులో ఉమేష్.. భార్య ప్రియాంక, తమ్ముడు రాకేష్, చిన్నాన్న కొడుకు లక్ష్మణ్‌లతో గొడవ పడ్డాడు. బీరు సీసాతో దాడి చేశాడు. వారు ప్రతిఘటించడంతో ఇంట్లో నుంచి వీధిలోకి పరుగెత్తుకుంటూ జాతీయ రహదారిపైకి చేరుకున్నాడు. అయినా రాకేష్, లక్ష్మణ్‌లు వదిలిపెట్టకుండా అన్న ఉమేష్‌ను వెంబడించి కత్తులతో 15 సార్లు పొడిచి చంపేశారు. - సాక్షి, సిటీబ్యూరో

ఇలా.. రక్త సంబంధాల్లో నెత్తుటి చారికలు పారుతున్నాయి. ఎలాంటి బంధాలనూ లెక్కచేయడం లేదు. చెడు వ్యసనాలు, డబ్బు మీద వ్యామోహం, వివాహేతర సంబంధాల కారణంగా బంధుత్వాలు మరిచి పాశవికంగా ప్రవర్తిస్తున్నారు. ఈ దారుణ ఉదంతాలు ఏ మారుమూల గ్రామాల్లోనో, గిరిజన ప్రాంతాల్లో జరిగినవి కాదు.. విశ్వనగరంగా ప్రపంచంతో పోటీపడుతున్న హైదరాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్నాయి. విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగస్తులూ ఇలాంటి కిరాతకాలకు పాల్పడుతుండటం శోచనీయం.

ఓటీటీలో బోలెడంత కంటెంట్..

హత్యలు ఎలా చేయాలి, చేశాక పోలీసులకు ఆధారాలు దొరక్కుండా ఎలా తప్పించుకోవాలి? ఈజీగా మనీ సంపాదించే అక్రమ మార్గాలేంటి? అనే అంశాలు పూసగుచ్చినట్లు బోలెడంత కంటెంట్ ఓటీటీ, యూట్యూబ్‌లో అందుబాటులో ఉంది. ఓటీటీ కంటెంట్ కారణంగా సమాజంలో నేరాలు, లైంగిక హింస పెరుగుతున్నాయని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇండియన్ సైకాలజీ ఓ రిపోర్టును విడుదల చేసింది. ఓటీటీకి అలవాటు పడ్డవారి ప్రవర్తనలో విపరీతమైన మార్పులు కలుగుతున్నట్లు, ముఖ్యంగా టీనేజర్లలో ఒంటరితనం, హింసా ప్రవృత్తి పెరుగుతున్నట్లు తేల్చింది. ఓటీటీకి కేటాయించే సమయాన్ని క్రమంగా తగ్గిస్తూ.. సాహిత్యం, సంగీత, ఇతర కళలు, అభిరుచుల వైపు దృష్టిసారిస్తేనే ఈ విపత్తు నుంచి బయటపడవచ్చని సూచించింది.

అసాంఘిక ఊబిలోకి..

మద్యం, మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చాయి. నగదు అవసరాలు పెరిగాయి. వీటి కోసం పర తమ భేదభావాలను మర్చిపోతున్నారు. అయినోళ్లనే అత్యంత కిరాతకంగా హతమారుస్తున్నారు. తల్లీదండ్రులు, అన్నా చెల్లెళ్లు, భార్యాభర్తలు వావి వరసలు పట్టించుకోవడం లేదు. అవసరాల కోసం, క్షణిక సుఖాల కోసం నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన అశ్లీలత, విశృంఖలత్వం, మనుషుల భావాలను తీవ్రంగా దిగజారుస్తున్నాయి. వారిని అసాంఘిక ఊబిలోకి లాగుతున్నాయి. సంస్కృతి, సంప్రదాయాల్ని పక్కనపెట్టేలా చేస్తున్నాయి. ఈ దుస్థితిని సమాజం నుంచి పారదోలేందుకు చిన్ననాటి పాఠ్యాంశాల నుంచి కూడా మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని సామాజిక, మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. నైతిక విలువలకు ప్రత్యేకంగా క్లాసులు తీసుకోవాలి. ఉన్నత, తరగతుల ఉపాధ్యాయులు సమకాలిన రాజకీయ, ఆర్థిక, చారిత్రక అంశాలకు, భారతీయ సంస్కృతి, విలువల్ని కూడా జోడించి విద్యార్థులకు బోధించాలి. చట్టాలు, న్యాయ వ్యవస్థ మానసిక శాస్త్ర ఆలోచల్ని అందుబాటులో ఉంచాలి.

తప్పు చేసి తప్పించుకోలేరు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఈ రోజుల్లో నేరం చేసి తప్పించుకోలేరు. వ్యామోహంలో, క్షణికావేశంలో చేసిన తప్పు తెలుసుకునేసరికి పరిస్థితి ఘోరంగా ఉంటుంది. కుటుంబ సభ్యులు జైలుకు వచ్చి పలకరించే పరిస్థితి కూడా ఉండదు. కన్నబిడ్డలు అసలు దగ్గరకు కూడా రానివ్వరు. ఇలా అందరూ ఉన్న ఒంటరిగా నాలుగు గోడల మధ్య జైలు జీవితం గడపాల్సిందే.



–సుధీర్ బాబు, రాచకొండ సీపీ

విలువలు కునారిల్లడం వల్లే..



చిన్నతనం నుంచే డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. దీంతో సమాజం, కుటుంబం అంటే గౌరవం ఉండట్లే. ఆస్తులు, డబ్బే లక్ష్యంగా ఎంతటి దారుణాలకైనా ఒడిగడుతున్నారు. నేరాలు, హింస, హత్యలు, వివాహేతర సంబంధాల వంటి వాటికి ఇంతకాలం మగవారు ఎక్కువగా పాల్పడేవారు. ఇటీవల కాలంలో మహిళలు కూడా ఇందులో భాగస్వామ్యమవుతున్నారు.

–డాక్టర్ పద్మా కమలాకర్, మానసిక వైద్యురాలు, ఫ్యామిలీ రిలేషన్‌షిప్ కౌన్సిలర్

ఉద్యానం.. అభివృద్ధి స్వచ్ఛందం

హైడ్రా కమిషనర్‌ను కలుస్తున్న ఎన్‌జీఓల ప్రతినిధులు

- తమ ప్రాంతాల్లోని పార్కులు అప్పగించాలని వినతులు
- చెరువులూ అభివృద్ధి చేసేందుకు కొన్ని సంఘాల ఆసక్తి
- ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకోవాలని హైడ్రా నిర్ణయం

రాజధానిలోని చెరువుల అభివృద్ధి కోసం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) నిధులు కేటాయిస్తుండగా... పార్కుల్ని తమకు అప్పగించాలంటూ పలు స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జీఓ) హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీని (హైడ్రా) కలుస్తున్నాయి. కబ్జా చెర నుంచి విడిపించిన వాటితో పాటు తమ ప్రాంతాల్లో ఉన్నవీ అప్పగిస్తే వాటిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకువస్తామని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి, తదుపరి వచ్చే ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. –సాక్షి, సిటీబ్యూరో



హైడ్రా అధికారులు ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న జలవనరులతో పాటు ప్రభుత్వ స్థలాలను పరిరక్షించే బాధ్యతల్ని నిర్వర్తిస్తోంది. ఏదైనా లేఔట్‌కు అనుమతి పొందే సమయంలో దాని యజమానులు పార్కుతో పాటు కామన్ ఏరియాలను విడిచిపెట్టడం అనివార్యం. తొలినాళ్లలో వీటిని ఓపెన్ ప్లేసులుగానే వదిలేస్తున్న యజమానులు కాలక్రమంలో ప్లాట్‌గా మార్చి అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఆ ప్రాంతానికి అటు–ఇటు ఉన్న ప్లాట్ల యజమానులు కబ్జా చేస్తున్నారు. ఇలాంటి అనేక కారణాల నేపథ్యంలో కాలనీ నుంచి పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, కామన్ ఏరియాలు మాయమవుతున్నాయి. లేఔట్ వేసే సమయంలో వదిలే ఈ ప్రాంతాలన్నీ ప్రభుత్వ స్థలాల పరిధిలోకే వస్తాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వరుసగా ఫిర్యాదులు..

కొన్నేళ్లుగా నగరంలో ఈ కబ్జా పర్వం నడుస్తోంది. అయితే.. ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఎలా ఫిర్యాదు చేయాలి? అనేది అంశాలు తెలియక కొందరు.. ప్రభుత్వ విభాగాల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక మరికొందరు మిన్నకుండిపోతున్నారు. హైడ్రా ఏర్పడిన తర్వాత ఈ కబ్జాలపై ఫిర్యాదులు మొదలు కాగా... ఆ విభాగంలో ప్రజావాణి నిర్వహణ ప్రారంభించిన తర్వాత జోరందుకున్నాయి. తమకు వచ్చే ఫిర్యాదుల పూర్వాపరాలు, రికార్డులు, డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు పార్కుల్లో ఉన్న కబ్జాలను తొలగిస్తున్నారు. అక్కడ నిర్మించిన నిర్మాణాలను కూల్చివేస్తూ పరిరక్షించాల్సిందిగా ఆయా ప్రభుత్వ విభాగాలకు లేఖలు రాస్తున్నారు. కొన్ని కాలనీల్లో ఆయా సంక్షేమ సంఘాలే ఈ బాధ్యతల్ని చేపడుతున్నాయి.

ఆసక్తి చూపిస్తున్న ఎన్‌జీఓలు..

నగరంలోని అనేక ప్రాంతాల్లో ఎన్‌జీఓలు యాక్టివ్‌గా పని చేస్తున్నాయి. కొన్ని సంస్థలు నగర వ్యాప్తంగా తమ సేవల్ని విస్తరించాయి. ఇలాంటి కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి హైడ్రాకు విజ్ఞప్తులు వస్తున్నాయి. కొన్ని పార్కుల్ని తమకు అప్పగిస్తే వాటిని అభివృద్ధి చేయడంతో పాటు నిర్వహణ బాధ్యతలు చేపడతామని కోరుతున్నాయి. అయితే గత ప్రభుత్వం కొన్ని చెరువులన్ని రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించింది. అభివృద్ధి పనులంటూ వారు చేపట్టిన చర్యల వల్ల ఆయా జలవనరులకు లాభం కంటే నష్టమే జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న హైడ్రా అధికారులు పూర్తి సమాచారాన్ని, విధివిధానాలను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు. ఆపై సర్కారు తీసుకునే నిర్ణయం, ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్లనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ 'సాక్షి'కి తెలిపారు.

యథావిధిగా నేటి ప్రజావాణి...

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ మార్గంలో శనివారం దుర్ఘటన చోటు చేసుకున్న విషయం విదితమే. ఆ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందిని రక్షించడానికి వివిధ ప్రభుత్వ విభాగాలు రెస్క్యూ ఆపరేషన్లు చేస్తున్నారు. దీనికోసం నగరం నుంచి హైడ్రా బృందాలు కూడా తరలివెళ్లాయి. కమిషనర్ ఏవీ రంగనాథ్ సైతం ఈ బృందాలతో పాటు శనివారం రాత్రి అక్కడికి వెళ్లారు. రాణిగంజ్‌లోని బుద్ధ భవన్‌లో ఉన్న హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి.. కమిషనర్ రంగనాథ్ అందుబాటులో లేనప్పటికీ ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని హైడ్రా ప్రకటించింది.

సిటీ ట్రాఫిక్ చీఫ్‌గా జోయల్ డెవిస్

- ఆయన స్థానంలో సైబరాబాద్‌కు గజరావ్ భూపాల్
- అదనపు కమిషనర్‌గా (నేరాలు) వెళ్లిన పి.విశ్వప్రసాద్
- చైతన్యకుమార్‌ను ఎస్బీ డీసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు



సాక్షి, సిటీబ్యూరో: నగర ట్రాఫిక్ విభాగం చీఫ్‌గా 2010 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి డి.జోయల్ డెవిస్ నియమితులయ్యారు. మొత్తం ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లకు సంబంధించి నలుగురు అధికారులు ఉన్నారు. జోయల్ డెవిస్ గతంలో హైదరాబాద్ మధ్య మండల డీసీపీగా, సిద్దిపేట కమిషనర్‌గా పని చేశారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి సైబరాబాద్‌లో ట్రాఫిక్ విభాగం సంయుక్త పోలీసు కమిషనర్‌గా (జేసీపీ) వ్యవహరిస్తున్నారు. ఆ పరిధిలో ఉన్న అనేక రహదారుల్ని అధ్యయనం చేసిన ఆయన క్లిష్టమైన ప్రాంతాల్లోని ట్రాఫిక్ సమస్యల్ని పరిష్కరించడంతో తన మార్కు చూపించారు. ఈ నేపథ్యంలో ఆయనను అత్యంత కీలకమైన సిటీ ట్రాఫిక్ చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది. కొన్నాళ్లుగా రాజధానిలోని ట్రాఫిక్ సమస్యలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో జోయల్ డెవిస్ నియామకం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. అదనపు సీపీ హోదాలో సిటీ ట్రాఫిక్ చీఫ్‌గా పని చేస్తున్న 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారి పి.విశ్వప్రసాద్‌ను ప్రభుత్వం నగర నేర విభాగానికి బదిలీ చేసింది. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ ఎఫెక్ట్‌తో అదనపు సీపీగా (నేరాలు) పని చేస్తున్న ఏవీ రంగనాథ్ బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఈ పోస్టును నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) డీసీపీనే ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. జోయల్ డెవిస్ బదిలీతో ఖాళీ అయిన సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం జేసీపీ పోస్టులో 2008 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి డాక్టర్ గజరావ్ భూపాల్ నియమితులయ్యారు. గతంలో దక్షిణ మండల డీసీపీ, సీసీఎస్ డీసీపీగా పని చేసిన ఆయన 2023 నుంచి డీజీపీ కార్యాలయంలో కో-ఆర్డినేషన్ విభాగం డీఐజీగా పని చేస్తున్నారు. జోయల్ డెవిస్ బదిలీతో ఆయన్ను మరో కీలకమైన సైబరాబాద్ ట్రాఫిక్ చీఫ్ పోస్టులో ప్రభుత్వం నియమించింది. గతంలో నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీగా పని చేసిన ఎస్.చైతన్యకుమార్‌కు 2020 బ్యాచ్ ఐపీఎస్ ఖరారైంది. ఈయన కొన్నాళ్లుగా నగర నిఘా విభాగమైన స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) డీసీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.



భారత్ గెలుపుతో సిటీలో జోష్

సాక్షి, సిటీబ్యూరో: నగర క్రికెట్ అభిమానుల్లో ఇండియా– పాక్ మ్యాచ్ జోష్ నింపింది. మధ్యాహ్నం నుంచే అభిమానులు టీవీలకు అతుక్కుపోయారు. హోటళ్లు, రెస్టారెంట్లతో పాటు గేటెడ్ కమ్యూనిటీలలో భారీ తెరలను ఏర్పాటు చేసి మరీ క్రికెట్‌ను ఆస్వాదించారు. చిన్నా, పెద్దా, యువత, మహిళలు అందరూ ఆద్యంతం మ్యాచ్‌ను తిలకించారు. అంతిమంగా కోహ్లి సెంచరీతో పాటు పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించడంతో నగరంలో ఆదివారం రాత్రి సందడి వాతావరణం నెలకొంది.



శేరిలింగంపల్లిలో..

ప్రేమించి పెళ్లాడిన వ్యక్తే వేధించాడు..

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


మనీషా(ఫైల్)

ఉప్పల్: సరిగ్గా ఏడాది క్రితం ప్రేమికుల రోజున ఒక్కటైన జంట ఉదంతంలో విషాదం చోటుచేసుకుంది. కట్టుకున్నోడే వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేక యువతి ఆత్మహత్య చేసుకుంది. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనపై ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు..సూర్యాపేట జిల్లా మద్దిరాల గ్రామానికి చెందిన ఆకుల మనీషా(24), తుంగతుర్తి ప్రాంతానికి చెందిన పులిగుజ్జు సంపత్‌లు ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదివే సమయంలో ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేర్వేరు కావడంతో మనీషా తల్లిదండ్రులను ఎదురించి సంపత్‌ను గతేడాది వాలంటైన్స్ డే రోజున ఉప్పల్ ఆర్యసమాజ్‌లో పెళ్లాడింది. అనంతరం రామంతాపూర్‌లో కాపురం పెట్టారు. వీరి వైవాహిక జీవితం కొన్నాళ్లు బాగానే ఉన్నా అనుకోని విధంగా భర్త నుంచి వేధింపులు ప్రారంభమయ్యాయి. సంపత్‌కు వరుసకు సోదరి అయ్యే మున్నిత అనే యువతి కూడా కట్నం తేవాలని వేధించడంతో ఇటీవల మనీషా విషయాన్ని తల్లిదండ్రులకు మొరపెట్టుకుంది. దీంతో వారు భర్తను వదిలేసి ఇంటికి రావాలని సలహా ఇవ్వగా అందుకు ఒప్పుకోలేదు. చివరకు తీవ్ర ఒత్తిడికి గురై ఆదివారం రాత్రి తాను ఉంటున్న గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. మనీషా తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త సంపత్, మున్నితపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిగరెట్ అమ్మినా సీరియస్ యాక్షన్

మైనర్లకు విక్రయాలపై టీజీఏఎన్‌బీ నజర్
- నగర వ్యాప్తంగా నిఘా ఉంచిన బృందాలు
- ఇలా చిక్కిన వ్యాపారులపై ఠాణాల్లో కేసులు


సీక్రెట్ కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) అధికారులు కేవలం మాదకద్రవ్యాల క్రయవిక్రయాల పైనే కాదు...సిగరెట్ల అమ్మకంలో జరుగుతున్న చట్టం ఉల్లంఘనలపైనా దృష్టి పెడుతున్నారు. నగర వ్యాప్తంగా పలువురు వ్యాపారులు మైనర్లకు సిగరెట్లు అమ్ముతున్నారంటూ వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దింపారు. ఇవి శుక్రవారం పశ్చిమ మండలంలోని ఇద్దరు వ్యాపారులను పట్టుకుని, వారిపై స్థానిక ఠాణాల్లో కేసు నమోదు చేయించాయి.

మాదక ద్రవ్యాలకు ముందు సిగరెట్...

టీజీఏఎన్‌బీ అధికారులు గడిచిన కొన్నేళ్లుగా నగరంలో జరుగుతున్న మాదక ద్రవ్యాల దందాను అధ్యయనం చేస్తున్నారు. ప్రధానంగా కళాశాలలు, పాఠశాలలతో పాటు ఇతర విద్యా సంస్థలపై పటిష్ట నిఘా ఉంచారు. వాటిలో, సమీపంలో, సంబంధించిన టీజీఏఎన్‌బీకి చిక్కిన వారిలో గంజాయి తాగుతున్న వాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. అతి తక్కువ మంది ఇతర మాదకద్రవ్యాలను బానిసలుగా మారారు. ఆయా విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న టీజీఏఎన్‌బీ అధికారులు వాళ్లు ఈ వ్యసనానికి బానిసకావడానికి కారణాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ కీలక విషయం అధికారులకు తెలిసింది. ఇతర మాదక ద్రవ్యాలు వినియోగానికి ముందు వారంతా గంజాయి సేవించేవారని బయటపడింది. దీనికి ముందు సిగరెట్ కాల్చడంతో ఈ ఊబిలోకి దిగినట్లు పలువురు బయటపెట్టారు.

చట్టం స్పష్టంగా చెబుతున్నప్పటికీ..

తల్లిదండ్రులు, కుటుంబీకుల పర్యవేక్షణ లేకపోవడం, మెచ్యూరిటీ తక్కువగా ఉండటంతో పాటు వివిధ కారణాల నేపథ్యంలో మైనర్లు వ్యసనాలకు తేలిగ్గా ఆకర్షితులై, బానిసలుగా మారుతూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే జువైనల్ జస్టిస్ యాక్ట్ (జేజేఏ), సిగిరెట్ అండ్ అదర్ టుబాకో ప్రొడక్ట్స్ యాక్ట్ (కాట్పా) ప్రకారం మైనర్లకు మద్యం, సిగరెట్లు, మాదకద్రవాలు తదితరాల విక్రయంపై నిషేధం ఉంది. అయితే మద్యం విక్రయాల విషయంలో నిబంధనలు కొంతవరకు అమలు అవుతున్నాయి. సిగరెట్ల విక్రయించకూడదనే విషయాన్ని మాత్రం ఎవరూ పట్టించుకోవట్లేదు. పోలీసులు సైతం అప్పుడప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు తప్ప మైనర్లకు విక్రయం విషయం పట్టించుకోవట్లేదు.

రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు..

ఈ నేపథ్యంలోనే టీజీఏఎన్‌బీకి ఇటీవల కాలంలో మైనర్లకు సిగరెట్ల విక్రయంపై వరుస ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని సీరియస్‌గా తీసుకున్న డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. వీరు తమ సెల్‌ఫోన్లతో పాటు రహస్య కెమెరాలను వినియోగించి నిఘా ఉంచుతున్నారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఈ తరహా సిగరెట్ల విక్రయాలను రహస్యంగా చిత్రీకరిస్తున్నారు. వీటిని ఆధారంగా చేసుకుని ఆ వ్యాపారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. ఆ అధికారులే స్థానిక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు ఇస్తూ వీడియోలు అందిచడం ద్వారా వ్యాపారులపై జేజేఏ, కాట్పాల్లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయిస్తున్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు చేయించారు. ఈ డ్రైవ్ కొనసాగించాలని సందీప్ శాండిల్య నిర్ణయించారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

అమీర్‌పేట: మహిళలకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైతలాపూర్‌కు చెందిన రోజా ఉద్యోగావకాశాల పేరిట వచ్చిన ప్రకటన చూసి మూసాపేటలోని ఎర్త్ సెక్యూరిటీ కాంట్రాక్ట్ మ్యాన్ పవర్ సర్వీసెస్ అనే ఔట్ సోర్సింగ్ సర్వీసెస్ కార్యాలయాన్ని సంప్రదించింది. ఏజెన్సీ నిర్వాహకుడు మాదుగుల సురేష్‌ను కలవగా ఉద్యోగం ఇప్పిస్తానని రూ.40 వేలు తీసుకున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీలోని బస్తీ దవాఖానలో కాంట్రాక్ట్ పద్ధతిన కేవలం ఒక సంవత్సరం పాటు ఉద్యోగంలో చేర్పించాడు. గడువు తీరిన తర్వాత రూ.లక్ష రూపాయలు చెల్లిస్తే స్టాఫ్ నర్సుగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో అమీర్‌పేట అన్నపూర్ణ బ్లాక్‌లోని మరో కార్యాలయం ద్వారా రూ.80 వేలు చెల్లించింది. స్టాఫ్ నర్సు ఉద్యోగం కోసం అమీర్‌పేటలోని కార్యాలయానికి వెళ్లగా అప్పటికే కార్యాలయం మూసి ఉంది. నిర్వాహకుడు సురేష్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. డబ్బులు చెల్లించి మూడు సంవత్సరాలైనా ఉద్యోగం ఇప్పించకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రిని హత్య చేసిన కుమారుడికి రిమాండ్


నిందితుడు సాయికుమార్

కుషాయిగూడ: ఈసీఐఎల్ చౌరస్తాలో తండ్రిని కిరాతకంగా హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. లాలపేట్‌కు చెందిన మొగిలిని కన్నకొడుకే కత్తితో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కుషాయిగూడ పోలీసులు నిందితుడు సాయికుమార్‌ను అరెస్టు చేసి ఆదివారం మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టారు. నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశించినట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మృతుడి మొగిలి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో కుటుంబం అదృశ్యం?


అదృశ్యమైన సుదర్శన్, కుటుంబ సభ్యులు(ఫైల్)

శంషాబాద్: అప్పుల బాధ భరించలేక కుటుంబంతో సహా ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన మేరకు..మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన డి.సుదర్శన్ వివాహనం అనంతరం అత్తగారిల్లు ఉన్న కర్మన్‌ఘాట్‌లో ఏడేళ్లు, ఆ తర్వాత శంషాబాద్ పట్టణంలో ఏడాది కాలం నివసించాడు. రెండు చోట్లా అప్పులు కావడంతో గత మూడేళ్లుగా నర్కూడ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల చీటీ డబ్బుల వసూలు కోసం ప్రభాకర్ అనే వ్యక్తి సుదర్శన్ ఇంటికి వెళ్లగా వారు ఇంట్లో కన్పించకపోవడంతో వారి తల్లికి విషయం తెలిపాడు. ఈ విషయమైన సుదర్శన్ సోదరుడు భానుప్రకాష్ అద్దె ఇంట్లో ఆరా తీయగా సుదర్శన్‌తో పాటు ఆయన భార్య తేజస్వి, ఇద్దరు కుమారులు ఇక్కడ ఉండడం లేదని వెల్లడైంది. ఈ నెల 18 నుంచి వారు ఇంట్లో లేరని తెలియడంతో భానుప్రకాష్ వారి కోసం అన్ని చోట్లా ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. అప్పుల ఒత్తిడి కారణంగానే ఎక్కడికైనా వెళ్లి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో శనివారం రాత్రి గంజాయిని విక్రయిస్తున్న ముచ్చింత్, పెద్దతూప్ర గ్రామాలకు చెందిన బొడ్డు భాను, బ్యాగరి కిరణ్‌తో పాటు మైనర్ బాలుడు పట్టుబడ్డాడు. వీరి నుంచి 56 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఎయిర్‌పోర్టు బావర్చి హోటల్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన సఫీల్‌గూడ చెందిన ఆర్.రోహిత్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 100 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శభాష్ పోలీస్

- పరీక్ష కేంద్రానికి దారి తప్పిన విద్యార్థిని
- సమయానికి తమ వాహనంలో చేర్చిన పోలీసులు


విద్యార్థినిని తమ వాహనంలో వదిలిపెడుతున్న మహేశ్వరం పోలీసులు

మహేశ్వరం: గురుకుల పాఠశాల అర్హత పరీక్ష రాసేందుకు ఓ విద్యార్థిని దారితప్పడంతో పోలీసులు పరీక్ష కేంద్రానికి సకాలంలో తమ వాహనంలో చేర్చారు. గురుకులాల్లో ప్రవేశానికి ప్రభుత్వం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అర్హత పరీక్ష నిర్వహించింది. ఓ విద్యార్థినికి కందుకూరు మండల పరిధిలోని కొత్తురు సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐ కళాశాలలో సెంటర్ కేటాయించారు. ఆమె తల్లితో కలిసి పరీక్ష కేంద్రానికి వస్తూ అడ్రస్ తెలియక దారి తప్పి ఉదయం 10.40 గంటలకు మహేశ్వరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. పరీక్ష కేంద్రం ఇక్కడ కాదు కందుకూరు మండలం కొత్తురు సమీపంలో ఉందని చెప్పడంతో ఆందోళనకు గురైంది. గమనించిన మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు వెంటనే విద్యార్థితో పాటు ఆమె తల్లిని పోలీస్ పెట్రోల్ మొబైల్ వాహనంలోఎస్ఆర్ఐ కళాశాల పరీక్ష కేంద్రంలో 10.55 గంటలకు వదిలిపెట్టారు. విద్యార్థిని సమయానికి పరీక్ష కేంద్రంలోకి వెళ్లి పరీక్ష రాయడంతో పోలీసులు చేసిన పనికి నెటిజన్లు శభాష్ అంటున్నారు. పరీక్ష రాసిన అనంతరం విద్యార్థిని, ఆమె తల్లి పోలీసులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఈక్వెస్ట్రియన్ అర్హత పోటీలు



శంకర్‌పల్లి: ఈక్వెస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఎఫ్ఐ) ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండలం జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో నిర్వహిస్తున్న నేషనల్ జూనియర్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్ అర్హత పోటీలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో దేశంలోని పలు క్లబ్‌లకు చెందిన 150కి పైగా హార్స్ రైడింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కి చెందిన ఐజా మీర్ ఢిల్లీలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ సీఈఓ మీర్ హాఫిజుద్దీన్ మాట్లాడుతూ.. అర్హత పోటీలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఇచ్చిన ఈఎఫ్ఐకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ డైరెక్టర్ మీర్ మొయిజుద్దీన్ మహమ్మద్, కంప్రోలర్ మీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు కట్టాం.. ఇళ్లు అప్పగించండి


సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

హుడాకాంప్లెక్స్: పేద, బడుగు బలహీన వర్గాల కోసం నిర్మించిన ఇళ్లను వెంటనే అసలైన లబ్ధిదారులకు అప్పగించాలంటూ సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. హస్తినాపురం నందనవనం జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద 15 ఏళ్ల క్రితం 512 నివాసాలను అప్పటి ప్రభుత్వం నిర్మించింది. వాటిలో 427 ఇళ్లను స్థానిక నిరుపేదలు ఆక్రమించుకుని కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. తర్వాత ప్రభుత్వం ఆ గృహాలకు సంబంధించిన లబ్ధిరులను ఎంపిక చేసి కేటాయింపు పత్రాలు అందజేసింది. వారు ఇక్కడికి వచ్చి చూడగా ఆ నివాసాల్లో వేరే వాళ్లు ఉంటున్నారని, ఖాళీ చేయబోమని చెప్పారని లబ్ధిదారులు అధికారులకు తెలియజేశారు. ఇళ్లలో ఉంటున్న వారికి, అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారులకు మూడేళ్లుగా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. న్యాయం చేయాలంటూ ఇరువర్గాలు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యను పరిశీలించిన ప్రభుత్వం ప్రస్తుతం ఆ నివాసాల్లో ఉంటున్న పేదలకు డ్రా పద్ధతిలో నగరంలోని ఇతర ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లను కేటాయించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా 15 నవంబర్ 2022న ఆర్డీఓ వెంకటాచారి, హౌసింగ్ బోర్డు ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో 427 కుటుంబాలకు ఇతర ప్రాంతాల్లో నివాసాలు కేటాయించారు. అయినా ఈ వారు నందనవనంలోని ఇళ్ల ఖాళీ చేయకుండానే కొత్తగా కేటాయించిన ఇళ్లను సైతం ఆక్రమించి నివాసం ఉంటున్నారు. 2006లో ఇళ్ల కోసం ప్రభుత్వానికి రూ.80,250 చొప్పున చెల్లించిన వారు విసిగిపోయి ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా అక్రమంగా నివాసముంటున్న వారిని ఖాళీ చేయించి డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

తన ప్రాణాల్ని పణంగా పెట్టి..

కుమారుణ్ని కాపాడిన తండ్రి


వెంకటేష్ (ఫైల్)

శామీర్‌పేట్: విద్యుదాఘాతం నుంచి కుమారుణ్ని తప్పించేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టాడు ఓ తండ్రి. ఈ ఘటన మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామానికి చెందిన బుద్ధి వెంకటేష్ (40), తన పదిహేనేళ్ల కుమారుడు కలిసి వరి పొలంలో ఆదివారం ఉదయం క్రిమిసంహారక మందు చల్లుతున్నారు. ఈ క్రమంలో వీరి పొలం మీదుగా ఉన్న విద్యుత్ తీగలు కుమారుడికి తగిలి షాక్ కొట్టగా తండ్రి వెంకటేష్ గమనించాడు. కుమారుణ్ని ప్రమాదం నుంచి తప్పించే క్రమంలో వెంకటేష్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా.. కుమారుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకటేష్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. శామీర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో
కొహెడ మార్కెట్

- త్వరలో పరిపాలనా అనుమతులు
- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్


బాటసింగారం మార్కెట్‌లో రైతులు, వ్యాపారులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న సురేంద్రమోహన్

అబ్దుల్లాపూర్‌మెట్/తుర్కయంజాల్: కొహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ నిర్మాణం చేపడతామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్ర మోహన్ తెలిపారు. త్వరలోనే పరిపాలన అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకుడు లక్ష్మణుడు, జాయింట్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా మార్కెటింగ్ రిజిస్టర్ రియాజ్, కోహెడ మార్కెట్ కన్సల్టెంట్ ఉమామహేశ్వర రావుతో కలిసి ఆదివారం ఆయన కొహెడలో పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం కేటాయించిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోనే అత్యున్నత స్థాయి సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. త్వరలో సీఎంతో పాటు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి మార్కెట్ నిర్మాణానికి పాలనా అనుమతులు మంజూరు చేయడంతో పాటు పనులకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

200 ఎకరాల్లో రూ.2,900 కోట్లతో..

కొహెడ మార్కెట్లో పండ్లు, పాలు, డ్రై ఫ్రూట్స్, మాంసాహార ఉత్పత్తులతో పాటు పూల వంటి ఉత్పత్తులకు అవకాశం ఉందని సురేంద్రమోహన్ అన్నారు. దాదాపు 200 ఎకరాల్లో రూ.2,900 కోట్లతో మార్కెట్ నిర్మాణం జరుగనుందని చెప్పారు. మార్కెట్‌కి వచ్చే రైతులు, వినియోగదారులు, అమ్ముకునే వర్తకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యున్నత సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు అత్యాధునిక కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం బాటసింగారం పండ్ల మార్కెట్‌లో క్రయవిక్రయాలను పరిశీలించారు. ఏపీ ప్రాంతాల నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి.. ఏపీ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయన్న విషయాలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మార్కెట్ సెక్రటరీ ఎల్.శ్రీనివాస్, డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, రఘుపతి రెడ్డి, నరసింహ, జైపాల్ రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, గణేశ్ నాయక్, వెంకటేశం గుప్తాం, ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో పాత నేరస్తుడి రిమాండ్

మీర్‌పేట: బాలికపై దాడికి పాల్పడిన పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. లెనిన్‌నగర్‌కు చెందిన పన్నాల సురేష్, ముత్యాల గణేశ్‌లు తాపీ మేస్త్రీలుగా పనిచేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పనిచేసే చోట ఇద్దరికి గొడవ జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న గణేశ్.. శనివారం సాయంత్రం దాడి చేసేందుకు నేరుగా సురేష్ ఇంటికి వెళ్లాడు. అతను లేకపోవడంతో అతడి కూతురు(16) కంట్లో కారం చల్లి, కత్తెరతో దాడి చేసి గాయపరిచాడు. సురేష్ ఫిర్యాదు మేరకు గణేశ్‌ను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. నిందితుడిపై వనపర్తిటౌన్, గద్వాలటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 19 దొంగతనం కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

12 గంటల పాటు 'రికార్డు' గానం..


ఆనందలక్ష్మికి వండర్‌బుక్ యోగ్యతాపత్రాన్ని అందజేస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి: వర్ధమాన గాయని ఆనంద లక్ష్మి ఆదివారం ఉదయం 8.05 నుంచి రాత్రి 8.30 గంటల వరకు 12 గంటల పాటు సినిమా పాటలు, అన్నమయ్య కీర్తనలను రాగయుక్తంగా ఆలపించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రికార్డు నమోదు చేశారు. ది భారతీమణి ఫౌండేషన్, ఆనంద లహరి కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రాత్రి త్యాగరాయగాన సభలో కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆమె 120 పాటలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ మేరకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యోగ్యతా పత్రాన్ని ఆమెకు అందజేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ప్రముఖులు దేవేందర్‌గౌడ్, చింతలపూడి త్రినాథరావు, వంశీకృష్ణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీలో రంగారెడ్డి జట్టు సత్తా

అనంతగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 34వ సబ్ జూనియర్ అంతర్రాష్ట్ర బాలబాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జాతీయ అంతర్జాతీయ పోటీల్లో రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. క్రీడాపోటీలను విజయవంతంగా చేపట్టిన నిర్వాహకులను అభినందించారు. రాత్రి నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో బాలి కల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు, బాలుర విభాగంలో నల్లగొండ జట్టు విజయం సాధించగా.. రన్నరప్‌గా బాలికల విభాగంలో రంగారెడ్డి, బాలుర విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా జట్లు నిలిచాయి. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరశురాం నాయక్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కోశాధికారి నరేందర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, నాయకులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని సర్దార వల్లభ్‌భాయ్‌పటేల్‌నగర్ బూత్ నం.172లో బీజేపీ నాయకులు మన్‌కీ బాత్ 119వ ఎపిసోడ్‌ను వీక్షించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు జెరిపిటి సైదులు ఆధ్వర్యంలో మన్‌కీ బాత్ వీక్షణ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, పోలింగ్ బూత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రహమత్‌నగర్: కార్మికనగర్ క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో కంటి, రక్తపోటు, మధుమేహ, దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బిషప్ డా.విద్యాసాగర్ పాల్ మాట్లాడుతూ... పేద రోగులకు వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో శిబిరం ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతినెల ఈ శిబిరం వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా.నిపుని కృష్ణ, డా.రవళి, డా.గౌరవ్, డా.సురేందర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య కళాశాల తల్లిలాంటిది

వెంగళరావునగర్: ఆయుర్వేద వైద్య కళాశాల తల్లిలాంటిదని ఆయుష్ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ కె.నర్సింహారెడ్డి తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఆదివారం 1975 – 80 పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాటి ఏడీ నర్సింహారావు మాట్లాడుతూ.. కొన్ని వేల సంవత్సరాలకు పూర్వమే మన దేశంలో ఆయుర్వేద వైద్యం ప్రాచుర్యంలో ఉందన్నారు. అలాంటి ఆయుర్వేద వైద్యాన్ని అభ్యసించడానికి ముందుకు వచ్చిన ప్రతి విద్యార్థికి, ఇక్కడ పని చేసే ప్రతి ఉద్యోగికి ఇది తల్లి లాంటిదన్నారు.

కల్యాణం.. కమనీయం

రహమత్‌నగర్: బోరబండ సైట్-2 భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఉదయం 11గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం, అగ్ని గుండాలు, మల్లన్నఎల్లమ్మలకు బోనాలును సమర్పించారు.అనంతరం నాగవెల్లి కార్యక్రమం కొనసాగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు బోరబండ, రహమత్‌నగర్, అల్లాపూర్, ఎర్రగడ్డ డివిజన్‌ల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

శవ్యాప్తంగా కులగణన చేయాలి

లిబర్టీ: తెలంగాణను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా కులగణన చేయాలని బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కులగణన చేస్తామని ప్రధానమంత్రి స్వయంగా ప్రకటించాలని కోరారు. కుల గణన చేయమని దమ్ముంటే బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రకటించాలని సవాల్ విసిరారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కుల గణన చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. బీసీల ఓట్లతో మూడోసారి గద్దెనెక్కిన ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీలకు మొండి చూపించిందన్నారు. కేవలం చట్టసభలను కాకుండా విద్యా, ఉద్యోగ, రంగాల్లో సైతం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

హామీలు అమలు చేయాలి

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లోక్ దళ్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు పీవీ రాజేశ్వరరావు కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి మహిళకు 2500 ఇస్తామన్న హామీ ఇంకా అమలుకు నోచుకోకపోవడం వల్ల మహిళల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామన్న హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికీ రైతు భరోసా పథకం కింద రైతుల బ్యాంకుల్లో డబ్బులు పడకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారం నుంచి అధిక వడ్డీకి డబ్బులు తీసుకోని పంటలు వేశారని తెలిపారు. ఈ సమావేశంలో సౌభాగ్యవతి, న్యాయవాదది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోరా పబ్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించి గడువు ముగిసిన తర్వాత కూడా పబ్ నడుపుతున్న మేనేజర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.36లోని జోరా పబ్‌లో శనివారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో పెద్ద ఎత్తున శబ్దాలు వస్తుండటంతో పెట్రోలింగ్ పోలీసులు వెళ్లి చూడగా సమయం అయిపోయిన తర్వాత కూడా పబ్ కొనసాగిస్తున్నట్లుగా గుర్తించారు. పబ్ మేనేజర్ వరాహాలు నాయుడుపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇట్ల పైసలిస్తే.. అట్ల పనైపోద్ది.!

'మేముండగా.. టెన్షన్ ఎందుకు దండగా'అంటున్న బ్రోకర్లు

- ఖైరతాబాద్ సర్కిల్-7 కార్యాలయంలో బ్రోకర్లదే హవా
- అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న **వైనం**
- రేషన్‌కార్డులో పేరు తొలగింపునకు డబ్బులు
- మధ్యవర్తులను నమ్మొద్దంటున్న అధికారులు
- పేర్లు ఉచితంగానే డిలీట్ చేస్తామంటూ వెల్లడి
- కార్యాలయాలపై కొరవడిన ఉన్నతాధికారుల **పర్యవేక్షణ**



బంజారాహిల్స్ రోడ్ నం.7లోని మీ-సేవా కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

బంజారాహిల్స్: సోమాజీగూడకు చెందిన వీరాంజనేయులు తన కుటుంబానికి సంబంధించిన కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ-సేవా కార్యాలయానికి వెళ్లాడు. అయితే మీ తల్లిదండ్రుల పేరుతో ఉన్న రేషన్‌కార్డులో మీ పేరు ఉంది. ఆ పేరును రేషన్ కార్యాలయానికి వెళ్లి డిలీట్ చేసుకుని వస్తే కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని మీ-సేవా కార్యాలయం నిర్వాహకులు తెలిపారు. ఆయన వెంటనే ఖైరతాబాద్ ఆనంద్‌నగర్‌కాలనీలోని ఖైరతాబాద్ సర్కిల్-7 కార్యాలయానికి వెళ్లి తన తల్లిదండ్రులకు ఉన్న రేషన్‌కార్డులో తన పేరును తీసివేయాలని కోరాడు. ఇందు కోసం చాలా తిప్పలు పడ్డాడు. ఆ పత్రాలు.. ఈ పత్రాలు అంటూ అధికారులు అటూ ఇటూ తిప్పారు. ఇది గమనించి ఓ బ్రోకర్ వీరాంజనేయులు అవసరాన్ని ఆసరాగా చేసుకుందామనుకున్నాడు. ఆ తర్వాత మాటలు కలిపాడు.

పేరు తొలగించుకోవడానికి రూ.వేయి సమర్పించుకోవాల్సిందే..

- సదరు బ్రోకర్ వీరాంజనేయులు దగ్గరకు వచ్చి "కార్డులో నీ పేరు డిలీట్ చేయిస్తాను. రూ.1000 ఖర్చవుతుంది."అని చెప్పాడు. ఎలాగైనా సరే పేరు డిలీట్ చేయించుకుని కొత్తకార్డు తీసుకోవాలనే ఉద్దేశంతో ఉన్న వీరాంజనేయులు రూ.1000 సమర్పించుకుని తన పేరును తొలగించుకున్నాడు. ఇలా ఒక్క వీరాంజనేయులు మాత్రమే కాదు. ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-7 కార్యాలయానికి నిత్యం కార్డులో నుంచి తమ పేరును డిలీట్ చేసుకోవడానికి వందలాది మంది వస్తుండగా వారందరి పరిస్థితి ఇలాగే ఉంది.

బ్రోకర్ల తీరుతో అధికారులకు ఇబ్బందులు..

- డబ్బులు ఇస్తేనే పేర్లు డిలీట్ అవుతుండటంతో రేషనింగ్ సర్కిల్-7 కార్యాలయం అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రోకర్లను నమ్మొద్దని నేరుగా తమ **వద్దకే వచ్చి సంప్రదించాలని** అధికారులు సూచిస్తున్నా త్వరగా పని అయిపోవాలనే ఉద్దేశంతో చాలామంది బ్రోకర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ బ్రోకర్లు కూడా రూ.1000 నుంచి రూ.2,000 దాకా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఖైరతాబాద్ సర్కిల్-7 కార్యాలయం

బలహీనతను క్యాష్ చేసుకుంటున్న బ్రోకర్లు..

కార్డు నుంచి పేరు డిలీట్ అయితేనే కొత్తకార్డు దరఖాస్తును మీ-సేవా **కేంద్రంలో** ప్రత్యేక యాప్‌లో ఆమోదం లభిస్తుంది. దీంతో కొన్నేళ్ల క్రితం **తీసుకున్న కార్డుల నుంచి** ఇప్పుడు పెరిగి పెద్దయ్యి భార్యా పిల్లలతో ఉన్న కొడుకులు కొత్త **కార్డు తీసుకునేందుకు** పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఈ బలహీనతను రేషనింగ్ **కార్యాలయం వద్ద కొందరు** బ్రోకర్లు క్యాష్ చేసుకుంటున్నారు.

కొత్తకార్డు కోసం పడే పాట్లు అన్నీఇన్నీ కావు..

- **ప్రభుత్వం ఇచ్చిన మ**రో అవకాశాన్ని **సద్వినియోగం చేసుకోవాలనే ఉ**ద్దేశంతో కొత్త కార్డు పొందాలనుకునేవారు మీ-సేవా కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా పాతకార్డుల నుంచి తమ పేర్లను తొలగించుకునే పనిలో పడ్డారు. రేషనింగ్ సర్కిల్-7 కార్యాలయం పరిధిలో 81 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో ఖైరతాబాద్, సోమాజీగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, రహమత్‌నగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్ల పరిధిలోని ప్రజలు కొత్తకార్డు పొందడానికి పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు కావడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు మధ్యవర్తులు ఇదే అదునుగా భావించి తమ జేబులు నింపుకుంటున్నారు.

ఆస్తిపన్ను సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం



ఆస్తిపన్ను పరిష్కార వేదికలో సర్కిల్-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: వచ్చే నెల 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగిస్తున్నందున ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టారు. మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తూ సీజ్ చేస్తున్నారు. అయితే ఆ పన్ను చెల్లింపుల్లో కొంతమందికి సమస్యలు ఉండటంతో వాటిని చెల్లించలేకపోతున్నట్లు తెలుసుకున్న అధికారులు ఆస్తిపన్ను పరిష్కార వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి ఈ వేదికలో పాల్గొని సమస్యలు ఉన్నవారితో ముఖాముఖి చర్చించి వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీనిచ్చారు. వారు ఇన్నాళ్లు ఆస్తిపన్ను చెల్లించకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. పన్ను చెల్లింపుల్లో సమస్యలు ఉంటే వాటిని చక్కదిద్దుతున్న అధికారులు సకాలంలో చెల్లించే విధంగా కృషి చేస్తున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

వెంగళరావునగర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని మోతీనగర్ పోస్టాఫీస్ వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో పోస్టుకార్డులు పట్టుకుని ఉద్యమకారుల సంఘం నేతలు నినాదాలు చేశారు. అనంతరం పోస్టుబాక్స్‌లో ఉత్తరాలను వేశారు.

- ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పోస్టు కార్డు ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తమ సమస్యలను తెలియజేస్తున్నామని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పదివేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 250 గజాల చొప్పున ఇంటి స్థలాలు కేటాయించాలని, వృద్ధులకు రూ.25వేలు పింఛన్ ఇస్తామని, గుర్తింపుకార్డులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఇందర్‌కుమార్, కన్వీనర్ బి.చంద్రశేఖర్, నియోజకవర్గ కార్యదర్శి గౌసుద్దీన్, సెబాస్టియన్, కుమారస్వామి, సీహెచ్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.




పోస్టుకారులు చూపుతున్న ఉద్యమకారులు

భక్తిశ్రద్ధలతో హనుమత్ వైభవ ఉత్సవాలు



వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి మాఘమాస హనుమత్ వైభవ్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే స్వామివారికి పూజలు ప్రారంభించారు. తొలుత తేనెతో విశేషంగా అభిషేకం చేశారు. 9 గంటలకు మన్యుసూక్త హోమం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు పెద్ద సంఖ్యలో అన్నదానం జరిగింది. సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. మధురానగర్‌కాలనీ, వెంగళరావునగర్ కాలనీ, సిద్ధార్థనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తొలిరోజు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అభయాంజనేయ స్వామి దేవాలయం కిటకిటలాడింది. కాగా ఆలయ ప్రధాన అర్చకులు కె.పవనకుమార ఆచార్యులు ఆధ్వర్యంలో ఆలయ పూజారులు వీరేశం, సత్యం స్వామి, మహేష్‌స్వామి తదితరులు పూజా కార్యక్రమాలను చేశారు. ఆలయ ధర్మకర్తలు తోటకూర నరసింహారావు, వెంకటరమణలు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సైబర్ క్రైమ్.. సైకిల్ ర్యాలీ

బంజారాహిల్స్: రాబోయే రోజుల్లో సైబర్ క్రైమ్ ప్రమాదకరంగా మారనుందని ప్రముఖ చిత్ర నిర్మాత బెక్కం వేణుగోపాల్ అన్నారు. 'సైబర్ దొంగలు ఉన్నారు..తస్మాత్ జాగ్రత్త'నినాదంతో 'తకిట తధిమి తందానా'చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన మెగా సైకిల్ ర్యాలీ ఆదివారం ఫిలించాంబర్ నుంచి కేబీఆర్ పార్కు మీదుగా 150మంది సైక్లిస్ట్‌లతో నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ పేమెంట్ యాప్స్ ఈజీగా లోన్స్ అందిస్తూ సగటు వ్యక్తులను అప్పుల ఊబిలోకి లాగుతున్నాయని అన్నారు. ఆ తర్వాత అప్పు వసూళ్ల పేరుతో అప్పు తీసుకున్న వ్యక్తి నుంచి అసలు కంటే కొన్ని రెట్లు అధికంగా వసూలు చేస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నారని అన్నారు. లోన్‌యాప్‌లకు వ్యతిరేకంగా ప్రజలను మేల్కొల్పేందుకు తకిట తధిమి తందానా చిత్రాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు. హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ర్యాలీలో సినీ దర్శకులు చంద్రమహేష్, హీరో రామ్‌కీ, పెటాప్సీ చైర్మన్ హరిగోవింద ప్రసాద్, రవీంద్ర, చందన్‌కుమార్ కొప్పుల, హీరో గణ ఆదిత్య, హీరోయిన్ ప్రియ, దర్శకులు రాజ్ లోహిత్ తదితరులు పాల్గొన్నారు. సందేశాన్ని వినోదాత్మకంగా చూపిస్తూ ప్రజలకు మేల్కొలుపుగా ఈ చిత్రాన్ని నిర్మించడం సమాజ సేవలో భాగమేనని దర్శకుడు తెలిపారు.



బందోబస్తు ఇవ్వండి.. కబ్జాలు తొలగించాలి

పేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నందినగర్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయని, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి గుడిసెలు వేయడమే కాకుండా పెద్ద ఎత్తున డబ్బాలు ఏర్పాటు చేశారని, వీటిని తొలగించడానికి పోలీసు బందోబస్తు కావాలంటూ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నందినగర్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున జరిగిన ఆక్రమణల వల్ల ఆర్టీసీ బస్సు తిరగలేని పరిస్థితి ఏర్పడిందని, వాటర్ ట్యాంకర్, అంబులెన్స్‌లు కూడా వచ్చే పరిస్థితి లేదని బస్తీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహశీల్దార్ స్పందించి వీటి తొలగింపునకు ప్రతిపాదించారు. పోలీసు బందోబస్తు కావాలని అడిగారు. అలాగే ఆక్రమణల తొలగింపునకు సహకరించాల్సిందిగా జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌కు కూడా ఆమె లేఖ రాశారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఈ ఆక్రమణలన్నింటినీ తొలగించాల్సి ఉంటుందని ఆమె వెల్లడించారు. ఒక జేసీబీని కేటాయించాల్సిందిగా కోరారు. ఇదే విషయాన్ని ఆమె ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి దృష్టికి కూడా తీసుకువెళ్లారు. అయితే ఇలాంటి కూల్చివేతలు హైడ్రా చేస్తున్నదని, వారికి లేఖ రాయాలంటూ జెడ్సీ ఆమెకు సూచించారు. ఇటు పోలీసులు, అటు టౌన్‌ప్లానింగ్, మరోవైపు జీహెచ్ఎంసీ అధికారులు ఏమాత్రం సహకారం అందించకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోజురోజుకు నందినగర్ గ్రౌండ్ ఆక్రమణదారులకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికైనా పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి రెవెన్యూ అధికారులకు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విశ్వసాయి మందిరంలో అభిషేకం



బంజారాహిల్స్: మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని శ్రీ విశ్వ సాయి మందిరంలో కొలువుదీరిన శ్రీ సాయిబాబాకు ఆదివారం ఖర్జూర రసంతో అభిషేకం నిర్వహించారు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేశారు. దీంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ప్రభుత్వ దృష్టికి అంగన్‌వాడీ సమస్యలు

రహమత్‌నగర్: అంగన్‌వాడీ పాఠశాలల, టీచర్ల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డివిజన్‌లోని అంగన్‌వాడీ టీచర్లు కార్పొరేటర్‌కు మొరపెట్టుకున్నారు. రహమత్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆదివారం అంగన్‌వాడీ టీచర్లు సీఎన్ రెడ్డిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. సొంత భవనాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలపై ఇప్పటికే తాము నివేదికలు రుపొందించామని తెలిపారు.



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

పేకాట శిబిరంపై దాడి

ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: పోలీసుల కళ్లుగప్పి గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న పేకాట శిబిరంపై జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు చేసి ముగ్గురు సినీ పరిశ్రమకు చెందిన ఆర్టిస్ట్‌లను అరెస్టు చేశారు. శ్రీనగర్‌కాలనీ గణపతి కాంప్లెక్స్ వెనుక ఉన్న చాయ్ దునియా టీ స్టాల్ సమీపంలో కే.రాజేష్, బాలాంజనేయులు, నర్సింహులు తదితరులు పేకాడుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి వీరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి రూ.5,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురూ సినిమాల్లో ఆర్టిస్టులుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా కారు నడుపుతూ చిక్కారు

- మద్యం సేవించినట్లు గుర్తించిన పోలీసులు
- ముగ్గురు యువకులపై కేసు నమోదు

బంజారాహిల్స్: మద్యం మత్తులో వేగంతో కారు నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మణికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మెహుల్‌సింగ్ పరమార్, తుషార్ మల్హోత్ర, సాగర్ సోనీ అనే ముగ్గురు యువకులు అర్ధరాత్రి బంజారాహిల్స్ రోడ్ నం.12లో ప్రమాదకరంగా మితిమీరిన వేగంతో ఫుట్‌పాత్‌ను ఢీకొడుతూ వెళ్లారు. అంతేకాకుండా అటు వైపు నుంచి వెళ్తున్న వాహనదారులకు ప్రమాదకర సంకేతాలు చూపిస్తూ వెళ్తుండగా పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ చేయగా ముగ్గురూ తాగి ఉన్నట్లుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే నంబర్‌తో రెండు బైక్‌లు

నిందితుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఫైనాన్స్ ఈఎంఐల నుంచి తప్పించుకునేందుకు ఒకే నంబర్‌తో రెండు బైక్‌లు తిప్పుతున్న వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి బైక్‌లను సీజ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం.10లోని ఐపీఎస్‌కాలనీ సమీపంలో బంజారాహిల్స్ పోలీసులు శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒకే నంబర్‌తో ఉన్న రెండు బైక్‌లు కనిపించాయి. అక్కడే నిలబడి ఉన్న వ్యక్తిని ఇవి ఎవరివి అని ఆరా తీయగా తనవేనని చెప్పాడు. సింగాడబస్తీకి చెందిన టి.ప్రవీణ్ ఈ రెండు బైక్‌లకు ఒకే నెంబర్ వేసి తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఫైనాన్స్ ఈఎంఐలు తప్పించుకునేందుకు రెండు బైక్‌లకు ఒకే నంబర్ వేసినట్లు వెల్లడించాడు. నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బైక్‌లు సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసంలో చిక్కి.. వెంటనే నగదు పొంది.!

బంజారాహిల్స్: మహా కుంభమేళా పుణ్య స్నానం కోసం గదులు కావాలని వెతుకుతున్న ఓ వ్యాపారికి సైబర్ మోసగాడు టోకరా ఇచ్చాడు. అయితే సదరు వ్యాపారి క్షణాల్లోనే సైబర్ క్రైమ్ నెంబర్‌కు సమాచారం ఇవ్వడంతో పోగొట్టుకున్న సొమ్ము వెంటనే ఖాతాలో జమ అయ్యింది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఆనంద్ బంజారాకాలనీలో నివసించే కుమార్ రామచంద్రన్ మహా కుంభమేళా వెళ్లేందుకు వసతి కోసం వెతుకుతుండగా మహాకుంభ్ టెంట్ సిటీ ప్రయాగ్‌రాజ్.ఆర్గ్ కనబడింది. వెంటనే ఆ వెబ్‌సైట్‌లోని నంబర్‌కు ఫోన్ చేయగా ఈనెల 9, 10 తేదీల్లో ఖాళీ ఉన్నాయని చెప్పారు. వెంటనే ఆయన రూ.30వేలు చెల్లించాడు. అయితే ఎలాంటి బుకింగ్ సమాచారం రాలేదు. మళ్లీ ఫోన్ చేయగా ఈ నంబర్ పనిచేయడం లేదని సమాధానం వచ్చింది. తాను మోసపోయానని తెలుసుకుని 1930 సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. సంబంధిత అధికారులు ఖాతాను స్తంభింపజేశారు. పోగొట్టుకున్న నగదు క్షణాల్లోనే రామచంద్రన్ ఖాతాలో జమయ్యింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ఎక్స్'లో పోస్ట్.. కారు సీజ్!

ముగ్గురు యువకులను అరెస్టు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: 'ఎక్స్'వేదికగా ఓ వ్యక్తి చేసిన పోస్ట్ ఆధారంగా ఓ కారు డ్రైవర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడమే కాకుండా మితిమీరిన వేగంతో ప్రమాదకరంగా వాహనాన్ని నడుతుండగా ఓ వ్యక్తి ఆ కారును వీడియో తీసి 'ఎక్స్'(ట్విట్టర్)లో పోస్ట్ చేయడంతో పోలీసులు స్పందించి సదరు కారు డ్రైవర్‌పై చర్యలకు దిగారు.

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సిగ్నల్ వద్ద శనివారం ఉదయం 7 గంటల సమయంలో (ఏపీ 09 ఏక్యూ 7209) నంబర్ గల కారు రోడ్డు మధ్యలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు అధిక వేగంతో ప్రమాదకరంగా వాహనాన్ని నడుపుకుంటూ వెళ్లాడు. కారు నడుపుతున్న దృశ్యాలను ఎండీ మౌజం అనే వ్యక్తి వీడియో తీసి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు.
- ఆదివారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో టెక్ టీమ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కరుణాకర్ సాధారణ పరిశీలనలో భాగంగా ఎక్స్ ఖాతాను పరిశీలిస్తుండగా ఎండీ మౌజం పోస్ట్ చేసిన వీడియోను పరిశీలించాడు. దీంతో కారును వేగంగా నడుపుతూ రోడ్డుపై ప్రయాణించే వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా వ్యవహరించారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా కరుణాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ఈ కారు కోసం గాలించి పట్టుకున్నారు. మలక్‌పేటలోని ప్రజ్ఞ విజయజ్యోతి కాలేజీలో చదువుతున్న మహ్మద్ అబ్దుల్ ఖదిర్, అన్వర్ ఉలుం కాలేజీలో చదువుతున్న ఎండీ అనస్ అహ్మదుద్దీన్, లకోటియా కాలేజీలో చదువుతున్న మహ్మద్ అబ్దుల్ రహద్ ఈ కారులో వెళ్తూ స్టంట్లు చేసినట్లుగా గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించి వీరు ఇష్టారాజ్యంగా దూసుకెళ్తున్నట్లుగా నిర్ధారించి కారును సీజ్ చేసి ఈ ముగ్గురిని అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదకరంగా కారు నడుపుతూ పట్టుబడ్డ విద్యార్థులు

వక్ఫ్ చట్టం రద్దుపై పోరాడతాం: మధుయాష్కీ



గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం సెక్యులర్ విధానాలను కాలరాస్తూ తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తామని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఆదివారం రింగ్‌రోడ్డు రూఫ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ మైనార్టీస్ రైట్స్ అండ్ 'సేవ్ వక్ఫ్' పేరిట జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. వక్ఫ్ చట్టం రద్దుకు వ్యతిరేకంగా మైనార్టీలు, దళితులు, బీసీలు, గిరిజనులు, ఇతర అల్ప సంఖ్యాక జాతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. వక్ఫ్ ఆస్తులు ముస్లింలు ఆక్రమించుకున్న ఆస్తులు కావని, వీటిపై చట్ట ప్రకారం ముస్లిం సంస్థలకు అన్ని హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. సంఖ్యా బలంతో వక్ఫ్ చట్టానికి ప్రధాని మోదీ తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బియాబానీ ఖుస్రో, మాజీ ఎంపీ అజీజ్ పాషా, కార్వాన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీ తదితరులు పాల్గొన్నారు.

'విద్యారణ్యం'.. సనాతన వేదిక

- ఘనంగా ఏడో వార్షికోత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయ గురుకుల వ్యవస్థను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన 'విద్యారణ్యం'సంస్థలు ఋగ్వేదం, యజుర్వేద అధ్యయనాలను అధికారిక విద్యతో మిళితం చేస్తున్నామని వ్యవస్థాపకులు మాడుగుల శశిభూషణ సోమయాజి తెలిపారు. సనాతన ధర్మంపై ఆధారపడిన మంచి వ్యక్తులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. నగరంలోని విద్యారణ్య విద్యాసంస్థ 7వ వార్షికోత్సవాలను ఆదివారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహాదేవ దీక్షిత పరమాచార్య స్వామిగళ్, పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మికురాలు అనంతలక్ష్మి, అనంత పద్మనాభరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యారణ్యం వ్యవస్థాపకుడు మాడుగుల శశిభూషణ సోమయాజి మాట్లాడుతూ విద్యార్థులు కఠినమైన వేద అభ్యాసనలో నిమగ్నమై, కళలు, శారీరక దృఢత్వం, సంపూర్ణ విభాగాలలో నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారని అన్నారు. వారు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థులతో ప్రారంభమైన విద్యారణ్యం ఇప్పుడు 114 మంది విద్యార్థులకు ఎదిగిందని, 2027 నాటికి 500 మంది విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తాందని పేర్కొన్నారు.

అమెరికాలో హైదర్షాకోట్ యువకుడి మృతి



యార్లగడ్డ విజయ్

బండ్లగూడ: నగరం నుంచి ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాలు... బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన మాజీ వార్డు మెంబర్ యార్లగడ్డ లక్ష్మి కుమారుడు విజయ్(26) రెండేళ్ల క్రితం పైచదువుల కోసం అమెరికాలోని ఒహాయోకు వెళ్లాడు. అయితే ఈ నెల 13న ఆయన అనారోగ్యంతో అక్కడ మృతి చెందాడు. భౌతికకాయం శనివారం హైదరాబాద్‌కు చేరుకోగా ఆదివారం హైదర్షాకోట్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బయటకు వెళ్తే దుమ్ము,
ధూళి.. ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి..
పరిశ్రమలు, నిర్మాణ సంస్థలున్న ప్రాంతాల్లో దట్టమైన పొగలు.. ఇదీ నగరంలో పరిస్థితి. స్వచ్ఛమైన గాలి మచ్చుకైనా లేదు. వాహనాల రద్దీకి గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతింటోంది. కొన్ని ప్రాంతాల్లో ఘనపు మీటరు గాలిలో పీఎం10 ధూళికణాలు 60 మైక్రో గ్రాములు ఉండాల్సిన చోట 150 మైక్రో గ్రాములు దాటి నమోదు కావడం అందరినీ కలవరపెడుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల ప్రకారం ఘనపు మీటరు గాలిలో పీఎం 10 సూక్ష్మ ధూళి కణాలు 60 మైక్రో గ్రాములు, డబ్ల్యూహెచ్‌ఓ ప్రమాణాల ప్రకారం 40 మైక్రో గ్రాములు ఉండాలి. –సాక్షి, సిటీబ్యూరో



ఊపిరి.. ఉక్కిరిబిక్కిరి

నిర్మాణ ప్రాజెక్టులు, వాహన రద్దీ ప్రాంతాల్లో ప్రమాదకరంగా వాయువు

- గణనీయంగా పెరిగిన గాలిలో ధూళి కణాలు
- శ్వాసకోశ జబ్బులు వచ్చే ప్రమాదముందంటున్న నిపుణులు

గ్రేటర్ పరిధిలోని కోకాపేట్, నార్సింగి, తెల్లాపూర్, పుప్పాలగూడ, మణికొండ, గండిపేట్, జూబ్లీహిల్స్, మియాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పనిచేసే ప్రదేశాల్లో ఇసుక, మట్టి తరలింపు, వ్యర్థాల తొలగింపు, నిర్వహణ వంటి విషయాల్లో నిర్మాణ సంస్థలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వాటి పరిసర ప్రాంతాల్లో ఇసుక రేణువులు గాలిలో దట్టంగా అలముకుంటున్నాయి. గాలిలో పీఎం 10 ధూళికణాల సాంద్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై బస్సు, లారీ, కారు వంటి వాహనాలు వెళ్లేటప్పుడు దారి కనిపించనంత దట్టంగా దుమ్ము రేగుతోంది. పటాన్‌చెరు, బొల్లారం, పాశమైలారం, రామచంద్రాపురం తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థాలు గాలి పీల్చుకోలేనంత గాఢంగా మారుతున్నాయి. నగరంలో సుమారు 80 లక్షల వాహనాలు నిత్యం రహదారిపై తిరుగుతున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, అమీర్‌పేట్, కోఠి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో వాహనాల రద్దీ విపరీతంగా పెరుగుతోంది. దీంతో రహదారిపై ఒకవైపు పొగ, మరోవైపు ధూళి రేణువులు కళ్లల్లో పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు జీహెచ్ఎంసీ రూ.వేల కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు దీర్ఘకాలంగా కొనసాగుతుండటంతో ఆ దారిలో దుమ్మురేగుతోంది. గాఢమైన వాసనలు పీల్చడం, దుమ్ము, ధూళి రేణువుల ప్రభావంతో శ్వాసకోశ జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రాంతం	పీఎం 10 స్థాయి (మైక్రో గ్రాములు)
పాశమైలారం	158
పటాన్‌చెరు	155
జూ పార్క్	157
బొల్లారం	146
హెచ్‌సీయూ	135
కోకాపేట్	120
సోమాజిగూడ	104

మియాపూర్‌లో ఆందోళనకరం

మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో ఎయిర్ క్వాలిటీ 342గా నమోదైంది. ఇక్కడ ఉన్న కొన్ని నిర్మాణ సంస్థలే ఇందుకు ప్రధాన కారణమంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గాలి నాణ్యత సోమాజిగూడ(154), కేపీహెచ్‌బీ ఫేజ్–3 (139), జూపార్క్ (124), కోటి (124), యూఎస్ కాన్సులేట్ (124) సైదాబాద్ (107) తదితర ప్రదేశాల్లో ప్రమాదకరంగా నమోదైంది. గాలి నాణ్యత 50 వరకు ఉంటే సాధారణం. 100 దాటితే ఇబ్బందులు తప్పవని నిపుణులు చెబుతున్నారు.

పని ప్రదేశాల్లో లింగ సమానత్వం సాధించాలి



సాక్షి, సిటీబ్యూరో: పనిచేసే చోట లింగ సమానత్వం సాధించాల్సిన అవసరం ఉందని సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి ప్రసాద్ అన్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం(టీడీఎఫ్), సీఐఐ తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ యూత్ ఎంపవర్‌మెంట్ సంయుక్తంగా 'ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి' అనే అంశంపై ఆదివారం హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పాలసీకి సిఫార్సులను రూపొందించడంలో ఇండియన్ ఉమెన్ నెట్ వర్క్ తెలంగాణ చేస్తున్న కృషిని కొనియాడారు. ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ విద్యా నాణ్యతను మెరుగుపరిచేందుకు మద్దతు ఇవ్వడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మన విద్యార్థులు అసాధారణంగా రాణించేందుకు విద్యా వ్యవస్థలో భారీ మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సమాచారం సమకూర్చాలని కోరారు. విద్యలో నాణ్యత పెంపొందించడానికి విశ్వవిద్యాలయాల పరిపాలనను మెరుగుపరచడం, అవసరమైన నిధులను సమకూర్చడం, కొత్త బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడం అవసరమని అన్నారు. కార్యక్రమంలో సీఐఐ సదరన్ రీజియన్ మాజీ చైర్మన్ అనిల్ కుమార్, తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం ట్రస్టీ, మాజీ చైర్మన్ జి.గోపాల్ రెడ్డి, కావేరి విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వి.ప్రవీణ్ రావు, మారుతి సుజుకి లిమిటెడ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు సి.వి.రామన్, సీఐఐ తెలంగాణ వైస్ చైర్మన్ ఆర్ఎస్ రెడ్డి, 200 మందికిపైగా పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

శిశుమందిరాలతోనే సంస్కృతి పరిరక్షణ



వార్షికోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బండ్లగూడ: సరస్వతీ శిశుమందిరాల్లోనే సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన విద్య అందుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీ శారదాధామంలో 41వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సమాజానికి అవసరమైన భవిష్యత్ యువతరం శ్రీ సరస్వతీ శిశు మందిరాల ద్వారానే నిర్మాణం అవుతుందని పేర్కొన్నారు. చక్కటి వాతావరణం ఉన్నచోటనే దేశ భవిష్యత్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అధ్యక్షుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ తక్కెళ్లపల్లి తిరుపతిరావు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి విరివింటి రవీంద్ర శర్మ, ఆవాస విద్యాలయ కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, అధ్యక్షుడు అర్జున్‌గౌడ్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా 'ది ఆర్టిసాన్స్ ఫ్లీ'..

- టీ వర్క్స్ వేదికగా కళాత్మక సందడి
- ఆర్టిసాన్స్ ఫ్లీలో ఆకట్టుకున్న ఆర్టిస్టులు, కళాకృతులు
- ప్యానల్ చర్చలో పాల్గొన్న ప్రముఖులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని టి–వర్క్స్ వేదికగా నిర్వహించిన 'ది ఆర్టిసాన్స్ ఫ్లీ'కార్యక్రమం విభిన్న కళలను, కళాకారులను ఒకే వేదిక మీదకు చేర్చింది. ఆదివారం జరిగిన ఈ కళాత్మక వేదికలో పలువురు ఆర్టిస్టులు వినూత్న కళలు, ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రముఖ ఆర్ట్ బ్రాండ్ బ్రస్ట్రో సహకారంతో బియాండ్ హైదరాబాద్, ఆర్ట్ ఆర్టిస్ అఫీషియల్, ఎస్ఆర్‌బీ, అర్బన్ స్కెచర్స్ హైదరాబాద్ వంటి సంస్థ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారుల హస్తకళా ప్రదర్శనలతోపాటు కళా ప్రముఖులతో ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. మేకింగ్ కల్చర్‌ను ప్రోత్సహించడానికి ఇటీవల టి–వర్క్స్ ఆధ్వర్యంలో మేకర్స్ కలెక్టివ్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఏర్పాటు చేసిన ఈ వేదికలో హ్యాండ్స్–ఆన్ వర్క్‌షాప్‌లు, నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించింది. ఈ ఆర్టిసన్స్ ఫ్లీ 23వ ఎడిషన్‌లో 40 మంది వరకు కళాకారులు సృష్టించిన కళాకృతులను సామాజిక అనుసంధానాన్ని ప్రదర్శించాయి. ఈ వినూత్న కార్యక్రమంలోని ప్యానెల్ చర్చలో ప్రముఖ నటి గీతాభాస్కర్, స్క్రైబుల్ ఆర్టిస్టు హరీష్ భాగవతులు, అర్బన్ స్కెచర్స్ హైదరాబాద్ వ్యవస్థాపకుడు ఇషాక్ జియాయీ, చిత్రకారుడు–టెడెక్స్ స్పీకర్ ప్రియతం తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ ఆర్టిసాన్స్ ఫ్లీలో వెయ్యికి పైగా ఔత్సాహికులు, కళాకారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

'చరితార్థం' పుస్తకావిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆంధ్ర మహిళాసభ కళాశాలలో ఆనందేశి నాగరాజు రాసిన 'చరితార్థం' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ రఘుకుమార్, సెంటర్ ఫర్ సోషియల్ డైలాగ్ కన్వీనర్ వేలూరి రామారావు మాట్లారు. భారత సమాజం, సంస్కృతి, ఆర్థిక అధ్యయనంతో ప్రాచీన భారతదేశ చరిత్రను 'చరితార్థం'పుస్తకంలో రికార్డు చేశారని వక్తలు అన్నారు. నేటి భారత యువతకు మొదటి భారత ముస్లిం సంఘ సంస్కర్త, లౌకిక ప్రజాస్వామ్యవాది హమీద్ దల్వాయి భావాలు అనుసరణీయమని చెప్పారు. అనంతరం హమీద్ దల్వాయి రచించిన 'లౌకిక భారతదేశంలో ముస్లిం రాజకీయాలు' అనే అనువాద పుస్తక పరిచయం కార్యక్రమం కూడా జరిగింది.

8న ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్

రాయదుర్గం: మార్చి 8వ తేదీన ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్–2025ను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సమ్మిట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాల ఓబీసీ సమస్యల పరిష్కారం కోసం ఈ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అడుగంటిన పబ్లిక్ గార్డెన్ చెరువు

ప్రశ్నార్థకంగా జలచరాల మనుగడ



ఎండిపోతున్న నాంపల్లి పబ్లిక్ గార్డెన్ చెరువు

నాంపల్లి: 150 ఏళ్ల పురాతన చరిత్ర కలిగిన నాంపల్లి పబ్లిక్ గార్డెన్ చెరువు అడుగంటింది. ఈ చెరువు ఎండిపోవడం పర్యావరణం సంక్షోభానికి సంకేతం. ఇన్నాళ్లూ జీవ వైవిధ్యానికి ఆధారంగా నిలిచిన పబ్లిక్‌గార్డెన్ చెరువు ఎండిపోవడానికి పట్టణీకరణ, భూగర్భ జలాలు అడుగంటడం, పేలవమైన పరిరక్షణ చర్యలే కారణాలని పర్యావరణ నిపుణులు అంటున్నారు. ఈ చరిత్రాత్మకమైన ప్రదేశం వినాశనానికి గురి కావడంతో అందులోని జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మరో రెండు రోజుల్లో పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. తాబేళ్లు, చేపలు మృత్యువాత పడే అవకాశం ఉంది. నీటిమట్టం తగ్గడంతో చెరువులోని చేపలు కొంగలకు ఆహారంగా మారాయి. కాబట్టి సంబంధిత శాఖ అధికారులు ఈ చెరువుపై ప్రత్యేక దృష్టిని సారించి చెరువును, చెరువులోని జలచరాలను కాపాడాల్సిన అవసరం ఉంది. చెరువులోని పూడికను తొలగించి తక్షణం జల స్థిరత్వాన్ని తీసుకురావాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.

నీరా కేఫ్ ఎత్తేస్తే అడ్డుకుంటాం

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



నీరాకేఫ్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

ఖైరతాబాద్/సుందరయ్య విజ్ఞానకేంద్రం: హైదరాబాద్ నడిబొడ్డున రూ.20 కోట్లతో నిర్మించిన నీరా కేఫ్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. విజయ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కల్లుగీత సంఘాల నాయకులు నీరా కేఫ్ భవన్‌ను పరిశీలించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గౌడ కులస్తులు ఆత్మగౌరవంతోపాటు వృత్తిదారులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు నీరా కేఫ్ ఏర్పాటైందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 50 వేల వృత్తిదారులు ప్రకృతి సిద్ధమైన పానియాన్ని నీరా రూపంలో ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. కొందరు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి ఈ కేఫ్‌ను ప్రైవేటు వ్యక్తుల పరం చేయడానికి పన్నాగం పన్నారని ఆరోపించారు. ప్రభుత్వ తక్షణమే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే గౌడ సంఘాలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, బబ్బూరి బిక్షపతి, భానుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఛావా' చిత్ర ప్రదర్శన



కొంపల్లిలో ఛావా చిత్రాన్ని తిలకిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: మొగలులు భారతీయులపై సాగించిన దమకాండను 'ఛావా'చిత్రం ప్రతిబింబిస్తోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కొంపల్లిలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన చావా చిత్రాన్ని ఎంపీ రాజేందర్ వీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 400 ఏళ్ల క్రితం మొగలుల దమనకాండ నుంచి హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు శివాజీ మహరాజ్ నడుం బిగించారని, మన సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడేందుకు ఆయన వీరోచితంగా పోరాడారని తెలిపారు. ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న శంభాజీ మహరాజ్ ఆనాడు మొగల్ చక్రవర్తులపై సాగించిన పోరాటాన్ని ఛావా చిత్రం ద్వారా తెరకెక్కించడం అభినందనీయమన్నారు. ఎంపీ ఈటల వెంట బీజేపీ నాయకుడు రాజిరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ శివాజీ రాజు, మాధురి, దుర్గా, అశోక్, మధు, మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, శంకర్ నాయక్, మహేందర్, తిరుపతి తదితరులు ఉన్నారు.



ఛావా చిత్రాన్ని తిలకించేందుకు ర్యాలీగా వెళ్తున్న జాతీయవాద వైద్యులు

ర్యాలీగా వెళ్లి... చిత్రం తిలకించి..

సుల్తాన్‌బజార్: శంభాజీ మహారాజ్ జీవిత కథగా తెరకెక్కిన ఛావా చిత్రానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఆదివారం కాచిగూడ క్రాస్ రోడ్డులోని ఐనాక్స్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సనాతన ధర్మసేన వ్యవస్థాపకుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌తో కలిసి 150 మంది జాతీయవాద వైద్యులు కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంతో ర్యాలీగా ఐనాక్స్ థియేటర్ వద్దకు చేరుకుని తిలకించారు.

ఈజీగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్లు

- 'సారథి'సాంకేతిక దన్నుతో ఆన్‌లైన్‌లో పునరుద్ధరణ
- ఎక్కడి నుంచైనా సేవలను వినియోగించుకొనే అవకాశం
- తుదిదశలో సాంకేతిక అంశాల పరిశీలన...



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్లు మరింత సులభతరం కానున్నాయి. ఆన్‌లైన్‌లోనే పునరుద్ధరించుకునే సదుపాయం అందుబాటులోకి రానుంది. రవాణా శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సారథి'సాంకేతిక పరిజ్ఞానంసహాయంతో వాహన వినియోగదారులు ఎక్కడి నుంచైనా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ల(ఐడీపీ)ను రెన్యువల్ చేసుకొనే సదుపాయం ఉంటుంది. అమెరికా, దుబాయ్, యూరోప్ తదితర దేశాల్లోని నిబంధనల మేరకు రవాణా శాఖ అందజేసే డ్రైవింగ్ లైసెన్సులు, పర్మిట్ల ఆధారంగా ఏడాదిపాటు చెల్లుబాటు అయ్యేవిధంగా తాత్కాలికంగా లైసెన్సులను అందజేస్తారు. మరో ఏడాదిపాటు తీసుకోవాలంటే హైదరాబాద్ నుంచి మరోసారి ఐడీపీ పొందాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యక్షంగా ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. కానీ, 'సారథి'సేవలు వినియోగంలోకి వచ్చిన తరువాత ఆ ఇబ్బంది తొలగిపోనుందని ఆర్టీఏ అధికారి ఒకరు తెలిపారు. ఆర్టీఏ అందజేసే శాశ్వత డ్రైవింగ్ లైసెన్సులు, విదేశాల్లో ఉండేందుకు అనుమతించిన వీసాల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే ఐడీపీలను పొందే అవకాశం లభిస్తుంది. సాధారణ లైసెన్సుల పునరుద్ధరణ, చిరునామా మార్పు, డూప్లికేట్ లైసెన్సులు వంటి ఆన్‌లైన్ సేవల్లో భాగంగా ఐడీపీ సదుపాయం ఉంటుంది. విదేశాల్లో ఉంటున్న వాళ్లకు దీనివల్ల భారీ ఊరట లభించనుంది.

అనూహ్యమైన స్పందన...

ఆర్టీఏ అందజేసే ఐడీపీలకు అనూహ్యమైన స్పందన లభిస్తోంది. విదేశాల్లో చదువుకొనేందుకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, బంధువుల ఇళ్లకు వెళ్లేవాళ్లు, తాత్కాలిక వీసాలపై వెళ్లే పర్యాటకులు ఐడీపీల కోసం ఆర్టీఏ కార్యాయాల వద్ద క్యూ కడుతున్నారు. ఒక్క ఖైరతాబాద్ కేంద్ర కార్యాలయం నుంచి ప్రతిరోజు సగటున 25 నుంచి 30 ఐడీపీలను అందజేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో సగటున 50 వరకు ఉండవచ్చని అంచనా. లైట్ మోటార్ వెహికల్(ఎల్ఎంవీ) డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి వీసా ఉన్న నగరవాసులు ఈ అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్లను తీసుకోవచ్చు. ఇందుకోసం ప్రస్తుతం ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకొని సుమారు రూ.1,500 ఫీజు చెల్లించి నిర్ణీత తేదీ, సమయం ప్రకారం సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం అదేరోజు ఐడీపీని అందజేస్తారు. ఈ ఐడీపీని ఆమోదించిన దేశాల్లో వాహనాలు నడిపేందుకు అర్హత లభిస్తుంది. కానీ, ఉద్యోగులు వీటి పునరుద్ధరణలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సారథి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే ఆ ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉంది. మరోవైపు విదేశాల్లో వాహనాలు నడిపేందుకు పర్మిట్‌లు కోరుతున్న వాళ్లలో ఉద్యోగులతోపాటు మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. విదేశాల్లోనే స్థిరపడ్డవాళ్లు మాత్రం కొంతకాలం తాత్కాలికంగా ఐడీపీ ఆధారంగా వాహనాలు నడిపేందుకు అనుమతి పొందినా శాశ్వతంగా మాత్రం అక్కడి రవాణా శాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్సులను పొందవలసి ఉంటుంది.

తుదిదశలో 'సారథి'పరిశీలన

దేశ వ్యాప్తంగా వాహనాల నమోదు, డ్రైవింగ్ లైసెన్సుల సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం వాహన్ సారథిని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో 'వాహన్' సేవలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వాహనాల గణాంకాలు, చిరునామాలు వంటి వివరాలన్నింటినీ 'వాహన్'లో నిక్షిప్తం చేశారు. దీనివల్ల వాహనదారులు ఒక రాష్ట్రంనుంచి మరో రాష్ట్రానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వాహనాలను బదిలీ చేసుకొన్నప్పుడు ప్రత్యేకంగా నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సిన అవసరం లేదు. ఒకవిధంగా వాహనాన్ని ఏ రాష్ట్రంలో కొనుగోలు చేసినా వాహన వినియోగానికి సంబంధించి దేశవ్యాప్తంగా ఒకే విధమైన సేవలను పొందవచ్చు. వాహన్ ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తుంది. డ్రైవింగ్ లైసెన్సుల సేవలను సైతం ఏకీకృతం చేసేవిధంగా 'సారథి'ని హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. సారథి సాంకేతిక వ్యవస్థ తుదిదశ పరిశీలనలో ఉంది. డ్రైవింగ్ లైసెన్సుల గణాంకాలను, వివరాలను సారథిలో నమోదు చేయడం వల్ల వాహనదారులు వాటి బదిలీలు, పునరుద్ధరణలో సారథి సేవలను వినియోగించుకోవచ్చు. అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్లకు కూడా ఈ సదుపాయం లభించనుంది.

బ్రష్‌లు చేత పట్టి.. గోడలకు రంగులేసి..

ఉస్మానియా ఆసుపత్రిలో ఐటీ ఉద్యోగుల సామాజిక సేవ



ఆనందం వ్యక్తం చేస్తున్న ఐటీ ఉద్యోగులు



ఐటీ ఉద్యోగులను అభినందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్



ఆసుపత్రి గోడలకు రంగులు వేస్తున్న ఐటీ ఉద్యోగి

అఫ్జల్‌గంజ్: నిత్యం కంప్యూటర్ కీ బోర్డుపై బిజీగా ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల చేతులు బ్రష్‌లను పట్టి ఉస్మానియా ఆసుపత్రి గోడలకు రంగులు అద్దాయి. ప్రతిరోజు పని ఒత్తిడితో సతమతమవుతూ వారాంతంలో సినిమా, విందు, వినోద కార్యక్రమాలతో సేద తీరే ఐటీ ఉద్యోగులు సామాజిక సేవలో తాము సైతం అంటూ పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. వివిధ ఐటీ కంపెనీలకు చెందిన దాదాపు 50 మంది ఉద్యోగులు, ఇప్పటికే ఉస్మానియా ఆసుపత్రిలో పేద రోగులకు సేవలందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సహకారంతో ఆసుపత్రిలోని అవుట్ పేషంట్ బ్లాక్, కులీకుతుబ్ షా భవనంలోని పరిసరాలు, గోడలు, వార్డులను శ్రమదానంతో శుభ్రం చేశారు. బ్రష్‌లు చేతబట్టి సుమారు 100 లీటర్ల పెయింట్‌తో రంగులు వేశారు. పేద రోగులు వచ్చే ఉస్మానియా ఆసుపత్రికి తమ వంతుగా సేవ చేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని విప్రో కేర్ ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఆర్ఎంఓలు డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ మునావర్‌లు ఐటీ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో వాజిద్, భారతి, నేహా, ప్రీతి, ఆరిఫ్, తేజ, దివ్య, స్వర్ణ, కౌసల్య, ఉష, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 24, ఫిబ్రవరి, 2025



ఆనతి నీయరా హరా.. సన్నుతి సేయగా.. సమ్మతి నీయరా దొరా.. సన్నిధి చేరగా.. నీ ఆన లేనిదే గ్రహింప జాలున వేదాల వాణితో విరించి విశ్వ నాటకం.. అన్నట్లు శివరాత్రి ఉత్సవాలకు నగరం చుట్టుపక్కల ఉన్న పలు శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. విద్యుత్ కాంతుల ధగధగలతో దేదీప్యమానంగా వెలుగులు చిమ్ముతున్నాయి. యాత్రికుల కోసం ఆయా ఆలయ కమిటీలు, దేవాదాయ శాఖ అన్ని రకాల ఏర్పాట్లనూ పూర్తి చేస్తున్నాయి. ముఖ్యంగా నగరానికి చేరువగా ఉన్న కీసరగుట్టలోని శ్రీభవానీ శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేస్తోంది దేవాలయ కమిటీ. దీంతో పాటు మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం కూడా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది.. ఈ నేపథ్యంలో వీటి గురించిన మరిన్ని విశేషాలు..

- కీసర, మహేశ్వరం





ఆనతి నీయరా..

మహాశివరాత్రికి శైవ క్షేత్రాలు ముస్తాబు

నేటి నుంచి పలు ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు

కీసర, మహేశ్వరం ఆలయాల్లో భారీ ఏర్పాట్లు

చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్న ఈ ఆలయాలకు భక్తుల నుంచి విశేష ఆదరణ

నగరానికి 35 కిలోమీటర్ల దూరంలో పచ్చని ప్రకృతి మధ్యన కీసరగుట్టలో కొలువుదీరిన శ్రీభవానీ శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. యేటా శివరాత్రికి లక్షల సంఖ్యలో భక్తులు ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటారు. నేటి నుంచి మార్చి 1 వరకూ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.. సికింద్రాబాద్ నుండి కీసరగుట్టకు బస్సు సౌకర్యం ఉంది. ఇసీఐఎల్ నుండి 15 కిలోమీటర్ల ప్రయాణం. బ్రహ్మోత్సవాల సందర్భంగా నగరం నలుమూలల నుంచి ఆర్టీసీ వారు 200 ప్రత్యేక బస్సులను నడుపుతారు.



ఇదీ స్థలపురాణం..

కీసరగుట్టలో భక్తులచే పూజింపబడుతున్న శ్రీరామలింగేశ్వరుడు స్వయంగా శ్రీరామునిచే ప్రతిష్టించబడినట్లు ప్రతీతి. రావణుడు తపస్సు ద్వారా బ్రహ్మత్వంపొందాడు. రావణబ్రహ్మను హతమార్చినందువల్ల బ్రహ్మహత్యాదోషం అంటకుండా శ్రీరాముడు ఈ ప్రదేశంలో శివలింగార్చన చేయాలనుకుంటాడు. కాశీ నుంచి శివలింగం తెమ్మని హనుమంతుని పంపిస్తాడు. సమయం మించిపోతున్నా హనుమంతుడు రాకపోవడంతో శ్రీరాముడు ప్రార్థన ఆలకించిన శివుడు స్వయంగా లింగరూపంలో దర్శనమిస్తాడు. ఆ లింగాన్నే శ్రీరాముడు ప్రతిష్టించి పూజచేశాడని స్థలపురాణం చెబుతోంది.



మూడు ప్రత్యేకతలు..

ఈ ఆలయానికి మూడు ప్రత్యేకతలున్నాయి. ఇక్కడి శివాలయం పశ్చిమాభిముఖంగా ఉంటుంది. గర్భగుడిలో శివలింగం సైకత లింగం (ఇసుకతో చేసినది)గా ప్రసిద్ధికెక్కింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ శివాలయానికి ఎదురుగా హనుమంతుడిచే విసిరేయబడ్డట్టుగా చెబుతున్న శివలింగాలు చెల్లాచెదురుగా పడిఉంటాయి. గుట్ట పరిసర ప్రాంతాల్లో 107 శివలింగాలు ఉండగా.. చివరి లింగం నల్గొండ జిల్లా కొలనుపాకలో ఉంది. వీటికి భక్తులు తైలాభిషేకాలు చేస్తారు. వీటితోపాటు జైన విగ్రహాలు, గర్భాలయంలో అభిషేకం నీరు ఎటు వెళ్తాయో ఇప్పటికీ తెలియకపోవడం ఇక్కడి విశేషం.

చారిత్రక ప్రశస్తి..

కీసరగుట్ట ప్రాంతాన్ని క్రీ.పూ 4వ శతాబ్దం నుండి 6వ శతాబ్దం వరకూ విష్ణుకుండినుల పాలించినట్లు చారిత్రక ఆధారాలు లభ్యమయ్యాయి. పుట్టుకతో బ్రాహ్మణులైన క్షత్రియులుగా వ్యవహరించిన విష్ణుకుండినులు కీసరగుట్టను విజయానికి చిహ్నంగా భావించి ఆయుధాగారంగా వృద్ధిచేశారు. విష్ణుకుండినులలో శ్రేష్ఠుడైన రెండో మాధవవర్మ నరమేధయాగం ఇక్కడే చేసినట్లు ఆధారాలు చెబుతున్నాయి. పురావస్తుశాఖ జరిపిన తవ్వకాల్లో ఆ కాలం నాటి అవశేషాలు, నాణేలు, మట్టిపాత్రలు, అలంకరణ వస్తువులు, రేకులు, రాజప్రాసాదాలు బయటపడ్డాయి.

మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబువుతోంది. ఈ నెల 25 మంగళవారం నుండి మార్చి 1 శనివారం వరకూ ఉత్సవాలు జరుగనున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గంగలో శివుడు, పార్వతి ఉండడం ఇక్కడి ఆలయ విశేషం. బ్రహ్మోత్సవాలకు మహబూబ్‌నగర్, హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు రానున్నట్లు తెలిపారు. నగరం నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి చార్మినార్ నుంచి 253ఎం, 253టి, 253కె, 253హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఏ, 253ఎం, జూబ్లీ బస్సు డిపో నుంచి 253ఎం బస్సుల సౌకర్యం ఉంది. దీంతో పాటు పలు డిపోల నుంచి ఆర్టీసి ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది.



ఆలయ విశిష్టతలు..

కాకతీయుల కాలంలో రాజరాజేశ్వర స్వామి ఆలయం నిర్మాణం జరగడంతో ఈ గ్రామానికి మహేశ్వరమని పేరొచ్చినట్లు చరిత్ర చెబుతోంది. ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. గంగ మధ్యలో శివాలయం దాని చుట్టూ 16 ఆలయాలు పద్మరేకుల్లా ఉంటాయి. తానీషా కాలంలో అక్కన్న, మాదన్నలు పునరుద్ధరించినట్లు ప్రతీతి. శివ, పార్వతుల ఆలయాలతో పాటు మరో పదహారు ఆలయాలు దీని చుట్టూ కొలువుదీరాయి.



చరిత్రలోకి వెళితే..

తానీషా నవాబు వద్ద మంత్రులుగా చేసిన అక్కన్న మాదన్నలు 1672లో తమ పర్యటనలో భాగంగా శిథిలావస్థలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించుకున్నారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. 1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా మార్గమధ్యలో రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ఆలయంపై 1687లో మొఘల్ సామ్రాజ్యానికి చెందిన ఔరంగజేబు తన సైన్యంతో దాడి చేసి గుడిని ధ్వంసం చేసినట్లు చెబుతుంటారు. నాటి శిథిలాలు ఇప్పటికీ ఉన్నాయి. శివగంగ చుట్టూ 16 శివాలయాలు ఉండటం దీని ప్రత్యేకత.



అన్ని ఏర్పాట్లూ చేశాం..

బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపట్టాం. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఆరోగ్యం, పారిశుద్ధ్యం వంటి శాఖల సమన్వయంతో పనిచేస్తున్నాం.

– అల్లె కుమార్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్, మహేశ్వరం.



❖ పెద్ద చెరువు నుంచి నానక్‌రామ్ గూడ వరకూ

❖ హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహణ

ఖాజాగూడలో క్లబ్‌రన్-2025

రాయదుర్గం: సెలవు రోజు తెల్లవారుజామునే అంతా ఖాజాగూడ పెద్ద చెరువు వద్దకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు ఔత్సాహిక రన్నర్లు గుమిగూడారు. అక్కడే కొద్దిసేపు కసరత్తు చేశారు. అనంతరం 5.45 గంటలకు 16వ ఎడిషన్ క్లబ్‌రన్–2025కు సిద్ధమయ్యారు. హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో క్లబ్‌రన్–2025, వాలంటీర్ రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి ఖాజాగూడ మోడల్ రోడ్డు మీదుగా నానక్‌రామ్‌గూడ వరకూ రన్ కొనసాగింది. అక్కడ కొద్ది సేపు సేదతీరి ఆ తర్వాత తిరిగి ఖాజాగూడ పెద్ద చెరువుకు చేరుకొని సేద తీరారు. అనంతరం తమ గమ్యస్థానం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రన్నర్స్ ప్రతినిధులు, రన్నర్లు, వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఉత్సాహంగా 'సంకల్ప్ సురక్షా రన్'

జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద ప్రారంభం

గచ్చిబౌలి : 2030 నాటికి పిల్లలపై వేధింపులకు తావు లేకుండా చేయాలనే సంకల్పంతో చేపట్టిన 'సంకల్ప్ సురక్షా రన్–2025' విజయవంతమైంది. ఇందులో పెద్ద సంఖ్యలో రన్నర్లు పాల్గొనడం విశేషం. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సంకల్ప్ సంస్థ, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంస్థలు సంయుక్తంగా ఈ రన్‌ను ఆదివారం ఉదయం నిర్వహించాయి. ముఖ్యంగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జీవిత నైపుణ్యాలతో కూడిన విద్య ద్వారా పిల్లలను చేరుకోవాలని సంకల్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 500 పాఠశాలల్లో పిల్లల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని యోచిస్తున్నారు. సమాజంలో 2030 నాటికి పిల్లలపై వేధింపులకు తావులేని సమాజాన్ని రూపొందించాలని సంకల్పించారు. సంకల్ప్ సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షురాలు హేమలతా విజయరాఘవన్, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ డీ జోయల్ డేవిస్, ఇతర ప్రతినిధులతో కలిసి జెండా ఊపి రన్ ప్రారంభించారు. 2007లో ప్రారంభించిన సంకల్ప్ తెలంగాణ వ్యాప్తంగా లక్ష మంది పిల్లలపై ప్రభావం చూపుతూ పిల్లల విద్య, భద్రతను చురుకుగా ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఈఓ, ఎండీ.వెంకటరామ్ వసంతవాడ, సత్‌గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ సీఈఓ విజయరాఘవన్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రన్‌లో పాల్గొన్న వారికి మెడల్స్ అందించారు.



ప్రతి మహిళా సెలిబ్రిటీనే..

విరజ ఫ్రిల్స్‌లో మిసెస్ ఇండియా తెలంగాణ మిటాలీ

సాక్షి, సిటీబ్యూరో : ఇటీవల మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేతగా నిలవడం సంతోషంగా ఉందని మిసెస్ మిటాలీ అగర్వాల్ తెలిపారు. సెప్టెంబర్‌లో జరగనున్న మిసెస్ ఇండియా ఫ్యాషన్‌లో పాల్గొంటానని, ఈ పోటీల్లోనూ విజేతగా నిలవడానికి సన్నద్ధమవుతున్నానని ఆమె తెలిపారు. నగరంలోని కూకట్‌పల్లి వేదికగా వనితల కోసం ఏర్పాటు చేసిన విరజ ఫ్రిల్స్ ఉమెన్స్ వేర్ స్టోర్‌ను ఆదివారం ప్రారంభించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. సాధికారతతో మహిళా దినోత్సవాన్ని జరుపుకునే ప్రతి మహిళా ఒక సెలిబ్రిటీనే అని మిటాలీ అన్నారు. విరజ ఫ్రిల్స్ వేదికగా స్మార్ట్ క్యాజువల్స్, బిజినెస్ క్యాజువల్స్‌తో పాటు మహిళల సరికొత్త స్టయిల్ కోసం లేటెస్ట్ ట్రేడింగ్ కలెక్షన్ అందుబాటులో ఉందని నిర్వాహకులు అనుషా నామా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మిసెస్ మిటాలీ అధునాతన వస్త్రాలంకరణతో అలరించారు.



ఆకట్టుకుంటున్న టోపోగ్రఫీ



బంజారాహిల్స్: రోడ్ నెం.10లోని సృష్టి ఆర్ట్ గ్యాలరీలో అంతర్జాతీయ చిత్ర కళాకారులతో పాటు భారతీయ కళాకారుడు, టోపోగ్రఫీస్ ఆఫ్ టెంట్స్ టెర్రకోట అండ్ స్లైమ్ అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన చిత్ర కళా ప్రదర్శన ఔత్సాహిక కళాకారులను విశేషంగా ఆకట్టుకుంటుంది. సృష్టి ఆర్ట్ గ్యాలరీ 25వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గోతేజంత్రం భాగస్వామ్యంతో టోపోగ్రఫీలను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. జర్మనీకి చెందిన ప్రముఖ చిత్రకళాకారుడు ఆర్నాల్డో డ్రెస్ గోన్జాలెజ్, స్విస్ కఫ్లర్ట్‌తో పాటు భారతీయ చిత్రకారుడు సుధాకర్ చిప్పా వేసిన పెయింటింగ్స్ ప్రదర్శనకు ఉంచారు. విభిన్న కళాత్మక భాషలు, జీవిత అనుభవాలను ఈ చిత్రాల్లో కళ్లకు కట్టారు. నెలా 15 రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 50కి పైగా సంస్కృతులను ప్రతిబింబించే చిత్రాలు ఆలోచనాత్మక రీతిలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది.



నగర వేదికగా ఘనంగా శారీ రన్

సంప్రదాయ దుస్తుల్లో సాగర తీరాన కలర్‌ఫుల్ పరుగు

తనైరా, జేజే యాక్టివ్ భాగస్వామ్యంతో నిర్వహణ

చీర కట్టి.. పరుగు పెట్టి..



ఖైరతాబాద్ : తెలుగు సంస్కృతి, సంప్రదాయం, సౌందర్యానికి ప్రతీక చీర కట్టు.. అలాంటి చీరకట్టులోని ఔన్నత్యాన్ని నలుదిశలా చాటిచెప్పేలా నగర నారీమణులు ఉత్సాహంగా శారీ రన్‌లో పాల్గొన్నారు. అద్భుతమైన చీరకట్టుకు తామే బ్రాండ్ అంబాసిడర్లమనేలా వివిధ రకాల చీరకట్టుతో హాజరయ్యారు. ఆదివారం ఉదయం ట్యాంక్ బండ్ వేదికగా నారీమణులు తెలుగు సంప్రదాయ చీరకట్టుతో పీపుల్స్ ప్లాజా నుంచి జలవిహార్ మీదుగా శారీ రన్‌లో పాల్గొని తిరిగి పీపుల్స్ ప్లాజా చేరుకున్నారు. సుప్రసిద్ధ బ్రాండ్ తనైరా, ఫిట్‌నెస్ కంపెనీ జేజే యాక్టివ్ భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ శారీ రన్‌ను తనైరా సీఈఓ అంబుల్ నారాయణ్, జేజే యాక్టివ్ కోచ్ ప్రమోద్ ప్రారంభించారు. తనైరా శారీ రన్ ఐక్యత, స్ఫూర్తి చిహ్నంగా మహిళలలోని స్త్రీతత్వం, ఫిట్‌నెస్‌కు ప్రేరణగా నిర్వహించినట్లు అంబుల్ నారాయణ్ తెలిపారు. మహిళల ఆరోగ్యం, సమగ్రతను ప్రోత్సహించేందుకు మొదటి ఎడిషన్‌ను 2020లో పూణె, బెంగళూరు, హైదరాబాద్‌లో నిర్వహించామని రెండో ఎడిషన్‌ను మరోసారి హైదరాబాద్‌లో నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సాహంగా సాగిన శారీ రన్‌లో మహిళలు అందమైన చీరకట్టుతో హాజరుకాగా.. కొందరు బుల్లెట్లు తోలుతూ, మరికొందరు సైకిళ్లు తొక్కుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున సాగర తీరంలో శారీ రన్‌లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని రన్‌లో పాల్గొన్న పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. సుమారు మూడు వేల మందికిపైగా రన్‌లో పాల్గొన్నారని నిర్వాహకులు చెబుతున్నారు. వీరంతా ఫినిషింగ్ పాయింట్‌లో సెల్ఫీలు, గ్రూఫ్ ఫొటోలు దిగారు. జేజే యాక్టివ్ కోచ్ ప్రమోద్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ముందు వామ్ అప్ ఫిట్‌నెస్, జుంబా చేయించారు.

ఉద్యోగుల కోసం ఇపీపీ ప్రోగ్రామ్

సాక్షి, సిటీబ్యూరో : ఉద్యోగుల ప్రయోజనాలను మరింత మెరుగుపరిచేందుకు నగరానికి చెందిన ప్రముఖ బీ 2 బీ ఫిన్‌టెక్ కంపెనీ జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. స్మార్ట్ ఎంప్లాయిస్ పర్చేజ్ ప్రోగ్రాం (ఇపీపీ+)ను రూపొందించింది. దీని కోసం 'గూగుల్ త్రూ రీడింగ్టన్ లిమిటెడ్' తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ జీ.అవినాష్ తెలిపారు. ఈ సరికొత్త ప్రోగ్రామ్ ప్రస్తుత ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతూనే.. వ్యాపారులు, ఉద్యోగుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో వినూత్న లీజింగ్ ప్రక్రియ ద్వారా ఖర్చులను నిర్వహించడంలో సహకరిస్తుందని వివరించారు.



చెక్ పోస్టు ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై పెట్టిన డ్రమ్ములు

ఇది కూటమి చెక్‌పోస్టు.. ఓకే అంటేనే ముందుకు!

చిల్లకూరు మండలం నల్లాయగారి పాళెం వద్ద ప్రైవేట్ చెక్‌పోస్టు

మామూలుగా రోడ్లపై ప్రభుత్వం చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం చూశాం. అయితే తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం నల్లాయగారిపాళెం గ్రామ సమీపంలోని రహదారి వద్ద కూటమి నేతలు 'మా ప్రభుత్వం.. మా ఇష్టం..'అంటూ ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. రోడ్డుపై డ్రమ్ములు అడ్డంగా పెట్టి.. వాహనాల రాకపోకలను అడ్డుకుంటున్నారు. సిలికా లీజుదారులు, గనులు, యార్డులు పొందిన వారిని గుప్పెట్లో పెట్టుకోవడానికి ఇలా వ్యూహం పన్నారు. ప్రధానంగా 'సిలికా'రవాణాదారుల నుంచి మామూళ్లు దండుకునేందుకేనని స్పష్టమవుతోంది. సిలికా తరలింపునకు పర్మిట్లు ఉన్న వారు సైతం ఇక్కడ 'ఓకే'చేసుకుని వెళ్లాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఈ విషయమై చెక్ పోస్టు వద్ద ఉన్న వారిని వివరణ కోరితే 'ప్రస్తుతం డీలర్ల వద్ద నుంచి వెళుతున్న సిలికా వాహనాల పర్మిట్లను తనిఖీ చేసి పంపుతున్నాం. త్వరలో సిలికా గనులు ప్రారంభమైతే రవాణాదారుల వాహనాలు కూడా తనిఖీ చేస్తాం'అని చెప్పడం విశేషం. – చిల్లకూరు

నేటి నుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు

సాక్షి, అమరావతి: ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమవుతాయి. ప్రాథమికంగా మూడు వారాల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. 25న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి చర్చిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 26, 27వ తేదీల్లో సభకు సెలవు ఇవ్వనున్నారు. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసన సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత సభను వాయిదా వేసే అవకాశం ఉంది. మార్చి 1, 2వ తేదీలు సెలవు రోజులు కావడంతో తిరిగి 3వ తేదీన సభ ప్రారంభం కానుంది.

మద్యంలో మరిన్ని బ్రాండ్లు

▶ మొదటి పేజీ తరువాయి

సరఫరా చేస్తున్న కంపెనీలు ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే కొత్త కంపెనీలు మాత్రం దరఖాస్తుతో పాటు ఇతర రాష్ట్రాల్లో లేదంటే మరే ప్రాంతంలోనైనా మద్యాన్ని సరఫరా చేసే క్రమంలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సరఫరా జరుపుతున్నట్లు నిర్ధారించే పత్రాలను జత చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త బ్రాండ్ల సరఫరా కోసం వచ్చే దరఖాస్తులను పది రోజుల పాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని, ఈ దరఖాస్తులపై వచ్చే అభ్యంతరాలను విచారించిన అనంతరం టీజీబీసీఎల్‌కు మద్యం సరఫరా చేసే అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. కొత్త బ్రాండ్లకు అనుమతినివ్వాలని సీఎం రేవంత్ సమక్షంలో ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తాజా నిర్ణయంతో.. గతంలో మద్యం సరఫరాకు అనుమతులిచ్చి ఆరోపణల నేపథ్యంలో వెనక్కు తీసుకున్న డిస్టిలరీలు కూడా ఈసారి కొత్త బ్రాండ్ల పేరుతో మళ్లీ తెలంగాణ మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశం లభించింది.

భూగోళంపై భానుడి భగభగలు..!




గ్లోబల్ వార్మింగ్ హెచ్చరికలు జారీ చేసిన 2024 సంవత్సరం

1.5 డిగ్రీలు అధికంగా సగటు భూ ఉపరితల ఉష్ణోగ్రతలు నమోదు

- చరిత్రలో తొలిసారి అని ప్రకటించిన 'సీ3ఎస్'
- గ్లోబల్ వార్మింగ్‌కు సమీపిస్తున్నామని హెచ్చరిక
- ఈ ఏడాది కూడా ఎండ ప్రచండమే..
- కర్బన ఉద్గారాలే ప్రధాన కారణమని స్పష్టీకరణ

సాక్షి, విశాఖపట్నం: భానుడి ప్రకోపానికి భూగోళం భగభగమండుతోంది. పెరుగుతున్న కాలుష్యం మానవాళిని ముప్పు ముంగిటకు నెట్టేస్తోంది. ఈ ఏడాది కూడా భానుడి భగభగలు తప్పవని ప్రపంచ ఉష్ణోగ్రతల డేటా ప్రొవైడర్ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ (సీ3ఎస్) వెల్లడించింది. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. భూతాపం భారీగా పెరిగిందని ప్రకటించింది. అదేవిధంగా 2050 నాటికి ప్రీ ఇండస్ట్రియల్ లెవల్ ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు చేరుకునే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇప్పటికైనా మేలుకొని కర్బన ఉద్గారాలు నియంత్రణకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా అడుగులు వెయ్యకపోతే ఉష్ణతాపాన్ని తట్టుకోవడం కష్టమని సీ3ఎస్ హెచ్చరించింది. 1850వ సంవత్సరం నుంచి ఉష్ణోగ్రతల గణాంకాలు తీసుకుంటే... 2024 అతి దుర్భరమైన సంవత్సరంగా ప్రకటించింది.



సీ3ఎస్ ఏం చెప్పిందంటే..

- 1850 నుంచి భూ ఉపరితల ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు పొందింది.
- సీ3ఎస్ పరిశోధనల ప్రకారం ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 15.10 డిగ్రీల సెల్సియస్.
- 1991–2020 మధ్య సగటు కంటే 0.72 డిగ్రీల సెల్సియస్ కాగా, అది 2024లో 1.5 డిగ్రీలు అధికంగా నమోదైంది.
- గత 10 సంవత్సరాల ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకుంటే 2024 అత్యంత గరిష్ఠ ఉష్ణోగ్రతల సంవత్సరం.
- 2024 జూలై 24న రోజువారీ ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 17.16 డిగ్రీలు నమోదైంది. ఇదే ఇప్పటి వరకు చరిత్రలో అత్యంత ఉష్ణతాపం రోజుగా సీ3ఎస్ ప్రకటించింది.
- 2024లో వాతావరణంలో నీటి ఆవిరి మొత్తం కూడా రికార్డు స్థాయికి చేరుకుంది. 1991–2020 సగటు కంటే దాదాపు 5శాతం ఎక్కువగా వ్యాపించింది.

సముద్రాలు సైతం వేడెక్కుతున్నాయ్!

కేవలం భూతాపమే కాదు... సముద్రాలు సైతం వేడెక్కుతున్నాయని సీ3ఎస్ హెచ్చరించింది. అంటార్కిటికా, ఆస్ట్రేలియా మినహా అన్ని ఖండాంతర ప్రాంతాలు, సముద్రంలోని గణనీయమైన భాగాలు, ముఖ్యంగా ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం, హిందూ మహాసముద్రం, పశ్చిమ పసిఫిక్ మహాసముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు కూడా 2024లో రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. 2024లో ధ్రువ సముద్రంపై వార్షిక సగటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత(ఎస్ఎస్‌టీ) రికార్డు స్థాయిలో 20.87 డిగ్రీలకు చేరుకుంది. ఇది 1991–2020 సగటు కంటే 0.51 డిగ్రీలు ఎక్కువగా ఉండటం గమనార్హం.

2025 మరో వేడి సంవత్సరం కాబోతోందా.?

ఈ ఏడాది కూడా 2024 మాదిరిగానే భానుడి భగభగలతో మండిపోయే సూచనలు ఆదిలోనే స్పష్టంగా కనిపించాయని సీ3ఎస్ వెల్లడించింది. జనవరి నెలాఖరు నుంచే వేసవిని తలపించేలా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 4 డిగ్రీలు గరిష్ఠంగా నమోదవుతుండటమే ఇందుకు సంకేతమని వెల్లడించింది. గత ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్యలో సాధారణం కంటే 0.37 డిగ్రీలు పెరగగా.. ఈ ఏడాది జనవరిలోనే సగటు ఉష్ణోగ్రత 0.94 డిగ్రీలు పెరగడం అసాధారణ హెచ్చరికగా పరిశోధకులు భావిస్తున్నారు. 2015–24 మధ్య కాలంలో సాధారణం కంటే 0.3 డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగి అత్యంత వేడి దశాబ్దంగా నమోదైందని.. ఉష్ణోగ్రత సగటు ఒక్కో డిగ్రీ పెరిగే కొద్దీ.. వడదెబ్బ మరణాల సంఖ్య 5 శాతం పెరిగే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

ఎందుకిలా జరుగుతోంది?

శీతోష్ణస్థితి మార్పులు భయపెడుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి ప్రపంచ వ్యాప్త ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. దీనికి కారణం మానవ తప్పిదాలేనన్నది స్పష్టమవుతోంది. పెరుగుతున్న కాలుష్యం కారణంగా వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్... మొదలైన వాయువుల కారణంగా గ్లోబల్ వార్మింగ్ ప్రమాదం ముంచుకొస్తోంది. గత ఏడాది భూమి వేడెక్కడానికి కారణమైన సీవో2 వంటి వాయు ఉద్గారాలు ఇప్పటికీ వాతావరణంలో రికార్డు స్థాయిలోనే ఉన్నాయని సీ3ఎస్ వెల్లడించింది. కర్బన ఉద్గారాలు అధికంగా విడుదల చేస్తున్న దేశాల జాబితాలో 29.18 శాతంతో చైనా అగ్రస్థానంలో ఉండగా.. అమెరికా (14.02 శాతం), భారత్ (7.09శాతం), రష్యా (4.65శాతం) ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. వాతావరణంలోని గ్రీన్‌హౌస్ వాయువుల సాంద్రతలే మన వాతావరణాన్ని ప్రభావితం చేసే అతిపెద్ద అంశమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భవిష్యత్తు వాతావరణం మనచేతుల్లోనే ఉంది



భూ ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో వేడెక్కడం చూస్తే వాతావరణం.. మానవాళికి తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లే. వాతావరణ మార్పుల కారణంగా సంభవించే వేడిగాలులు, సముద్ర మట్టాల పెరుగుదల, వన్యప్రాణులు అంతరించిపోవడం వంటి ప్రమాదాలు చాలా తీవ్రమయ్యే రోజులు ముందున్నాయి. మనం ఇప్పుడు దానికి అత్యంత చేరువలో ఉన్నాం. గాల్లో సీవో2, మీథేన్, సల్ఫర్ మోనాక్సైడ్ వాతావరణ సాంద్రతలు పెరుగుతూనే ఉన్నాయి. ఒక పాయింట్ సీవో2 దాదాపు 100 ఏళ్ల వరకు గాల్లో ఉంటుంది. మీథేన్ 400 ఏళ్లు ఉంటుంది. కాబట్టి.. వీటిని నియంత్రించాల్సిన బాధ్యత అందరిది. 2024లో ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన తుఫానులు, వరదలతోపాటు వడగాడ్పులు, కరువు, కార్చిచ్చు ఘటనలు సంభవించాయి. భూతాపం పెరిగే కొద్దీ ఈ తరహా ప్రమాద ఘంటికలు మోగుతూనే ఉంటాయి. కాబట్టి కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించగలిగితే భూమి వేడెక్కడాన్ని తగ్గించగలం. ఇదే మన ముందున్న అతి పెద్ద సవాల్. చెట్ల కంటే.. సముద్రాలే అసలైన వాతావరణ పరిరక్షకులు. అందులో ఉండే మొక్కలు ఆక్సిజన్‌ని ఎక్కువగా అందిస్తున్నాయి. అందుకే సముద్రాలను సంరక్షించుకోవాలి.

– ప్రొఫెసర్ ఓఎస్ఆర్ భానుకుమార్, వాతావరణశాస్త్ర నిపుణుడు

మా జీవితాలతో చెలగాటం

బాబు సర్కార్ నిర్లక్ష్యం దారుణం

- దుమ్మెత్తిపోస్తున్న గ్రూప్ –2 మెయిన్స్ అభ్యర్థులు
- తీవ్ర గందరగోళం మధ్య గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష
- ఈ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని అభ్యర్థుల ఆగ్రహం

సాక్షి, అమరావతి: అర్ధరాత్రి వరకు ఆందోళనలు.. అడ్డగింతలు.. అరెస్టులు.. తరలింపులు.. తీవ్ర ఉత్కంఠ మధ్య ఏపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష నిర్వహించి తమ జీవితాలతో ఆడుకుందని ఏపీ వ్యాప్తంగా అభ్యర్థులు మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు తమను నమ్మించి నిండా ముంచారని, తమ జీవితాలతో చెలగాటం ఆడారని నిప్పులు చెరిగారు. ప్రభుత్వ తీరుతో తీవ్ర మనస్థాపానికి గురయ్యామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఇంత గందరగోళం సృష్టించిందని, ఇంత టెన్షన్ ఎప్పుడూ పడలేదని ధ్వజమెత్తారు. రోస్టర్ విధానంలో తప్పులున్నాయని తొలుత చెప్పిందే టీడీపీ అని, అలాంటప్పుడు అది సరిచేయకుండా ఎలా పరీక్ష నిర్వహిస్తారని నిలదీశారు. పరీక్ష వాయిదా వేయడం వల్ల ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరి వల్లే తమ సమయం వృథా అయిందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే దోబూచులాట మధ్య పరీక్ష నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పరీక్ష ఉండగా, శుక్రవారం రాత్రి వాయిదాకు అనుకూలంగా మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ ట్వీట్ చేసి ఆశలు రేపారని.. ఇప్పుడింత గందరగోళం జరుగుతుంటే ఆయన మాత్రం ఫ్యామిలీతో కలిసి దుబాయ్‌లో ఇండియా–పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ చూస్తూ కూర్చున్నారని విరుచుకుపడ్డారు. తమను ఇంత దగా చేసిన కూటమి సర్కారును ఊరికే వదిలి పెట్టం అని.. 'బాయ్‌కాట్ ఎమ్మెల్సీ ఎలక్షన్'కాదు.. 'ఎన్నికల్లో పాల్గొందాం.. కూటమికి గట్టిగా బుద్ధి చెబుదాం'నినాదంతో తమ సత్తా చాటుతామని శపథం చేశారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను ఏ విధంగా ముంచిందో కళ్లారా చూశామని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము కూడా తమ శక్తి ఏపాటిదో చూపిస్తామని లక్షలాది మంది గ్రాడ్యుయేట్స్ స్పష్టం చేస్తున్నారు. ఇంతటి గందరగోళం సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గమని కోపంతో రగిలిపోయారు.



ఆదివారం విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన గ్రూప్–2 అభ్యర్థులు

పచ్చి దగా.. దుర్మార్గం

'పరీక్ష వాయిదా పడుతుందని సాక్షాత్తు విద్యా శాఖ మంత్రి ట్వీట్ చేసినప్పుడు నమ్మకుండా ఎలా ఉంటాం? పరీక్షపై సమీక్షిస్తున్నాం అంటూ ప్రభుత్వం గందరగోళం సృష్టించింది. శనివారం అర్ధరాత్రి అయోమయమే. ఎటూ పాలుపోని పరిస్థితి. టెన్షన్‌తో రాత్రంతా నిద్రపోలేదు. ఈ గంగరగోళం లేకుండా ఉండింటే పరీక్ష ఇంకా బాగా రాసి ఉండేదాన్ని'అని తిరుపతికి చెందిన సౌజన్య ఆవేదన వ్యక్తం చేసింది. 'రోస్టర్ విధానంలో తప్పులున్నాయని ప్రభుత్వంలోని పెద్దలు చెప్పినా, దీన్ని సవరించకుండా పరీక్ష నిర్వహించడమేంటి? రేపు న్యాయపరమైన చిక్కులతో పరీక్ష రద్దయితే.. మా కష్టమంతా వృథానే కదా? ఇంత గందరగోళం మధ్య పరీక్ష నిర్వహించడం దుర్మార్గం కాదా?'అని అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన హరి ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌ల ప్రకటనల వల్ల పరీక్ష వాయిదా పడుతుందని భావించాను. చివరి నిమిషం వరకు స్పష్టత లేకపోవడంతో తీవ్రంగా ఆందోళన చెందాను. పరీక్షకు బాగా ప్రిపేర్ అయినప్పటికీ తీవ్రంగా కలత చెందాను. పరీక్షను సరిగా రాయలేకపోయాను. ఇది చంద్రబాబు మార్కు రాజకీయం'అంటూ విజయవాడకు చెందిన కె.కాంతారావు మండిపడ్డాడు.

అంతా టెన్షన్.. టెన్షన్..

- పరీక్షకు కొన్ని గంటల ముందు వరకు అభ్యర్థుల భవితవ్యంతో ప్రభుత్వం ఆటలాడింది. పరీక్ష వాయిదా పడుతుందని మంత్రి లోకేశ్‌తో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సైతం ఓ వైపు ప్రకటించడం.. మరోవైపు ఎట్టిపరిస్థితుల్లోను పరీక్ష కొనసాగుతుందని ఏపీపీఎస్సీ స్పష్టం చేయడం.. వెరసి అసలు పరీక్ష ఉంటుదా.. లేదా? అన్న సందిగ్ధంలో అభ్యర్థులు ఉండిపోయారు. ఈ క్రమంలో పరీక్ష వాయిదా పడుతుందని ప్రకటించిన ప్రభుత్వాన్ని పూర్తిగా నమ్మిన అభ్యర్థులు తమకు కేటాయించిన సెంటర్లున్న ప్రాంతాలకు వెళ్లకుండా నిలువునా మోసపోయారు. రెండు వ్యవస్థల విరుద్ధ ప్రకటనలతో మీ మాంసలో మరికొందరు పరీక్ష ఉంటుందో ఉండదో తెలిక చాలా మంది సమయానికి సెంటర్లకు చేరుకోలేకపోయారు. దీంతో చాలా మంది అభ్యర్థులు నష్టపోయారు.
- గ్రూప్–2 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని శనివారం అర్ధరాత్రి వరకు అభ్యర్థులు ఆందోళన చేశారు. తాము కూడా వాయిదా వేయమని సర్వీస్ కమిషన్‌ను కోరామని సాక్షాత్తూ ముఖ్యమంత్రి ప్రకటించడం, కానీ చైర్మన్ అంగీకరించలేదని ఆరోపణలు చేయడం వంటి నాటకీయ పరిణామాల మధ్య ఆదివారం పరీక్ష నిర్వహించారు.

బాబు మోసాలకు.. గ్రూప్స్ పరీక్షలే రుజువు

'ఎక్స్' వేదికగా చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు నాయుడు అందరినీ ఏ విధంగా మోసం చేస్తారో చెప్పేందుకు గ్రూప్ 2 పరీక్షల అభ్యర్థుల పరిస్థితే ప్రత్యక్ష నిదర్శనం. మూడు వారాలుగా వారి అభ్యంతరాలు వింటున్నట్లుగా నటించి.. సమస్యను పరిష్కరిస్తానని నమ్మబలికి చివరకు నట్టేట ముంచాడు. విద్యార్థులను లాఠీలతో కొట్టించడమే కాకుండా ఆఖరికి తీవ్ర అయోమయం, గందరగోళం, అస్పష్టత మధ్యే పరీక్షలు పెట్టడం అత్యంత దారుణమని చంద్రబాబు సర్కారు మోసాలపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు కురిపించారు. అధికారం చేపట్టినప్పటి నుంచి చంద్రబాబు అన్ని వర్గాలను ఏ విధంగా మోసం చేస్తున్నారో అంశాల వారీగా వివరిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా కడిగి పారేశారు. మోసాలకు, అన్యాయలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన చందబాబుపై ప్రజలు ఆగ్రహంతో పోరాటాలు చేస్తున్నారని, వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ప్రకటించారు. 'చంద్రబాబు నాయుడు నిరుద్యోగులను, ఉద్యోగులనే కాదు.. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేయడమే అలవాటుగా మార్చుకున్నారు. ఇప్పుడు గ్రూప్–2 అభ్యర్థులను కూడా నిలువునా మోసం చేశారు. మూడు వారాలుగా గ్రూప్–2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటున్నట్లు నటించి, వాటిని పరిగణలోకి తీసుకుని తగిన న్యాయం చేస్తున్నట్లు నమ్మబలికి, చివరకు వారిని నట్టేట ముంచారు. అభ్యర్థుల నుంచి అందిన విజ్ఞాపనలను వింటున్నానని, తప్పకుండా పరిష్కారం చూపిస్తానని పరీక్షలకు రెండు రోజుల ముందు విద్యాశాఖ మంత్రి, మీ కుమారుడు మోసపూరిత ప్రకటన చేశారు. మరోవైపు తాను చెప్పినా సరే, ప్రభుత్వం నుంచి లేఖ ఇచ్చినా సరే పట్టించుకోకుండా ఏపీపీఎస్సీ ముందుకు వెళ్తోందని సాక్షాత్తూ ముఖ్యమంత్రిగా ఉన్న మీ వాయిస్‌తో ఆడియోను లీక్ చేసి మరో డ్రామా చేశారు. ఇంకో వైపు ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులతో లాఠీ ఛార్జీ చేయించి అమానుషంగా ప్రవర్తించారు. మీరు ప్రజలను ఎలా మోసం చేస్తారో చెప్పడానికి ఇది మరొక ఉదాహరణ మాత్రమే. ఆఖరికి అయోమయం, గందరగోళం, అస్పష్టత మధ్యే పరీక్షలు పెట్టడం అత్యంత దారుణం. మా ప్రభుత్వంలో ఇచ్చిన డీఎస్సీని రద్దు చేసి.. మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా కాలయాపన చేయడం ఒక మోసమే. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి అసలు దాని గురించి పట్టించుకోకపోవడం కూడా మీరు చేసిన మోసమే. మోసాలు, అన్యాయాలకు కేరాఫ్‌గా మారిన చంద్రబాబూ.. మీ వైఖరిపై ప్రజలు ఇప్పటికే ఆగ్రహంతో పోరాటాలు చేస్తున్నారు. ప్రజా పోరాటాలకు మా పార్టీ ఎప్పుడూ తోడుగా నిలుస్తుంది'అని వైఎస్ జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.



భట్టికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న టీఈఏఈఏ నేతలు

విద్యుత్ డిమాండ్‌ను బట్టి ఉద్యోగాల భర్తీ

- త్వరలోనే పదోన్నతుల ఉత్తర్వులు
- టీఈఏఈఏ సమావేశంలో భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌శాఖలో జాబ్ రిక్రూట్‌మెంట్ కేలండర్‌ను అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. అదే విధంగా పదోన్నతులకు సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం ప్రజాభవన్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఈఏఈఏ) నేతలు భట్టిని కలిశారు. రామగుండంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్త విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జెన్‌కో పరిధిలో 2024, అక్టోబర్‌లో ఏఈలు నుంచి ఏడీఈలుగా పదోన్నతులు పొందిన వారికి పోస్టింగులు ఇవ్వాలని, ట్రాన్స్‌కో, డిస్కం కంపెనీలలో పదోన్నతులు అమలు చేయాలని వారు భట్టికి విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్ల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన భట్టి పదోన్నతుల ఉత్తర్వులు త్వరలోనే ఇస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సంస్థల్లో ఉద్యోగం సేవాభావంతో కూడినదని, రాష్ట్ర ప్రజలకు అవసరమైన విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పనిచేయాలని కోరారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో టీఈఏఈఏ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బట్టు హరీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ ఇమ్రాన్ తదితరులున్నారు.

సత్వర పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

విద్యుదుత్పత్తి కేంద్రాల్లో సాంకేతిక ఇబ్బందుల నివృత్తికి ఏర్పాటు

- కమిటీలో జెన్‌కో డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్‌తోపాటు మరో అధికారి
- బీటీపీఎల్ పనులు పూర్తి చేయండి: భట్టి

సాక్షి, హైదరాబాద్: జెన్‌కో పరిధిలోని విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఏర్పడే సాంకేతిక సమస్యలను వెంటనే నివృత్తి చేసేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఇందులో జెన్‌కో డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్‌తోపాటు మరో అధికారి ఉంటారని తెలిపారు. నిర్ణీత గడువులోగా ఈ కమిటీ సదరు సమస్యలను సమీక్షించి తగిన నివేదికను బోర్డుకు సమర్పిస్తుందని, బోర్డు అనుమతితో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి చేస్తుందన్నారు సకాలంలో సరైన నిర్ణయం తీసుకొని ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవడం ద్వారా విద్యుత్ సంస్థలు నష్టపోకుండా ఈ కమిటీ పనిచేస్తుందని చెప్పారు. భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎల్) పనుల పురోగతిపై జెన్‌కో అధికారులతో ఆదివారం ఆయన ప్రజాభవన్‌లో సమీక్షించారు. విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, జెన్‌కో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, లక్ష్మయ్య, చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాస్‌రావు, రత్నాకర్‌రావు, పీవీ.శ్రీనివాస్, జీవాకుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా బీటీపీఎల్ పనుల పురోగతిపై అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బీహెచ్‌ఈఎల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పూర్తి చేయాల్సిన ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయించాలని సూచించారు.

నాణ్యత విషయంలో రాజీ వద్దు

యూనిట్–1లో ఉత్పత్తికి సంబంధించి కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల గురించి అధికారులను డిప్యూటీ సీఎం ఆరా తీయగా, విద్యుదుత్పత్తికి ఆటంకం కలగకుండా ఉండేందుకుగాను మరో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొనుగోలు చేస్తున్నామని, ఇందుకోసం టెండర్లు పిలిచామని అధికారులు వివరించారు. జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు అవసరమైన అదనపు పరికరాలను కూడా అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సూచించారు. వర్షాకాలంలో బొగ్గు నిల్వ చేయడానికి అవసరమైన షెడ్ నిర్మాణం, సింగరేణి నుంచి భద్రాద్రి ప్లాంట్ వరకు బొగ్గు రవాణా కోసం ఏర్పాటు చేస్తున్న రైల్వే లైన్, సిబ్బందికి వసతి గృహ నిర్మాణ పనుల గురించి కూడా డిప్యూటీ సీఎం ఆరా తీశారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, అన్ని ప్రమాణాలు పాటించేవిధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రైల్వేలైన్ నిర్మాణం కోసం భూసేకరణ జరుగుతోందని అధికారులు వివరించగా, ఈ రైల్వే లైన్ పనులను సమీక్షించేందుకు ప్రతివారం సమావేశం కావాలని అధికారులు ఆదేశించారు. బీటీపీఎల్‌లో జరిగే ఎలాంటి ఘటనకైనా చీఫ్ ఇంజనీర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని, ప్రతి విషయాన్ని తనతోపాటు సీఎండీ దృష్టికి తీసుకురావాలని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని చెప్పారు. పవర్ ప్లాంట్‌లో పనిచేసే అన్‌స్కిల్డ్ కార్మికుల విషయంలో ఐటీడీఏ ప్రాజెక్టును సంప్రదించి స్థానిక గిరిజనులను తీసుకోవాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో స్థానిక గిరిజన యువత కోసం బూడిదతో ఇటుకలు తయారుచేసే యూనిట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా గిరిజన యువతకు ఉపాధి కలుగుతుందని చెప్పిన భట్టి... బీటీపీఎల్‌లో త్రీడీ వాక్‌వే మోడల్ తయారు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు.

చదరపు అడుగు రూ.10,042

ఏపీ రాజధానిలో జీ+1 పద్ధతిలో మంత్రులు, న్యాయమూర్తులకు 71 బంగ్లాల నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్

- ఈ స్థాయిలో వ్యయాన్ని నిర్ణయించడంపై బిల్డర్లు, ఇంజనీర్లలో తీవ్ర విస్మయం

సాక్షి, అమరావతి: అప్పు చేసి పప్పు కూడు తిన కూడదంటారు పెద్దలు! కానీ.. ఏపీలో కూటమి ప్రభుత్వ ముఖ్యనేతలు మాత్రం తద్భిన్నం. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి తెచ్చిన అప్పులు.. హడ్కో లాంటి జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి తేనున్న రుణాలతో చేపట్టే పనుల అంచనా వ్య యాన్ని కాంట్రాక్టర్లతో కుమ్మక్కై భారీ ఎత్తున పెంచేసి దోచుకోవడానికి ప్రణాళిక రచించారు. ఏపీ రాజధానిలో మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తుల కోసం జీ+1 పద్ధతిలో 71 బంగ్లాల నిర్మాణానికి సీఆర్‌డీఏ(రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ) జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్ దీనికి మరో తార్కాణం.

ఏపీ రాజధాని ప్రాంతంలో 26.09 ఎకరాల్లో ఒక్కొక్కటి 6,600 చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో మంత్రుల కోసం జీ+1 పద్ధతిలో 35 బంగ్లాలు నిర్మిస్తున్నారు. మరో 24.13 ఎకరాల్లో ఒకొక్కటి 6,745 చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో హైకోర్టు న్యాయమూర్తుల కోసం జీ+1 పద్ధతిలో 36 బంగ్లాల నిర్మాణాన్ని చేపట్టారు. వీటికోసం మొత్తం రూ.401,37,22,221 కాంట్రాక్టు విలువతో సీఆర్‌డీఏ కమిషనర్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. 71 బంగ్లాలలో మొత్తం నిర్మిత ప్రాంతం 4,75,920 చదరపు అడుగులు అని టెండర్‌లో పేర్కొన్నారు. కానీ.. టెండర్‌లో పేర్కొన్న ఒక్కో బంగ్లా నిర్మిత ప్రాంతాన్ని బట్టి చూస్తే.. మొత్తం నిర్మిత ప్రాంతం 4,73,820 చదరపు అడుగులే. అంటే.. నిర్మిత ప్రాంతాన్ని 2,100 చదరపు అడుగులు పెంచినట్లు స్పష్టమవుతోంది. ఇక సీనరేజీ, జీఎస్టీ



తదితర పన్నుల రూపంలో రూ.76.59 కోట్లను రీయింబర్స్ చేస్తామని సీఆర్‌డీఏ పేర్కొంది. దీన్ని బట్టి చూస్తే 71 బంగ్లాల నిర్మాణ వ్యయం రూ.477.96 కోట్లు కానుంది. అంటే.. మౌలిక సదుపాయాలతో కలిపి సగటున చదరపు అడుగు నిర్మాణ వ్యయం రూ.10,042.86 అవుతుండగా.. ఒక్కో బంగ్లా నిర్మాణ వ్యయం ఏకంగా రూ.6.73 కోట్లుగా ఉంది. రాజధాని ప్రాంతంలో రహదారులు, ముంపు ముప్పు నివారణ పనుల నుంచి ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల వరకూ అంచనా వ్యయాన్ని వాస్తవ ధరల కంటే రెండింతలు పెంచేసి సీఆర్‌డీఏ టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తూ వస్తుండటంపై ఇంజనీర్లు, బిల్డర్లు, రియల్టర్లు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంచనా వ్యయాన్ని భారీగా పెంచేయడాన్ని బట్టి చూస్తుంటే... ముఖ్యనేతలు అడిగినంత కమీషన్ చెల్లించే కాంట్రాక్టర్‌కు పనులు కట్టబెట్టేందుకేనని స్పష్టమవుతోందని బిల్డర్లు పేర్కొంటున్నారు. కాంట్రాక్టు విలువలో పది శాతం మొబిలైజేషన్ అడ్వాన్సుగా ముట్టజెప్పి.. అందులో తిరిగి ఎనిమిది శాతం కమీషన్‌గా వసూలు చేసుకుని.. నీకింత నాకింత అనే ధోరణిలో పంచుకుతింటున్నారని చెబుతున్నారు.

సన్నిధి
సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 24-2-2025



● సాంకేతిక నైపుణ్యం.. శిల్పకళా వైభవం కలగలిసిన అద్భుత కట్టడం
● భక్తుల స్వహస్తాలతో అభిషేకించే బ్రహ్మసూత్ర లింగం ● వెయ్యేళ్ల కిందటి నిర్మాణం

శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబవుతున్న

శ్రీ ఛాయా సోమేశ్వరాలయం

చుట్టూ పచ్చని పంట పొలాల మధ్య ఓం నమఃశివాయ స్మరణతో మారుమోగే అద్భుత దేవాలయమే శ్రీ ఛాయా సోమేశ్వరాలయం. సోమవారం వచ్చిందంటే భక్తులతో కిటకిటలాడే ఈ ఆలయం అద్భుత నిర్మాణ శైలికి నిలయం. ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న నల్లగొండ పట్టణానికి సమీపంలోని పానగల్ వద్ద ఉన్న ఛాయా సోమేశ్వరా లయం శివరాత్రి సందర్భంగా మహోత్సవాలకు సిద్ధం అవుతోంది.





ఎక్కడైనా సూర్యకాంతి, విద్యుత్తు దీపాల వెలుతురులో ఏర్పడే ఛాయ (నీడ) గమనాన్ని బట్టి మారడం సహజం. కానీ ఇక్కడ శివలింగంపై పడే ఛాయ సూర్యుని గమనంతో సంబంధం లేకుండా స్తంభాకారంలో నిశ్చలంగా ఉండటం విశేషం. సూర్యరశ్మితో సంబంధం లేకుండా, వర్షం పడినా, ఆకాశం మేఘావృతమైనా ఆ నీడ ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నివేళలా ఒకేలా ఉంటుంది. అందుకే ఇది ఛాయా సోమేశ్వరాలయంగా ప్రసిద్ధి పొందింది. రాజసం ఉట్టిపడే అద్భుత శిల్ప కళాసంపద, కాకతీయుల నాటి శిల్ప కళారీతులు శ్రీఛాయాసోమేశ్వర స్వామి సొంతం. ఈ ఆలయంలోని ఎంతో విశేషమైన బ్రహ్మసూత్ర లింగాన్ని భక్తులే స్వయంగా అభిషేకించడం మరోప్రత్యేకత. ఆ శివ లింగాన్ని ఒక్కసారి తాకితే వేయి లింగాలను దర్శించిన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

వెయ్యేళ్ల కిందటి అద్భుత కట్టడం...

భారతీయ వాస్తు, శిల్పకళా చాతుర్యంలో సాంకేతిక విజ్ఞానాన్ని మిళితం చేసి ఆలనాటి కుందూరు చోళులు ఈ దేవాలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. పానగల్‌ను రాజధానిగా చేసుకొని పాలించిన కాకతీయుల సామంతరాజులైన కుందూరు చాళుక్య రాజు ఉదయ భానుడు ఈ ఆలయాన్ని 11వ శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. తమ ఆరాధ్యదైవమైన పరమేశ్వరునికి నిర్మించిన ఆలయాల్లో దీంతో పాటు సమీపంలోనే పచ్చల సోమేశ్వరాలయం కూడా నిర్మించారు. శివ లింగం చుట్టూ పచ్చని వజ్రాలను పొదగడంతో ఆలయం అంతా పచ్చని వెలుతురు వెదజల్లేదని చెబుతారు.

ప్రతి సోమవారం, పర్వదినాల్లో ప్రత్యేక పూజలు

ఆలయంలో ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పూజలు కొనసాగుతాయి. ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారు. తొలి ఏకాదశితో పాటు నిత్యాభిషేకాలు, కార్తీక పౌర్ణమి, దసరా, మహాశివరాత్రి, ఉగాది వంటి పర్వదినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆరుద్ర నక్షత్రం, అమావాస్య రోజుల్లోనూ విశేషంగా భక్తులు వస్తారు. మహాశివరాత్రి సందర్భంగా యజ్ఞాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, శివ పార్వతీ కళ్యాణం, అగ్నిగుండాలు, తెప్పోత్సవాలను నిర్వహిస్తారు.

మూడు గర్భాలయాలు...

చతురస్రాకారంలో ఉండే ఈ ఆలయంలో మూడు గర్భగుడులు ఉంటాయి. అందుకే దీనిని త్రికూటాలయంగా పేర్కొంటారు. మరోవైపు ఉపాలయాలు ఇక్కడ ఉన్నాయి.

స్తంభాలపై రామాయణ, మహాభారతాలు...

గుడి ఆవరణ మొత్తం 18 స్తంభాలతో ఉంటుంది. అందులో పడమరన ఉన్న సోమేశ్వరుడి ఆలయం ముందు 8 స్తంభాలు ఉంటాయి. వాటిల్లో ఏ స్తంభం నీడ శివలింగంపై పడుతుందన్నది ఇక్కడి రహస్యం. మరోవైపు ఆయా స్తంభాలపై రామాయణ, మహాభారతాలు విగ్రహ రూపంలో ఉండటం విశేషం. నాలుగు స్తంభాలపై ఉండే మండపం పైభాగంలో అష్టదిక్పాలకులు, మూడు గర్భ గుడుల ముందు గజలక్ష్మి కొలువై ఉంటుంది. అయితే సూర్యభగవానుడి భార్య ఛాయాదేవి పరమ శివుని ప్రార్థించి శివుని వరంతో ఛాయగా ఉన్నట్లు భావిస్తారు.

– చింతకింది గణేశ్, సాక్షి ప్రతినిధి, నల్లగొండ



ఉదయ సముద్రం నీరే కోనేరులోకి

పక్కనే ఉన్న ఉదయ సముద్రం చెరువులోని నీరే కోనేరులోకి రావడం ఇక్కడ విశేషం. దానికి ప్రత్యేకంగా పాయ అంటూ లేకపోయినా నీరు కోనేరులోకి రావడం ప్రత్యేకత. ఇప్పటికీ నీటి తడి (చెమ్మ) శివలింగం ఉన్న గర్భగుడిలో ఉంటుంది.

– ప్రధాన అర్చకుడు ఉదయ్‌కుమార్

మన గుడి... మన ఉత్సవం

● రాష్ట్రంలోనే పేరుగాంచిన కురవి వీరభద్రుడు
● ఆదిశైవ ఆచారం ప్రకారం పూజలు
● పార్లుదండాలు, ప్రాణాచారం (పానసారం) వరాలు
● భద్రకాళికి బోనం చేస్తే గండాలు తొలగుతాయి
● గిరిజన, గిరిజనేతరుల దేవుడుగా వీరన్న

వీరభద్రా... శరణు





గిరిజనులు, గిరజనేతరులు ఉమ్మడిగా కొలిచే దేవుడు కురవి వీరభద్రుడు. వీరన్నా అని శరణు కోరితే కోరికలు నెరవేరతాయని, గండాలు తొలగుతాయని, భూతపిశాచాలు వదులుతాయనీ విశ్వాసం.. ఇక్కడ పూజలు, భక్తుల మొక్కులు చెల్లించడం, వాటిని నెరవేర్చేందుకు చేసే పూజలు వైవిధ్యంగా ఉంటాయి. ప్రతిఏటా శివ రాత్రి నుంచి మొదలుకొని మూడు నెలలపాటు జరిగే ఈ జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచేగాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు..

శైవాగమం...

శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఆదిశైవులు శైవాగమం ప్రకారం స్వామివారికి నిత్య పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ప్రతి సోమవారం ఉదయం సంపూర్ణాభిషేక పూజలు నిర్వహిస్తారు. మిగిలిన రోజుల్లో అభిషేకాలు, అర్చనలు చేస్తుంటారు.

అన్నపూజా కార్యక్రమం...

ప్రతి దేవాలయంలో శివుడికి నైవేద్యం, పండ్లు పెడతారు. కానీ ఇక్కడ పెరుగు, అన్నం కలిపి శివలింగానికి అలంకరణ చేస్తారు. ఇలా చేస్తే వీరభద్రుని కొలిచే భక్తులకు బాగా పంటలు పండుతాయని, అన్నం లోటు లేకుండా చూస్తాడని నమ్మకం. కరువు కాటకాలు వచ్చిన సందర్భాల్లో కూడా కురవి వీరభద్రుని భక్తులు ఏనాడు ఇబ్బందులు పడలేదని, అంతావీరన్న మహిమ అంటారు భక్తులు.

భద్రకాళికి బోనం...

కోరిన కోర్కెలు తీరడంతో వీరభద్రస్వామికి ఉపవాసాలు, నియమాలతో పూజలు నిర్వహించిన భక్తులు.. స్వామివారి పూజ ముగియగానే పక్కనే ఉన్న భద్రకాళీ అమ్మవారికి బోనాలను సమర్పించుకుని నైవేద్యం పెడతారు. అలాగే ఏటపోతులు, కోళ్లను బలి ఇచ్చి మొక్కు చెల్లించుకుంటారు.

పార్లుదండాలు, పానసారం...

పిల్లలు లేనివారు సంతానప్రాప్తి కోసం స్నానం చేసి తడిదుస్తులతో ఆలయ ఆవరణలో పానసారం పట్టి స్వామివారిని వేడుకుంటారు. అలాగే పార్లుదండాలు పెట్టడం, భూత పిశాచాలు పట్టిన వారు, అనారోగ్యానికి గురైన వారు సైతం తడిబట్టలతో పానసారం పట్టి, ధ్వజస్తంభం ఎక్కించి కట్టివేస్తారు.

కోరమీసం పెడితే గౌరవం...

కోరమీసం సమర్పిస్తే గౌరవం, అధికారం కల్గుతుందనేది నానుడి. అందుకోసమే రాజకీయ నాయకులు ఎన్నికల్లో పోటీచేసేటప్పుడు, ఉద్యోగ దరఖాస్తు చేసేటప్పుడు. వ్యాపారులు తమ వ్యాపార ప్రారంభించేటప్పుడు, విదేశాలకు వెళ్లేందుకు విద్యార్థులు చేసే ప్రయత్నానికి ముందు.. కురవి వీరభద్రునికి కోరమీసం సమర్పిస్తామని మొక్కుకుంటారు. కోరికలు తీరగానే బంగారం లేదా వెండితో కోరమీసాల ఆకృతి తయారు చేసి స్వామివారికి అలంకరిస్తారు.

– ఈరగాని భిక్షం
సాక్షి, మహబూబాబాద్/కురవి

కళ్యాణ బ్రహ్మోత్సవాల వివరాలు

ఫిబ్రవరి 25, మంగళవారం
ఉదయం 9-00 గంటలకు పసుపు కుంకుమలు. ఆలయ పూజారి ఇంటినుంచి పసుపు కుంకుమలు రావడంతో జాతర పనుల ఆరంభం. సా. గం. 7కు గణపతిపూజ, పుణ్యాహవచనం పంచగవ్యప్రాశన, కంకణధారణ, దీక్షాధారణ, అంకురారోపణం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణం. రాత్రి 10 గంటలకు బసవముద్ద.

26 బుధవారం మహాశివరాత్రి.
ఉదయం 4-00ల నుండి స్వామివారి దర్శనం. ఉదయం 4 గంటల నుండి సాయంత్రం 4 వరకు పూర్ణాభిషేకం, సాయంత్రం 4 నుండి శ్రీ స్వామివారు అలంకారంతో దర్శనం, పాదాభిషేకం, శివాలయంలో ఉదయం 5 నుంచి, రాత్రి 12 వరకు శ్రీ పార్వతీ రామలింగేశ్వరస్వామి వారికి అభిషేకాలు. సాయంత్రం 7కు గ్రామసేవ, ఎదురుకోలు. రాత్రి గం 12-30కు శ్రీ భద్రకాళీ వీరభద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవం.

27 గురువారం, 28 శుక్రవారం నిత్యం ఉదయం 6 గంటలకు అభిషేకాలు, నిత్యోపాసన, బలిహరణ.. సాయంత్రం 6 గంటలకు హోమం, సేవలు, గ్రామసేవ

మార్చి 1, శనివారం ఉదయం 6 నుంచి 12వరకు అభిషేకాలు సాయంత్రం 6-30 గంటలకు తెప్పోత్సవం (కురవి పెద్ద చెఱువు నందు)

3, సోమవారం ఉదయం 6 గంటలకు అభిషేకాలు, నిత్యోపాసన, బలిహరణ సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, మంగళవారం ఉదయం 10-30కు పూర్ణాహుతి, సాయంత్రం 4గంటలకు బండ్లు తిరుగుట, పారువేట. రాత్రి 10-00 గంటలకు ధ్వజ అవరోహణ, బసవముద్ద.


సాక్షి సినిమా



● ఆనంది

బ్యూటీ నేనే...

ఆనంది, వరలక్ష్మీ శరత్‌కుమార్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'శివంగి'. దేవరాజ్ భరణీ ధరణ్ దర్శకత్వంలో పి. నరేశ్‌బాబు నిర్మించిన ఈ పవర్‌ఫుల్ విమెన్ సెంట్రిక్ ఫిల్మ్ మార్చి 7న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''నా జీవితంలో జరిగిన రెండు ముఖ్యమైన విషయాలు ఇప్పుడు నన్ను వెంటాడుతున్నాయి. ఒక అమ్మాయికి ఒక్క రోజుకి ఇన్ని కష్టాలు, సత్యభామ అంటే ఏదో చందమామ కథలు చెప్పే భామ అనుకున్నావేమో... సత్యభామ రా... ఇక్కడ బ్యూటీ నేనే... బీస్టుని నేనే'' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. జాన్ విజయ్, డా. కోయ కిశోర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఏహెచ్ కాషిఫ్, ఎబినేజర్ పాల్ సంగీతం అందించారు.



● అక్షయ్ కుమార్

గ్రీన్ సిగ్నల్?

వెంకటేశ్ హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ సంక్రాంతికి విడుదలైన ఈ మూవీ రూ. 300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీని బాలీవుడ్‌లో రీమేక్ చేయాలని చిత్ర నిర్మాత 'దిల్' రాజు ప్లాన్ చేస్తున్నారని, ఈ దిశగా ఆయన ప్రయత్నాలు కూడా మొదలు పెట్టారనే టాక్ తెరపైకి వచ్చింది. ఈ హిందీ రీమేక్‌లో అక్షయ్ కుమార్ అయితే బాగుంటుందని 'దిల్' రాజు భావిస్తున్నారట. కెరీర్‌లో ఇప్పటికే ఎన్నో దక్షిణాది సినిమాల హిందీ రీమేక్స్‌లో నటించిన అక్షయ్ కుమార్ మరి... ఈ రీమేక్ చిత్రానికీ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

సైకలాజికల్ థ్రిల్లర్

అనూ ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'బూమరాంగ్'. పలు భాషలలో 34 చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా చేసిన ఆండ్రూ బాబు దర్శకత్వంలో లండన్ గణేశ్, డా. ప్రవీణ్ రెడ్డి ఊట్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సితార ఫిల్మ్స్ లిమిటెడ్ లైన్ ప్రొడక్షన్‌ని నిర్వహిస్తోంది. ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కానుంది. ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ కార్యక్రమాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శివ కందుకూరి మాట్లాడుతూ– ''విభిన్నమైన చిత్రం ఇది. ఈ సినిమాలో ఓ డార్క్ సైడ్ స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అని అన్నారు. ''ఇది మెసేజ్ ఓరియంటెడ్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్. ఈ సినిమా కథ విని ప్రవీణ్‌గారు వెంటనే ఒప్పుకున్నారు'' అని తెలిపారు ఆండ్రూ బాబు. ''కర్మ సిద్ధాంతం ఆధారంగా ఈ సినిమా తీశాం. అవుట్‌పుట్ బాగా వచ్చింది. ఈ సినిమాకి అందరి సపోర్ట్ కావాలి'' అని పేర్కొన్నారు ప్రవీణ్ రెడ్డి. ''బూమరాంగ్' మంచి థ్రిల్లర్ ఫిల్మ్'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్. ఈ కార్యక్రమంలో దర్శకుడు విజయ్‌కుమార్ కొండా, నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ అతిథులుగా పాల్గొని, మాట్లాడారు.



● శివ కందుకూరి, అనూప్ రూబెన్స్



● రావు రమేశ్, సందీప్ కిషన్

నవ్వులు గట్టిగా వినిపిస్తాయి - సందీప్ కిషన్

సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. రావు రమేశ్, అన్షు ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేష్ కేఆర్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఆదివారం ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''మజాకా' సినిమాకు థియేటర్స్‌లో నవ్వులు గట్టిగా వినిపిస్తాయి. నా కెరీర్‌లో హయ్యెస్ట్ నంబర్స్ ఈ సినిమా ఇస్తుందనే నమ్మకం ఉంది. ఫ్యామిలీతో థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా ఇది. నాకు, రావు రమేశ్‌గారికి ఈక్వెల్ స్క్రీన్ స్పేస్ ఉంది. ఆయన వల్ల కథ మరింతగా పండింది'' అన్నారు సందీప్ కిషన్. ''ఇద్దరు మగవాళ్లు మాత్రమే ఉన్న ఒక ఇంట్లో ఏ రోజుకైనా ఒక ఫ్యామిలీ ఫొటో రావాలని పడే తపనే ఈ సినిమా కథ. నా ప్రతి సినిమాలో ఉండే మ్యాజిక్ ఈ సినిమాలోనూ ఉంటుంది. ఈ సినిమా డబుల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు నక్కిన త్రినాథరావు. ''ఈ చిత్రంలో రొమాంటిక్‌గా నటించడం చాలా సవాల్‌గా అనిపించింది. కొత్తగా నవ్వించే చాన్స్ ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు రావు రమేశ్. ''కెప్టెన్ మిల్లర్, భైరవకోన, రాయన్' ఇప్పుడు 'మజాకా'... ఇలా డిఫరెంట్ సినిమాలతో అలరిస్తున్న సందీప్ కిషన్‌కు పీపుల్స్ స్టార్ అనే ట్యాగ్ యాప్ట్ అనిపించింది'' అన్నారు అనిల్ సుంకర. ''సందీప్, రావు రమేశ్‌గార్లు పోటీపడి నటించారు. 'మజాకా' అందరికీ నచ్చుతుంది. 'సామజ వరగమన, భైరవ కోన' చిత్రాల తర్వాత అనిల్‌గారు, నేను హ్యాట్రిక్ సినిమాతో వస్తున్నాం'' అన్నారు రాజేశ్ దండా. హీరోయిన్ రీతూ వర్మ, అన్షు మాట్లాడారు.

విద్రోహి చాలా మంచి కథ - శ్రీకాంత్



● శ్రీకాంత్, రవిప్రకాశ్

రవి ప్రకాశ్, శివ కుమార్, చరిష్మా శ్రీకర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'విద్రోహి'. వీఎస్‌వీ దర్శకత్వంలో విజ్జన వెంకట సుబ్రహ్మణ్యం, పప్పుల కనకదుర్గా రావు నిర్మించిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ త్వరలోనే రిలీజ్ కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ– ''ఈ సినిమా స్టోరీ నాకు తెలుసు. చాలా మంచి మూవీ అవుతుంది. రవిప్రకాశ్ మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్టు. 'విద్రోహి' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఇందులో నేను పోలీసాఫీసర్ పాత్ర చేశాను. ఓ డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది'' అని తెలిపారు రవిప్రకాశ్. ''ఓ సరికొత్త పాయింట్‌తో మేం తీసిన ఈ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ మూవీని ఏప్రిల్‌లో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం'' అని పేర్కొన్నారు వీఎస్‌వీ. ''విద్రోహి' సినిమా ఆడియన్స్‌ను ఆకట్టుకుంటుంది'' అనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు పప్పుల కనకదుర్గా రావు. నటుడు శివకుమార్ మాట్లాడారు.

సందేశంతో...




● ఆదిత్య ఓం

వాతావరణ పరిరక్షణపై సామాజిక సందేశం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బందీ'. ఆదిత్య ఓం ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు రఘు తిరుమల దర్శకత్వం వహించారు. గల్లీ సినిమాపై వెంకటేశ్వర్ రావు దగ్గు, రఘు తిరుమల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ''భారత దేశంతో పాటు ఇతర విదేశాల్లోని అనేక అటవీ ప్రాంతాల్లో రియల్ లొకేషన్స్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. పర్యావరణ ప్రేమికులందరినీ ఈ సినిమా కదిలించేలా ఉంటుంది. అటవీ ప్రాంతంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటూ ఆదిత్య ఓం అద్భుతంగా నటించారు'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ — ఇది చూడొచ్చు

ఆడవారి కష్టానికి అద్దం ఈ సినిమా..

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం మిసెస్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ సమాజంలో ఏ ప్రతిఫలం ఆశించకుండా ప్రతి రోజూ బాధ్యతతో కష్టపడుతున్న వారెవరైనా ఉన్నారు అంటే వారు మన ఇంటి ఆడవారు. 365 రోజులు ఏ సెలవు లేకుండా ఇంట్లో ఉన్న ఆరు నుండి అరవై ఏళ్ల వాళ్ల బాగోగులు ప్రతి నిత్యం అలుపెరగకుండా చూసుకునేవారే ఆడవారు. మరి ఇంతలా కష్టపడుతున్న వారికి కొన్ని బాధలు ఉంటాయి కదా. వాటి గురించి విచారించేదెవరు... ఆ కోణంలో ఆలోచింపజేసేదే ఈ 'మిసెస్' చిత్రం. 2021లో విడుదలైన మలయాళ సినిమా 'ది గ్రేట్ ఇండియన్ కిచెన్'కి హిందీ రీమేక్‌గా 'మిసెస్' రూపొందింది. ఆరతి కడావ్ దీనికి దర్శకురాలు. బాలీవుడ్‌లో విలక్షణ నటిగా పేరొందిన సాన్యా మల్హోత్రా ఈ సినిమాలోని ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు కనీసం ఓ క్షణమైనా తమ ఇంటి ఆడవారి కష్టం గురించి ఆలోచిస్తారు. అలా ఆలోచింపజేయడమే లక్ష్యంగా దర్శకురాలు ఈ సినిమాని రూపొందించారు. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి చూద్దాం... రీచా ఓ చదువుకున్న ఆధునిక భావాలు కలిగిన అమ్మాయి. మంచి డ్యాన్స్ టీచర్ కూడా. తనకు సొంతంగా డ్యాన్స్ టీమ్ ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచనలో ఉంటుంది. ఈ లోపల తల్లిదండ్రులు నిశ్చయించిన సంబంధంతో పెద్దల సమక్షంలో సంప్రదాయబద్ధంగా దివాకర్‌తో పెళ్లవుతుంది. దివాకర్ ఓ డాక్టర్. దివాకర్‌ది మరీ ఛాందస భావాలు కలిగిన కుటుంబం. ఇంటికి వచ్చిన కోడలితో ఇంటిడు చాకిరీ చేయించుకోవడమే కాక ఓ బానిస కన్నా చాలా హీనంగా చూస్తుంటారు. ప్రతి రోజూ అలారం పెట్టుకొని లేచి ఇంట్లో ఉన్న వాళ్లందరికీ వండి రాత్రి మళ్లీ నిద్రపోయేంతవరకు కళ్లకు కట్టినట్టు చూపించారు దర్శకురాలు. ఇంట్లో కనీసం వాసన కూడా భరించలేని ఓ ప్రదేశాన్ని తాను ఎంత నరకయాతన అనుభవిస్తూ శుభ్రం చేసిందో చూస్తే చూసిన ప్రేక్షకులకు గుండె బరువెక్కుతుంది. ఇంటి పెద్ద అయిన దివాకర్ తండ్రి బయటకు వెళ్లాలంటే ఆయన చెప్పులు కూడా చేత్తో తీసి, ముందు పెడితే తాపీగా వేసుకుని వెళతాడు. అటువంటి ఘోరమైన భావజాలమున్న ఈ కుటుంబంలోకి వచ్చిన రీచా ఎలా మనగలుగుతుంది? అలాగే తన డ్యాన్స్ డ్రీమ్ నెరవేర్చుకుంటుందా? లేదా అన్నది సినిమాలోనే చూడాలి. ఈ సినిమాలోని కథాంశం సమాజంలో ఉన్న ప్రతి గృహిణిది. ప్రతి రోజూ మీ కోసం కష్టపడుతున్న మీ వారి కోసం ఈ సినిమా చూడండి. ఆమె కష్టమేంటో మీ మనస్సుతో పాటు కళ్లకు కూడా తెలుస్తుంది. వర్తఫుల్ వాచ్.

– ఇంటూరు హరికృష్ణ

14000 వన్డేల్లో 14 వేల పరుగులు దాటిన మూడో ఆటగాడిగా కోహ్లి నిలిచాడు. సచిన్ (350), సంగక్కర (378)కంటే చాలా తక్కువ ఇన్నింగ్స్ (287)లలో అతను ఈ మైలురాయిని దాటాడు.

158 వన్డేల్లో కోహ్లి క్యాచ్‌ల సంఖ్య. అత్యధిక క్యాచ్‌లు పట్టిన భారత ఫీల్డర్‌గా అజహరుద్దీన్ (156) రికార్డును అతను అధిగమించాడు.

82 అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్‌లలో కలిపి కోహ్లి శతకాల సంఖ్య. వన్డేల్లో 51, టెస్టుల్లో 30, టి20ల్లో 1 సెంచరీ అతని ఖాతాలో ఉన్నాయి.

“సెమీస్ చేరే అవకాశం ఉన్న కీలక మ్యాచ్‌లో ఈ తరహాలో ఆడటం సంతృప్తిగా ఉంది. రోహిత్ అవుటైన తర్వాత మధ్య ఓవర్లలో ఎలాంటి సాహసోపేత షాట్లకు పోకుండా జాగ్రత్తగా ఆడే బాధ్యత నాపై పడింది. ఇది సరైన వ్యూహం. నేను వన్డేల్లో ఎప్పుడూ ఇలాగే ఆడతాను. నా ఆట గురించి నాకు చాలా బాగా తెలుసు. బయటి విషయాలను పట్టించుకోకుండా నా సామర్థ్యాన్ని నమ్ముకోవడం ముఖ్యం. ఎన్నో అంచనాలు ఉండే ఇలాంటి మ్యాచ్‌లలో వాటిని అందుకోవడం నాకు కష్టం కాదు. స్పిన్‌లో జాగ్రత్తగా ఆడుతూ పేస్ బౌలింగ్‌లో పరుగులు రాబట్టాలనే స్పష్టత నాకు ఉంది. గిల్, అయ్యర్ కూడా బాగా ఆడారు. ఈ ఇన్నింగ్స్‌తో నేను చాలా అలసిపోయాను. తర్వాతి మ్యాచ్‌కు వారం రోజుల విరామం ఉంది. 36 ఏళ్ల వయసు ఉన్న నాకు ఇది సంతోషాన్ని కలిగించే విషయం. –విరాట్ కోహ్లి

కోహ్లి ‘నూరు’



చాంపియన్స్ ట్రోఫీలో నేడు
న్యూజిలాండ్ X బంగ్లాదేశ్
మధ్యాహ్నం గం. 2:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్‌లో
ప్రత్యక్ష ప్రసారం

‘చాంపియన్స్’ పోరులో భారత్ ఘన విజయం | 6 వికెట్లతో పాకిస్తాన్ చిత్తు | విరాట్ కోహ్లి అజేయ సెంచరీ | దాదాపు సెమీస్ చేరిన టీమిండియా

భారత క్రికెట్ జట్టు పాకిస్తాన్ టీమ్‌కంటే ఒక ‘కాంతి సంవత్సరం’ ముందుంది! దుబాయ్‌లో ఇది మరోసారి రుజువైంది. అందరిలోనూ ఆసక్తి, చర్చను రేపుతూ ప్రసారకర్తలు, ప్రకటనకర్తలకు అతి పెద్ద బ్రాండ్ ఈవెంట్‌గా మారిన భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ మళ్లీ ఏకపక్షంగా ముగిసింది. మ్యాచ్ ఆరంభమైనప్పటి నుంచి టీమిండియా సంపూర్ణ ఆధిపత్యం కనబర్చగా, ఏ దశలోనూ పాక్ కనీస పోటీ ఇచ్చే స్థితిలో కనిపించలేదు. పిచ్ నెమ్మదిగా ఉండవచ్చు... పరుగులు రావడం కష్టంగా మారవచ్చు... అయినా సరే పాక్ బ్యాటింగ్ బృందం పేలవ ఆటతో అతి సాధారణ స్కోరుకే పరిమితమైంది... మన బౌలర్లు సమష్టిగా రాణిస్తూ ప్రత్యర్థిని పూర్తిగా అడ్డుకున్నారు. ఆపై ఛేదనలో భారత్ అలవోకగా దూసుకుపోయింది... పాక్ బౌలర్లు టీమిండియాను ఏమాత్రం నిలువరించలేకపోయారు. పిచ్ ఎలా ఉన్నా సత్తా ఉంటే పరుగులు రాబట్టవచ్చనే సూత్రాన్ని చూపిస్తూ మన బ్యాటర్లంతా తమ స్థాయిని ప్రదర్శించాడు. ఎప్పటిలాగే ఛేదనలో వేటగాడైన విరాట్ కోహ్లి తన లెక్క తప్పకుండా పరుగులు చేస్తూ ఒకే షాట్‌తో భారత్‌ను గెలిపించడంతో పాటు తన శతకాన్ని కూడా పూర్తి చేసుకున్నాడు. తాజా గెలుపుతో భారత్ దాదాపు సెమీఫైనల్లో చోటు ఖాయం చేసుకోగా... రెండు పరాజయాల తర్వాత డిఫెండింగ్ చాంపియన్ పాక్ టోర్నీ నుంచి నిష్క్రమించడం దాదాపుగా ఖాయమైంది. ఆతిథ్య దేశమైన ఆ జట్టు ఇక తమ సొంతగడ్డకు వెళ్లి అభిమానుల మధ్య నామమాత్రమైన చివరి పోరులో ఆడటమే మిగిలింది.

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్ దాదాపుగా సెమీఫైనల్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. తొలి పోరులో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన రోహిత్ శర్మ బృందం ఇప్పుడు గ్రూప్ ‘ఎ’ రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పాకిస్తాన్ జట్టుపై గెలిచింది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 6 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (76 బంతుల్లో 62; 5 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా... కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (77 బంతుల్లో 46; 3 ఫోర్లు), ఖుష్‌దిల్ షా (39 బంతుల్లో 38; 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్‌కు 3 వికెట్లు దక్కగా...హార్దిక్ పాండ్యా 2 కీలక వికెట్లు తీశాడు. అనంతరం భారత్ 42.3 ఓవర్లలో 4 వికెట్లకు 244 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ విరాట్ కోహ్లి (111 బంతుల్లో 100 నాటౌట్; 7 ఫోర్లు) సెంచరీ సాధించాడు. శుబ్‌మన్ గిల్ (52 బంతుల్లో 46; 7 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (67 బంతుల్లో 56; 5 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచారు. కోహ్లి, అయ్యర్ మూడో వికెట్‌కు 114 పరుగులు జోడించారు. తమ ఆఖరి మ్యాచ్‌లో వచ్చే ఆదివారం న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది.

షకీల్ అర్ధ సెంచరీ...

షమీ నియంత్రణ కోల్పోయి వేసిన తొలి ఓవర్‌తో పాక్ ఇన్నింగ్స్ మొదలైంది. ఈ ఓవర్లో అతను ఏకంగా 5 వైడ్‌లు వేయడంతో మొత్తం 11 బంతులతో ఓవర్ పూర్తి చేయాల్సి వచ్చింది! ఆ తర్వాత బాబర్ ఆజమ్ (26 బంతుల్లో 23; 5 ఫోర్లు) చక్కటి కవర్ డ్రైవ్‌లతో పరుగులు రాబట్టాడు. అయితే బాబర్‌ను పాండ్యా వెనక్కి పంపించగా, అక్షర్ ఫీల్డింగ్‌కు ఇమామ్ ఉల్ హక్ (10) రనౌటయ్యాడు. ఈ దశలో రిజ్వాన్, షకీల్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే వీరిద్దరు మరీ నెమ్మదిగా ఆడటంతో పరుగుల వేగం మందగించింది. ఒకదశలో 32 బంతుల తర్వాత గానీ బౌండరీ రాలేదు. హార్దిక్ పాండ్యా చక్కటి స్పెల్ (6–0–18–1)తో పాక్‌ను కట్టి పడేసాడు. తొలి 10 ఓవర్లలో 52 పరుగులు చేసిన జట్టు తర్వాతి 10 ఓవర్లలో 27 పరుగులు మాత్రమే రాబట్టగలిగింది. ఆ తర్వాతా ఒక దశలో వరుసగా 53 బంతుల పాటు ఫోర్ రాలేదు! అనంతరం కాస్త ధాటిని పెంచిన షకీల్ 63 బంతుల్లో అర్ధ


నిరాశలో పాక్ కెప్టెన్ రిజ్వాన్

సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అక్షర్ బౌలింగ్‌లో ముందుకొచ్చి షాట్ ఆడబోయే క్రమంలో రిజ్వాన్ బౌల్డ్ కావడంతో 104 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మరో 14 పరుగుల వ్యవధిలో షకీల్, తాహిర్ (4) వెనుదిరగ్గా... ఆపై


రోహిత్, పాండ్యా సంబరం

కుల్దీప్ వరుస బంతుల్లో 2 వికెట్లు తీసి దెబ్బ కొట్టాడు. చివర్లో ఖుష్‌దిల్ కాస్త వేగంగా ఆడటంతో పాక్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యమే అయినా భారత్ తమ ఇన్నింగ్స్‌ను ధాటిగా ప్రారంభించింది. ఛేదనలో రోహిత్ శర్మ (15 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్), గిల్ చకచకా పరుగులు రాబట్టారు. అయితే షాహిన్ అఫ్రిది అద్భుత బంతితో రోహిత్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో జట్టు తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత అఫ్రిది వరుస రెండు ఓవర్లలో కలిపి 5 ఫోర్లు బాదిన గిల్ జోరు ప్రదర్శించాడు. మరోవైపు కోహ్లి కూడా తనదైన శైలిలో చక్కటి షాట్లతో ఆధిక్యం ప్రదర్శించాడు. కోహ్లితో రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించిన తర్వాత గిల్ వెనుదిరిగాడు. ఈ దశలో కోహ్లి, అయ్యర్ పార్ట్‌నర్‌షిప్ జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లింది. వీరిద్దరు ఎక్కడా తడబాటు లేకుండా చక్కటి సమన్వయంతో దూసుకుపోయారు. వీరిని నిలువరించేందుకు పాక్ బౌలర్లు తీవ్రంగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో కోహ్లి 62 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 25 పరుగుల వద్ద అయ్యర్ ఇచ్చిన క్యాచ్‌ను షకీల్ వదిలేయడం కూడా కలిసొచ్చింది. అనంతరం 63 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. విజయానికి 28 పరుగుల దూరంలో అయ్యర్... 19 పరుగుల దూరంలో హార్దిక్ పాండ్యా (8) అవుటైనా ... అక్షర్ పటేల్ (3 నాటౌట్)తో కలిసి కోహ్లి మ్యాచ్ ముగించాడు.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఇమామ్ (రనౌట్) 10; బాబర్ (సి) రాహుల్ (బి) పాండ్యా 23; షకీల్ (సి) అక్షర్ (బి) పాండ్యా 62; రిజ్వాన్ (బి) అక్షర్ 46; సల్మాన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 19; తాహిర్ (బి) జడేజా 4; ఖుష్‌దిల్ (సి) కోహ్లి (బి) రాణా 38; అఫ్రిది (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; నసీమ్ (సి) కోహ్లి (బి) కుల్దీప్ 14; రవూఫ్ (రనౌట్) 8; అబ్రార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 241. వికెట్ల పతనం:** 1–41, 2–47, 3–151, 4–159, 5–165, 6–200, 7–200, 8–222, 9–241, 10–241. **బౌలింగ్:** షమీ 8–0–43–0, హర్షిత్ రాణా 7.4–0–30–1, హార్దిక్ పాండ్యా 8–0–31–2, అక్షర్ పటేల్ 10–0–49–1, కుల్దీప్ యాదవ్ 9–0–40–3, జడేజా 7–0–40–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి) షాహిన్ అఫ్రిది 20; గిల్ (బి) అబ్రార్ 46; విరాట్ కోహ్లి (నాటౌట్) 100; శ్రేయస్ అయ్యర్ (సి) ఇమామ్ (బి) ఖుష్‌దిల్ 56; పాండ్యా (సి) రిజ్వాన్ (బి) షాహిన్ అఫ్రిది 8; అక్షర్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (42.3 ఓవర్లలో 4 వికెట్లకు) 244. వికెట్ల పతనం:** 1–31, 2–100, 3–214, 4–223. **బౌలింగ్:** అఫ్రిది 8–0–74–2, నసీమ్ షా 8–0–37–0, హారిస్ రవూఫ్ 7–0–52–0, అబ్రార్ 10–0–28–1, ఖుష్‌దిల్ 7.3–0–43–1, సల్మాన్ 2–0–10–0.


విరాట్ కోహ్లి



లక్ష్య ఛేదనలో భారత్ అలవోకగా విజయం వైపు దూసుకుపోతోంది...36 ఓవర్లు ముగిసే సరికి భారత్ స్కోరు సరిగ్గా 200కు చేరింది. 84 బంతుల్లో 42 పరుగులు చేయడం ఇక లాంఛనమే! సరిగ్గా ఇక్కడే అభిమానులు ఫలితం గురించి కాకుండా కోహ్లి శతకం గురించి ఆలోచించడం మొదలు పెట్టారు. ఆ సమయంలో విరాట్ స్కోరు 81. అంటే మరో 19 పరుగులు కావాలి. కానీ మరో వైపు అయ్యర్, పాండ్యా చకచకా పరుగులు రాబట్టడంతో ఉత్కంఠ పెరిగింది. పరుగులు తరుగుతూ పోవడంతో అటు వైపు బ్యాటర్ పరుగులు చేయరాదని, కోహ్లి సెంచరీ పూర్తి చేసుకోవాలని అంతా కోరుకున్నారు. ముందుగా అయ్యర్ 7, ఆపై పాండ్యా 8 పరుగులు చేశారు! పాండ్యా అవుటయ్యే సమయానికి కోహ్లి 86 వద్ద ఉన్నాడు. విజయానికి 19 పరుగులు కావాలి. ఈ సమయంలో అక్షర్ కాస్త సంయమనం పాటించాడు. సింగిల్స్ తీసే అవకాశం ఉన్నా ఆగిపోయాడు. దాంతో కోహ్లి పని సులువైంది. గెలుపు కోసం 2 పరుగులు చేయాల్సిన స్థితిలో కోహ్లి 96 వద్ద ఉన్నాడు. తర్వాతి బంతికి ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఫోర్ కొట్టడంతో కోహ్లి 51వ వన్డే సెంచరీ, భారత్ గెలుపు పూర్తయ్యాయి. విరాట్ స్థాయి దిగ్గజానికి శతకాలు కొత్త కాదు. కానీ పెర్త్‌లో సెంచరీ తర్వాత అతని బ్యాటింగ్‌లో తడబాటు కనిపించింది. తర్వాతి నాలుగు టెస్టుల్లో ఘోర వైఫల్యంతో పాటు రంజీ మ్యాచ్‌లో కూడా నిరాశపర్చాడు. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో ఒక హాఫ్ సెంచరీ చేసినా బంగ్లాతో మ్యాచ్‌లో మళ్లీ విఫలం. ఇలాంటి స్థితిలో పాకిస్తాన్ లాంటి జట్టుపై చేసిన సెంచరీ ఎంతో కీలకమైంది. అతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు సచిన్ ‘100’ సెంచరీల మైలురాయికి మరింత చేరువ చేసింది.

రెండు టోపీలు... రెండు ట్రోఫీలు

ఐసీసీ అవార్డులు అందుకున్న బుమ్రా

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇదివరకే ప్రకటించిన అవార్డుల్ని ఆదివారం భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అందుకున్నాడు. 2024 క్యాలెండర్ ఇయర్‌కు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష ప్రదర్శన కనబరిచిన ఈ భారత సీనియర్ పేసర్ పురుషుల క్రికెట్‌లో నాలుగు అవార్డులకు ఎంపికయ్యాడు. ‘క్రికెటర్ ఆఫ్ ద ఇయర్’... ‘టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్’ వ్యక్తిగత అవార్డులు కాగా... 2024 ప్రదర్శన ఆధారంగా అన్ని దేశాల నుంచి ఆటగాళ్లతో ఐసీసీ జట్లను ఎంపిక చేసింది. ఐసీసీ ప్రకటించిన టి20, టెస్టు జట్లలోనూ బుమ్రా ఉన్నాడు. దీంతో ‘టి20 టీమ్ ఆఫ్ ద ఇయర్’... ‘టెస్టు టీమ్ ఆఫ్ ద ఇయర్’ పురస్కారాలల్లో భాగంగా ఐసీసీ ప్రత్యేకమైన రెండు టోపీలను అందజేసింది. వ్యక్తిగత అవార్డులుగా రెండు ట్రోఫీలను బహూకరించింది. ప్రస్తుతం వెన్నుగాయంతో ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఈ ‘పేస్ ఎక్స్‌ప్రెస్’ అవార్డు స్వీకరించేందుకే దుబాయ్‌కి వచ్చాడు. ఉదయం మ్యాచ్‌కు ముందు తుది కసరత్తులో ఉన్న తమ జట్టు సహచరులతో ఆత్మీయంగా భేటీ అయ్యాక



దాయాదుల మ్యాచ్ ఆరంభానికి ముందు అవార్డులు అందుకున్నాడు. ప్రేక్షకులంతా చప్పట్లతో అభినందనలు తెలిపారు. గతేడాది టెస్టుల్లో కేవలం 13 మ్యాచ్‌లే ఆడిన 31 ఏళ్ల బుమ్రా 71 వికెట్లు పడగొట్టడం విశేషం. ఓ క్యాలెండర్ ఇయర్‌లో 70 పైచిలుకు వికెట్లు తీసిన నాలుగో భారత బౌలర్‌గా ఘనతకెక్కాడు. అతనికంటే ముందువరుసలో దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్, లెజెండ్ స్పిన్నర్లు అనిల్ కుంబ్లే, అశ్విన్ ఉన్నారు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 19 వికెట్లు తీసిన బుమ్రా... ఆస్ట్రేలియాలో జరిగిన ‘బోర్డర్–గావస్కర్ ట్రోఫీ’లో 32 వికెట్లు తీశాడు. అంటే కేవలం రెండే రెండు జట్లతో జరిగిన ముఖాముఖి సిరీస్‌ల్లోనే 51 వికెట్లు పడగొట్టడం విశేషం.


అభిషేక్ శర్మ, చిరంజీవి, తిలక్ వర్మ


కుటుంబసభ్యులతో దర్శకుడు సుకుమార్


మాజీ ఎంపీ సంతోష్ కుమార్, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, నటుడు వివేక్ ఒబెరాయ్

తారలు తరలి వెళ్లారు...

దుబాయ్: దాయాదుల దమ్మేంతో ప్రత్యక్షంగా చూసేందుకు తారలంతా దుబాయ్‌కి తరలి వెళ్లారు. ఏదో ఒక రంగమని కాకుండా... సినీ, క్రీడా, వ్యాపార, రాజకీయ రంగాలకు చెందిన హేమాహేమీలతో దుబాయ్ స్టేడియం ఓ తారాతీరమైంది. మైదానంలో భారత ఆటగాళ్లు, గ్యాలరీలో భారత అతిరథులతో స్టేడియం కళకళలాడింది. టీమిండియా క్రికెటర్లు జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, టీమిండియా మాజీ సభ్యులు శిఖర్ ధావన్, వెంకటేశ్ ప్రసాద్... తెలుగు సినీ ప్రముఖులు మెగాస్టార్ చిరంజీవి, ‘పుష్ప’ సీక్వెల్స్‌తో పాన్ ఇండియా డైరెక్టర్ అయిన సుకుమార్, బాలీవుడ్ నుంచి హీరోయిన్ సోనమ్ కపూర్ తన భర్త ఆనంద్ అహూజాతో కలిసి రాగా, వివేక్ ఒబెరాయ్, ఊర్వశీ రౌతేలా, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్‌రాడ్ సంగ్మా, త్రిపుర వెస్ట్ నియోజకవర్గం లోక్‌సభ సభ్యుడు బిప్లాబ్ కుమార్ దేబ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, బ్రిటన్ పాప్ సింగర్ జాస్మిన్ వాలియా, బాలీవుడ్ చిత్ర గీతాలతో పాపులర్ అయిన పాకిస్తాన్ సింగర్ అతీఫ్ అస్లామ్ తదితరులతో వీఐపీ గ్యాలరీలు కొత్త శోభను సంతరించుకున్నాయి. పాకిస్తాన్ దిగ్గజ క్రికెటర్ షాహిద్ అఫ్రిది, ఇమాద్ వసీమ్, పాక్ దివంగత ప్రధాని బెనజీర్ భుట్టో కుమార్తె భక్తావర్ భుట్టో జర్దారి, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కుమారుడు ఖాసీమ్ ఖాన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా విభాగం, ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ తదితరులు మ్యాచ్‌ను తిలకించిన వారిలో ఉన్నారు.


సినీ నటి ఊర్వశి రౌతేలా


ఐసీసీ చైర్మన్ జై షాతో త్రిపుర వెస్ట్ ఎంపీ బిప్లాబ్ కుమార్, మేఘాలయ సీఎం కాన్‌కర్డ్ సంగ్మా

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫస్ట్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
24-2-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
425	117
75,311	22,796


విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,533	▽	429
డోజోన్స్	43,400	▽	779
ఎఫ్‌టీఎస్ఈ 100	8,659	▽	4
డాక్స్	22,288	▽	27
షాంఘై	3,379	△	28
నికాయ్	38,777	△	99

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.10	87.12
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	108.30	111.17
€	యూరో	ఒకటి	89.65	92.28
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.00	58.45
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.35	56.57
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.56	67.24
SAR	సౌదీ రియాల్	భారమవుతు	22.21	23.77
UAE D	యూఏఈ దిర్హామ్	భారమవుతు	22.70	24.49
¥	చైనా యువాన్	భారమవుతు	11.07	12.89



ఆరోగ్య బీమా.. భారం తగ్గేదెలా?

- ప్రీమియం తగ్గించుకునేందుకు ఎన్నో మార్గాలు
- సమ్ అష్యూర్డ్ పరిమితంగానే తీసుకోవాలి
- దీనికి సూపర్ టాపప్ జోడించాలి
- బోనస్, రీస్టోరేషన్ ఫీచర్లు ఉండాలి
- కేలరీలు ఖర్చు చేస్తే రాయితీ
- క్రెడిట్ స్కోరు బలంగా ఉన్నా డిస్కౌంట్

ఆరోగ్య అత్యవసర స్థితి చెప్పి రాదు. ఆహారం, నిద్ర వేళల్లో మార్పులు.. గంటల తరబడి కూర్చొని చేసే ఉద్యోగాల ప్రభావంతో జీవనశైలి వ్యాధుల రిస్క్ పెరిగింది. వీటి కారణంగా ఆస్పత్రి పాలైతే బిల్లులు చెల్లించడం మెజారిటీ వ్యక్తులకు అసాధ్యమే కాదు, ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి. ఇలాంటి అనిశ్చితులకు రక్షణ కవచమే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ. కరోనా తర్వాత వీటి ప్రీమియంలు దాదాపుగా రెట్టింపయ్యాయి. మోయలేనంత భారంగా మారాయి. ఇది చూసి ఇప్పటికీ హెల్త్ ప్లాన్‌కు దూరంగా ఉన్నవారు ఎందరో. కానీ, ప్రతి వ్యక్తికీ, ప్రతి కుటుంబానికీ ఇది తప్పనిసరి. కావాలంటే ప్రీమియం తగ్గించుకునే మార్గాన్ని వెతకండి. అంతేకానీ, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా రక్షణ కల్పించే హెల్త్ ఇన్సూరెన్స్‌కు దూరంగా ఉండొద్దనేది నిపుణుల మాట!

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనం ప్రకారం.. దేశంలో 35 శాతం మంది హైపర్‌టెన్షన్ (అధిక రక్తపోటు)తో బాధపడుతున్నారు. 10 శాతం మందికి మధుమేహం సమస్య ఉంటే, 28 శాతం మంది అధిక కొలెస్ట్రాల్‌ను ఎదుర్కొంటున్నారు. జీవనశైలి వ్యాధులు ఏ స్థాయిలో పెరుగుతున్నాయో ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది. మరోవైపు వైద్య రంగంలో అత్యాధునిక చికిత్సా విధానాలు.. మరింత కచ్చితత్వంతో, మెరుగైన ఫలితాలనిచ్చే రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ వ్యయాలను అందరూ భరించలేరు. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆరోగ్యంగా ఉన్నప్పుడే..

హెల్త్ ఇన్సూరెన్స్‌ను వీలైనంత చిన్న వయసులోనే తీసుకోవాలి. అంటే ఆరోగ్యంగా ఉన్నప్పుడు తీసుకోవడం వల్ల ప్రీమియం తక్కువగా ఖరారవుతుంది. వయసు, ఆరోగ్య చరిత్ర తదితర అంశాలను బీమా సంస్థ పాలసీ జారీకి ముందు మదింపు చేస్తుంది. హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు విషయంలో.. 25 ఏళ్ల వయసు వ్యక్తికి, 40 ఏళ్ల వయసు వ్యక్తికి ప్రీమియంలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. చిన్న వయసులో, ఆరోగ్యంగా ఉన్నప్పుడు పాలసీ తీసుకుంటే, ఆ తర్వాతి కాలంలో ప్రీమియం పెరగదా? అన్న సందేహం రావచ్చు. 35 ఏళ్లు నిండిన తర్వాత, 45 ఏళ్లు, 55 ఏళ్లు, 60 ఏళ్లు నిండిన తర్వాత వయసువారీ ప్రీమియం రేట్లు కచ్చితంగా సవరణకు నోచుకుంటాయి. కానీ, 35–40 ఏళ్ల తర్వాత కొత్తగా పాలసీ తీసుకునే వారితో పోల్చితే, 25 ఏళ్లలోపు వారికి ప్రీమియం తక్కువే ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్నప్పుడు తీసుకుంటే, మూడేళ్లలో అన్ని రకాల వెయిటింగ్ పీరియడ్‌లు దాటేస్తారు. ముందస్తు వ్యాధులకు సైతం కవరేజీ అర్హత లభిస్తుంది. పైగా పాలసీ తీసుకుని 60 నెలలు (ఐదేళ్ల ప్రీమియం చెల్లింపులు) ముగిస్తే, ఆరోగ్య చరిత్రను సరిగ్గా వెల్లడించలేదనో, సమాచారం దాచిపెట్టారనే కారణంతో క్లెయిమ్‌ను బీమా సంస్థ తిరస్కరించడానికి కుదరదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ముందుగా తీసుకోవడం వల్ల ఇన్ని ప్రయోజనాలతోపాటు ప్రీమియం భారం తగ్గుతుంది.

బోనస్, రీస్టోరేషన్

కేవలం రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌నే తీసుకున్నప్పటికీ అదనపు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా కవరేజీని పెంచుకునే మార్గాలు కూడా ఉన్నాయి. దాదాపు అన్ని బీమా కంపెనీలు నో క్లెయిమ్ బోనస్, రీస్టోరేషన్ ఫీచర్లను అందిస్తున్నాయి.



ఒక పాలసీ సంవత్సరంలో ఎలాంటి క్లెయిమ్ లేకపోతే 50–200 శాతం మేర సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ)ను నో క్లెయిమ్ బోనస్ రూపంలో బీమా సంస్థలు ఇస్తుంటాయి. అప్పుడు రూ.5 లక్షల కవరేజీ రూ.10–15 లక్షలకు చేరుతుంది. రీస్టోరేషన్ సదుపాయం అన్నది.. హాస్పిటల్‌లో చేరినప్పుడు కవరేజీ పూర్తిగా అయిపోతే అంతే మొత్తాన్ని తిరిగి ఆ పాలసీ సంవత్సరానికి పునరుద్ధరించడం. కొన్ని బీమా సంస్థలు ఏడాదిలో ఒక్క రీస్టోరేషన్‌నే ఇస్తుంటే, కేర్, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ తదితర కంపెనీలు కొన్ని ప్లాన్లలో అపరిమిత రీస్టోరేషన్ సదుపాయాలను ఆఫర్ చేస్తున్నాయి. ఇవి తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల బేస్ సమ్ అష్యూర్డ్ తక్కువగా ఎంపిక చేసుకున్నప్పటికీ ఎలాంటి నష్టం ఉండదు. పైగా ప్రీమియం భారం తగ్గుతుంది.

చిన్న క్లెయిమ్‌లకు దూరం

ఏడాదిలో ఎలాంటి క్లెయిమ్ లేకపోతేనే నో క్లెయిమ్ బోనస్ వస్తుంది. కనుక చిన్న క్లెయిమ్‌లకు దూరంగా ఉండాలి. ఉదాహరణకు రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఎలాంటి క్లెయిమ్ లేకపోతే ఏటా 50 నుంచి 100 శాతం చొప్పున సమ్ అష్యూర్డ్ పెరుగుతుంది. ఒకవేళ క్లెయిమ్ చేస్తే ఎంత అయితే పెరిగిందో, అంతే మేర తగ్గిపోతుంది. కనుక చిన్న క్లెయిమ్ కోసం రూ.2.5–5 లక్షల సమ్ అష్యూర్డ్‌ను ఒక ఏడాదిలో నష్టపోవాల్సి వస్తుంది. అందుకే రూ.50 వేల లోపు చిన్న వ్యయాలను సొంతంగా భరించడమే మంచిది.

మంచి ఆహారం, జీవనశైలి..

హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్నాం కదా అన్న భరోసాతో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తామా? అలా చేయడం మన సమస్యలను మరింత పెంచుతుంది. మంచి ఆరోగ్యం కోసం తమ వంతు కృషి చేయాల్సిందే. దీనివల్ల ఆస్పత్రి పాలు కావడాన్ని సాధ్యమైన మేర నివారించొచ్చు. దీనివల్ల ప్రీమియం కూడా తగ్గుతుంది. హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో చాలా వరకు ఈ ప్రయోజనాన్ని అందిస్తున్నాయి. ఎన్ని కేలరీలు ఖర్చు చేస్తే అంత ప్రయోజనం లభిస్తుంది. రోజువారీ నడక, పరుగు, ఏరోబిక్ వ్యాయామాలు చేయడం ద్వారా హెల్త్ క్రెడిట్స్ పొందొచ్చు. వీటిని ప్రీమియంలో సర్దుబాటు చేసుకోవచ్చు. తద్వారా ప్రీమియంలో 100% రాయితీని సైతం కొన్ని సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి. ముఖ్యంగా



పొగతాగడం, మద్యపానం, గుట్కా/జర్దాలకు దూరంగా ఉండాలి. ఈ అలవాట్ల గురించి ఆరోగ్య చరిత్రలో వెల్లడించాల్సిందే. వీటి కారణంగా ప్రీమియం గణనీయంగా పెరిగిపోతుంది. వీటిని మానేయడం ద్వారా ప్రీమియం తగ్గించుకోవచ్చు.

సూపర్ టాపప్



నేటి రోజుల్లో నలుగురు సభ్యుల ఒక కుటుంబానికి కనీసం రూ.10 లక్షల హెల్త్ కవరేజీ ఉండాలి. కొన్ని సందర్భాల్లో ఇది కూడా చాలకపోవచ్చు. కానీ, రూ.10 లక్షల హెల్త్ ప్లాన్ కోసం 30 ఏళ్ల వ్యక్తి కుటుంబానికి రూ. 20 వేల వరకు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. దీనికి బదులు రూ.5 లక్షల బేసిక్ ఇండెమ్నిటీ ప్లాన్ పరిశీలించొచ్చు. దీనికి అదనంగా రూ.5 లక్షల డిడక్టబుల్‌తో సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవాలి. ఉదాహరణకు రూ.50 లక్షల సూపర్ టాపప్ ప్లాన్ రూ.3,000కే వస్తుంది. ఇందులో మొదటి రూ.5 లక్షల బిల్లును మినహాయించి, ఆపై ఉన్న మొత్తానికి చెల్లింపులు లభిస్తాయి. రూ.10 లక్షల హెల్త్ ప్లాన్ ప్రీమియం అందుబాటు ధరలోనే వస్తే, అప్పుడు రూ.10 లక్షల డిడక్టబుల్‌తో రూ.50 లక్షలు లేదా రూ.కోటికి సూపర్ టాపప్ ప్లాన్ జోడించుకోవడం మంచి నిర్ణయం అవుతుంది.

మెరుగైన క్రెడిట్ స్కోర్



వ్యక్తిగత రుణ చరిత్రకు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంకు సంబంధం ఏంటని అనుకుంటున్నారా?.. కొన్ని బీమా సంస్థలు మెరుగైన సిబిల్ స్కోర్ ఉన్న కస్టమర్లకు ప్రీమియంలో తగ్గింపు ఇస్తున్నాయి. ఎక్కువ స్కోరు ఉందంటే.. ఆర్థిక క్రమశిక్షణతో నడుచుకుంటున్నారని అర్థం. ఇలాంటి వారిని తక్కువ రిస్క్ కస్టమర్లుగా చూస్తూ ప్రీమియంలో డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నాయి. 15 శాతం వరకు తగ్గింపు పొందొచ్చు.

ఆన్‌లైన్‌లో కొనుగోలు

హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ, ఫీచర్లపై అవగాహన కలిగిన వారు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం ద్వారా ప్రీమియంలో డిస్కౌంట్ పొందొచ్చు. పైగా పాలసీబజార్ పోర్టల్‌పై మొబైల్ ఓటీపీతో లాగిన్ అయ్యి, అన్ని బీమా సంస్థల పాలసీలను పరిశీలించొచ్చు.



వాటి ఫీచర్లు, ప్రీమియం వ్యత్యాసాన్ని గమనించొచ్చు. తద్వారా మెరుగైన ఫీచర్లతో, తక్కువ ప్రీమియంతో ఉండే పాలసీని గుర్తించొచ్చు. బీమా సంస్థ పోర్టల్ ద్వారా నేరుగా పాలసీని కొనుగోలు చేయవచ్చు. దీనివల్ల స్వయంగా వివరాలు నమోదు చేయడం, నియమ, నిబంధనల గురించి అవగాహన కూడా ఏర్పడుతుంది.

కొంత రాజీపడితే?



సదుపాయాల విషయంలో కొంత రాజీధోరణితో వెళ్లేట్టు అయితే అప్పుడు కూడా ప్రీమియం భారాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఇందులో రూమ్ టైప్ ఒకటి. ఆస్పత్రిలో చేరినప్పుడు రోగికి ఐసీయూ వెలుపల పడక అవసరమవుతుంది. జనరల్ వార్డ్, షేరింగ్, సింగిల్ రూమ్, డీలక్స్ రూమ్ ఇలా పలు రకాలుంటాయి. పడక విషయంలో ఎలాంటి పరిమితుల్లేని పాలసీకి ఎక్కువ మంది మొగ్గు చూపిస్తుంటారు. ఒక విధంగా ఇదే సౌకర్యమైనది. ప్రీమియం భరించగలిగే వారు రూమ్ రెంట్‌లో పరిమితులు లేకుండా ఎంపిక చేసుకోవాలి. ప్రీమియం భారంగా భావించే వారు.. షేరింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఎందుకంటే ప్రైవేటు రూమ్‌ల్లోని సేవలతో పోల్చినప్పుడు షేరింగ్‌లో అందించే వైద్య సేవల చార్జీలు తక్కువగా ఉంటాయి. కనుక మొత్తం మీద బిల్లు తగ్గుతుంది. ఇది బీమా సంస్థపై భారాన్ని తగ్గిస్తుంది. షేరింగ్‌లోనూ రోగికి మెరుగైన సేవలే అందుతాయి. కనుక దీన్ని పరిశీలించొచ్చు. పైన చెప్పుకున్న అన్ని ఆప్షన్లు దాటి వచ్చిన తర్వాత కూడా ప్రీమియం భారంగా అనిపిస్తే.. కోపేమెంట్‌కు వెళ్లడమే. ఈ విధానంలో ప్రతి ఆస్పత్రి బిల్లులో పాలసీదారు తన వంతు చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు 10 శాతం కో–పేమెంట్ ఎంపిక చేసుకున్నారని అనుకుందాం. రూ.2 లక్షల బిల్లు వచ్చినప్పుడు రోగి తన జేబు నుంచి రూ.20 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇంతకంటే ఎక్కువ కోపేమెంట్ ఆప్షన్‌కైనా వెళ్లొచ్చు. కానీ, దీనివల్ల ఏటా ప్రీమియం భారం తగ్గుతుంది కానీ, ఆస్పత్రిలో చేరినప్పుడు ఆ మేరకు జేబుపై భారం పడుతుంది

ఈఎంఐ రూపంలో



హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం ఏడాదికి ఒకే వాయిదాలో చెల్లించాల్సి ఉంటుంది. జీవిత బీమాలో మాదిరి నెలవారీ లేదా త్రైమాసికం లేదా ఆరు నెలలకోసారి ఆప్షన్ లేదు. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఒకే విడత అంత మొత్తం అంటే భారంగా అనిపించొచ్చు. అలాంటి వారు ఈఎంఐ ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. కొన్ని రకాల కార్డులపై బీమా సంస్థలు ఈ సదుపాయం కల్పిస్తున్నాయి.

నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే..



ప్రతి హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ నెట్‌వర్క్ ఆస్పత్రులతో ఒక జాబితాను నిర్వహిస్తుంటుంది. తమ క్లయింట్లకు కొంచెం తగ్గింపు రేట్లపై సేవలు అందించే దిశగా ఆయా ఆస్పత్రులతో బీమా కంపెనీకి టైఅప్ ఉంటుంది. కనుక నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రులతో పోల్చి చూస్తే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవడం వల్ల తక్కువ చార్జీలు పడతాయి. ఈ మేరకు బీమా కంపెనీలకు ఆదా అవుతుంది. కనుక స్టార్ హెల్త్ వంటి కొన్ని బీమా సంస్థలు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే చికిత్స తీసుకుంటే ప్రీమియంలో 15 శాతం వరకు రాయితీని అందిస్తున్నాయి.

ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్



కుటుంబంలో ప్రతి ఒక్కరికీ ఇండివిడ్యువల్ హెల్త్ కవరేజీ తీసుకుంటే ప్రీమియం ఎక్కువ పడుతుంది. దీనికి బదులు కుటుంబం అంతటికీ ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ తీసుకోవాలి. ఎందుకంటే కుటుంబంలో అందరికీ కలిపి కవరేజీ ఒక్కటే అవుతుంది. కనుక ప్రీమియం తగ్గుతుంది.

వెల్‌నెస్ ప్రయోజనాలు ఉపయోగించుకోవాలి..

తీసుకునే హెల్త్ ప్లాన్‌లో హెల్త్ చెకప్ వంటి వెల్‌నెస్ ప్రయోజనాలు ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల ఏడాదికోసారి ఉచితంగా అన్ని రక్త పరీక్షలు చేయించుకోవచ్చు. ఇందుకు అదనంగా పడే ప్రీమియం ఉండదు. కానీ, ఆరోగ్యం ఎలా ఉందన్నది గమనించుకోవచ్చు. ఈ మేరకు కొంత ఆదా చేసినట్టే అవుతుంది.



స్టాక్స్ అమ్మి ఫ్లాట్ కొనడం మంచిదా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



స్టాక్స్‌లో, మ్యూచువల్ ఫండ్స్‌లో నాకున్న పెట్టుబడులను విక్రయించి, ఉత్తర బెంగళూరులో ఫ్లాట్ కొనాలన్నది నా ఆలోచన. వచ్చే ఐదేళ్ల కాలానికి ఇది మంచి ఆప్షన్ అవుతుందా? లేదంటే మరో ఐదేళ్లపాటు ఈ పెట్టుబడులు కొనసాగించిన అనంతరం ఫ్లాట్ కొనుగోలు చేసుకోవాలా? ఈ రెండింటిలో ఏది మెరుగైన ఆప్షన్? – శంకర్ కృష్ణమూర్తి

ఈ విషయంలో కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు ఫ్లాట్ కొనుగోలు చేస్తే ఎంత మేర లాభపడొచ్చు? దీని ద్వారా వచ్చే అద్దె ఆదాయం ఏ మేరకు ఉంటుంది? ఇవన్నీ పరిశీలించాలి. ఫ్లాట్‌పై పెట్టుబడి విలువకు వృద్ధి ఉండి, 4–6 శాతం మేర అద్దె రాబడి వచ్చేట్టు అయితే ఇప్పుడే స్టాక్స్ విక్రయించి కొనుగోలు చేయడం మంచి నిర్ణయం అవుతుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను విక్రయించేంత వరకు ఎలాంటి పన్నులు చెల్లించక్కర్లేదు. కనుక పెట్టుబడి వృద్ధి, రిస్క్, పెట్టుబడి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అద్దె ఇంట్లో ఉంటూ, సొంత అవసరాల కోసం ఇల్లు కొనుగోలు చేస్తున్నట్టు అయితే ఇప్పుడు కొనుగోలు చేయడం మంచి నిర్ణయం అవుతుంది. అలాంటప్పుడు తక్కువ రాబడి వచ్చినా ఫర్వాలేదు.



మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ తమ నిర్వహణ ఆస్తుల్లో (ఏయూఎం/పెట్టుబడులు) 30 శాతాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అలాంటప్పుడు ప్రత్యేకంగా లార్జ్‌క్యాప్ ఫండ్‌లో పెట్టుబడికి బదులు ఒకే మిడ్‌క్యాప్ ఫండ్‌లో ఎందుకు పెట్టకూడదు? దీనివల్ల రీబ్యాలన్స్ చేయాల్సిన అవసరం తప్పుతుందిగా? – రాఘవేంద్ర సౌరబ్

మిడ్‌క్యాప్ ఫండ్‌లో అంతర్గతంగా ఉండే అస్థిరతల పట్ల సౌకర్యంగా ఉండేట్టు అయితే ఇన్వెస్ట్ చేయడం మంచి వ్యూహమే అవుతుంది. మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌కు నిబంధనల పరంగా కొంత వెసులుబాటు ఉంది. అవి తమ నిర్వహణ ఆస్తుల్లో కనీసం 65 శాతాన్ని మిడ్‌క్యాప్ స్టాక్స్ కేటాయించాల్సి ఉంటుంది. మిగిలిన 35 శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ లేదా స్మాల్‌క్యాప్‌లో ఎక్కడైనా, ఎంత మేరకు అయినా కేటాయింపులు చేసుకోవచ్చు. ఇది ఫండ్ మేనేజర్ విచక్షణపైనే ఆధారపడి ఉంటుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఫండ్ మేనేజర్లు 35 శాతం పెట్టుబడులను వివిధ విభాగాల మధ్య మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. అయితే, చాలా మిడ్‌క్యాప్ ఫండ్స్ లార్జ్‌క్యాప్‌కు చాలా తక్కువగా అంటే.. సగటున 12 శాతం మేర కేటాయింపులు చేస్తున్నాయి. ఇవి ఎక్కువ శాతం పెట్టుబడులను మిడ్‌క్యాప్ స్టాక్స్‌కే కేటాయిస్తుంటాయి. మిడ్‌క్యాప్ ఫండ్ ఆస్తుల సైజు చిన్నగా ఉంటే అప్పుడు ఫండ్ మేనేజర్ లార్జ్‌క్యాప్ ఎక్స్‌పోజర్ బదులు నూరు శాతం పెట్టుబడులను మిడ్‌క్యాప్ కోసమే కేటాయించడం సరైన విధానం అవుతుంది. లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ వ్యాప్తంగా వైవిధ్యమైన పెట్టుబడులను మీరు కోరుకుంటుంటే అప్పుడు మిడ్‌క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడం మంచి నిర్ణయం కాబోదు. మల్టీక్యాప్ ఫండ్స్ అయితే లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో కనీసం 25 శాతం చొప్పున పెట్టుబడులు పెడుతుంటాయి. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు ఏ మార్కెట్ క్యాప్ విభాగంలో అయినా ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ వీటికి ఉంటుంది. అయినప్పటికీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ 80 శాతం వరకు లార్జ్‌క్యాప్ కంపెనీలకే కేటాయిస్తుంటాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టారిఫ్‌లు, ప్రపంచ మార్కెట్లపై దృష్టి
ఫండ్ పనితీరు మదింపు ఇలా..

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వడ్డీ రేట్లు తగ్గింపు

పావు శాతం కట్; గృహ రుణాలపై 8.10 శాతానికి చేరిక



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం) రిటైల్ రుణాలపై వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) తగ్గించింది. గృహ, కార్ల రుణాలకు ఇది వర్తిస్తుందని తెలిపింది. దీనితో గృహ రుణాలపై ప్రామాణిక రేటు 8.10 శాతానికి, కార్లపై రేటు 8.45 శాతానికి చేరినట్లు వివరించింది. అలాగే, రెపో ఆధారిత రుణ రేటుకు (ఆర్ఎల్ఎల్ఆర్) అనుసంధానమైన విద్య, ఇతరత్రా రుణాలపైనా వడ్డీరేటు పావు శాతం తగ్గినట్లు బ్యాంకు తెలిపింది. ఇప్పటికే గృహ, కార్ల రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేయడం లేదని, తాజాగా వడ్డీ రేట్లు కూడా తగ్గించడంతో కస్టమర్లు రెండు విధాలుగాను ప్రయోజనం పొందవచ్చని తెలిపింది. తాజా తగ్గింపుతో పరిశ్రమలోనే అత్యంత తక్కువ వడ్డీ రేటుకు గృహ రుణాలు అందిస్తున్నట్లవుతుందని బ్యాంకు పేర్కొంది. మరోవైపు, గిఫ్ట్ సిటీలో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ) బ్యాంకింగ్ యూనిట్‌ను ప్రారంభించేందుకు రిజర్వ్ బ్యాంక్ నుంచి అనుమతి లభించినట్లు వివరించింది.

న్యూ ఫండ్ ఆఫర్

360 వన్ గోల్డ్ ఈటీఎఫ్



360 వన్ అసెట్ మేనేజ్‌మెంట్ (గతంలో ఐఐఎఫ్ఎల్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) సంస్థ తాజాగా గోల్డ్ ఈటీఎఫ్‌ను ఆవిష్కరించింది. ఇది ఫిబ్రవరి 28 వరకు అందుబాటులో ఉంటుంది. కనీస దరఖాస్తు మొత్తం రూ. 500గాను, యూనిట్ ధర రూ. 10గా ఉంటుంది. దేశీయంగా బంగారం ధరలను ట్రాక్ చేసేలా ఈ ఓపెన్ ఎండెడ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ ఉంటుందని సంస్థ సీఈవో రాఘవ్ అయ్యంగార్ తెలిపారు. ఇది 95 శాతం భాగాన్ని పసిడి లేదా పసిడి సంబంధ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుందని వివరించారు. భౌతికంగా కొని దగ్గర పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా దీని ద్వారా పారదర్శకమైన విధంగా గోల్డ్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చని ఆయన పేర్కొన్నారు.

స్టాక్ వ్యూ

అదానీ ఎంటర్‌ప్రైజెస్ | బ్రోకరేజ్: వెంచురా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,125 **టార్గెట్: రూ. 3,801**



ఎందుకంటే: డైవర్సిఫైడ్ దిగ్గజం, పలు విజయవంత బిజినెస్‌ల ఇన్‌క్యుబేటర్ అదానీ ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) భారీ లక్ష్యాలతో గ్రీన్ హెచ్2లోకి ప్రవేశించింది. పర్యావరణ ఆధారిత భవిష్యత్ వృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తోంది. 2024 నవంబర్‌లో యూఎస్ న్యాయశాఖ (డీవోజే) నోటీసు నేపథ్యంలో షేరు ధర ఆటుపోట్లను చవిచూసింది. అయినప్పటికీ పటిష్ట మూలాలు (ఫండమెంటల్స్), నిర్వహణ సామర్థ్యం కారణంగా నిలదొక్కుకుంది. వెరసి 2024–27 మధ్య కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం వార్షికంగా 17.5 శాతం పుంజుకోగలదని భావిస్తున్నాం. ఈ బాటలో నిర్వహణ లాభం (ఇబిటా) 37.5 శాతం, నికర లాభం మరింత అధికంగా 45.8 శాతం చొప్పున జంప్ చేయగలవని అంచనా వేస్తున్నాం. దీంతో 2026–27కల్లా ఆదాయం రూ. 1,56,343 కోట్లకు, ఇబిటా రూ. 28,563 కోట్లకు చేరే వీలుంది. ఇక నికర లాభం రూ. 9,245 కోట్లను తాకవచ్చు. విమానాశ్రయాలు, సోలార్, డబ్ల్యూటీజీ విభాగాలలో అధిక వృద్ధితోపాటు.. కాపర్ బిజినెస్ పురోగతి ఆర్థికంగా పటిష్ట ఫలితాలకు దారి చూపే అవకాశముంది. తద్వారా లాభాల మార్జిన్లు సైతం బలపడనున్నట్లు భావిస్తున్నాం. వెరసి రిటర్న్ రేషియోలు.. ఆర్‌వోఈ 5.63 శాతం ఎగసి 14.5 శాతానికి, ఆర్‌వోఐసీ 0.99 శాతం మెరుగుపడి 11.3 శాతానికి చేరే వీలుంది. రానున్న దశాబ్ద కాలంలో రూ. 6.5–7 లక్షల కోట్ల పెట్టుబడులు వెచ్చించేందుకు కంపెనీ ప్రణాళికలు వేసింది. నిధులను ఎయిర్‌పోర్టులు, డేటా సెంటర్లు, కాపర్, గ్రీన్ హెచ్2 తదితర వ్యవస్థలపై వెచ్చించనుంది. నిధులను ప్రధానంగా రుణాల ద్వారా సమకూర్చుకోనుంది. దీంతో 2024కల్లా 1.2 రెట్లుగా ఉన్న నికర రుణాలు– ఈక్విటీ, 1.7 రెట్లుగా నమోదైన నికర రుణాలు– ఇబిటా నిష్పత్తిని 2027కల్లా 1.8 రెట్లు, 2.2 రెట్లకు చేర్చనుంది.

ఒబెరాయ్ రియల్టీ | బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,578 **టార్గెట్: రూ. 2,560**



ఎందుకంటే: రియల్టీ రంగ దిగ్గజం ఒబెరాయ్ రియల్టీ వ్యూహాత్మకంగా కీలక మార్కెట్లలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. అధిక వృద్ధి అవకాశాలు, ప్రీమియం ప్రాజెక్టులకు వీలున్న ఢిల్లీ ఎన్‌సీఆర్ తదితర ప్రాంతాలలో ప్రాజెక్టులు చేపడుతోంది. ఆయా ప్రాంతాలలో ఇటీవల కొంతకాలంగా ఖరీదైన (ప్రీమియం) గృహాలకు డిమాండ్ పెరుగుతోంది. వెరసి కంపెనీ వసూళ్ల (కలెక్షన్స్) పెరిగేందుకు ఇవి దోహదపడనున్నాయి. తద్వారా కొత్త ప్రాంతాలలో బలపడేందుకు విస్తరణ కార్యకలాపాలపై దృష్టిపెట్టింది. దీంతో ఆయా ప్రాంతాలలో ప్రాజెక్టులు ప్రవేశపెట్టిన తొలి ఏడాదిలోనే 40–50 శాతం బుకింగ్స్‌ను సాధించింది. వెరసి థానే ప్రాజెక్టు ప్రవేశపెట్టేందుకు కంపెనీకి జోష్ లభించింది. అంతేకాకుండా దీని ద్వారా మరిన్ని అదనపు ప్రాజెక్టులకు దారి ఏర్పడనుంది. వెరసి 2026–27కల్లా బుకింగ్స్ విలువ రూ. 9,000 కోట్లను అధిగమించవచ్చని అంచనా. ఇందుకు థానే, దక్షిణ ముంబై, ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాలలోని ప్రాజెక్టులు సహకరించనున్నాయి. ఇందుకు అనుగుణంగా కంపెనీ రానున్న త్రైమాసికాలలో వరుస ప్రాజెక్టులను ప్రవేశపెట్టే వ్యూహాలను అమలు చేయనుంది. పటిష్ట యాన్యుటీ బిజినెస్‌కుతోడు.. విక్రయానికి సిద్ధంగా ఉన్న ఇన్వెంటరీ అవసరమైన నగదు లభ్యతకు మద్దతివ్వనున్నాయి. మరోపక్క కంపెనీ చిన్న మార్కెట్లలో తగిన భూములను (ల్యాండ్ పార్సెల్) కొనుగోలు చేస్తోంది. తద్వారా భౌగోళికంగా విస్తారిత పోర్ట్‌ఫోలియోను నిర్మించుకునే బాటలో సాగుతోంది. వ్యూహాత్మకంగా కంపెనీ తక్కువ స్థాయి రుణ భారం ద్వారా బ్యాలన్స్‌షీట్‌ను మరింత పటిష్ట పరచుకునే బాటలో సాగుతోంది. అయితే కంపెనీ లక్ష్యాలకు అనుగుణంగా పలు ప్రాజెక్టులను ప్రవేశపెట్టవలసి ఉంటుంది. తద్వారా ఆశించిన జీడీవీని అందుకోవడంతోపాటు.. ముందస్తు బుకింగ్స్‌ను సాధించగలుగుతుంది. ఈ ఏడాది తొలి అర్ధభాగం (ఏప్రిల్–డిసెంబర్)లో పనితీరు మందగించడం గమనార్హం!

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

స్థూల భారతం.. మందుల మార్గం!



జీవన శైలిలో మార్పులు, శరీరానికి వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్ వినియోగం పెరగడంతో.. మన దేశంలో స్థూలకాయుల సంఖ్య ఏటేటా మరింతగా పెరిగిపోతోంది. 'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్ఎస్)'2022 ప్రకారం ప్రతి నలుగురు భారతీయుల్లో ఒకరు అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారు. దాదాపు 8 కోట్ల మంది ఇప్పటికే స్థూలకాయుల కేటగిరీలోకి చేరగా.. మరో 3 కోట్ల మంది వయోజనులు పొట్ట చుట్టూ అధిక కొవ్వు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్టు అంచనా. ఒబేసిటీ అత్యధికంగా ఉన్న టాప్-10 దేశాల జాబితాలోకి భారత్ కూడా చేరిపోయింది. దీంతో అంతర్జాతీయ ఫార్మా దిగ్గజాలు కూడా మన దేశం వైపు చూస్తున్నాయి. ఇప్పటికే బరువు తగ్గించే పలు రకాల మందులు మార్కెట్లో ఉండగా.. మరికొన్ని ఔషధాలు మన మార్కెట్లోకి రానున్నాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్

దేశంలో పెరిగిపోతున్న స్థూలకాయులు.. యాంటీ-ఒబేసిటీ ఔషధాలకు డిమాండ్

290% నాలుగేళ్ల వ్యవధిలోనే అమ్మకాల్లో వృద్ధి	ఈ పరిస్థితిని సొమ్ము చేసుకునేందుకు రంగంలోకి అంతర్జాతీయ ఫార్మా కంపెనీలు
	కొత్త ఔషధాలను ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు

మన దేశ 'స్థూల'లెక్కలివీ..

మన దేశంలో స్థూలకాయంతో బాధపడుతున్నవారు	**8** కోట్లు
పొట్టచుట్టూ అధిక కొవ్వుతో ఇబ్బందిపడుతున్నవారు	**3** కోట్లు
ప్రమాణాలకు మించి అధిక బరువు ఉన్నవారు: ప్రతి నలుగురిలో ఒకరు	యాంటీ-ఒబేసిటీ చికిత్సలకు ప్రతినెలా అయ్యే ఖర్చు: సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేలు
2020 నవంబర్‌లో యాంటీ ఒబేసిటీ ఔషధాల అమ్మకాలు: రూ.**137** కోట్లు	నాలుగేళ్లలో ఈ మందుల మార్కెట్ పెరిగిన శాతం: **290** శాతం
	2004లో బరువు తగ్గించుకునే సర్జరీలు: సుమారు **200**
2024 నవంబర్ నాటికి యాంటీ ఒబేసిటీ ఔషధాల అమ్మకాలు: రూ.**535** కోట్లు	2019లో జరిగిన బరువు తగ్గించుకునే సర్జరీలు: 20 వేలకుపైనే...

ఒబేసిటీ చికిత్సలో ఉపయోగించే ఔషధాలను జీఎల్‌పీ-1 (గ్లూకగాన్ తరహా పెప్టైడ్ రిసెప్టర్ ఎగోనిస్ట్స్)గా వ్యవహరిస్తారు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను, ఆకలిని నియంత్రించే హార్మోన్లుగా పనిచేస్తాయి. పొట్ట నిండుగా ఉన్నట్లుగా మెదడుకు సంకేతాలు పంపించి, పొట్ట ఖాళీ అయ్యే ప్రక్రియను నెమ్మదింపజేసి, బరువు తగ్గించుకునేందుకు తోడ్పడతాయి. అంతర్జాతీయంగా యాంటీ-ఒబే

మూడింతలు పెరిగిన మార్కెట్..

సిటీ ఔషధాల అమ్మకాలు 2024లో సుమారు 13 బిలియన్ డాలర్లుగా ఉండగా... 2035 నాటికి 105 బిలియన్ డాలర్లకు చేరొచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. మన దేశంలోనూ బరువు తగ్గించే మందులకు డిమాండ్ పెరుగుతోంది. 2020 నవంబర్‌లో వీటి అమ్మకాలు రూ.137 కోట్లుగా ఉంటే.. 2024 నవంబర్ నాటికి రూ.535 కోట్లకు చేరాయి. అంటే సుమారు 290 శాతం పెరిగింది. ఒబేసిటీ సర్జరీ సొసైటీ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం బరువు తగ్గేందుకు చేయించుకునే సర్జరీలు 2004లో సుమారు 200 మాత్రమేకాగా... 2019 నాటికి ఏకంగా 100 రెట్లు పెరిగి 20,000కు చేరుకున్నాయి. స్థూలకాయంతో బాధపడుతున్నవారిలో హైపర్‌టెన్షన్, మధుమేహం, కాలేయ వ్యాధులు వంటి సమస్యలూ వస్తాయి. వీటి చికిత్సల్లో ఉపయోగించే ఔషధాలకూ డిమాండ్ పెరిగిపోతోంది.

యాంటీ-ఒబేసిటీ చికిత్స ఆషామాషీ వ్యవహారం కాదని డాక్టర్లు చెబుతున్నారు. సాధారణంగా ఈ చికిత్సలకు నెలకు రూ.40,000 నుంచి రూ.50,000 వరకు ఖర్చవుతుందని అంటున్నారు. ఈ ఔషధాలను దీర్ఘకాలంపాటు తీసుకుంటేనే ఫలితాలు కనిపిస్తాయని, మధ్యలో ఆపేస్తే అప్పటిదాకా చేసినదంతా వృథా అవుతుందని

ఖరీదైన వ్యవహారంగా చికిత్స..

పేర్కొంటున్నారు. అంతేకాదు ఒకే మందు అందరికీ పనిచేయదని... శరీరతత్వాన్ని బట్టి ఒక్కొక్కరికి ఒక్కో రకం ఔషధం వాడాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఇక యాంటీ ఒబేసిటీ మందులతో కొన్ని దుష్ఫలితాలకూడా వచ్చే అవకాశం ఉండటంతో.. చాలా మంది మధ్యలోనే ఆపేస్తూ ఉంటారు. కొన్నిరకాల ఔషధాలను దీర్ఘకాలం ఉపయోగిస్తే ఇతర దుష్ప్రభావాలు తలెత్తవచ్చనే అభిప్రాయం కూడా ఉంది. అయినా మన దేశంలో యాంటీ ఒబేసిటీ ఔషధాల వినియోగం పెరుగుతోంది. సెమాగ్లూటైడ్, లిరాగ్లూటైడ్, డ్యూలాగ్లూటైడ్, ఒర్లిస్టాట్, టిర్జెపైడ్ వంటి ఫార్ములాల ఆధారిత ఔషధాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

అంతర్జాతీయ కంపెనీల కన్ను..

భారత్‌లో బరువు తగ్గే మందులకు డిమాండ్ నెలకొనడంతో.. అంతర్జాతీయ ఫార్మా కంపెనీలు మన దేశంపై దృష్టి పెడుతున్నాయి. డెన్మార్క్ కంపెనీ నావో నోర్డిస్క్‌కు చెందిన ఓరల్ సెమాగ్లూటైడ్ ట్యాబ్లెట్ రైబెల్సస్‌ను 2022లో దేశీ మార్కెట్లో ప్రవేశపెట్టగా.. అది 65 శాతం యాంటీ-ఒబేసిటీ మార్కెట్‌ను ఆక్రమించింది. దీంతో సెమాగ్లూటైడ్ ఇంజెక్షన్లను కూడా భారత్‌లో ప్రవేశపెట్టేందుకు ఆ కంపెనీ కసరత్తు చేస్తోంది. వెగోవీ, ఒజెంపిక్ వంటి ఔషధాల వినియోగం కూడా మనదేశంలో భారీగానే ఉంటోంది. మరింత బాగా పనిచేస్తాయని పేరుండి.. మన దగ్గర విక్రయించని కొన్ని ఔషధాలను అనధికారిక మార్గాల్లో తెప్పించుకునే ధోరణి కూడా పెరుగుతోంది. ఇక అమెరికాకు చెందిన ఎలై లిల్లీ కంపెనీ సైతం టిర్జెపైడ్ ఆధారిత మౌంజారో ఔషధాన్ని మార్కెట్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మన దేశీయ కంపెనీలు కూడా బరిలోకి దిగుతున్నాయి. గ్లెన్‌మార్క్ ఇప్పటికే లిరాగ్లూటైడ్ జనరిక్ వెర్షన్‌ను ప్రవేశపెట్టగా.. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా తదితర కంపెనీలు పేటెంట్ ముగిసిన జీఎల్‌పీ-1 ప్రత్యామ్నాయాల మీద పని చేస్తున్నాయి. సన్ ఫార్మా కూడా ఈ విభాగంలో కొత్త మాలిక్యూల్‌పై పరిశోధన చేస్తోంది.

అవస్థల 'అపార్'!

విద్యార్థుల విశిష్ట గుర్తింపునకు ఇక్కట్లు ఎన్నెన్నో..

ఆధార్, స్కూల్ రికార్డు, యూడైస్‌లలో వివరాలు ఒకేలా ఉంటే సరే..

సాక్షి, హైదరాబాద్: 'ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ ఎకౌంట్ రిజిస్ట్రీ (అపార్)'.. ప్రతి విద్యార్థికి శాశ్వత గుర్తింపు నంబర్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సరికొత్త విధానం. ఒకటో తరగతి మొదలు పన్నెండో తరగతి వరకు ప్రతి విద్యార్థి పూర్తి వివరాలను అపార్ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత.. వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య జనరేట్ అవుతుంది.. అదే అపార్ ఐడీ. విద్యార్థుల చదువుకు సంబంధించిన అన్ని రకాల వివరాలు, సర్టిఫికెట్లు అందులో నిక్షిప్తమవుతాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ సాగుతోంది. రాష్ట్రంలోని 40 వేల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల పరిధిలో సుమారు 65 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో అపార్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఇప్పటివరకు 60 శాతం కూడా నమోదు పూర్తికాలేదు.

మూడింటిలోనూ సరిపోలితేనే..

విద్యార్థి తొలుత పాఠశాలలో చేరినప్పుడు రాసిన అడ్మిషన్ రిజిస్టర్, అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన యూడైస్ ప్లస్ వివరాలు, ఆధార్‌లోని వివరాలు.. ఇలా మూడింటిలోనూ విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల వివరాలు సరిపోలితేనే అపార్ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసే వీలుంటుంది. ఏ ఒక్కదానిలో, ఏ వివరాల్లోనైనా తేడా ఉంటే అపార్ ప్రక్రియ పూర్తవడం లేదు. బర్త్ సర్టిఫికెట్‌లో పూర్తిగా వివరాలు లేకపోవడం, ఆధార్‌లో ఇంటిపేరుకు బదులు ఒక్క అక్షరమే ఉండటం, పుట్టినతేదీ తప్పుగా ఉండటం, పేరులో అక్షర దోషాలు వంటి సమస్యలు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. వీటిని సవరించుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యాలు సూచిస్తున్నాయి. వీలైనంత త్వరగా సర్టిఫికెట్లు తెస్తే అపార్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తామని ఒత్తిడి చేస్తున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న మధ్యవర్తులు, అధికారులతో చేతులు కలిపి.. అందినకాడికి దండుకుని సర్టిఫికెట్లు ఇప్పిస్తున్నారు.

ఫిర్యాదు చేసేదెలా...?

జనన ధ్రువపత్రాల జారీ, పొరపాట్ల సవరణకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ అంతా మీసేవ కేంద్రాల ద్వారానే జరుగుతోంది. అయితే దరఖాస్తు చేసిన సర్టిఫికెట్లను మాన్యువల్‌గా తీసుకురావాలనే సాకు చూపుతూ స్థానిక సంస్థల అధికారులు దరఖాస్తుల పరిశీలనను నిలిపివేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న మీసేవ కేంద్రాల నిర్వాహకులు, ఇతర దళారులు దరఖాస్తుదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. అధికారులతో కుమ్మక్కై వెంటనే సర్టిఫికెట్లు సిద్ధం చేసి ఇస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న ఈ తంతు దరఖాస్తుదారులకు అర్థమయ్యే పరిస్థితి లేదు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఎలాగోలా త్వరగా పనికావాలన్న ఉద్దేశంతో దళారులను ఆశ్రయిస్తున్నారు.

నమోదు ప్రక్రియను సులభతరం చేయాలి

అపార్ ఉద్దేశం మంచిదే అయినా వివరాల నమోదు ప్రక్రియ ప్రహసనంగా మారింది. ఆధార్, యూడైస్, స్కూల్ రికార్డుల్లోని వివరాలన్నీ సరిపోలినప్పుడే పోర్టల్‌లో వివరాలను ఎంట్రీ చేయగలిగే పరిస్థితి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన మెజార్టీ పిల్లల స్కూల్ వివరాలు, ఆధార్ వివరాల్లో చిన్నపాటి పొరపాట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకూ ఈ సమస్య ఉంది. సరైన వివరాలను నమోదు చేస్తే తప్ప వెబ్‌సైట్‌లో అపార్ వివరాలు జనరేట్ కావు.



ప్రస్తుతం ఆధార్ తప్పనిసరి చేసినప్పటికీ.. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణతో వివరాల నమోదుకు అవకాశం కల్పించాలి. అప్పుడే అపార్ నమోదు ప్రక్రియ నూరుశాతం పూర్తవుతుంది. దీనిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించాం. కానీ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు కావడంతో మార్పులు చేసే వీలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని చెబుతున్నారు.

- సిద్దగోని గిరిధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం

రాష్ట్రంలో కేటగిరీల వారీగా పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య

కేటగిరీ	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	20,539	8,98,588
ప్రాథమికోన్నత	7,482	9,16,869
ఉన్నత	11,561	39,92,429
హయ్యర్ సెకండరీ	1,393	7,33,199
మొత్తం	40,975	65,41,085

బర్త్ సర్టిఫికెట్‌లో మార్పు కోసం రూ.5 వేలు తీసుకున్నారు



మా ఇద్దరు పిల్లలకు సంబంధించి అపార్ వివరాలు నమోదుకావడం లేదని స్కూల్ టీచర్ ఫోన్ చేసి చెప్పారు. ఆధార్‌లో ఇంటిపేరు పూర్తిగా ఉంటే, జనన ధ్రువీకరణ పత్రంలో షార్ట్ ఫామ్‌లో ఉంది. దీంతో బర్త్ సర్టిఫికెట్‌లో వివరాలు మార్పించాలన్నారు. దీనికోసం స్థానికంగా ఉన్న మీసేవ కేంద్రానికి వెళ్లాను. గెజిటెడ్ సంతకం, అఫిడవిట్‌తోపాటు మున్సిపల్ కార్యాలయంలో పని పూర్తి చేయించేందుకు రూ.5 వేలు వసూలు చేశారు. వారం తర్వాత సర్టిఫికెట్ వచ్చింది. స్కూల్‌లో ఇచ్చి అపార్ వివరాలను నమోదు చేయించాను.

- టి.యాకయ్య, జగద్గిరిగుట్ట, మేడ్చల్ జిల్లా

అన్ని ధ్రువపత్రాలు సమర్పించినా తిరస్కరించారు



మా అబ్బాయి బర్త్ సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల పేర్లు ఇంటిపేరుతో కాకుండా ఒక్క మొదటి అక్షరంతో ఉన్నాయి. వాటిని మార్చి పూర్తి ఇంటిపేరు సరి చేయడానికి మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేశాను. ఆ పత్రాలను ప్రింట్ తీసుకుని ఎల్బీ నగర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాను. ఆధారాలను సమర్పించినా మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలంటూ మెలిక పెట్టి రెండు వారాల తర్వాత దరఖాస్తును తిరస్కరించారు.

- బందె గిరిజ, ఎల్బీ నగర్, రంగారెడ్డి జిల్లా



ఓయూ పీహెచ్‌డీ ప్రవేశపరీక్షకు 4800 దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష-2025కు 4800 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు సమీపిస్తున్నందున అర్హులైన అభ్యర్థులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి చివరి వారం నుంచి ప్రారంభమయ్యే పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల కోసం.. మార్చి 1 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. యూజీసీ నెట్, సెట్, జేఆర్‌ఎఫ్ అభ్యర్థులు కూడా ఓయూ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డులు



కోలాటం ఆడుతున్న భక్తులు

ఖమ్మం గాంధీచౌక్: ఖమ్మం నగరంలోని పెవిలియన్ మైదానంలో ఆదివారం నిర్వహించిన శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా సాగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన మూడు వేల మందికి పైగా భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణానికి శ్రీకారం చుట్టగా.. భక్తులు లక్ష హనుమాన్ చాలీసా (108 సార్లు)ను పఠించారు. వేదిక ఎదుట మహిళా భక్త బృందాలు కోలాటం ఆడగా.. శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి వలంటీర్లు భక్తులకు సేవలందించారు. భక్తులు, ఇతరులతో కలిపి మొత్తం నాలుగు వేల మందికి అన్నదానం చేశారు. కాగా ఈ శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డులు దక్కాయి. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా కార్యక్రమాన్ని నిర్వహించడంతోనే అవార్డులకు ఎంపిక చేశామని ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గన్నవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
సోమవారం। 24-2-2025


మల్లన్నగుట్టే.. చిన్న శ్రీశైలం

కోరిన కోర్కెలు తీర్చే స్వామివారు


గుహాంతరాళమున వెలసిన శివలింగం


ప్రధాన దేవాలయం ఎదురుగా గల నందీశ్వరుని విగ్రహం


మల్లన్నగుట్టపై గల ఏకశిలతో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ప్రధాన దేవాలయం


నిధానపల్లి మల్లన్నగుట్ట (చిన్న శ్రీశైలం)

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిధానపల్లి గ్రామ శివారులోని మల్లన్నగుట్ట చిన్న శ్రీశైలంగా పేరొందింది. గుట్టపై ఉన్న ప్రధాన దేవాలయంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కొలువై ఉన్నాడు. క్షేత్రం ఎగువభాగంలోని గుహాంతరాళమున మహామునుల తపో స్థలములు, స్వామివారి పుట్టులింగములు ఉండటం మల్లన్నగుట్ట ప్రత్యేకత. మునుల తపస్సు చేత ప్రసిద్ధి చెందిన గుట్టపై కొలువై ఉన్న మల్లికార్జునస్వామి భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీరుస్తాడని ప్రజల నమ్మకం. ప్రతీ సంవత్సరం మాఘ మాసం బహుళ త్రయోదశి నుంచి పాల్గుణమాసం విదియ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తారు.

గుట్టపై నిద్రిస్తే రోగాలు మాయం

మల్లన్నగుట్టపై సువిశాలమైన మైదానం ఉంది. హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. పరిసర గ్రామాల ప్రజలు వివిధ పర్వదినములలో స్వామివారి దర్శనం కోసం పరితపిస్తుంటారు. నూతన కార్యక్రమాలను గుట్టపై గల దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రారంభిస్తారు. ఎంతటి క్లిష్టమైన ఆపదల నుంచైనా భగవంతుడు తమను రక్షిస్తాడని భక్తుల ప్రగాఢమైన నమ్మకం. గుట్టపై నిద్ర చేస్తే ఆయురారోగ్యములు, భోగ భాగ్యాలు పొందుతామని ప్రజలు విశ్వసిస్తారు.


మల్లన్నగుట్టపైకి గల ఘాట్ రోడ్డు

కోనేరు నీటితో సకల శుభాలు

గుట్టపైకి వెళ్లేమార్గంలో సహజ సిద్ధమైన కోనేరు ఉంది. కోనేటిలో ఏడాది పొడవునా నీరు ఉంటుంది. కోనేటి నీటిని ప్రజలు పరమ పవిత్రంగా భావిస్తారు. కోనేటిలోని నీటిని తీసుకెళ్లి పంటలపై చల్లితే చీడపీడలు తొలగి పంటలు సమృద్ధిగా పండుతాయని, పశువులపై చల్లితే పుష్కలంగా పాలు ఇస్తాయని, రోగాలు మాయమవుతాయని ప్రజల విశ్వాసం.

ఈ ఏడాది జరిగే బ్రహ్మోత్సవాల వివరాలు

- ఈనెల 26న గణపతి పూజ, స్వస్తివాచనము, అంకురార్పణ, బ్రహ్మకలశ స్థాపనలు, ధ్వజారోహణం, ఉత్సవాల విగ్రహాలు గుట్టపైకి వేంచేయుట
- 27న స్వామివారి అర్జిత సేవలు, ప్రభోత్సవం, షావలు, రాత్రి కల్యాణ మహోత్సవం
- 28న రుద్ర చండీహవనం, అన్న ప్రసాద వితరణ, వీర భద్రేశ్వరస్వామి పూజ, ఖడ్గాలు, ప్రభల ఊరేగింపు, భద్రకాళి అమ్మవారి పూజ తెల్లవారుజామున అగ్నిగుండాల మహోత్సవం 29న గెలుపు, మహదాశీర్వచనములు ఉంటాయి.

అత్యంత మహిమాన్వితుడు




మల్లన్నగుట్టపై కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి పట్ల పరిసర ప్రాంత ప్రజలకు అపారమైన నమ్మకం. ఇక్కడ కొలువై ఉన్న స్వామివారు అత్యంత మహిమాన్వితుడు. బాధల నుంచి విముక్తి కలిగించే దైవమని భక్తుల నమ్మకం. ఏటా బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

–బేతోజు సత్యనారాయణశాస్త్రి, ప్రధానార్చకుడు

మెరుగైన రోడ్డు సౌకర్యం

నిధానపల్లి మల్లన్నగుట్ట(చిన్న శ్రీశైలం) చిట్యాల–భువనగిరి రోడ్డుకు సమీపంలో ఉంటుంది. గుట్టపైకి వాహనాలు వెళ్లడానికి ఘాట్‌రోడ్డు ఉంది. వాహనాల పార్కింగ్‌కు విశాలమైన మైదానం ఉంది. గత ఏడాది మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన సొంత డబ్బులతో ప్రధాన దేవాలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేయడానికి బండరాళ్లను తొలగింపజేశారు.


అత్యంత మహిమాన్వితమైన కోనేరు

సింగరేణి భవన్‌కు క్వీన్స్‌ల్యాండ్ ఆర్థిక మంత్రి నేడు

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణ మంత్రి రాస్‌బేట్స్ సోమవారం సింగరేణి భవన్‌ను సందర్శించనున్నట్లు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ ఎన్.బలరామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి భవన్‌ను సందర్శిస్తున్న తొలి విదేశీ మంత్రి రాస్‌బేట్స్ కావడం విశేషం. ఈ సందర్భంగా సింగరేణి భవన్‌లో ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో సింగరేణి అధికారులు, క్వీన్స్‌ల్యాండ్ మంత్రి, విదేశీ అధికారుల బృందంతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. మైనింగ్ రంగంలో అధునాతన టెక్నాలజీ విషయంలో సహకారంపై చర్చించనున్నారు. సింగరేణి థర్మల్ ప్లాంట్లకు అవసరమైన వనాడియం లాంటి క్రిటికల్ మినరల్స్ నిల్వలు క్వీన్స్‌ల్యాండ్‌లో పుష్కలంగా ఉన్నాయి. అవే కాకుండా కాపర్, గ్రాఫైట్, కోబాల్ట్, ఇండియం తదితర క్రిటికల్ మినరల్స్ రంగంలోనూ సింగరేణి–క్వీన్స్‌ల్యాండ్ మధ్య పరస్పర సహకారంపై కీలక చర్చ జరగనుంది.

ఎండోమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సతీశ్



సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో దేవాదాయ శాఖ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది చింతలచెర్వు సతీశ్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల లేదా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. తనను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించినందుకు.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.



చిలుకమ్మా .. కల్లు బాగుందా?

దొండపండు రంగు ముక్కుతో తాటి కల్లు తాగింది. ఆసాంతం రుచి ఆస్వాదిస్తూ.. అక్కడికక్కడే తిరిగింది. తాగింది చాలన్నట్లు తుర్రుమని ఎగిరిపోయింది. పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట శివారు తాటివనంలో ఒక రామ చిలక కల్లు రుచి చూస్తూ కెమెరాకు చిక్కింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి




వేసవికాలం సమీపిస్తుండటంతో ఈసీఐఎల్ నాగారం వద్ద కుమ్మరిబట్టీలో కుండలు తయారు చేస్తున్న దృశ్యం

చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు



జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అదే పరిస్థితి కనిపించింది. వివాహాది శుభకార్యాలు అధికంగా ఉండడంతోపాటు వారాంతపు సెలవు కూడా తవ్వడంతో ప్రజలు పెద్దఎత్తున రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై రద్దీ కొనసాగింది. రద్దీని నియంత్రించేందుకు తంగడపల్లి చౌరస్తా వద్ద హైవేపై జంక్షన్‌ను మూసేశారు.


హైదరాబాద్‌లోని ముస్లింజంగ్ పూల్ వద్ద భారీగా ఉన్న పావురాలకు నీళ్లు పోస్తున్న యువకుడు

అపురూపాల మంత్రపురి

- పురాతన వస్తువుల ప్రదర్శనకు ‘మంత్రపురి దర్శన్’నిర్మాణం
- సీతారామ సేవా సదన్ సంస్థ కృషి
- మంత్రముగ్ధుల్ని చేస్తున్న అలనాటి పరికరాలు
- తిలకించేందుకు వస్తున్న ప్రవాసులు, విద్యార్థులు


మంత్రపురి దర్శన్ నిలయం

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని ప్రాచీన పట్టణం. సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు. ఆ గ్రామంలో ప్రజల ఆహారపు అలవాట్లు, వినియోగించే వస్తువులు.. ఇలా అన్నీ భిన్నంగానే ఉంటాయి. ఉన్నతోద్యోగాలు, ఉపాధి కోసం.. మంత్రపురివాసులు ప్రపంచంలోని వివిధ దేశాల్లో స్థిరపడిపోయారు. సమాజంలో మార్పులకు ఇక్కడి ప్రజలు కూడా అలవాటు పడిపోతున్నారు. కానీ మంథనిలోని సీతారామ సేవా సదన్ స్వచ్ఛంద సేవా సంస్థ.. ఈ గ్రామస్తులు తరతరాలుగా వినియోగించిన విలువైన పురాతన వస్తు సామగ్రిని భవిష్యత్‌తరాలకు అందించేందుకు కృషి చేస్తోంది. అందుకోసం మంత్రపురిలోని పురాతన ఇళ్లు, వాటిలోని వస్తుసామగ్రి, వంటలు, వ్యవసాయ.. తదితర అవసరాలకు ఉపయోగించే పురాతన వస్తువులను సేకరించి ప్రదర్శించేందుకు మంత్రపురి దర్శన్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో పురాతన వంట సామగ్రి, ధాన్యం నిల్వచేసే గాదెలు, కొలతలు, ప్రమాణాల పరికరాలు, వ్యవసాయ పరికరాలు, ఎండ, వేడి, చలిని తట్టుకునేలా సొనార్పి (మిద్దె), పాలతం.. తదితర సుమారు ఐదు వందల రకాల వస్తువులను ప్రదర్శనగా ఉంచారు. ఇందు కోసం ఓ ఇంటిని ప్రత్యేకంగా నిర్మించారు. ప్రజల సందర్శనార్థం రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శన శాలను తెరిచి ఉంచుతున్నారు. వివిధ దేశాల్లో స్థిరపడి స్వస్థలానికి వచ్చిన ప్రవాసులు.. ఈ పురాతన వస్తువులను దర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. మంథనితోపాటు చుట్టు పక్కల ప్రాంతాల విద్యార్థులకు ఇందులో అవకాశం కలిస్తున్నారు. పురాతన వస్తుసామగ్రి సేకరణకు దాదాపు మూడేళ్లకు పైగా సమయం పట్టిందని, మరో 50 ఏళ్ల ఇవి ఉండేలా ఇంటిని నిర్మించామని సేవా సదన్ వ్యవస్థాపకుడు గట్టు నారాయణ గురూజీ, అధ్యక్షుడు కర్నే హరిబాబు తెలిపారు.

నేటితరం కోసం..

భారతీయ ఆచారాలు, వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రకృతిలో లభించే అనేక వస్తువులు కనుమరుగవుతున్నాయి. ఈక్రమంలో నాటి కుటీర, గ్రామీణ వ్యవస్థ, వస్తువులను నేటితరానికి చూపించాలనే ఆకాంక్షతోనే గట్టు నారాయణ గురూజీ ఈ అవకాశం కల్పించారు. విద్యార్థులు, యువత అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– దుద్దిళ్ల గణపతి, ప్రధాన కార్యదర్శి, సేవాసదన్, మంథని

ఎన్టీపీసీ, సింగరేణిలో ప్రదర్శన

మంత్రపురి దర్శన్‌లోని తాళపత్ర గ్రంథాలతోపాటు ఇతర పురాతన వస్తువులను ఎన్టీపీసీ, సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు తీసుకెళ్లి తమ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచారు. ఇలా పలుమార్లు పలు సంస్థలు.. ఇతర ప్రాంతాల వారు వచ్చి ఈ పురాతన వస్తువులను తీసుకెళ్లి తమ కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నారు. ఆ తర్వాత మళ్లీ తీసుకొచ్చి మంత్రపురి దర్శన్ నిర్వాహకులకు అప్పగిస్తున్నారు.


ధాన్యం నిలువ చేసుకునే గాదె


వ్యవసాయ పరికరాలు


ధాన్యం కొలిచే సోలలు

క్లుప్తంగా...

వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం తీరు ఆక్షేపణీయం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆగ్రహం

సాక్షి, అమరావతి: అక్రమ వలసదారుల పేరుతో యువతను అమెరికా ప్రభుత్వం క్రూరమైన పద్ధతుల్లో జంతువులను, నేరస్తులను వేటాడుతున్న తీరులో ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అమెరికా పార్లమెంట్ ముందు నుంచి ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. అక్రమ వలస దారులను తిప్పి పంపడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, ట్రంప్ ప్రభుత్వం ఎన్నుకున్న విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భారత ప్రధాని మోదీ అమెరికాకు వచ్చి ట్రంప్‌తో చర్చలు జరిపిన మరుసటి రోజు నుంచే ట్రంప్ ప్రభుత్వం వలసదారుల పట్ల అమానుషంగా వ్యవహరించడం దుర్మార్గమని చెప్పారు. అమెరికా ప్రభుత్వం తీరుతో యువత జీవితం నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వలసదారులను గుర్తించడం, వారికి కొంత సమయం ఇచ్చి సుహృద్భావ వాతావరణంలోనూ, తగినంత సమయం ఇచ్చి తిప్పి పంపే ఏర్పాటు చేసి ఉండాల్సిందని నారాయణ హితవు పలికారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడొద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మండిపాటు

సాక్షి, అమరావతి: గ్రూప్–2 మెయిన్స్ పరీక్షల విషయంలో అభ్యర్థులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇప్పటికైనా వారితో చర్చించి వారు లేవనెత్తిన రోస్టర్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసి రోస్టర్ పాయింట్స్‌లో జరిగిన లోటుపాట్లను సరిదిద్దాలని నిరుద్యోగులు గత కొద్దిరోజులుగా చేస్తున్న ఆందోళనను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. వారిని చర్చలకు పిలిచి పరిష్కరించాల్సిన ప్రభుత్వం కోచింగ్ సెంటర్ల మీద, ఆందోళనల్లో ఉన్న నిరుద్యోగుల మీద తప్పుడు ప్రచారానికి దిగడం గర్హనీయమన్నారు. పరీక్షలు వాయిదా వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు లీకులు వదిలి నిరుద్యోగులను భ్రమల్లో పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం దుర్మార్గమన్నారు. ఏదో ఒక రకంగా న్యాయ వివాదంలోకి దించి రిక్రూట్‌మెంట్ ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. మెగా డీఎస్సీని వాయిదా వేస్తున్న తీరు కూడా దీన్ని బలపరుస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ విషయంలో జరిగిన లోటుపాట్లు సరిదిద్దేందుకు నిరుద్యోగులతో చర్చించాలని, ప్రతిష్టకు పోకుండా న్యాయ నిపుణులతో, విద్యావేత్తలు, మేధావులతో చర్చించి ఈ సమస్యను పరిష్కరించాలని శ్రీనివాసరావు హితవు పలికారు.

సభలో మన విధానాలను బలంగా వినిపిద్దాం

పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అసెంబ్లీ సమావేశాల్లో జనసేన పార్టీ విధివిధానాలను బలంగా వినిపించాలంటూ అధినేత పవన్‌కళ్యాణ్ సూచించారు. బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి మొదలవుతున్న నేపథ్యంలో జనసేన పార్టీ శాసనసభాపక్ష సమావేశం ఆదివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలను ఉద్దేశించి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. 'అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జనసేన పార్టీ సామాన్యుడి గొంతుగా ఉండాలి. ఇందుకు అనుగుణంగా ప్రతి సభ్యుడు చర్చల్లో పాల్గొనాలి. శాసనసభ సంప్రదాయాన్ని, మర్యాదను కాపాడుతూ హుందాగా ముందుకు వెళ్దాం. చట్టసభల్లో మనం మాట్లాడే ప్రతి విషయాన్ని ప్రజలంతా చూస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. సభలో ఎదుట వారు మాట్లాడినప్పుడు స్పందించే సందర్భంలో హుందాగా సమాధానం ఇవ్వండి' అని వివరించారు. తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పార్టీ సభ్యులు సభలో ఉపయోగించే భాషతో సహా ప్రతి విషయంలో సీనియర్ సభ్యులు నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధ ప్రసాద్ ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తూ ఉండాలని పవన్‌కళ్యాణ్ సూచించారు. సమావేశానికి పార్టీ ఎంపీలు కూడా హాజరయ్యారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి


ఏపీ రైతు సంఘం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థులుగా ఉమ్మడి కృష్ణా–గుంటూరు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావు, డీ.వీరరాఘవులును అలాగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజక వర్గం నుంచి విజయగౌరిలను గెలిపించాలని రైతులు, రైతు కుటుంబాల సభ్యులకు ఏపీ రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వీరికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం ఉందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీ కృష్ణయ్య, కే ప్రభాకరరెడ్డి అన్నారు.

పర్యాటకంపై ప్రై'వేటు'

రాష్ట్రంలో అత్యధిక ఆదాయం వచ్చే 11 యూనిట్లపై కన్ను

- 11 యూనిట్లలో రూ.82.12 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టిన గత ప్రభుత్వం
- చెన్నై స్టెర్లింగ్ రిసార్ట్స్‌కు కట్టబెట్టేందుకు సిద్ధమైన కూటమి సర్కారు
- వాటి ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి లెక్కగట్టిన స్టెర్లింగ్ ప్రతినిధులు
- పర్యటనపై అధికారికంగా ఆదేశాలిచ్చిన టూరిజం ఈడీ
- ప్రమాదంలో 436 మంది ఉద్యోగుల భవిష్యత్



అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్

'స్టెర్లింగ్' పరిశీలించిన యూనిట్ల వివరాలు

పర్యాటక కేంద్రం	ఉద్యోగులు	చేపట్టిన అభివృద్ధి (రూ.కోట్లు)	23-24 ఆదాయం (రూ.కోట్లు)
హార్సిలీహిల్స్	42	10.39	3.50
నెల్లూరు	35	6.27	3.00
సూర్యలంక	50	5.84	5.00
శ్రీశైలం	38	10.79	5.50
అరకు	58	11.44	4.00
టైడా	22	9.37	1.00
అనంతగిరి	36	7.88	3.00
విశాఖ యాత్రి నివాస్	36	5.28	4.00
బెరం పార్క్	52	5.31	4.00
భవానీ ఐలాండ్	42	4.36	2.00
దిండి	25	5.19	3.00

బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటక శాఖకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకు ప్రణాళికలు రచించి అభివృద్ధికి కృషిచేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటక రంగాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తోంది. పర్యాటక యూనిట్ల అభివృద్ధి, ఆధునికీకరణ, పర్యాటకుల ఆకర్షణ కోసం ప్రత్యేకంగా ఒక్క చర్య చేపట్టకపోగా.. వాటిని ప్రైవేటు సంస్థకు అప్పగించే చర్యలను వేగవంతం చేసింది. రాష్ట్రంలోని 11 కీలమైన యూనిట్లు, వాటి నిర్వహణ, ఆస్తులను చెన్నైకి చెందిన స్టెర్లింగ్‌కు అప్పగింత ఖరారైందని సమాచారం. ఈ నేపథ్యంలోనే స్టెర్లింగ్ ప్రతినిధులు 11 టూరిజం యూనిట్లలో పర్యటించి ఆస్తులు, వ్యాపార కార్యకలాపాలపై మదింపు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.

కీలకమైన యూనిట్లే ప్రైవేటుకు..

రాష్ట్రంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కీలకమైన 11 యూనిట్లు ఆదాయంతో పాటు అభివృద్ధిలోనూ ముందున్నాయి. వీటికి సొంత ఆస్తులు కూడా ఉన్నాయి. ఏపీలో ఏకైక పర్వత నివాస ప్రాంతమైన అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్, బాపట్ల జిల్లాలోని సూర్యలంక, విశాఖ జిల్లాలోని అరకు, టైడా, అనంతగిరి, యాత్రి నివాస్, విజయవాడలోని భవానీ ఐలాండ్, బెరమ్ పార్క్, కోనసీమ జిల్లాలోని దిండి, నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, నెల్లూరులోని రిసార్ట్స్, బార్, రెస్టారెంట్, అతిథి గృహలు ఉన్నాయి. ఇవన్నీ వ్యాపారం, ఆదాయంలో ప్రాధాన్యత సాధించాయి. ఈ యూనిట్ల ఏటా ఆదాయం రూ.కోట్లలోనే ఉంటుంది. నెల ఆదాయం రూ.18 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉంటోంది.

436 మంది భవిష్యత్ ప్రశ్నార్థకం

ఈ 11 టూరిజం యూనిట్లలో 436 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇవి ప్రైవేటు సంస్థ చేతికి వెళ్లిపోతే ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. వీరిని ఉద్యోగులుగా కొనసాగించడం, కొనసాగించకపోవడం ఆ సంస్థ ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. ఉద్యోగుల్లో ఆప్కాస్, కాంట్రాక్టు, రెగ్యులర్ ప్రాతిపదికన నియమితులైన వారున్నారు. ప్రైవేటు చేతికి యూనిట్లు వెళితే వీరంతా ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని ఏపీ టూరిజం ఉద్యోగ సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. స్టెర్లింగ్ సంస్థకు చెందిన ఉద్యోగులు, సిబ్బందిని టూరిజం యూనిట్లలో నియమించుకుని కార్యకలాపాలను కొనసాగించే అవకాశాలే అధికంగా ఉంటాయని అంటున్నారు.

గత ప్రభుత్వంలో రూ.82 కోట్లతో అభివృద్ధి

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి సందర్శకులను విశేషంగా ఆకర్షించడం ద్వారా ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారు. ఈ నేపథ్యంలో 11 టూరిజం యూనిట్లలో నవీకరణ, పునరుద్ధరణ పనుల కోసం రూ.82.12 కోట్లతో పనులు మంజూరు చేయగా.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో టెండర్లు నిర్వహించి పనులు అప్పగించారు. అభివృద్ధి పనులు పూర్తయితే పర్యాటక శాఖకు మరింత ఆదాయం పెరుగుతుంది. ప్రైవేటుకు అప్పగిస్తే అభివృద్ధి చేసి అప్పనంగా ఇచ్చినట్టే.

భరోసా ఇవ్వడం లేదు



పర్యాటక శాఖకు చెందిన 11 యూనిట్లను ప్రైవేటుకు అప్పగిస్తే మా పరిస్థితి ఏంటనేది ప్రభుత్వం భరోసా ఇవ్వడం లేదు. 25 ఏళ్ల నుంచి పని చేస్తున్న ఉద్యోగుల వయసు 50–55 ఏళ్లు. ఉన్నపళంగా వీళ్లని తొలగిస్తే ఎలా బతకాలి. రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశాక ప్రైవేటుకు అప్పగించడం సరైన నిర్ణయం కాదు. ఇప్పుడున్న విధానం కొనసాగిస్తే మరింత ఆదాయం కోసం ఉద్యోగులు కష్టపడి పనిచేస్తారు. దీనిపై ప్రభుత్వం ముందుకు వెళ్లకూడదు. అందుకనే ఉద్యోగులతో కలిసి సీఎంకు విన్నవించనున్నాం.

– పీటీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఏపీ టూరిజం ఎంప్లాయీస్ యూనియన్

'స్టెర్లింగ్' పరిశీలన పూర్తి

పది టూరిజం యూనిట్ల ఆస్తులు, వ్యాపార కార్యకలాపాలను మదింపు చేసేందుకు ఆతిథ్య రంగంలో చెన్నైకు చెందిన స్టెర్లింగ్ కంపెనీ ప్రతినిధులు పర్యటించారు. డిసెంబర్ 26 నుంచి జనవరి 5 వరకు పది యూనిట్లలో పర్యటించి పరిశీలనలు పూర్తి చేశారు. ఈ పర్యటన సందర్భంగా ఆయా యూనిట్లలో ప్రతినిధులకు అతిథి మర్యాదలు చేయాలని ఈడీ నుంచి ఆదేశాలు వెళ్లాయి. యూనిట్ల మేనేజర్లు దగ్గరుండి మర్యాదలు చేయడంతో పాటు పరిశీలనకు సహకరించి వారు అడిగిన సమాచారం ఇచ్చారు. ఆస్తులను పరిశీలించి వాటి స్థితిగతులపై సమీక్షించుకుని వెళ్లారు.



క్షీరారామంలో శివరాత్రి శోభ



పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 23న ఆదివారం ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమ పూజలు, రుద్రహోమం, సాయంత్రం 5 గంటలకు ముత్యాల పూజ, 6 గంటలకు లీలాకళ్యాణం నిర్వహించారు. 27 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

పెండ్లికుమారుడైన అమరేశ్వరుడు



అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అర్చకులు అమరేశ్వరుడిని, బాల చాముండేశ్వరి దేవిని పెండ్లి కుమారునిగా, పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు కైతేపల్లి సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో శివరాత్రి కళ్యాణ మహోత్సవానికి ఆదివారం ఈ కార్యక్రమాలు ప్రారంభించారు. తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ రాజావాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ తరపున పీసపాటి అమరేశ్వర శర్మ నేతృత్వంలో స్వామి వారికి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి కళ్యాణోత్సవ వస్త్రాలను సమర్పించారు. ఈ క్రమంలో స్వామి వారికి వేకువజామున అభిషేకం నిర్వహించి, నూతన వస్త్రధారణతో పెండ్లికుమారుడిని చేశారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



పెదకాకాని: స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. భ్రమరాంబ అమ్మవారు పెండ్లి కుమార్తె అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, పంచహారతులు, రుద్రాభిషేకం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, త్రిశూలపూజ, వాస్తుపూజ, శైవాగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, ఆలయ బలిహరణ తదితర కార్యక్రమాలు ఘనంగా సాగాయి. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

రుద్రాక్ష వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం 6వ రోజు స్వామి వారు రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహేష్ కుమార్ శర్మ, శ్యామ సుందర శాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

బోయకొండ.. భక్తుల దండు



చౌడేపల్లె: చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలంలోని బోయ కొండ గంగమ్మతల్లి దీవెనల కోసం భక్తులు బోయకొండకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. సెలవు దినం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, యువత బోయకొండకు రావడంతో ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆలయంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారని అధికారులు వెల్లడించారు.

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు కిటకిటలాడారు. సెలవు కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఉదయం నుంచే క్యూకట్టారు. ఉచిత, శ్రీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన క్యూలైన్లు అన్నీ కిక్కిరిశాయి. దర్శనానికి 2గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రభల తేజం.. భవుని వైభవం



శ్రీకాళహస్తి: దక్షిణ కైలాసంలో అంగరంగవైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామివారు సూర్య ప్రభ వాహనంపై ఊరేగారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై అధిష్ఠించి లయకారుని వెంట సాగారు. మూషిక వాహనంపై విఘ్నేశ్వరుడు, చప్పరాలపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజనల నడుమ ఆదిదంపతులు పురవిహారం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



కర్నూలు(అర్బన్): షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ పార్లమెంట్ సభ్యుడు జీవీ హర్షకుమార్ అన్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే తాను ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ ఎంపీలను కలుస్తానన్నారు. మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కర్నూలులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో రాయలసీమ మాలల యుద్ధ గర్జన పేరుతో భారీ సభను నిర్వహించారు. ఈ సభలో హర్షకుమార్ మాట్లాడుతూ.. విశ్వరూప సభలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాదిగలను బీజేపీ ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు ప్రయత్నం చేశారన్నారు. మోసాలకు కేరాఫ్‌గా ఉన్న సీఎం చంద్రబాబుకు ఎన్నికలకు ముందే వర్గీకరణ జరుగుతుందని తెలుసునన్నారు. ఆర్టికల్ 341ను బైపాస్ చేసి రాష్ట్రాలకే అధికారం వచ్చే విధంగా చంద్రబాబు, మోదీ కుట్రలు పన్నారన్నారు. సుప్రీంకోర్టు గొప్పదా, పార్లమెంట్ గొప్పదా ... అనే విషయంపై చర్చ జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని మాలలను మాత్రమే మోసం చేయలేదని, రాష్ట్ర ప్రజలందరిని మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నట్టేట ముంచారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఒక్క హామీనైనా ఇప్పటి వరకు అమలు చేశారా ? అని ప్రశ్నించారు.

మల్లన్నకు పొందూరు పాగా

మహా శివరాత్రి ఉత్సవాల్లో అతివిశిష్టమైనది పాగా అలంకరణ

- దాని వస్త్ర తయారీ భాగ్యం కొన్ని నేతకారుల కుటుంబాలదే
- ఏళ్ల నుంచి కొనసాగుతున్న సంప్రదాయం
- శ్రీకాకుళం జిల్లా నుంచి వస్త్రాల సమర్పణ
- నియమ నిష్టలతో సిద్ధం చేసిన చేనేత కార్మికులు
- శ్రీశైలానికి బయల్దేరిన పవిత్ర వస్త్రాలు

మహా శివరాత్రి వస్తోందంటే చాలు ఆ గ్రామాల్లో ఒకటే సందడి. దాదాపు ఒకటిన్నర నెలల ముందే అక్కడి చేనేత కార్మికులందరూ మిగతా అన్ని కార్యక్రమాలు పక్కనపెట్టేసి ఒకే ఒక్క కార్యక్రమంపై దృష్టి పెడతారు. అదే శ్రీశైల మల్లన్న స్వామికి సమర్పించేందుకు ప్రత్యేక వస్త్రం తయారీ. నేత పని పూర్తయిన తరువాత ప్రత్యేక పూజలు ఊరేగింపులు నిర్వహించి ప్రత్యేక వస్త్రాన్ని శ్రీశైలానికి తీసుకువెళతారు. ఈ పుణ్యక్రతువు పూర్తయింది. ప్రత్యేక వస్త్రం శ్రీశైలానికి బయల్దేరింది.



శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయ శిఖరానికి వస్త్రాలంకరణ(ఫైల్)

పరమ పవిత్రమైన శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి శివరాత్రికి సిక్కోలు.. తలపాగాలు, ఇతర వస్త్రాలు పంపనుంది. ఎన్నో ఏళ్లగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా తలపాగా వస్త్రాలు పంపించేందుకు పొందూరుతో పాటు జిల్లా నుంచి పలు ఊళ్లు సిద్ధమయ్యాయి. శ్రీకాకుళం జిల్లాలో పొందూరు, బూర్జ, ఆమదాలవలస, ఉప్పెనవలస, లావేరు గ్రామాల నుంచి వస్త్రాలను శివరాత్రికి మల్లికార్జున స్వామికి సమర్పించనున్నారు. ఈ ఏడాది స్థానిక చేనేతవాడకు చెందిన బనిశెట్టి శ్రీనివాసరావు పొందూరు నుంచి తలపాగాను సమర్పించనున్నారు. చేనేత, జౌళి శాఖ ద్వారా బనిశెట్టి శ్రీనివాసరావు తలపాగా వస్త్రాలను శ్రీశైలం మల్లన్నకు సమర్పించడానికి దరఖాస్తులు చేసుకున్నారు. బనిశెట్టి ఆంజనేయులు మూడు తలపాగా వస్త్రాలను గుడివాడ, ఒంగోలు, వెంకటగిరి వాళ్లకు నేశారు. శివయ్యకు తలపాగా, అమ్మవారికి చీర, శనగల బసవన్న, వినాయకుడికి పంచె, నవనందులను, గాలి గోపురాన్ని అలంకరించేందుకు వస్త్రాలను నేశారు.

– పొందూరు



తలపాగా వస్త్రాలతో నేతన్నలు

చరిత్ర సృష్టించిన ముఖలింగం..

- వాంఢ్రంగి వీధికి చెందిన ఆకాశం ముఖలింగం 33 సార్లు శ్రీశైలం వెళ్లి మల్లన్నకు వస్త్రాలను సమర్పించి చరిత్ర సృష్టించారు.
- లావేటి వీధికి చెందిన బూడిద చిన్నారావు 21 సార్లు స్వామికి వస్త్రాలను సమర్పించారు.
- వస్త్రాలను తీసుకొచ్చే పొందూరు కార్మికులకు వసతి, భోజన సదుపాయాలను, ఇతర సౌకర్యాలను కల్పిస్తారు.


ఊరేగింపు

ఆమదాలవలస రూరల్: మందరాడ గ్రామానికి చెందిన దేవాంగులు నేసిన శ్రీశైల మల్లన్న తలపాగాను శ్రీనివాసాచార్యులపేట గ్రామ పురవీధుల్లో ఊరేగించి శివాలయం ప్రాంగణంలో ఉంచారు. మహా శివరాత్రి నాడు శ్రీశైల శిఖరానికి ఈ పాగా చుడతామని నేత కార్మికులు తెలిపారు. ముందుగా గ్రామాల్లో తలపాగాను ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు చేస్తూ శ్రీశైలం మల్లన్న సన్నిధికి చేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి గౌరీపతి, కె.ప్రసాద్‌రావు, కె.తవుడు బాబు, జి.పకీర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసాచార్యులపేటలో మల్లన్న తలపాగాకు పూజలు

నిష్టతో నేశాం..



ఎంతో నియమ, నిష్టల తో శ్రీశైలం మల్లన్నకు తలపాగా వస్త్రాలను నేశాం. ఈ వస్త్రాలను నేస్తున్నంత సేపు శివ నామస్మరణలోనే ఉన్నాం. ఉపవాస దీక్షలోనే వస్త్రాలను పూర్తిచేశాం. ఏటా వస్త్రాలను నేసే మహాభాగ్యం మాకు దక్కుతుండటం ఎంతో సంతోషంగా ఉంది.

– బనిశెట్టి శ్రీనివాసరావు, చేనేత కార్మికుడు, పొందూరు

వస్త్రాలను సమర్పిస్తారిలా..

- మల్లికార్జున స్వామికి 366 మూరల (160 మీటర్లు) పొడవు 48 సెంటీమీటర్లు వెడల్పు ఉన్న తలపాగా.
- భ్రమరాంబ అమ్మవారికి 6 మీటర్లు పసుపు అంచు చీర.
- శనగల బసవన్న (నందీశ్వరుడు)కు 6 మీటర్ల అరుణ వర్ణ అంచు పంచె.
- వినాయకుడికి 6 మీటర్లు ఎరుపు అంచు పంచెలను నేశారు. ఈ వస్త్రాలను శివలింగాకారంలో మలిచారు.
- ప్రతి రోజూ తల పాగా, వస్త్రాల వద్ద భజనలు చేస్తున్నారు. చేనేత వాడలోని ప్రజలంతా పూజలు నిర్వహిస్తున్నారు.
- మహాశివరాత్రికి రెండు రోజుల ముందు ఈ వస్త్రాలను శ్రీశైలం తీసుకొని వెళ్తారు. దేవాంగులు సమర్పించనున్న వస్త్రాలను మహాశివరాత్రి రోజున స్వామికి అలంకరిస్తారు.
- శివరాత్రి రోజున లింగోద్భవ కాలానికి ముందు..అంటే రాత్రి 10 నుంచి 12 గంటల మధ్య దేవాలయంలో ప్రవేశాలు నిలిపివేసి, లైట్లన్నీ ఆర్పేస్తారు.
- ఒక వస్త్రంతో తలపాగా చుట్టి మిగిలిన వస్త్రాలను నవ నందులకు, గాలి గోపురానికి అలంకరిస్తారు. పవిత్ర వస్త్రాలను తీసుకుని ఆదివారం ఆయా నేతకారులు శ్రీశైలానికి బయల్దేరారు.



శిఖరానికి తలపాగా అలంకరిస్తూ.. (ఫైల్)



హిమాలయ పర్వత శ్రేణులకు ముఖద్వారం అని చెప్పవచ్చు.
హిల్ స్టేషన్‌ల రాష్ట్రం అనడం కంటే దీనిని హిల్‌స్టేట్ అనడమే కరెక్ట్.
మబ్బులు... అన్ని చోట్లా నేలకు నింగికి మధ్యలో పర్యటిస్తుంటాయి.
ఇక్కడ మాత్రం... నేల మీదకు దిగి పర్యాటకుల్ని పలకరిస్తుంటాయి.
అందుకే దీనిని దేవభూమి అంటారు... ఓసారి వెళ్లి చూసొద్దాం...

• ఉత్తరాఖండ్

దేవభూమిలో వేసవి విహారం









1 అడ్వెంచరస్ ఔలి

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఏడాదంతా మంచు దుప్పటి కప్పుకునే ప్రదేశం ఔలి. పదివేల అడుగుల ఎత్తులో ఉంది. ఇది సాహసక్రీడల వేదిక. మంచు మీద స్కీయింగ్ చేయడానికి మనదేశంలో ప్రధానంగా చెప్పుకోవాల్సిన ప్రదేశం ఇది. ఔలి ఎక్కడుంది అని చెప్పాలంటే దగ్గరలో ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రాన్ని చెప్పాలి. జోషిమఠ్‌కు ఏడు కిలోమీటర్ల దూరాన ఉంది. ఔలి నుంచి హిమాలయ శిఖరాలను చూడవచ్చు.

మబ్బుల మధ్య కేబుల్ కార్

జోషిమఠ్ నుంచి ఔలికి కేబుల్ కార్‌లో వెళ్లాలి. నేల మీద విస్తరించిన తెల్లటి మంచు, మంచును చీల్చుకుని ఎదిగిన చెట్లను తాకుతూ మంద్రంగా కదులుతున్న మబ్బుల మధ్య సాగుతుంది విహారం. ప్రభుత్వ రిసార్టులు, గెస్ట్ హౌస్‌లలో బస చేయడం మంచిది.

2 ఐఏఎస్ బడి ముస్సోరీ

ముస్సోరీ... ఐఏఎస్‌లకు పాఠాలు చెప్తుంది. వింటర్ స్పోర్ట్స్ ఆడిస్తుంది. వేసవిలో చల్లగా అలరిస్తుంది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి మూడు వందల కిలోమీటర్ల దూరాన ఉంది ముస్సోరీ పట్టణం. ఢిల్లీ నుంచి ముస్సోరీకి డెహ్రాడూన్ మీదుగానే వెళ్లాలి. ఇది ఆ రాష్ట్ర శీతాకాలపు రాజధాని డెహ్రాడూన్ నుంచి 35 కిమీల దూరం.

ముస్సోరీ పట్టణానికి చేరడానికి ముందే ముస్సోరీ లేక్ పలకరిస్తుంది. కొండల మీద సరస్సును ఆసక్తిగా చూసి ఒక ఫొటో తీసుకుని ముందుకు సాగాలి. ఈ పట్టణం అంతా కొండవాలులోనే ఉంటుంది. మాల్‌రోడ్, క్యామెల్స్ బ్యాక్ రోడ్... లైబ్రరీ రోడ్... ఇలా ప్రదేశాల పేర్లన్నీ రోడ్లే. ఇక్కడ హ్యాపీవ్యాలీ కనిపించేటట్లు రోడ్ మీదనే వ్యూ పాయింట్ ఉంటుంది. అక్కడ మరొక ఫొటో తీసుకుని ముందుకెళ్లడమే. రోప్ వే లో ముస్సోరీ పట్టణం ఏరియల్ వ్యూ చూస్తూ గన్‌హిల్‌కి చేరాలి. ఆకాశం నిర్మలంగా ఉంటే ఇక్కడ నుంచి హిమాలయాలు కనిపిస్తాయి. కెంప్టీ వాటర్ ఫాల్, ఝరి పానీ జలపాతం, లాల్‌తిబ్బ, లాండౌర్‌లను చుట్టేసిన తర్వాత ఐఏఎస్‌లకు శిక్షణనిచ్చే (లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్) అకాడమీ తప్పకుండా చూడాలి. మౌంటనియరింగ్ ట్రైనింగ్ అకాడెమీ, దిగంతాల్లో కనిపించే యమునానదినీ చూస్తూ తిరుగుప్రయాణం కొనసాగించాలి.

3 సంస్కృతంలో పాలించే నైనితాల్

నైనితాల్... మహాపర్వతాలు, వాటి మధ్య విశాలమైన చెరువులు, వాటి తీరాన నివాస ప్రదేశాలు... ఇదీ నైనితాల్ భౌగోళిక స్వరూపం. నైనితాల్ ఆ రాష్ట్రానికి న్యాయ రాజధాని. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఒకటుంది తెలుసా! హిందీతో పాటు సంస్కృతం కూడా అధికారిక భాష. నైనితాల్ జిల్లా కేంద్రం నైనితాల్ పట్టణం. తాల్ అనే పదానికి అర్థం కూడా సరస్సు లేదా చెరువు అని. దీని చుట్టు పక్కల సాత్‌తాల్, భీమ్‌తాల్, నౌకుచియాతాల్ ఉన్నాయి. అందుకే దీనిని లేక్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఇండియా అంటారు. ఈ టూర్‌లో వరుసగా అన్నింటినీ కవర్ చేయవచ్చు. ఇక్కడి వాతావరణం ఎంత చల్లగా ఉంటుందో చెప్పడానికి ఒక ఉదాహరణ చాలు. బ్రిటిష్ పాలకులు తాము నివసించడానికి అనువైన ప్రదేశాలను వెతుకుతూ ఈ చెరువు తీరాన అధికారిక నివాసాలను కట్టుకున్నారు. వాటిని కూడా ఈ టూర్‌లో చూడవచ్చు. అల్మోరా కూడా నైనితాల్‌కు దగ్గరలోనే ఉంది. అల్మోరాలో రామకృష్ణ కుటీరం ఉంది. స్వామి వివేకానందుడు కొంత కాలం ఇక్కడ ధ్యానం చేసుకుంటూ గడిపాడు. మనం మబ్బులను చూడాలంటే తల పైకెత్తాలి, కానీ ఇక్కడ తల దించి చూడాలి. మన పర్యటన మబ్బులకు పైన సాగుతుంటుంది.

4 నాటి రాణివాసం రాణికేత్

ఈ ప్రదేశం సముద్రమట్టానికి ఆరువేల అడుగుల ఎత్తులో ఉంది. రాణికేత్... అల్మోరా పట్టణానికి దగ్గరలో ఉంది. ఇక్కడ జనావాసం కంటే మిలటరీ శిక్షణ కార్యకలాపాలే ఎక్కువ. అందమైన ప్రదేశం అని చెప్పడం అంటే ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని తక్కువ చేయడమే. పదాలకందనంతటి మహోన్నతంగా ఉంటుంది. ఈ ప్రదేశాన్ని పాలించిన కాత్యూరి పాలకుడు సుధార్‌దేవ్ సతీమణి రాణి పద్మిని ఇక్కడ నివసించేదని, రాణి నివాసం చుట్టూ ఉన్న ప్రదేశానికి రాణీకేత్ (రాణిగారి భూములు) అనే పేరు వ్యవహారంలోకి వచ్చింది. ఈ ప్రదేశం కొంతకాలం నేపాల్ రాజుల పాలనలో ఉండేది. బ్రిటిష్ పాలకులు స్వాధీనం చేసుకోవడంతో భారత్‌లో భాగమైంది. నేపాల్ సంస్కృతి కనిపిస్తుంది. రాణి నివాసం మాత్రం కనిపించదు.

5 బహుగుణ పుట్టిన తెహ్రీ

తెహ్రీ పేరు విన్న వెంటనే గుర్తు రాదు, కానీ ఇది మనకు తెలిసిన ప్రదేశమే. తెహ్రీ డ్యామ్ పేరు తెలిసిందే. పర్యావరణ పోరాటయోధుడు సుందర్‌లాల్ బహుగుణ పుట్టిన ఊరు, చిప్కో ఉద్యమం చేసిన ప్రదేశం ఇది. ఇప్పుడు మనకు కనిపించేది కొత్త తెహ్రీ పట్టణం. అసలు జనావాసం డ్యామ్ నిర్మాణంలో మునిగిపోయింది. భాగీరథి, భిలాంగ్న నదుల కలయిక ఈ ప్రదేశం. ఈ నదులు ఆ తర్వాత గంగ, యమున నదులతో సంగమిస్తాయి.





6 కవుల స్ఫూర్తి చమోలి

చమోలి పట్టణం జిల్లా కేంద్రం కావడంతో సౌకర్యాలు బాగానే ఉంటాయి. అనేక పుణ్యతీర్థాలకు, ప్రకృతి సౌందర్యక్షేత్రాలకు కేంద్రం వంటిది. బదరీనాథ్, కేదార్‌నాథ్, కర్ణ ప్రయాగ, నంద రయాగ, విష్ణుప్రయాగలు ఇదే రూట్‌లో కలుస్తాయి. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ తోపాటు మన దేశపు ఉత్తరభాగాన చివరి గ్రామం మాణా వరకు వెళ్లవచ్చు. ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి కవులు వచ్చేవారని చెబుతారు. కాళిదాసు వంటి మహాకవుల రచనల్లో ప్రతిబింబించిన వర్ణన ఇక్కడి ప్రకృతి దృశ్యాల ప్రభావమే.

7 ప్రశాంత మున్సియారీ


ఈ ప్రదేశం7, 217 అడుగుల ఎత్తులో ఉంది. హిమాలయ పర్వత శ్రేణులు మధ్యలో విస్తరించిన భూభాగం. ఇక్కడ నిలబడి ఎటు వైపు చూసినా హిమాలయాలే కనిపిస్తాయి. ఇక్కడి ప్రజలను అదృష్టవంతులనవచ్చా లేక స్థితప్రజ్ఞత సాధించిన తాత్వికవాదులనవచ్చా అనేది అర్థం కాదు. ముఖాల్లో ప్రసన్నత తాండవిస్తుంటుంది. జీవితాన్ని ప్రశాంతంగా గడపడం, సంతృప్తిగా జీవించడం ఎలాగో తెలిసిన వాళ్లు. వాతావరణాన్ని బట్టి పంటలు పండించుకోవడం, ఆవులు, గేదెలను పోషించుకుంటూ ప్రకృతితో మమేకమై జీవిస్తుంటారు. పరుగులు ఉండవు, అసంతృప్తి ఉండదు, ఆవేదన కనిపించదు. జీవితం విలువ తెలిసిన వాళ్లు, జీవించడం తెలిసిన వాళ్లు అని చెప్పవచ్చు.

8 కిలకిలరవాల ముక్తేశ్వర్

ఇది నైనితాల్ జిల్లాలో చిన్న గ్రామం. 7,500 అడుగుల ఎత్తులో ఉంది. హిమాలయాల్లోని కుమావ్ పర్వతశ్రేణిలో ఉంది. (ఢిల్లీ నుంచి 343 కిమీలు). ఇక్కడ ముక్తేశ్వరుడిగా పూజలందుకుంటున్న శివుడిని దర్శించుకోవడంతో సరిపెట్టుకోకూడదు. దగ్గరలో ఉన్న రుద్రధారి జలపాతాన్ని చూడాలి. రంగురంగుల పక్షులను, మృదువైన కువకులను ఆస్వాదించాలి. వాహనాన్ని ఆపి ఇంజన్ శబ్దం లేకుండా నిశ్శబ్దంలో వినిపించే పిట్టల రెక్కల టపటపలను, సన్నని తీయగా సాగే రాగాల మాధుర్యాన్ని ఆలకించాలి. ఈ అవకాశం నగరంలో దొరకదు. అలాగే 20 కి.మీల దూరాన ఉన్న ఐవీఆర్‌ఐ (ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)ని చూడాలి.

ప్యాకేజీలిలా...

- డెహ్రాడూన్ నుంచి ఔలి మూడు రోజుల టూర్ ప్యాకేజ్ ఒక్కొక్కరికి 32 వేలవుతుంది. ఇందులో డెహ్రాడూన్ – ఔలి రెండువైపులా హెలికాప్టర్ జర్నీ, రెండు రోజులు లగ్జరీ హోటల్‌లో బస ఉంటాయి. హెలికాప్టర్ రైడ్‌లో హిమాలయాల శిఖరాలను చూడవచ్చు. ఔలిలో స్నో స్పోర్ట్స్ స్కీయింగ్, స్నోబోర్డింగ్, స్నో స్లెడ్డింగ్, స్నో ట్యూబింగ్, స్నో బైకింగ్ చేయవచ్చు
- ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజ్‌లు కూడా సౌకర్యంగా ఉంటాయి. హిల్ స్టేషన్ ప్యాకేజ్‌లు 15 వేల నుంచి 35 వేల వరకు ఉన్నాయి. హనీమూన్ కపుల్ ప్యాకేజ్‌లు, ఏడెనిమిది మంది బృందం వెళ్లాలన్నా అందుకు తగిన ప్యాకేజ్‌లున్నాయి. రైలు ప్రయాణంలో ఏదైనా అసౌకర్యం ఎదురైతే గ్రీవెన్స్ రిడ్రెసల్ సెల్ కూడా ఉంటుంది. ఫోన్ లేదా ఈ మెయిల్‌లో సంప్రదించవచ్చు.



9 భానుడి విన్యాసాల చక్రత


ఇది డెహ్రాడూన్ నుంచి వందకిలోమీటర్ల దూరాన ఉంది. ఇక్కడి నుంచి చూస్తే హిమాలయాలు ఆకాశాన్ని ముద్దాడుతున్నట్లు కనిపిస్తాయి. ఎండాకాలంలో హిమాలయాల వీక్షణంలో దాగిన అద్భుతం ఏమిటంటే... ఒక పర్వతశిఖరం సూర్యుడి కిరణాలు నేరుగా పడుతూ ఎర్రగా ప్రజ్వరిల్లుతున్నట్లు ఉంటుంది. దాని పక్కనే మరొక శిఖరం పక్క శిఖరం నీడ పడి ఇంకా సూర్యోదయాన్ని చూడలేదన్నట్లే కనిపిస్తుంది. సూర్యాస్తమయం సమయంలోనూ ఇలాంటి అద్భుతాలను ఆస్వాదించవచ్చు. వేసవిలో టైగర్ ఫాల్స్ జలపాతం జల్లును ఆస్వాదించవచ్చు. డెహ్రాడూన్ వంటి నగరాల్లో హోటల్ రూమ్ అద్దెతో పోలిస్తే ఇక్కడ అద్దెలు తక్కువ. వెకేషన్‌ని ఎక్కువ రోజులు ఎంజాయ్ చేయవచ్చు.

ట్రావెల్ టిప్స్

- ఈ టూర్‌లో ఉలెన్స్‌తోపాటు మంచులో జారని షూస్ తప్పనిసరి
- ప్రయాణం పర్వతశ్రేణుల మధ్య మెలికలు తిరుగుతూ సాగుతుంది. కాబట్టి వాహనాల వేగం నియంత్రణలో ఉండాలి. సొంత వాహనంలో వెళ్లిన వాళ్లు కూడా స్వయంగా నడపాలనే సరదా పక్కన పెట్టి స్థానిక డ్రైవర్‌ను నియమించుకోవాలి. గైడ్ కమ్ డ్రైవర్‌ని తీసుకోవడం మంచిది
- ఈ రాష్ట్రం పర్యాటకమే ప్రధానంగా ఉపాధి పొందుతోంది. కాబట్టి ఆహారపానీయాలకు ఇబ్బంది ఉండదు. కానీ వాటర్ బాటిల్ కొనేటప్పుడు సీల్‌ని తప్పనిసరిగా చెక్ చేసుకోవాలి.







10 హనీమూన్ ధనౌల్టీ

ఇది ఇటీవల పర్యాటక రంగం కొత్తగా అభివృద్ధి చేసిన ప్రదేశం. ముస్సోరీ పట్టణం జన సమ్మర్దం అధికం కావడంతో అది టూరిస్ట్ ప్లేస్‌కి పరిమితమైంది. వెకేషన్ కోసం పర్యాటకుల ప్రయాణం ధనౌల్టీ వైపు సాగుతోంది. ముఖ్యంగా హనీమూన్ జంటలకు ఇది బెస్ట్ వెకేషన్. ఢిల్లీ నుంచి 325 కి.మీ.ల దూరం. కారులో తొమ్మిద గంటల ప్రయాణం. ఈ టూర్‌లో ఢిల్లీ నగరం వదిలి, ఉత్తర ప్రదేశ్ భూభాగాన్ని దాటినప్పటి నుంచి ఉత్తరాఖండ్‌లోకి ప్రవేశించిన ఆనవాళ్లు పచ్చదనంతో స్వాగతం పలుకుతాయి. తమిళనాడు దాటి కేరళలో అడుగుపెట్టినప్పుడు కనిపించేటంతటి స్పష్టమైన మార్పును ఇక్కడా చూడవచ్చు. పచ్చదనాన్ని పరిరక్షించుకోవడం కోసం ప్రకృతి కొంత ప్రదేశాన్ని జీవితకాలపు లీజుకు తీసుకున్నట్లు ఉంటాయి ఈ ప్రదేశాలన్నీ. అందుకే ఈ రెండూ దేవుడి రాష్ట్రాలుగా పేరు తెచ్చుకున్నాయి.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



ప్రతి ఒక్కరిలోనూ దేన్నయినా సాధించే సామర్థ్యం ఉంటుంది. సాధించి చూపేందుకు వాళ్లకు ఒక అవకాశం దక్కాలి.

- రిచర్డ్ బ్రాన్సన్, వర్జిన్ గ్రూప్ వ్యవస్థాపకుడు

బిజినెస్ రీల్

డెల్టా ఎలక్ట్రానిక్స్ 50 కోట్ల డాలర్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: భారత్‌లో కార్యకలాపాల విస్తరణపై 50 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తైవాన్‌కి చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రెసిడెంట్ బెంజమిన్ లిన్ తెలిపారు. స్మార్ట్ తయారీ, విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి భారత్ స్వయం సమృద్ధిని సాధించడంలో తమ వంతు తోడ్పాటు అందిస్తున్నట్లు 'ఎలెక్‌రమా 2025' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వివరించారు. బెంగళూరుకు దగ్గర్లోని కృష్ణగిరిలో ఉన్న ప్లాంటులో ఎలక్ట్రిక్ మొబిలిటీ సెగ్మెంట్‌కి అవసరమైన ఈవీ చార్జింగ్ మౌలిక సదుపాయాలు, టెలికం పరిశ్రమలో ఉపయోగించే డైరెక్ట్ కరెంట్ కన్వర్టర్లు, రెక్టిఫయర్లు మొదలైనవి ఉత్పత్తి చేస్తున్నామని లిన్ చెప్పారు. ఈ ప్లాంటును కూడా విస్తరిస్తున్నామని తెలిపారు. 2003లో భారత మార్కెట్లో ప్రవేశించినప్పటి నుంచి గణనీయంగా ఇన్వెస్ట్ చేసినట్లు లిన్ చెప్పారు.

2055 నాటికి నెట్‌-జీరో లక్ష్యం

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 2055 నాటికి కర్బన ఉద్గారాలను తటస్థ స్థాయికి (నెట్ జీరో) తగ్గించుకోవాలని నిర్దేశించుకుంది. అప్పటికి తమ సంస్థ ఏర్పడి వందేళ్లవుతుందని బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. 'ఎస్‌బీఐ గ్రీన్ మారథాన్ సీజన్ 5' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. వైజాగ్, లక్నో, చండీగఢ్ తదితర నగరాల్లో కూడా ఇలాంటి మారథాన్లను నిర్వహించనున్నట్లు వివరించారు.

జియోటెలీ ఓఎస్‌తో థామ్సన్ క్యూలెడ్ టీవీ

ధర రూ. 18,999



హైదరాబాద్: దేశీ ఆపరేటింగ్ సిస్టం జియోటెలీ ఓఎస్‌తో తొలిసారిగా రూపొందించిన క్యూఎల్ఈడీ టీవీని మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్లు ఫ్రెంచ్ కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ థామ్సన్ వెల్లడించింది. ఈ 43 అంగుళాల టీవీ ప్రత్యేకంగా ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపింది. దీని ధర రూ. 18,999గా ఉంటుంది. వేగవంతమైన ఇంటర్‌ఫేస్, ఏఐ ఆధారిత కంటెంట్ రికమెండేషన్స్, స్మార్ట్ కనెక్టివిటీ, ప్రీ-లోడెడ్ యాప్‌లు మొదలైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నట్లు సంస్థ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

24-2-2025

విశాఖ	460-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	435-00
వరంగల్	437-00
రిటైల్ ధర	4.95

టారిఫ్‌లు, ప్రపంచ మార్కెట్లపై దృష్టి

- బుధవారం 'మహాశివరాత్రి' సెలవు
- ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులే
- మరోసారి ఆటుపోట్లు తప్పకపోవచ్చు
- దేశీ స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనాలు

ముంబై: ప్రధానంగా ప్రపంచ పరిణామాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నాయి. బుధవారం (26న) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మార్కెట్లు పనిచేయవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. ఇటీవల దేశీ స్టాక్ మార్కెట్లు భారీ అమ్మకాల కారణంగా నేలచూపులకే పరిమితమవుతున్నాయి. ఈ బాటలో మరోసారి ఆటుపోట్లు చవిచూడనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

చైనా ఎఫెక్ట్

యూఎస్ టారిఫ్‌లు తదితర పాలసీ నిర్ణయాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలు దేశీయంగా సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజిమెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు. కొద్ది నెలలుగా మార్కెట్లు దిద్దుబాటు ధోరణిలో సాగుతున్నాయి. దీంతో మార్కెట్లు ఎక్కడ టర్న్‌అరౌండ్ అయ్యేదీ అంచనా వేయడం కష్టమేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవల మరోసారి చైనా మార్కెట్లవైపు విదేశీ ఇన్వెస్టర్లు దృష్టి పెట్టినట్లు పేర్కొంటున్నారు. ఫలితంగా దేశీ మార్కెట్లలో అమ్మకాలు కొనసాగుతున్నట్లు తెలియజేశారు. దీంతో పలువురికి ఆదాయపన్ను ఉపశమనాన్ని కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్, వడ్డీ రేట్లకు కీలకమైన రెపోలో 0.25 శాతం కోత పెట్టిన ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష పెద్దగా ప్రభావం చూపలేకపోయినట్లు ప్రస్తావించారు.

గత వారమిలా..

గత వారం(17-21) దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోవారంలోనూ డీలా పడ్డాయి. అమ్మకాలు ఊపందుకోవడంతో సెన్సెక్స్ నికరంగా 628 పాయింట్లు(0.85 శాతం) క్షీణించి 75,311 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 133 పాయింట్లు(0.6 శాతం) నీరసించి 22,796 వద్ద స్థిరపడింది. అయితే బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1.6 శాతం, 1 శాతం చొప్పున బలపడటం గమనార్హం!

క్యూ4 జీడీపీ గణాంకాలు కీలకం



వారాంతాన...

గత కేలండర్ ఏడాది(2024) చివరి త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు శుక్రవారం(28న) వెల్లడికానుంది. అక్టోబర్-డిసెంబర్(క్యూ4)లో దేశ జీడీపీ పురోగతి గణాంకాలు విడుదలకానున్నాయి. జులై-సెప్టెంబర్(క్యూ3)లో జీడీపీ 5.4 శాతం వృద్ధి చూపింది. మరోపక్క యూఎస్ క్యూ4 జీడీపీ రెండో అంచనాలు 27న వెలువడనున్నాయి. ముందస్తు అంచనాలు 2.3 శాతం వృద్ధిని సంకేతించాయి. గత మూడు త్రైమాసికాలలో ఇది తక్కువకాగా.. క్యూ3లో 3.1 శాతం పురోగతి నమోదైంది. ఇదే రోజు జనవరి నెలకు యూఎస్ కీలక ద్రవ్యోల్బణ గణాంకాలు, డ్యురబుల్ గూడ్స్ ఆర్డర్లు, వ్యక్తిగత ఆదాయం, వ్యయాలు తదితర గణాంకాలు సైతం వెల్లడికానున్నాయి. ఇన్వెస్టర్లు గ్లోబల్ అంశాలపైనా దృష్టి పెట్టనున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ తెలియజేశారు.

ఇతర అంశాలు

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం సంబంధిత వార్తలు, ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి తీరు సైతం దేశీయంగా సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు ఖేమ్కా పేర్కొన్నారు. దేశీ మార్కెట్లలో బలహీన సెంటిమెంటు నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించనున్నట్లు వినోద్ అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ ఆర్జన మెరుగుపడటం, గ్లోబల్ లిక్విడిటీ, కరెన్సీ నిలకడం వంటి సానుకూల పరిస్థితులు నెలకొనేవరకూ మార్కెట్లు కన్సాలిడేట్ అయ్యే వీలున్నట్లు నిపుణులు వివరించారు. యూఎస్ విధిస్తున్న టారిఫ్‌లపై ఆందోళనలు దేశీ మార్కెట్లతోపాటు.. పలు ఇతర మార్కెట్లను సైతం ప్రభావితం చేయనున్నట్లు కొటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలియజేశారు. సమీప భవిష్యత్‌లో టారిఫ్ వార్తలు ట్రెండ్‌ను నిర్దేశించవచ్చని అంచనా వేశారు. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లు కీలక భాగస్వామ్య దేశాలను ప్రభావితం చేయనున్నట్లు మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ డైరెక్టర్ పునీత్ సింఘానియా పేర్కొన్నారు. దీనికితోడు దేశీయంగా కార్పొరేట్ ఫలితాలు కొంతమేర నిరాశపరుస్తున్నట్లు తెలియజేశారు.

ఎఫ్‌పీఐల షాక్

- ఫిబ్రవరిలోనూ కొనసాగుతున్న అమ్మకాలు
- ఇప్పటివరకూ రూ. 23,710 కోట్లు వెనక్కి



దేశీ స్టాక్ మార్కెట్లో కొద్ది నెలలుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అమ్మకాలకే ఆసక్తి చూపుతున్నారు. ఈ నెలలోనూ ఇదే బాటలో కొనసాగుతున్నారు. దీంతో ఫిబ్రవరి 3-21 మధ్య నికరంగా రూ. 23,710 కోట్ల విలువైన పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య ఆందోళనల మధ్య దేశీ స్టాక్స్‌లో విక్రయాలకు తెరతీస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. డిపాజిటరీల గణాంకాల ప్రకారం జనవరిలో ఎఫ్‌పీఐలు దేశీ మార్కెట్ల నుంచి రూ. 78,027 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. వెరసి కొత్త కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటివరకూ రూ. 1,01,737 కోట్ల విలువైన స్టాక్స్ అమ్మివేశారు. ఫలితంగా ఈ కాలంలో ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 4 శాతం నష్టపోయింది. పటిష్ట ఆర్థిక పురోగతి, కార్పొరేట్ ఫలితాలలో వృద్ధి వంటి సానుకూల అంశాలు మాత్రమే తిరిగి ఎఫ్‌పీఐలను ఆకట్టుకోగలవని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్.. పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయ కుమార్ అభిప్రాయపడ్డారు.

ఫండ్ పనితీరు మదింపు ఇలా..



భారత్‌లో అత్యంత ప్రాచుర్యం పొందుతున్న పెట్టుబడి సాధనాల్లో మ్యుచువల్ ఫండ్స్ కూడా ఉన్నాయి. 2023లో అద్భుతంగా రాణించిన మ్యుచువల్ ఫండ్ పరిశ్రమ 2024లోనూ అదే తీరును కొనసాగించడంతో నిర్వహణలోని అసెట్స్ పరిమాణం ఏకంగా రూ. 17 లక్షల కోట్లు పెరిగింది. సరైన ఫండ్ ఎంపికపై ఎలాగైతే ఆలోచించి నిర్ణయం తీసుకుంటారో, అలాగే ఫండ్ పనితీరును మదింపు చేయడంపై కూడా ఇన్వెస్టర్లు తప్పక దృష్టి పెట్టాలి. ఇందుకు ఉపయోగపడే కొన్ని కీలక కొలమానాల గురించి తెలుసుకుందాం.

రిస్కుకు తగ్గ రాబడులు: రాబడులు ముఖ్యమే అయినప్పటికీ, ఇవి పెట్టుబడి ప్రస్థానంలో ఒక భాగం మాత్రమే. రిస్క్ అడ్జస్టెడ్ రిటర్నులను అందించగలిగే సామర్థ్యమే, ఫండ్ సిసలైన పనితీరును మదింపు చేసేందుకు కీలకాంశంగా ఉంటుంది. తీసుకుంటున్న రిస్కుకు తగ్గట్లుగా ఫండ్ ఎంత రాబడిని అందిస్తున్నదీ తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. రిస్క్ అడ్జస్టెడ్ రిటర్నులను మదింపు చేసేందుకు విరివిగా ఉపయోగించే సాధనాల్లో షార్ప్ రేషియో కూడా ఒకటి. తీసుకున్న ప్రతి యూనిట్ రిస్కుకు ఫండ్ ఎంత ఎక్కువగా రాబడిని అందించినదీ తెలుసుకునేందుకు ఈ నిష్పత్తి ఉపయోగపడుతుంది. షార్ప్ నిష్పత్తి అధికంగా ఉందంటే, తీసుకున్న రిస్కుకు మించి అధిక రాబడులను అందిస్తోందని అర్థం. దీర్ఘకాలంలో స్థిరమైన పనితీరును కోరుకుంటున్న ఇన్వెస్టర్లకు ఇది సానుకూల సంకేతం. ఇక ఆల్ఫా అనేది రిస్కుకు అనుగుణంగా సర్దుబాట్లు చేసి, బెంచ్‌మార్క్ సూచీకి మించి పనితీరును కనపర్చగలిగే ఫండ్ మేనేజర్ సామర్థ్యాలను సూచిస్తుంది. ఆల్ఫా సానుకూలంగా ఉందంటే మార్కెట్ కదలికలను బట్టి, ఊహించిన దానికి మించి ఫండ్ మేనేజరు రాబడులు అందించినట్లు అర్థం.

బీటా: మ్యుచువల్ ఫండ్ స్కీములు సాధారణంగా నిర్దిష్ట సూచీని ప్రామాణికంగా తీసుకుంటాయి. సదరు బెంచ్‌మార్క్‌లతో పోలిస్తే నిర్దిష్ట స్కీము రాబడులను అందించడంలో ఎంత ఒడిదుడుకులకు లోనవుతున్నదీ తెలుసుకునేందుకు ఉపయోగించే కొలమానం బీటా. మార్కెట్ బీటా సాధారణంగా 1గా ఉంటుంది. మ్యుచువల్ ఫండ్ బీటా 1.0గా ఉందంటే, అచ్చం దాని బెంచ్‌మార్క్ సూచీని ప్రతిబింబించేంత సెన్సిటివ్‌గా లేదా ఒడిదుడుకులతో ఉంటుందని అర్థం. బీటా 1.20గా ఉందంటే అది 20% ఎక్కువ సెన్సిటివ్‌గా లేదా హెచ్చుతగ్గులకు లోనవుతుందని అర్థం. పోర్ట్‌ఫోలియోలోని మిగతా సాధనాలతో పోలిస్తే రిస్కులను మదింపు చేసేందుకు ఇదొక కొలమానంగా ఉపయోగపడగలదు.



రోహిత్ మట్టూ
నేషనల్ హెడ్ (రిటైల్ సేల్స్)
యాక్సిస్ మ్యుచువల్ ఫండ్

ట్రాకింగ్ ఎర్రర్: నిర్దిష్ట ఫండ్ పనితీరు, దాని బెంచ్‌మార్క్ సూచీ పనితీరుకు ఎంత దగ్గరగా ఉందనేది ట్రాకింగ్ ఎర్రర్ లెక్కిస్తుంది. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉందంటే, బెంచ్‌మార్క్‌కి అనుగుణంగా ఫండ్ పనితీరు అంత దగ్గరగా ఉందని అర్థం. అదే ట్రాకింగ్ ఎర్రర్ అధికంగా ఉందంటే, ప్రామాణిక సూచీకి భిన్నంగా ఫండ్ పనితీరు ఉంటోందని భావించవచ్చు. ప్యాసివ్ ఫండ్స్ ఇన్వెస్టర్లు లేదా ఇండెక్స్ తరహా రాబడులను కోరుకునే మదుపరులకు ట్రాకింగ్ ఎర్రర్ తక్కువ ఉండటం మంచిది.

ఎక్స్‌పెన్స్ రేషియో: ఎక్స్‌పెన్స్ రేషియో అనేది మ్యుచువల్ ఫండ్ నిర్వహణకయ్యే వార్షిక వ్యయాలను ప్రతిబింబిస్తుంది. దీన్ని ఫండ్ అసెట్స్‌లో నిర్దిష్ట శాతంగా చూపిస్తారు. ఎక్స్‌పెన్స్ రేషియో అధికంగా ఉంటే రాబడులు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, కాస్త ఎక్కువ ఫీజులు వర్తించినా, యాక్టివ్ మేనేజ్‌మెంట్ ఉండటం వల్ల ప్యాసివ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌తో పోలిస్తే మరింత మెరుగైన రాబడులు పొందడానికి కూడా ఎక్కువ అవకాశం ఉంటుందని గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు, స్టాక్స్ ఎంపిక లేదా మార్కెట్ టైమింగ్‌పై దృష్టి పెట్టే యాక్టివ్ ఫండ్లు, బెంచ్‌మార్క్‌కి మించి రాబడులు అందించడం ద్వారా అధిక ఫీజులకు న్యాయం చేకూర్చవచ్చు. కాబట్టి వ్యయాలతో పోలిస్తే ఫండ్ వ్యూహం వల్ల ఒనగూరే విలువను మదింపు చేసుకోవడం అన్నివేళలా శ్రేయస్కరం.

బెంచ్‌మార్క్: మ్యుచువల్ ఫండ్ పనితీరును పోల్చి చూసే మార్కెట్ సూచీని బెంచ్‌మార్క్‌గా పరిగణిస్తారు. ఉదాహరణకు ఈక్విటీ ఫండ్లను సాధారణంగా నిఫ్టీ 50 లేదా సెన్సెక్స్‌ను ప్రామాణికంగా పోల్చి చూస్తారు. అదే డెట్ ఫండ్లకు బాండ్ సూచీలను బెంచ్‌మార్క్‌లుగా పరిగణిస్తారు. ఫండ్ పనితీరును బెంచ్‌మార్క్‌తో పోల్చి చూడటం వల్ల ఫండ్ మేనేజర్ వ్యూహం సమర్థతను, అధిక రాబడులను సాధించగలుగుతున్నారా అనే ది ఇన్వెస్టర్లు తెలుసుకోవచ్చు. అలాగే, వివిధ కాలవ్యవధుల్లో అంటే 1 ఏడాది, 3 ఏళ్లు, లేదా 5 ఏళ్ల వ్యవధిలో నిర్దిష్ట ఫండ్ తన బెంచ్‌మార్క్‌తో పోలిస్తే ఏ విధంగా పనిచేస్తోందో పరిశీలించడం కూడా ముఖ్యం.

చివరగా చెప్పాలంటే, మ్యుచువల్ ఫండ్ పనితీరును మదింపు చేయాలంటే అది గతంలో అందించిన రాబడి మాత్రమే చూస్తే సరిపోదు. పైన పేర్కొన్న అంశాల్లో కొన్నింటిని పరిశీలించడం ద్వారా సదరు ఫండ్ సిసలైన సామర్థ్యాలను ఇన్వెస్టరు అర్థం చేసుకోవచ్చు. మీరు ఎంచుకున్న ఫండ్ మీ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఉందో లేదో తెలుసుకునేందుకు ఈ కొలమానాలన్నింటినీ కలిపి ఉపయోగించి అర్థం చేసుకోవచ్చు. పెట్టుబడి వృద్ధి, ఆదాయాన్ని కోరుకుంటున్నా లేదా సమతూకమైన విధానాన్ని పాటించాలనుకుంటున్నా ఈ కొలమానాలను అర్థం చేసుకోవడం వల్ల మరింత స్మార్ట్‌గా, సమగ్రమైన వివరాలతో తగిన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవచ్చు.

ఐపీవో బాటలో ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ఈపీసీ సంస్థ ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. వీటి ప్రకారం ఐపీవోలో భాగంగా రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో .29 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను పరికరాల కొనుగోలు, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా నీటి పారుదల, నీటి సరఫరా ప్రాజెక్టుల విభాగాలలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) సేవలు అందిస్తోంది. రెండు దశాబ్దాల కాలంలో కంపెనీ ఆనకట్టలు, బ్యారేజీలు, హైడ్రాలిక్ స్ట్రక్చర్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు తదితర ప్రాజెక్టులను పూర్తి చేసింది.

ఐటీ మార్పులు.. తరచుగా అడిగే ప్రశ్నలు



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఈసారి బడ్జెట్ ప్రతిపాదనలతో పాటు సందేహాల నివృత్తి కోసం తరచుగా అడిగే ప్రశ్నలకు జవాబులు కూడా పొందుపర్చారు. ఇలా చేయటంతో డిపార్టుమెంటువారి స్నేహభావం, సన్నద్ధంగా ఉండే విధానం రెండూ తెలుస్తోన్నాయి. వ్యక్తుల ఆదాయపు పన్ను వరకు 21 ప్రశ్నలు ఉన్నాయి. వాటి సారాంశమే ఈ వారం కథనం.

కొత్త విధానం అంటే ఏమిటి?

కొత్త విధానంలో రాయితీ ఉండే పన్ను రేట్లు, ఉదారమైన శ్లాబులుంటాయి. స్టాండర్డ్ డిడక్షన్ మినహా ఎటువంటి మినహాయింపులు ఉండవు.

రేట్లు, శ్లాబులు

గతంలో ఈ శ్లాబులు, రేట్ల గురించి తెలియజేశాం. ఇక్కడ బేసిక్ లిమిట్ రూ. 3,00,000 నుంచి రూ. 4,00,000కు పెంచారు. రూ. 4 లక్షల వరకు పన్ను ఉండదు. రూ. 12 లక్షలు దాటిన వారికి మాత్రం రూ. 4,00,000 నుంచి పన్ను శ్లాబుల ప్రకారం వడ్డిస్తారు. శ్లాబుల విషయంలో నాలుగో ఎక్కం.. రేట్ల విషయంలో ఐదో ఎక్కం గుర్తు పెట్టుకుంటే చాలు. ప్రతి రూ. లక్ష ఆదాయం పెరుగుదలకు ఎంత పన్ను భారం ఏర్పడుతుంది? ప్రస్తుతం ఎంత? ప్రతిపాదనల వల్ల ఎంత ప్రయోజనం ఉంటుంది? అనే విషయాలను అంకెలతో ఉదాహరణగా పట్టిక పొందుపరిచారు.

ఎంత వరకు పన్ను చెల్లించనక్కర్లేదు

కొత్త విధానంలో రూ. 12,00,000 వరకు పన్ను భారం ఏర్పడదు.

పన్ను భారం 'నిల్'గా ఉండాలంటే ఏం చేయాలి

రూ. 12,00,000 వరకు ఆదాయంపై పన్ను భారం నిల్‌గా ఉండాలంటే కొత్త విధానాన్ని విధిగా ఎంచుకోవాలి. ఆ మేరకు రిటర్నులు దాఖలు చేయాలి.

కొత్త విధానం ఎవరికి వర్తిస్తుంది?

కొత్త విధానం వ్యక్తులకు, హిందూ ఉమ్మడి కుటుంబాలకు, వ్యక్తుల కలయిక లేదా బాడీ, కృత్రిమ వ్యక్తికి వర్తిస్తుంది.

పన్నెండు లక్షల లోపు ఆదాయం ఉన్న వారికి ఏమిటి ప్రయోజనం?

ఒకప్పుడు రూ. 12,00,000 ఆదాయం ఉన్న వారు రూ. 80,000 వరకు పన్ను చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు వారు ఏమీ చెల్లించనక్కర్లేదు.

ఆదాయ పరిమితిని పెంచినట్లా?

అవుననే చెప్పాలి. నిల్‌గా పన్ను భారం రావాలంటే రూ. 12,00,000 లోపల ఆదాయం ఉండాలి. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే ట్యాక్సబుల్ పరిమితిని పెంచినట్లు. అంటే రిబేటును పూర్తిగా వాడుకున్నట్లు.

ఒకప్పుడు 'నిల్'కి లిమిట్ ఎంత ఉంది?

ఒకప్పు ఇటువంటి లిమిట్ రూ. 7,00,000గా ఉండేది. ఇప్పుడు ఈ పరిమితిని రూ. 12,00,000కు పెంచారు.

కొత్త విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ తగ్గిస్తారా?

కొత్త విధానంలో ఉద్యోగస్తులకు రూ. 75,000 తగ్గిస్తారు. ఈ తగ్గింపును పరిగణనలోకి తీసుకుంటే ఉద్యోగస్తులకు రూ. 12,75,000 వరకు పన్ను ఉండదు.

పాత విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ ఎంత?

పాత విధానంలో రూ. 50,000 స్టాండర్డ్ డిడక్షన్ మాత్రమే. ఎటువంటి పెంపుదల లేదు.

మార్జినల్ రిలీఫ్‌ను ఎలా లెక్కించాలి?

రూ. 12,00,000 దాటితే రూ. 4,00,000 నుంచి పన్ను భారం లెక్కించాలి. మీ ఆదాయం రూ. 12,10,000 అనుకోండి, సాధారణంగానైతే పన్ను భారం రూ. 61,500. ఇటువంటి వారికి ఇచ్చే ఉపశమనాన్నే మార్జినల్ రిలీఫ్ అంటారు. ఈ రిలీఫ్ వల్ల స్వల్పంగా అదనపు ఆదాయం ఉన్నా అధిక పన్ను చెల్లించనక్కర్లేదు. ఇలాంటప్పుడు పన్నుభారం రూ. 10,000 మాత్రమే. ఇలా రూ. 12,75,000 వరకు రిలీఫ్ కల్పించారు. ఈ మేరకు చక్కటి, సంపూర్ణమైన ఉదాహరణ ఇచ్చారు.

ఎంత మొత్తం రిబేటు ఉంటుంది?

రిబేటు రూ. 60,000 దాటి ఇవ్వరు.

రిబేటుకి మార్జినల్ రిలీఫ్‌కి తేడా ఏమిటి?

రూ. 12,00,000 లోపు ఆదాయం ఉన్నప్పుడు ఇచ్చేది రిబేటు. రూ. 12,00,000 దాటిన తర్వాత (రూ. 12,75,000 వరకు) వచ్చేది మార్జినల్ రిలీఫ్.

ఇతర ఆదాయాలకు రిబేటు వర్తిస్తుందా?

మూలధన లాభాలు, లాటరీ మొదలైన వాటి వల్ల ఏర్పడ్డ ఆదాయాలకు ఈ రిబేటు వర్తించదు. ఏ ఆదాయం మీద స్పెషల్ రేటు ఉందో, దాని మీద రిబేటు రాదు.

ఎంత మంది లబ్ధిదార్లు

గత సంవత్సరం 8.75 కోట్ల మంది కొత్త విధానంలో రిటర్నులు వేశారు. వారందరికీ ఇప్పుడు లాభం చేకూరుతుంది.

పన్ను చెల్లించేవారి చేతుల్లో

ఈ మార్పుల వల్ల సుమారుగా రూ. లక్ష కోట్లు ట్యాక్స్‌పేయర్స్ చేతిలో మిగులుతుంది. అదే వినియోగం పెరిగేందుకు నాంది.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రిస్క్‌-రాబడుల సమతుల్యం

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్





ఇటీవలి మార్కెట్ కరెక్షన్ రిటైల్ ఇన్వెస్టర్లలో ఆందోళనకు దారితీయడాన్ని గమనించొచ్చు. ముఖ్యంగా మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 20 శాతం వరకు పతనమయ్యాయి. అదే సమయంలో ప్రధాన సూచీల పతనం 12-13 శాతం మించలేదు. ఇక మిడ్, స్మాల్‌క్యాప్ విభాగంలో విడిగా చూస్తే కొన్ని స్టాక్స్ 60-70 శాతం వరకు పతనమయ్యాయి. ఎక్కువ స్టాక్స్ 20-40 శాతం వరకు క్షీణించాయి. ఇంతకాలం నాన్‌స్టాప్ ర్యాలీ చేసిన ఈ షేర్లు అమ్మకాల ఒత్తిడికి కుదేలవుతున్నాయి. దీంతో ఇన్వెస్టర్లలో విశ్వాసనం సన్నగిల్లి, అది వారి పెట్టుబడులపై ప్రభావం చూపించొచ్చు. ముఖ్యంగా మార్కెట్ దిద్దుబాటులో పెట్టుబడి పెట్టాల్సిన దానికి విరుద్ధంగా.. భయంతో ఇలాంటి సందర్భాల్లో పెట్టుబడి నిలిపివేస్తుంటారు. అందుకే రిటైల్ ఇన్వెస్టర్లకు నిపుణుల ఆధ్వర్యంలో నడిచే మ్యూచువల్ ఫండ్స్ సూచనీయం. అందులోనూ డైనమిక్ అస్సెట్ అలోకేషన్ విధానంతో పనిచేసేవి అయితే పెట్టుబడిని కాపాడుతూనే, మెరుగైన ప్రతిఫలం కోసం పనిచేస్తుంటాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది.

పెట్టుబడుల విధానం

బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ విభాగంలోని మ్యూచువల్ ఫండ్స్ (వీటినే డైనమిక్ అసెట్ అలోకేషన్ ఫండ్స్ అని కూడా అంటారు) మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా డైనమిక్‌గా ఇన్వెస్ట్ చేస్తూ రాబడులను ఇచ్చే విధానాన్ని అనుసరిస్తాయి. ఈక్విటీ మార్కెట్లు తక్కువ వ్యాల్యూషన్లకు చేరినప్పుడు అందులో పెట్టుబడులు పెంచుకోవడం, మార్కెట్లు అధిక వ్యాల్యూషన్లకు చేరినప్పుడు ఎక్స్‌పోజర్ తగ్గించుకోవడం అనే రిస్క్ బ్యాలన్స్‌డ్ విధానాన్ని అనుసరిస్తుంటాయి. అంటే స్టాక్స్ వాటి వాస్తవ విలువల కంటే గణనీయంగా పెరిగిన సందర్భంలో ఈ పథకం కొంత పెట్టుబడులు విక్రయించి డెట్ సాధనాలకు అధికంగా కేటాయిస్తుంటుంది. ఇప్పుడు చూస్తున్న మాదిరి స్టాక్స్ విలువలు పడిపోయి ఆకర్షణీయంగా మారినప్పుడు డెట్‌లో పెట్టుబడులను కొంత మేర విక్రయించి తిరిగి ఈక్విటీల్లో పెట్టుబడులను పెంచుకుంటుంది. ఈక్విటీలో కనీసం 65 శాతం ఇన్వెస్ట్ చేయడం వల్ల ఇది ఈక్విటీ ఫండ్ కిందకే వస్తుంది. పన్ను కూడా ఈక్విటీలకు మాదిరే వర్తిస్తుంది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.60,347 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 46.37 శాతం వరకే ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సెక్యూరిటీల్లో సుమారు 19 శాతం మేర పెట్టుబడులు కలిగి ఉంది. రియల్ ఎస్టేట్ సాధనాల్లో 3.47 శాతం పెట్టుబడులు ఉన్నాయి. నగదు నిల్వలు 31 శాతానికి పైనే నిర్వహిస్తుండడం గమనార్హం. ఇటీవల ఈక్విటీ విలువలు గరిష్టాలకు చేరడం, అంతర్జాతీయంగా అనిశ్చితుల నేపథ్యంలో, ముందు జాగ్రత్తగా నగదు నిల్వలు పెంచుకున్నట్టు కనిపిస్తోంది. ఈక్విటీ పెట్టుబడుల్లో 94 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్, స్మాల్ క్యాప్‌తో పోల్చితే లార్జ్‌క్యాప్ కంపెనీల విలువలు సహేతుకు స్థాయిలోనే ఉండడం గమనార్హం. మిడ్‌క్యాప్‌లో 6 శాతం మేర పెట్టుబడులు ఉన్నాయి. ఈక్విటీ పోర్ట్‌ఫోలియోని గమనించినట్టయితే.. మొత్తం 85 స్టాక్స్ ఉన్నాయి. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో 10.88 శాతం పెట్టుబడులు ఉన్నాయి. కన్జ్యూమర్ డిస్క్రెషినరీ కంపెనీల్లో 9.7 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీల్లో 7.49 శాతం, ఇండస్ట్రియల్ కంపెనీల్లో 4.48 శాతం, కన్జ్యూమర్ స్టెపుల్స్ కంపెనీల్లో 4 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. డెట్ పెట్టుబడుల్లో అధిక భాగం నాణ్యమైన సెక్యూరిటీల్లోనే ఇన్వెస్ట్ చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
టీవీఎస్ మోటార్	4.54
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4.20
ఐసీఐసీఐ బ్యాంక్	4.15
మారుతి సుజుకీ	3.63
ఇన్ఫోసిస్	3.45
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.60
ఎల్అండ్‌టీ	2.58
భారతీ ఎయిర్‌టెల్	2.15
యాక్సిస్ బ్యాంక్	2.11
ఎస్‌బీఐ	2.03

సాక్షి ప్లస్
సోమవారం। 24-2-2025

టైటిల్‌తో పునరాగమనం

సిడ్నీ క్లాసిక్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన భారత స్క్వాష్ స్టార్ సౌరవ్



న్యూఢిల్లీ: భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషాల్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గత ఏడాది ఏప్రిల్‌లో ఆట నుంచి వీడ్కోలు తీసుకున్న 38 ఏళ్ల సౌరవ్ ఈ ఏడాది జనవరిలో మళ్లీ రాకెట్ పట్టాడు. ఆదివారం ఆస్ట్రేలియాలో ముగిసిన ఆక్టేన్ ఓపెన్ సిడ్నీ క్లాసిక్ స్క్వాష్ చాలెంజర్ టోర్నీలో సౌరవ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో ప్రపంచ మాజీ పదో ర్యాంకర్ సౌరవ్ 11–2, 11–6, 11–2తో ఈజిప్ట్ దేశానికి చెందిన అబ్దుల్ రెహమాన్ నాసర్‌పై గెలుపొందాడు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లలో కలిపి మొత్తం 12 పతకాలు సాధించిన సౌరవ్... ఈ టోర్నీలో తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ మాత్రమే కోల్పోవడం విశేషం. సెమీఫైనల్లో సౌరవ్ 11–9, 5–11, 11–1, 11–2తో రైస్ డౌలింగ్ (ఆస్ట్రేలియా)పై, క్వార్టర్ ఫైనల్లో 11–6, 11–6, 11–5తో మిన్‌వూ లీ (దక్షిణ కొరియా)పై, రెండో రౌండ్‌లో 11–8, 11–2, 11–8తో కిజాన్ (మాల్టా)పై గెలుపొందాడు. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన సౌరవ్‌కు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. 2003లో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) టూర్‌లో అరంగేట్రం చేసిన సౌరవ్ ఇప్పటి వరకు 11 పీఎస్ఏ సింగిల్స్ టైటిల్స్ సాధించాడు. 18 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు.

జాతీయ కబడ్డీ విజేత సర్వీసెస్



కటక్: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ జట్టు విజేతగా అవతరించింది. ఆదివారం జరిగిన తుదిపోరులో సర్వీసెస్ జట్టు టైబ్రేక్‌లో 6–4 పాయింట్ల తేడాతో రైల్వేస్‌పై విజయం సాధించింది. నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరు నిర్ణీత సమయంలో 30–30 పాయింట్లతో సమం అయింది. దాంతో విజేతను తేల్చేందుకు టైబ్రేక్ నిర్వహించగా సర్వీసెస్ రెండు పాయింట్లతో పైచేయి సాధించింది. ప్రొ కబడ్డీ లీగ్ స్టార్ నవీన్ కుమార్ సారథ్యంలో బరిలోకి దిగిన సర్వీసెస్ జట్టు టోర్నీ ఆసాంతం కనబర్చిన నిలకడనే ఫైనల్లోనూ కొనసాగించింది. పీకేఎల్ 11వ సీజన్ విజేతలైన జైదీప్ దహియా, రాహుల్ సర్వీసెస్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. అంతకుముందు సెమీఫైనల్లో సర్వీసెస్ 43–35 పాయింట్ల తేడాతో పంజాబ్‌పై విజయం సాధించగా... మరో సెమీస్‌లో రైల్వేస్ 42–34 పాయింట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై గెలుపొందింది.

క్రీడల మంత్రి... సైకిల్ సవారీ...

- 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్'లో పాల్గొన్న కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ
- దేశవ్యాప్తంగా 4,200 ప్రాంతాల్లో సైకిల్ ర్యాలీలు



న్యూఢిల్లీ: దేశం నుంచి ఊబకాయాన్ని పారద్రోలాలంటే ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పిలుపునిచ్చారు. ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో కేంద్ర క్రీడల మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... 'ఊబకాయంపై అవగాహన అత్యవసరం. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లు రోజువారీ జీవితంలో వ్యాయామం ఎంతో ముఖ్యం. సైక్లింగ్ అతి సులువైన ఎక్సర్‌సైజ్. దీని వల్ల ఆరోగ్యం మెరుగవడంతో పాటు... పర్యావరణానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి రోజూ సైక్లింగ్ చేసే వాళ్లు కాలుష్యాన్ని నివారించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోగలరు' అని అన్నారు. ఈ సందర్భంగా మాండవీయ సైకిల్ తొక్కి ప్రజల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐసీసీఐ, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి వారం ఒక్కో రంగానికి చెందిన ఔత్సాహికులు ఈ సైకిల్ ర్యాలీలో పాల్గొంటున్నారు. గతంలో ఆర్మీ అధికారులు, పోస్ట్‌మెన్‌లు, వెల్‌నెస్ నిపుణులు ఇలా పలు రంగాలకు చెందిన వాళ్లు ఇందులో పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఒలింపియన్ అర్జున్‌లాల్ జాట్ మాట్లాడుతూ... 'ఒక అథ్లెట్‌గా ప్రజల్లో ఆరోగ్యంపై వస్తున్న అవగాహన చూస్తుంటే సంతోషంగా ఉంది. ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యాయామం కోసం సమయాన్ని వెచ్చించడం ఆహ్వానించదగ్గ విషయం. ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆ దిశగా 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపుతోంది' అని అన్నారు. మరోవైపు గువాహటిలోని భారత క్రీడా ప్రాధికార సంస్థ కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో భారత మెడికల్ అసోసియేషన్‌కు చెందిన వందలాది మంది వైద్యులు పాల్గొని ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఓవరాల్‌గా దేశంలోని 4,200 కేంద్రాల్లో 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఒక్క రోజే దేశంలో 1200 ప్రాంతాల్లో ఈ ర్యాలీలు జరిగినట్లు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి నెల చివరి ఆదివారం ప్రధానమంత్రి దేశ ప్రజలతో తన మనసులోని మాటలు పంచుకునే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగాగా ఆదివారం నరేంద్ర మోదీ ఒబేసిటీ గురించి ప్రస్తావించారు. ఊబకాయాన్ని పారదోలేందుకు వంట నూనెల వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని దేశ ప్రజలకు సూచించారు.



జోరు కొనసాగించాలని...

- నేడు ఇంగ్లండ్‌తో భారత పురుషుల హాకీ జట్టు 'ఢీ'
- నెదర్లాండ్స్‌తో మహిళల జట్టు పోరు
- సాయంత్రం గం. 5:15 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న భారత పురుషుల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఐర్లాండ్‌పై భారీ విజయాలు నమోదు చేసుకున్న హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా... సోమవారం తమకంటే మెరుగైన ర్యాంకర్ ఇంగ్లండ్‌తో మ్యాచ్ ఆడనుంది. భారత అంచె పోటీల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్న భారత్... తాజా సీజన్‌లో 6 మ్యాచ్‌లాడి 4 విజయాలు, 2 పరాజయాలతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు 13 పాయింట్లు సాధించిన ఇంగ్లండ్ మూడో 'ప్లేస్'లో ఉంది. స్పెయిన్, జర్మనీతో మ్యాచ్‌ల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన భారత జట్టు... ఐర్లాండ్‌పై మాత్రం సమష్టిగా సత్తా చాటింది. అదే స్ఫూర్తి ఇంగ్లండ్‌పై కూడా కొనసాగించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, నీలమ్, అభిషేక్, షంషేర్ సింగ్ కలిసికట్టుగా కదం తొక్కాల్సిన అవసరముంది. డిఫెన్స్‌లో భారత్ బలంగా కనిపిస్తోంది. తాజా సీజన్‌లో ఆరు మ్యాచ్‌లాడిన టీమిండియా ఇప్పటి వరకు ప్రత్యర్థులకు కేవలం 8 గోల్స్ మాత్రమే సమర్పించుకుంది. తొమ్మిది జట్లలో ఇదే అతి తక్కువ కావడం మన రక్షణ శ్రేణి పటుత్వాన్ని చాటుతోంది. అయితే పెనాల్టీ కార్నర్‌లను సద్వినియోగ పరుచుకోవడంపై మరింత దృష్టి సారిస్తేనే ఇంగ్లండ్‌పై విజయం సాధ్యమవుతుంది.

నెదర్లాండ్స్‌ను నిలువరించేనా..

మహిళల ప్రొ లీగ్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న భారత జట్టు... సోమవారం డిఫెండింగ్ చాంపియన్ నెదర్లాండ్స్‌తో తలపడుతుంది. భారత అంచె పోటీలను ఘనవిజయంతో ప్రారంభించిన సలీమా టెటె సారథ్యంలోని భారత జట్టు... ఆసాంతం అదే జోరు కొనసాగించలేకపోయింది. తాజా సీజన్‌లో 6 మ్యాచ్‌లాడిన మన అమ్మాయిలు 2 విజయాలు, 3 పరాజయాలు, 1 'డ్రా'తో 7 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఏడో స్థానంలో ఉన్నారు. మరోవైపు 15 పాయింట్లు సాధించిన నెదర్లాండ్స్ రెండో 'ప్లేస్'లో కొనసాగుతోంది. గత మ్యాచ్‌లో జర్మనీపై సాధించిన స్ఫూర్తితో సమష్టిగా సత్తాచాటాలని భారత జట్టు భావిస్తోంది. మరోవైపు గత రెండు మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్‌పై 5–1, 6–0తో విజయాలు సాధించిన నెదర్లాండ్స్ జట్టు టీమిండియాపై కూడా అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. 'ప్రపంచంలోనే అత్యంత పటిష్ట జట్లలో నెదర్లాండ్స్ ఒకటి. వాళ్లతో మ్యాచ్ కఠినమైందని తెలుసు. మా వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంపైనే దృష్టి పెట్టాం. జర్మనీపై విజయం ప్లేయర్ల ఆత్మవిశ్వాసాన్ని పెంచింది' అని భారత సారథి సలీమ చెప్పింది. 2013 నుంచి భారత్, నెదర్లాండ్స్ మధ్య 7 మ్యాచ్‌లు జరగగా... అందులో ఐదింట నెదర్లాండ్స్ విజయం సాధించింది. ఒక మ్యాచ్ టీమిండియా నెగ్గగా... మరొకటి 'డ్రా' అయింది.

రన్నరప్ ఉన్నతి



న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ ఉన్నతి హుడా సింగపూర్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ ఉన్నతి 17–21, 16–21 పాయింట్ల తేడాతో రుజానా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 42 నిమిషాల్లో ముగిసిన పోరులో ఉన్నతి వరుస గేమ్‌ల్లో ఓడింది. టోర్నీ ఆసాంతం రాణించిన ఉన్నతి... రెండో రౌండ్‌లో ఆసియా క్రీడల పతక విజేత సయిన కవాకమి (ఆస్ట్రేలియా)ను ఓడించింది. సెమీఫైనల్‌కు చేరే క్రమంలో చైనీస్ తైపీకి చెందిన ఇద్దరు షట్లర్లు సైయాంగ్ స్యూన్ లిన్, యూ టింగ్‌పై కూడా ఉన్నతి విజయాలు సాధించింది. సెమీఫైనల్లో ఉన్నతి 18–21, 21–19, 22–20తో థి ట్రాంగ్ వు (వియత్నాం)ను చిత్తు చేసింది. తొలి గేమ్‌లో పరాజయం పాలైన తర్వాత తిరిగి పుంజుకున్న ఉన్నతి... హోరాహోరీ పోరులో చక్కటి విజయంతో ఫైనల్ చేరింది. అయితే తుదిపోరులో యువ షట్లర్ అదే జోరు కనబర్చలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో యువ షట్లర్ దేవిక సిహాగ్ క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైంది.

ఆంద్రీవా అదుర్స్

డబ్ల్యూటీఏ–1000 సిరీస్ టైటిల్ నెగ్గిన పిన్న వయస్కురాలిగా రికార్డు



దుబాయ్: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) చరిత్రలో 1000 సిరీస్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన పిన్న వయస్కురాలిగా రష్యా టీనేజ్ స్టార్ మీరా ఆంద్రీవా రికార్డు నెలకొల్పింది. దుబాయ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ డబ్ల్యూటీఏ–1000 టోర్నీలో విజేతగా నిలువడం ద్వారా 17 ఏళ్ల మీరా ఆంద్రీవా ఈ ఘనత సాధించింది. ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ ఆంద్రీవా 7–6 (7/1), 6–1తో ప్రపంచ 38వ ర్యాంకర్ క్లారా టౌసన్ (డెన్మార్క్)పై గెలుపొందింది. 1 గంట 46 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ఆంద్రీవా ఆరు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాపై సంచలన విజయం సాధించిన క్లారా టౌసన్ తుది పోరులో తొలి సెట్‌లో గట్టిపోటీనిచ్చి ఆ తర్వాత తడబడింది. విజేతగా నిలిచిన ఆంద్రీవాకు 5,97,000 డాలర్ల (రూ. 5 కోట్ల 17 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ క్లారా టౌసన్‌కు 3,51,801 డాలర్ల (రూ. 3 కోట్ల 4 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

దుబాయ్ ఓపెన్ టైటిల్ విజయంతో సోమవారం విడుదల చేసే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో మీరా ఆంద్రీవా కెరీర్ బెస్ట్‌9వ ర్యాంక్‌కు చేరుకుంటుంది. 2007లో నికోల్ వైదిసోవా (చెక్ రిపబ్లిక్) తర్వాత టాప్–10లోకి వచ్చిన పిన్న వయస్కురాలిగా ఆంద్రీవా గుర్తింపు పొందనుంది.

దుబాయ్ ఓపెన్ టోర్నీలో ఆంద్రీవా విశేషంగా రాణించింది. టైటిల్ గెలిచే క్రమంలో ముగ్గురు గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్ మర్కెటా వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్), ఇగా స్వియాటెక్ (పోలాండ్), ఎలానీ రిబాకినా (కజకిస్తాన్)లపై గెలుపొందింది. 2004 డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీలో మరియా షరపోవా (రష్యా) తర్వాత ఒకే టోర్నీలో ముగ్గురు గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్‌ను ఓడించిన ప్లేయర్‌గా ఆంద్రీవా గుర్తింపు పొందింది.



వారియర్స్ X చాలెంజర్స్

- యూపీతో తలపడనున్న బెంగళూరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నమెంట్‌లో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. గత మ్యాచ్‌లో ఘన విజయంతో సీజన్‌లో బోణీ కొట్టిన యూపీ వారియర్స్ జట్టుతో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) సోమవారం చిన్నస్వామి స్టేడియంలో తలపడుతుంది. సొంత అభిమానుల మద్దతు మధ్య జరుగనున్న పోరులో సత్తా చాటాలని స్మృతి మంధాన సారథ్యంలోని ఆర్‌సీబీ భావిస్తుంటే... గెలుపు జోరును కొనసాగించాలని యూపీ వారియర్స్ చూస్తోంది. తాజా సీజన్‌లో ఆర్‌సీబీ మూడు మ్యాచ్‌లాడి 2 విజయాలు, 1 పరాజయంతో 4 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. మరోవైపు యూపీ వారియర్స్ మూడు మ్యాచ్‌ల్లో ఒక విజయం, 2 పరాజయాలతో నాలుగో స్థానంలో ఉంది. స్మృతి, డానీ వ్యాట్, ఎలీస్ పెర్రీ, రాఘవి బిస్త్, రిచా, కనిక, జార్జియాతో కూడిన ఆర్‌సీబీ జట్టు బలంగా కనిపిస్తోంది. ముఖ్యంగా స్మృతి సూపర్ ఫామ్ ఆ జట్టుకు కలిసిరానుంది. స్మృతి ఆడిన గత 10 మ్యాచ్‌ల్లో (అంతర్జాతీయ, డబ్ల్యూపీఎల్ కలిపి) 1 సెంచరీ, 5 అర్ధసెంచరీలు చేయడమే అందుకు నిదర్శనం. బౌలింగ్‌లో రేణుక, కిమ్ గార్త్, ఏక్తా బిష్త్ జోషిత కీలకం కానున్నారు. మరోవైపు దీప్తి శర్మ సారథ్యంలోని యూపీ వారియర్స్ జట్టులో నిలకడ లోపించింది. కెప్టెన్ దీప్తి శర్మతో పాటు కిరణ్ నవగిరె, వృందా దినేశ్, తాలియా మెక్‌గ్రాత్, శ్వేత సెహ్రావత్, గ్రేస్ హ్యారిస్, ఉమ ఛెత్రి కలిసికట్టుగా రాణించాల్సిన అవసరం ఉంది. గత మ్యాచ్‌లో భీకర హిట్టింగ్‌తో విజృంభించిన షినెల్ హెన్రీపై ఆ జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. బౌలింగ్‌లో యువ మీడియం పేసర్ క్రాంతి గౌడ్‌తో పాటు స్పిన్నర్ గ్రేస్ హ్యారిస్ చక్కటి ప్రదర్శన చేస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో ఉన్న బెంగళూరుపై పైచేయి సాధించాలంటే యూపీ వారియర్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకోవాల్సిన అవసరముంది.

సెమీస్ లక్ష్యంగా...

బంగ్లాదేశ్‌తో నేడు న్యూజిలాండ్ పోరు
మధ్యాహ్నం గం.2:30 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్', జియో హాట్‌స్టార్‌లలో ప్రసారం

రావల్పిండి: టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య పాకిస్తాన్‌ను ఓడించిన న్యూజిలాండ్ వరుస విజయాలతో సెమీఫైనల్ చేరాలని భావిస్తుంది. నేడు బంగ్లాదేశ్‌తో జరిగే పోరులో గెలిచి నాకౌట్‌కు అర్హత పొందాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. సోమవారం గ్రూప్ 'ఎ'లో జరిగే ఈ మ్యాచ్ బంగ్లాదేశ్‌కు చావోరేవో కానుంది. భారత్ చేతిలో తొలి మ్యాచ్ ఓడిన నజ్ముల్ హుస్సేన్ బృందం నెట్ రన్‌రేట్‌లోనూ మైనస్‌లోకి పడిపోయింది. ఇప్పుడు ఇదీ ఓడితే ఇంటిదారి పట్టడం మినహా ఇంకో దారే ఉండదు. అయితే పటిష్టమైన కివీస్‌ను ఓడించడం అంత సులభం కాదు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు పాక్‌లో సన్నాహకంగా జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీలో టైటిల్ సాధించిన న్యూజిలాండ్ ఆల్‌రౌండ్ సామర్థ్యంతో పటిష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లాంటి జట్టుపై గెలుపొందడం, సెమీఫైనల్‌కు చేరడం కివీస్‌కు కష్టమైతే కాదు. అయితే మ్యాచ్‌పై ఏ బెంగా లేని న్యూజిలాండ్ తుదిజట్టు కసరత్తుపైనే తర్జనభర్జన పడుతోంది. తలకు అయిన స్వల్పగాయం నుంచి రచిన్ రవీంద్ర కోలుకోవడంతో కివీస్‌కు డాషింగ్ ఓపెనర్ అందుబాటులో వచ్చాడు. గత మ్యాచ్‌లో కాన్వే, విల్ యంగ్ ఇన్నింగ్స్ ఆరంభించగా, ఇప్పుడు విల్ యంగ్‌ను తప్పించే అవకాశముంది. ఇదే జరిగితే లెఫ్ట్–రైట్ హ్యాండ్ ఓపెనింగ్ కాంబినేషన్ అటకెక్కుతుంది. ఫామ్‌లో ఉన్న కాన్వేతో రవీంద్ర ఇన్నింగ్స్ ఆరంభిస్తాడు. మరోవైపు తొలి మ్యాచ్‌లో ఓడిన బంగ్లాదేశ్ తీవ్ర ఒత్తిడిలో మరో గట్టి ప్రత్యర్థిని ఎదుర్కొనున్నడం పెద్ద సవాల్‌గా మారింది. గత మ్యాచ్‌లో భారత్‌ను బౌలింగ్‌తో ఇబ్బంది పెట్టిన నజ్ముల్ బృందం బ్యాటింగ్‌లో పేలవమైన ప్రదర్శన కనబరిచింది. ఇప్పుడు బ్యాటింగ్ లోపాలను సరిదిద్దుకుంటే మ్యాచ్‌లో ప్రత్యర్థికి గట్టిపోటీ ఇచ్చే అవకాశముంటుంది. లేదంటే ఇంకో మ్యాచ్ (పాక్‌తో) ఉండగానే గ్రూప్ దశలోనే వెనుదిరగడం ఖాయమవుతుంది.

హంపి, హారిక గేమ్‌లు 'డ్రా'





మోంటికార్లోలో జరుగుతున్న మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక ఐదో రౌండ్‌లో తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. అలెగ్జాండ్రా గొర్యాక్‌చినాతో జరిగిన గేమ్‌ను హారిక 33 ఎత్తుల్లో... టాన్ జోంగితో జరిగిన గేమ్‌ను హంపి 69 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. ఐదో రౌండ్ తర్వాత హంపి 3 పాయింట్లతో రెండో స్థానంలో, హారిక 1.5 పాయింట్లతో పదో స్థానంలో ఉన్నారు.



శ్రీనగర్‌లోని ప్రఖ్యాత దాల్ సరస్సులో ఆదివారం సందడి కనిపించింది. మంచుతో తెల్లగా మెరుస్తున్న జబర్వాన్ పర్వత శిఖరాలను తిలకిస్తూ నులి వెచ్చని ఎండలో పర్యాటకులు షికారా బోట్లలో సంచరించారు.



అస్సాంలోని గౌహతిలో ఆదివారం జరిగిన 'ఝుమోయిర్ బినందిని' రిహార్సల్స్ దృశ్యమిది. సోమవారం ఇందిరాగాంధీ అథ్లెటిక్ స్టేడియంలో ప్రధాని మోదీ సమక్షంలో ఈ భారీ నృత్య ప్రదర్శన ఉంటుంది. ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది.

గత వారం దేశం కోసం ఏం చేశారు?

48 గంటల్లోగా క్లుప్తంగా వివరిస్తూ మెయిల్ చేయండి

అమెరికా ఫెడరల్ ఏజెన్సీల సిబ్బందికి అందిన ఈమెయిల్స్

న్యూయార్క్: డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక దాదాపు అనధికార అధ్యక్షుడిగా చలామణి అవుతున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సారథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ(డోజ్) విభాగం నుంచి వివాదాస్పద నిర్ణయాల పరంపర కొనసాగుతోంది. తాజాగా వేర్వేరు ప్రభుత్వ విభాగాలైన ఫెడరల్ ఏజెన్సీల్లోని సిబ్బంది పనితీరును క్రోడీకరించే పేరుతో వారి ఉద్యోగాలకు కోత పెట్టే పనిని మొదలెట్టారు. ఈ మేరకు ఫెడరల్ ఏజెన్సీలోని ఉద్యోగులకు తాజాగా ఒక మెయిల్ వచ్చింది. అందులో ''దయచేసి ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ ఈ-మెయిల్‌కు మీ స్పందన తెలియజేయండి. గత వారం మీరంతా విధినిర్వహణలో భాగంగా దేశం కోసం ఏమేం పనులు చేశారు?. ఒక ఐదు కీలకమైన అంశాలను విడివిడిగా క్లుప్తంగా పేర్కొంటూ ప్రతిస్పందన మెయిల్ పంపించండి. సోమవారం రాత్రి 11.59 గంటలకల్లా మెయిల్‌ను పంపించండి. మీరు గనక ఈ-మెయిల్ పంపించకపోతే మీరు ఉద్యోగానికి రాజీనామా చేసినట్లుగా పరిగణిస్తాం''అని మెయిల్‌లో ఉంది.

ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు

గత వారం మొత్తంలో దేశం కోసం ఏమేం చేశారని సంజాయిషీ అడగడమేంటని ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. యూఎస్ ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్(ఓపీఎం) విభాగం నుంచి వచ్చిన ఈ మెయిల్‌ను స్పందనగా మెయిల్‌ను పంపొద్దని తమ సిబ్బందికి అమెరికా జాతీయ వాతావరణ సేవల కేంద్రం తదితర ఏజెన్సీలు సూచించాయి. ''ప్రజల కోసం పనిచేస్తున్న ఉద్యోగులను ఉద్దేశపూర్వకంగా అవమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులను చట్టవ్యతిరేకంగా తొలగిస్తే ఊరుకోం. కోర్టుల్లో సవాల్ చేస్తాం. అసలు కనీసం ఒక్క గంట సమయం నిజాయతీగా ప్రజాసేవ చేయని, ఎన్నికల్లో పోటీచేయని ప్రపంచకుబేరుడు మస్క్‌తో ఉద్యోగులకు విధినిర్వహణపై హితబోధ చేయించడాన్ని మించిన అవమానం మరోటి లేదు''అని అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎవిరెట్ కెల్లీ అన్నారు. ఇప్పటికే వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులను ఉన్నపళంగా తొలగించడమో లేదంటే కొన్ని నెలల జీతం ముందస్తుగా ఇచ్చి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు లేఖలు రాయించుకోవడమే డోజ్ చేసింది. మాజీ ఉద్యోగుల వ్యవహారాల విభాగం, రక్షణ, ఆరోగ్యం, మానవీయ సేవలు, అంతర్గత రెవిన్యూ సేవ, జాతీయవనాల విభాగం తదితర ఏజెన్సీల్లోని చాలా మంది తాత్కాలిక, శాశ్వత ఉద్యోగులపై వేటువేసిన సంగతి విదితమే. ఉద్యోగుల సంఖ్యను భారీగా కుదించడమే లక్ష్యంగా డోజ్ వ్యవహరిస్తున్న విషయం తెల్సిందే.

మేం ప్రజాస్వామ్యానికి ప్రమాదమా?

- వామపక్షవాదులది రెండు నాల్కల ధోరణి
- ఇటలీ మహిళా ప్రధాని మెలోనీ అసహనం

వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇటలీ ప్రధానిగా తాను ఏం మాట్లాడినా, గెలిచినా వామపక్ష వాదులు మమ్మల్ని ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అన్నట్లు విమర్శిస్తున్నారని ఇటలీ మహిళా ప్రధాని జార్జియా మెలోనీ అసహనం వ్యక్తంచేశారు. వాషింగ్టన్‌లో ఆదివారం జరిగిన కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫెరెన్స్‌లో రోమ్ నుంచి మెలోనీ వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు. ''నాతోపాటు మోదీ, ట్రంప్ వంటి సంప్రదాయ వాదులను చూడగానే వామపక్షవాదులకు ఎక్కడ లేని అసూయ, అసహనం పుట్టుకొస్తున్నాయి.

90వ దశకంలో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, నాటి బ్రిటన్ ప్రధాన మంత్రి టోనీ బ్లెయిర్‌లు ఇలాగే ప్రపంచవ్యాప్తంగా ఉదారవాదుల కూటములను ఏర్పరిస్తే వారిని మాత్రం గొప్ప రాజనీతిజ్ఞులుగా కీర్తించారు. అదే పనిని నేడు నాతోపాటు మోదీ, ట్రంప్, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్‌లు తదితర నాయకులు చేస్తుంటే మమ్మల్ని ప్రజాస్వామ్యానికి పెనుముప్పు అని వామపక్షపార్టీలు ముద్ర వేస్తున్నాయి. వామపక్షవాదులది నిజంగా రెండు నాల్కల ధోరణి. ద్వంద్వ ప్రమాణాలు పాటించే వామపక్ష వాదులు మాపై ఎంతగా బురద చల్లినాసరే పౌరులు వీళ్ల మాటలను నమ్మట్లేరు. ఓటర్లు మాత్రం మాకే ఓట్లు వేస్తున్నారు''అని మెలోనీ వ్యాఖ్యానించారు. ''ఓటర్లు మాకే ఎందుకు ఓట్లేస్తున్నారంటే.. మేం స్వేచ్ఛను కాపాడుతున్నాం. మా దేశలను ప్రేమిస్తున్నాం. సరిహద్దులను కాపాడుతున్నాం. పౌరులు, వాణిజ్యాన్ని పరిరక్షిస్తున్నాం. కుటుంబజీవనానికి అగ్రతాంబూలం ఇస్తున్నాం''అని ఆమె అన్నారు.



బీరుట్‌లో హసన్ నస్రల్లా శవపేటికను ఉంచిన వాహనాన్ని అనుసరిస్తూ భారీగా తరలివస్తున్న ప్రజలు

హసన్ నస్రల్లాకు కన్నీటి వీడ్కోలు

లెబనాన్‌లో పూర్తయిన అంత్యక్రియలు

బీరూట్: లెబనాన్ మిలిటెంట్ సంస్థ 'హెజ్బొల్లా'దివంగత అధినేత హసన్ నస్రల్లాకు వేలాది మంది అభిమానులు తుది వీడ్కోలు పలికారు. గత ఏడాది సెప్టెంబర్‌లో బీరూట్ శివారు ప్రాంతంలో ఇజ్రాయెల్ సైన్యం దాడిలో మరణించిన నస్రల్లా అంత్యక్రియలు ఆదివారం పూర్తయ్యాయి. అభిమాన నేతకు నివాళులర్పించడానికి వేలాది మంది తరలివచ్చారు. నస్రల్లా పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం లెబనాన్ రాజధాని బీరూట్‌లోని కెమిల్లీచామౌన్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో ఉంచారు. ఈ సందర్భంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పంపించిన సందేశాన్ని చదివి వినిపించారు. స్టేడియంలో నస్రల్లా మృతదేహంతోపాటు ఆయన ప్రధాన అనుచరుడు హాషీం సఫీద్దీన్ మృతదేహాన్ని కూడా జనం దర్శించుకున్నారు. ఇజ్రాయెల్ వైమానిక దాడిలో సఫీద్దీన్ మరణించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇరువురి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా హెజ్బొల్లా అగ్రనేత నయీమ్ ఖాషీం టీవీలో ప్రసంగించారు. నస్రల్లా చూపిన మార్గంలో నడుస్తామని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు. అంత్యక్రియల సందర్భంగా బీరూట్ నగరంలో అడుగడుగునా నస్రల్లా చిత్రపటాలు ఏర్పాటు చేశారు. నగరంలో విషాద వాతావరణం కనిపించింది. విదేశాల నుంచి సైతం అభిమానులు హాజరయ్యారు.

వెస్ట్ బ్యాంక్‌పై పట్టు బిగించిన ఇజ్రాయెల్

తమ బలగాలు ఏడాదిపాటు ఉంటాయని స్పష్టీకరణ

కబాటియా: గాజాలో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న ఇజ్రాయెల్ ఇప్పుడిక వెస్ట్ బ్యాంక్‌పై దృష్టి సారించింది. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన రెండు రోజుల్లో భారీగా సైన్యాన్ని ఇక్కడికి తరలించింది. శరణార్థులుగా మారిన పాలస్తీనియన్లను తిరిగి వెస్ట్ బ్యాంక్‌లోకి అడుగుపెట్టకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌ను క్రమేపీ విస్తరిస్తూ వచ్చింది. వెస్ట్ బ్యాంక్ నుంచి తమపై దాడులు పెరుగుతున్నందున ఈ ప్రాంతం నుంచి మిలిటెన్సీని రూపుమాపడమే లక్ష్యమని అంటోంది. అయితే, ఇక్కడున్న 30 లక్షల మందిని సైనిక పాలన కిందికి తేవడమే ఇజ్రాయెల్ ఉద్దేశమని పాలస్తీనియన్లు అంటున్నారు. ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన దాడుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం జరుగుతోందని, వేలాది మందికి నిలువ నీడ కూడా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే 40వేల మంది పాలస్తీనయన్లు జెనిన్ వంటి పట్టణ ప్రాంత శరణార్థి శిబిరాలను ఖాళీ చేసి వెళ్లిపోయారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తెలిపారు. దీంతో, అక్కడ కనీసం ఏడాదిపాటు ఉండేలా ఏర్పాట్లు చేయాలని మిలటరీకి ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. పాలస్తీనియన్లను తిరిగి అక్కడికి రానిచ్చేది లేదని, ఉగ్రవాదాన్ని పెరగనివ్వబోమని చెప్పారు. అయితే, ఎంతకాలం పాలస్తీనియన్లను అడ్డుకుంటారో ఆయన స్పష్టం చేయలేదు. ఇజ్రాయెల్‌పై సాయుధ పోరుకు కేంద్ర స్థానంగా ఉన్న జెనిన్‌లోకి ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులను పంపించింది. 2002 తర్వాత ఇజ్రాయెల్ ట్యాంకులు ఈ ప్రాంతంలోకి ప్రవేశించడం ఇదే మొదటి సారని చెబుతున్నారు. దశాబ్దాల క్రితం ఇజ్రాయెల్ దాడుల్లో సొంతప్రాంతాలను వదిలిన శరణార్థుల వారసులే ఈ శిబిరాల్లో ఉంటున్నారు. కాగా, దీర్ఘ కాలంపాటు ఇజ్రాయెల్ ఆర్మీ వెస్ట్ బ్యాంక్‌లో తిష్టవేయడం 2000 తర్వాత ఇదే మొదటిసారని ఐరాస కూడా అంటోంది.

గాజాలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో వెస్ట్ బ్యాంక్‌లో హింసాత్మక ఘటనలు పెరిగాయి. ఇజ్రాయెల్ కూడా ఈ ప్రాంతంపై పదేపదే దాడులకు పాల్పడింది. ఇక్కడ కనీసం 800 మంది చనిపోయారు. వీరిలో ఎక్కువ మంది మిలిటెంట్లేనని ఆర్మీ పేర్కొంది. అయితే, గాజాతోపాటు లెబనాన్‌లోనూ యుద్ధం జరుగుతున్నందున సంకీర్ణ పక్షాల నుంచి వచ్చిన ఒత్తిడుల కారణంగా ప్రధాని నెతన్యాహూ వెస్ట్ బ్యాంక్‌లో మిలిటెన్సీ అణచివేత చర్యలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. 1967లో జరిగిన యుద్ధంలో వెస్ట్ బ్యాంక్, గాజా, తూర్పు జెరుసలేంను ఇజ్రాయెల్ ఆక్రమించుకుంది. ఈ మూడు ప్రాంతాలను కలిపి స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలన్నది పాలస్తీనియన్ల చిరకాల వాంఛ.

ఏప్రిల్‌లో ఏఐసీసీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) సమావేశాలను ఏప్రిల్ 8, 9వ తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ఆదివారం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనను ఈ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపింది. కీలకమైన చర్చలకు వేదికగానే కాకుండా, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి, దేశం కోసం బలమైన ప్రత్యామ్నాయ దృక్పథ ఆవిష్కరణకు, పార్టీ సమష్టి సంకల్పానికి పునరుద్ఘాటనగా ఉంటాయని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఈ సమావేశం దేశ వ్యాప్తంగా ఉన్న ఏఐసీసీ ప్రతినిధులను ఒకచోట చేర్చి ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎదురయ్యే సవాళ్లను, రాజ్యాంగం, దాని విలువలపై బీజేపీ చేస్తున్న నిరంతర దాడులను చర్చించి, కార్యాచరణను సిద్ధం చేస్తుంది'అని చెప్పారు. 1924 సమావేశంలో మహాత్మాగాంధీ అధ్యక్ష పదవి చేపట్టిన వందేళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బెళగావిలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో ఆమోదించిన తీర్మానాలకు కొనసాగింపుగా ఈ సమావేశాలు ఉంటాయని తెలిపారు. గాంధీజీ, బీఆర్ అంబేడ్కర్‌ల వారసత్వాన్ని కొనసాగిస్తూ రాజ్యాంగాన్ని రక్షించాల్సిన అవసరాన్ని గుర్తిచేలా సంవిధాన్ బచావో రాష్ట్రీయ్ పాదయాత్రను చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ భేటీకి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ హాజరవుతారు.

పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు

యూఎస్‌టీఎం చాన్స్‌లర్ అరెస్ట్

గౌహతి: పరీక్షల్లో అక్రమాలకు ఊతమిచ్చారన్న ఆరోపణలపై యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మేఘాలయ(యూఎస్‌టీఎం) చాన్స్‌లర్ మహబూబుల్ హక్ అరెస్టయ్యారు. అస్సాంలోని షిభుమి జిల్లాకు చెందిన ఓ కోర్టు శనివారం రాత్రి హక్‌తోపాటు, కరీమ్‌గంజ్ జిల్లా పత్తర్‌కండిలోని ఓ పాఠశాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులను కూడా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పోలీసులు గౌహతిలోని నివాసంలో ఉన్న హక్‌ను శనివారం అదుపులోకి తీసుకుని షిభుమికి తరలించారు. యూఎస్‌టీఎం చాన్స్‌లర్‌గా ఉన్న హక్ ఈఆర్‌డీ అనే ఫౌండేషన్ ద్వారా ఎన్నో విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. ఇందులో పత్తర్‌కండిలోని స్కూలు కూడా ఉంది. ఇతర జిల్లాలకు చెందిన సీబీఎస్‌ఈ విద్యార్థులను ఎక్కువ మార్కులు వచ్చేలా ప్రిపేర్ చేస్తామంటూ ఈ స్కూలుకు తీసుకువచ్చారు. వీరు పరీక్షల్లో అక్రమాలకు పాల్పడేందుకు

పథకం వేశారంటూ శుక్రవారం నుంచి అక్కడ వార్తలు గుప్పుమన్నాయి. ఈ నేపథ్యంలో టీచర్లతోపాటు చాన్స్‌లర్ హక్ అరెస్ట్ కావడం చర్చనీయాంశమైంది. ఘటనపై సీఎం హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ..దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉందన్నారు. సీబీఎస్‌ఈలోనే కాకుండా, మెడికల్ ఎంట్రన్స్‌లోనూ ఇక్కడ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 'యూఎస్‌టీఎం చాన్స్‌లర్ హక్ పెద్ద ఫ్రాడ్, ఆయన జీవితమే ఫ్రాడ్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హక్ దొడ్డిదారిన పొందిన ఓబీసీ సర్టిఫికెట్ తర్వాత రద్దయిందని చెప్పారు. అస్సాం-మేఘాలయ సరిహద్దుల్లో ఉన్న యూఎస్‌టీఎం క్యాంపస్ కారణంగా గౌహతి నగరానికి వరద ముప్పు పెరిగిందంటూ సీఎం శర్మ గతంలోనే ఆరోపణలు చేయడం తెల్సిందే.

ఆక్సిజన్ ఛాంబరే అతని ఆఫీస్

- వృద్ధాప్య వేగాన్ని భారీగా తగ్గించడమే లక్ష్యంగా వినూత్న నిర్ణయం
- అమెరికన్ వ్యాపారవేత్త బ్రియాన్ జాన్సన్ కొత్త పోకడ



ఆక్సిజన్ ఛాంబర్‌లో బ్రియాన్

వృద్ధాప్య ఛాయలను దరిచేరనీయకుండా నిత్యం యవ్వన కాంతులీనడమే ధ్యేయంగా ప్రతి ఏటా కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్న అమెరికన్ వ్యాపారవేత్త, అత్యంత సంపన్నుడు బ్రియాన్ జాన్సన్ మరో వినూత్న నిర్ణయం తీసుకున్నారు. కలుషిత గాలికి బదులు స్వచ్ఛమైన ఆక్సిజన్ ఎక్కువ మోతాదులో లభ్యమయ్యే ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఆక్సిజన్ ఛాంబర్‌నే తన కార్యస్థలిగా మార్చుకున్నారు. ఆక్సిజన్ సరఫరా ట్యూబ్‌లు పెట్టుకుని డెస్క్‌టాప్‌పై పనిచేస్తున్న వీడియోను తాజాగా 'ఎక్స్'ఖాతాలో షేర్‌చేశారు. ''హైపర్‌బారిక్ ఆక్సిజన్ ఛాంబర్‌లోకి ఆఫీస్‌కు తీసుకొచ్చా''అని ఆయన రాసుకొచ్చారు. హైపర్‌బారిక్ ఆక్సిజన్ థెరపీ(హెచ్‌బీఓటీ) తీసుకుంటున్నట్లు చెప్పారు. ''ఊపిరితిత్తుల్లోకి తగు పీడనంతో ఆక్సిజన్ వెళితే అంతర్గత కణజాలం ఏదైనా అతిసూక్ష్మస్థాయి రిపేర్లు ఉంటే వేగంగా చేసుకుంటుంది. హెచ్‌బీఓటీ అనేది ప్రపంచంలోనే చర్మ సంబంధ అత్యంత అధునాతన థెరపీ. ఈ థెరపీతో చర్మంలోని కణజాలం సాంద్రత 12.8 శాతం పెరుగుతుంది. సాగి, మళ్లీ యథాస్థానానికి వచ్చే ఎలాస్టిక్ గుణం 144 శాతం మెరుగుపడుతుంది. చర్మంలో అతిసూక్ష్మ రక్తనాళాల సంఖ్య 40.9 శాతం పెరుగుతుంది. సీడీ31 అనే రక్తనాళం సామర్థ్యం 84.3 శాతం మెరుగవుతుంది. కణక్షీణత 21 శాతం తగ్గుతుంది''అని బ్రియాన్ చెప్పుకొచ్చారు. సముద్రజలాల్లో 33 అడుగుల లోతులో ఉన్నప్పుడు ఎంత పీడనం అయితే ఉంటుందో అంతే పీడనంతో గాలిని ఈ ఛాంబర్‌లో పీల్చే వెసులుబాటు ఉంది. ఈ ఛాంబర్‌లో 95 నుంచి 100 శాతం స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను పీలుస్తా''అని చెప్పారు.

పీడనంతో అంతా సమతుల్యం

''సరైన పీడనంతో ఆక్సిజన్ ఊపిరితిత్తుల్లోకి చేరితే అక్కడి నుంచి అన్ని శరీరభాగాలకు ఖచ్చితమైన సమయానికి ఆక్సిజన్ అందుతుంది. దీంతో అన్ని అవయవాల్లో ఆక్సిజన్ స్థాయిలు సవ్యంగా ఉంటాయి. కణజాలాల్లో ఆక్సిజన్ లభ్యత పెరిగి శరీరం ఏదైనా గాయాలు, రిపేర్లు ఉంటే ఆ పనిని త్వరగా పూర్తిచేస్తుంది. అతిసూక్ష్మ రక్తనాళాలు పాతబడిపోతే వాటి స్థానంలో కొత్త రక్తనాళాలు త్వరగా పుట్టుకొస్తాయి''అని బ్రియాన్ చెప్పారు.

వయసు తగ్గింపు చర్యలపై స్పందించిన నెటిజన్లు

18 ఏళ్ల యువకుడిలా కనిపించేందుకు బ్రియాన్ పడుతున్న తాపత్రయాన్ని చూసి మెచ్చుకునే వాళ్లతోపాటు విమర్శించే వాళ్లూ పెరిగారు. ''వాహనాలు, ఇతర కాలుష్య ఉద్గారాలతో కలుషితమైన గాలితో పోలిస్తే ఇలాంటి ఆక్సిజన్ చాంబర్‌లో కూర్చుని కాస్తంత స్వచ్ఛమైన గాలి పీల్చడం బాగానే ఉందిగానీ ఇది ఏమంత సురక్షితం కాదు. ఆక్సిజన్ అగ్నిని మరింత రాజేస్తుంది. పూర్తిగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వైర్లమయమైన ఛాంబర్‌లో పొరపాటున ఒక్క నిప్పురవ్వ అంటుకున్నా మీకే ప్రమాదం. పైగా వేగంగా వేడెక్కే కంప్యూటర్ వాడుతున్నారు''అని ఒక నెటిజన్ హెచ్చరించారు. హాలీవుడ్ సినిమా మ్యాడ్‌మ్యాక్స్‌లో మృత్యుంజయునిగా ఉండేందుకు తాపత్రయపడే 'ఇమ్మోర్టాన్ జోయ్'పాత్రధారి వేషంలో బ్రియాన్ భలేగా ఉన్నాడని మరో నెటిజన్ వ్యంగ్య పోస్ట్‌చేశారు. దీనిని నటుడు కీస్ బైర్న్ ఫొటోను జతచేశారు. ''చిన్నతనంలో కార్టూన్ సినిమాలో చూసిన క్యాప్సూల్ లాగా ఈయన గారి ఛాంబర్ ఉంది''అని ఇంకొకరు వెటకారంగా పోస్ట్‌చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పాక్ వర్సిటీలో హోలీ వేడుకలు..

హిందూ విద్యార్థులకు నోటీసులు

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ కరాచీలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో హోలీ వేడుకలు నిర్వహించిన హిందూ విద్యార్థులకు షోకాజ్ నోటీసులివ్వడం చర్చనీయాంశమైంది. దావూద్ యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ యాజమాన్యం విద్యార్థులకు నోటీసులిచ్చిన విషయాన్ని మాజీ ఎంపీ లాల్ మల్హి సోషల్ మీడియా ద్వారా తెలిపారు. మైనారిటీ విద్యార్థుల మతపరమైన ఆచారాలను నేరంగా భావించే ధోరణి పాక్‌లో ఎక్కువైపోతోందంటూ ఆందోళన వెలిబుచ్చారు. గతేడాది కూడా కొన్ని ప్రావిన్స్‌ల్లో హోలీ వేడుకలు జరుపుకున్నందుకు హిందూ విద్యార్థులు ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొన్నారని తెలిపారు. అయితే, పరిపాలనాధికారి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీ ఆవరణలో వేడుకలు చేపట్టినందుకే నోటీసులిచ్చామని వర్సిటీ వివరణ ఇచ్చింది. ఇది పాత కేసని, సంబంధిత విద్యార్థులపై కేసులు నమోదు కాలేదని కూడా తెలిపింది.పాకిస్తాన్‌లో అత్యధికంగా హిందువులు సింధ్ ప్రావిన్స్‌లోనే నివసిస్తున్నారు. అధికారులు తమ పట్ల వివక్ష చూపుతున్నారని, నిరుపేద హిందువుల అమ్మాయిలను ముస్లింలు బలవంతంగా పెళ్లి చేసుకుని, మతమార్పిడులకు పాల్పడుతున్నారంటూ వీరు తరచూ ఆరోపిస్తున్నారు.

అవమానిస్తున్నా నోరు మెదపరా?

'ఓటర్ల సంఖ్య కోసం అమెరికా డబ్బు' ఉదంతంలో కేంద్రంపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: భారత్‌లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా కోట్ల రూపాయల నగదు విరాళాలు ఇచ్చిందని డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్‌లు పదేపదే చెబుతుంటే మోదీ సర్కార్ ఎందుకు మౌనం వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ సూటిగా ప్రశ్నించింది. ఈ విషయమై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(ఇన్‌చార్జ్) జైరాం రమేశ్ ఆదివారం 'ఎక్స్'లో పలు పోస్టులుచేశారు. ''అబద్ధాలకోరులు, నిరక్షరాస్యుల ఊరేగింపు మందగా బీజేపీ తయారైంది. 2.1 కోట్ల డాలర్లు ఇచ్చామని అమెరికా ప్రకటించినప్పటి నుంచీ బీజేపీ వాళ్లు ఎగిరెగిరి పడుతున్నారు. 2022లో భారత్‌కు అన్ని కోట్ల డాలర్లు వచ్చాయనేది అబద్ధం. ఆ డబ్బు బంగ్లాదేశ్‌కు వెళ్లింది. ఎలాన్ మస్క్ తప్పు చెప్పారు. ఢాకా అనిబోయి ట్రంప్ ఢిల్లీ అన్నారు. బీజేపీ నేత అమిత్ మాలవీయ అబద్ధాలు ప్రచారంచేస్తున్నారు. దీనికి బీజేపీ వాళ్లు వంతపాడుతున్నారు''అని జైరాంరమేశ్ అన్నారు.

సీఈపీపీఎస్‌కు 48 కోట్ల డాలర్లు

''డోజ్ జాబితా ప్రకారం అమెరికా నుంచి రెండు యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ఎయిడ్) గ్రాంట్లు రావాల్సి ఉంది. ఆ 48.6 కోట్ల డాలర్లు కన్సార్టియం ఫర్ ఎలక్షన్స్ అండ్ పొలిటికల్ ప్రాసెస్ స్ట్రెంథనింగ్(సీఈపీపీఎస్)కు రావాల్సిఉంది. ఇందులో 2.2 కోట్లు మాల్డోవా కోసం, మరో 2.1 కోట్లు భారత్‌లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు ఉద్దేశించినవి. ఇందులో తొలిగ్రాంట్ ఏఐడీ117ఎల్ఏ1600001 ఐడీతో మాల్డోవాకు ఇచ్చారు. 2.1 కోట్ల గ్రాంట్‌కు భారత్‌కు వెళ్లాల్సి ఉందని మస్క్ చెప్పింది అబద్ధం. ఈ గ్రాంట్ వాస్తవానికి బంగ్లాదేశ్‌కు వెళ్లాల్సింది. నా ఓటు నాదే అనే కార్యక్రమం కోసం ఈ గ్రాంట్‌ను వినియోగించాలని బంగ్లాదేశ్‌లో నిర్ణయించారు. కానీ తర్వాత ఈ నిధులను నాగరిక్ కార్యక్రమం కోసం వినియోగించాలని నిర్ణయం మార్చుకున్నారు. ఈ విషయాన్ని యూఎస్ఎయిడ్ అధికారి స్పష్టం చేశారు''అని జైరాం వెల్లడించారు.

న్యూయార్క్-న్యూఢిల్లీ విమానానికి బాంబు బెదిరింపు

రోమ్‌కు దారి మళ్లింపు

న్యూయార్క్: అమెరికన్ ఎయిర్ లైన్స్‌కు చెందిన న్యూయార్క్-న్యూఢిల్లీ విమానాన్ని అధికారులు భద్రతా కారణాలతో రోమ్‌కు దారి మళ్లించారు. 22న జేఎఫ్‌కే అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాత్రి 8.14 గంటల సమయంలో టేకాఫ్ తీసుకున్న ఈ విమానంలో బాంబు పెట్టామంటూ బెదిరింపులు అందాయి. దీంతో, రోమ్‌లోని లియోనార్డో డావిన్సీ ఫియుమిసినో ఎయిర్ పోర్టులో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఇటలీ ఎయిర్ ఫోర్స్ విమానాలు రక్షణగా రాగా బోయింగ్ విమానం ల్యాండవుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి.

శ్రీలంక నేవీ అదుపులో 32 మంది భారతీయ జాలర్లు

కొలంబో: తమ ప్రాదేశిక జలాల్లోకి చొరబడి అక్రమంగా చేపలు పడుతున్న 32 మంది భారతీయ జాలర్లను అరెస్ట్ చేసినట్లు ఆదివారం శ్రీలంక నేవీ తెలిపింది. మన్నార్‌కు ఉత్తరంగా చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్ సందర్భంగా ఐదు పడవలను కూడా స్వాధీనం చేసుకున్నామంది.

స్థానిక మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను అడ్డుకుంటామని, ఆ ప్రాంతంలో రోజువారీ గస్తీ కొనసాగుతుందని తెలిపింది. పట్టుకున్న మత్స్యకారులను తలైమన్నార్‌కు తరలించామని వివరించింది. దీంతో, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 131 మంది భారతీయ జాలర్లతోపాటు 18 చేపల పడవలను పట్టుకున్నట్లయిందని శ్రీలంక నేవీ వెల్లడించింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇటువంటి చర్యలు అంగీకారం కాదంటూ భారత్ పేర్కొంది. కొలంబోలోని భారత హైకమిషనర్ ఈ అంశాన్ని శ్రీలంక విదేశాంగ శాఖ దృష్టికి తీసుకెళతారని తెలిపింది.

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 518 పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 518.
» పోస్టుల వివరాలు: సీనియర్ మేనేజర్, మేనేజర్–డెవలపర్ ఫుల్‌స్టాక్, ఆఫీసర్–డెవలపర్, ఆఫీస్–క్లౌడ్ ఇంజనీర్, ఆఫీసర్–ఏఐ ఇంజనీర్, మేనేజర్–ఏఐ ఇంజనీర్, సీనియర్ మేనేజర్ ఏఐ ఇంజనీర్, ఆఫీసర్ ఏపీఐ డెవలపర్, మేనేజర్ ఏపీఐ డెవలపర్, మేనేజర్–నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సీనియర్ మేనేజర్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ మొదలైనవి.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంసీఏ, సీఏ, సీఎఫ్ఏ, ఎంబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: పోస్ట్ గ్రేడ్–ఎంఎంజీ/ఎస్–3కి 27 నుంచి 37 ఏళ్లు, ఎంఎంజీ/ఎస్–2కు 24 నుంచి 34 ఏళ్లు, జేఎంజీ/ఎస్–1కు 22 నుంచి 32 ఏళ్లు, ఎస్ఎంజీ/ఎస్–4కు 33 నుంచి 43 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు పోస్ట్ గ్రేడ్–జేఎంజీ/ఎస్–1కు రూ.48,480,ఎంఎంజీ/ఎస్–2కు రూ. 64,820, ఎంఎంజీ/ఎస్–3కు రూ.85,920, ఎస్ఎంజీ/ఎస్–4కు రూ.1,02,300.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:11.03.2025
» వెబ్‌సైట్: www.bankofbaroda.in

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో 83 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) దేశవ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 83.
» పోస్టుల వివరాలు: జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీసెస్)–13, జూనియర్ ఎగ్జిక్యూటివ్(హ్యూమన్ రిసోర్సెస్)–66, జూనియర్ ఎగ్జిక్యూటివ్(అఫిషియల్ లాంగ్వేజ్)–04.
» అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 18.03.2025 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, సర్టిఫికేట్‌ల పరిశీలన, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:18.03.2025
» వెబ్‌సైట్: https://www.aai.aero

ఐఎఫ్‌సీఐ లిమిటెడ్, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఐఎఫ్‌సీఐ).. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08.
» పోస్టుల వివరాలు: డైరెక్టర్–01, డైరెక్టర్(ఐటీ)–01, అసోసియేట్ డైరెక్టర్–01, అసోసియేట్ డైరెక్టర్(ఎస్టేట్, సర్వీస్, అడ్మినిస్ట్రేషన్)–01, సీనియర్ అసోసియేట్–02, సీనియర్ అసోసియేట్(ఐటీ)–01,అసోసియేట్(అడ్వైజరీ)–1.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీసీఏ, బీఈ, బీటెక్, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.01.2025 నాటికి అసోసియేట్‌కు 35 ఏళ్లు, అసోసియేట్ డైరెక్టర్‌కు 55 ఏళ్లు, డైరెక్టర్‌కు 57 ఏళ్లు నిండి ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» ఈమెయిల్: contract@ifciltd.com.
» దరఖాస్తులకు చివరితేది: 05.03.2025.
» వెబ్‌సైట్: http://www.ifciltd.com

పీజీసీఐఎల్‌లో 115 మేనేజర్ పోస్టులు

హర్యానాలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్).. మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 115.
» పోస్టుల వివరాలు: మేనేజర్(ఎలక్ట్రికల్)–09, డిప్యూటీ మేనేజర్(ఎలక్ట్రికల్)–48, అసిస్టెంట్ మేనేజర్(ఎలక్ట్రికల్)–58.
» అర్హత: కనీసం 60 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఇంజనీరింగ్ విభాగంలో బీఈ,బీటెక్,బీఎస్సీ (ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వయసు: మేనేజర్ పోస్టుకు 39 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 36 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 33 ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: నెలకు మేనేజర్ పోస్టుకు రూ.1,13,500, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.97,300, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.76,700.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:12.03.2025
» వెబ్‌సైట్: www.powergrid.in

డిజైన్ కెరీర్స్‌కు కేరాఫ్ ఎఫ్‌డీడీఐ

వినూత్నమైన కెరీర్ కోరుకునే వారికి సరైన వేదిక.. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)! డిజైన్, ఫ్యాషన్ రంగంలో.. నిష్ణాతులను తీర్చిదిద్దేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్ ఇది!! డిజైన్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయిలో పలు కోర్సులను అందిస్తోంది. ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌ల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్‌కు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎఫ్‌డీడీఐ ఏఐఎస్‌టీ-2025 దరఖాస్తుకు అర్హతలు, క్యాంపస్‌లు, కోర్సులు, ప్రవేశ పరీక్ష విధానం తదితర వివరాలు..



» ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లలో యూజీ, పీజీ కోర్సులు
» జాతీయ స్థాయి ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు
» కోర్సులు పూర్తి చేసుకుంటే ప్రముఖ సంస్థల్లో కొలువులు

12 క్యాంపస్‌లు.. 2,390 సీట్లు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 12 క్యాంపస్‌లు ఉన్నాయి. వాటిలో బ్యాచిలర్, పీజీ స్థాయిలో డిజైన్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించి మొత్తం 2,390 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లో ఒక క్యాంపస్‌ను నెలకొల్పారు. ఇందులో 370 సీట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లోని క్యాంపస్‌లో బ్యాచిలర్ స్థాయిలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ విభాగంలో.. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్‌లో 80 సీట్లు, ఫ్యాషన్ డిజైన్‌లో 80; లెదర్, లైఫ్‌స్టైల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్‌లో 60;, బీబీఏ(రిటెయిల్ అండ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్)లో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పీజీ స్థాయిలో.. ఫ్యాషన్ డిజైన్‌లో 30; ఎంబీఏ(రిటెయిల్ అండ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్) స్పెషలైజేషన్‌లో 60 సీట్లు ఉన్నాయి. అదేవిధంగా నోయిడ క్యాంపస్‌లో 430 సీట్లు, ఫురసత్‌గంజ్‌లో 120, చెన్నైలో 180, కోల్‌కతలో 180, రోహ్‌తక్‌లో 120, జోధ్‌పూర్‌లో 120, చింద్వారాలో 180, గుణలో 90, అంక్లేశ్వర్‌లో 120, పాట్నాలో 240, చండీగఢ్‌లో 240 సీట్లు చొప్పున బ్యాచిలర్, పీజీ స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా ఎన్ఆర్ఐ అభ్యర్థులకు మరో 230 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత

✦ బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులకు ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
✦ వయో పరిమితి: 2025, జూలై 1 నాటికి 25 ఏళ్ల లోపు ఉండాలి.
✦ మాస్టర్ ఆఫ్ డిజైన్, ఎంబీఏ (రిటెయిల్ అండ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్) కోర్సులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. పీజీ కోర్సులకు ఎలాంటి వయో పరిమితి లేదు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సెప్టెంబర్ 30, 2025 లోపు ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష

మొత్తం 12 క్యాంపస్‌లలోని బ్యాచిలర్, పీజీ స్థాయిలో ప్రొడక్ట్ డిజైన్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి ఎఫ్‌డీడీఐ ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ) నిర్వహిస్తుంది. ఈ పరీక్ష జాతీయ స్థాయిలో బ్యాచిలర్, పీజీ కోర్సులకు వేర్వేరుగా ఉంటుంది.

ఏఐఎస్‌టీ.. యూజీ పరీక్ష

బ్యాచిలర్ స్థాయి కోర్సులకు నిర్వహించే పరీక్ష నాలుగు విభాగాల్లో మొత్తం 200 మార్కులకు ఉంటుంది. ఇందులో సెక్షన్–ఎలో అనలిటికల్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–25 మార్కులకు, సెక్షన్–బిలో బిజినెస్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు, డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 1 ప్రశ్న–50 మార్కులకు, సెక్షన్–సిలో జనరల్ అవేర్‌నెస్ 35 ప్రశ్నలు–35 మార్కులకు, సెక్షన్–డిలో కాంప్రహెన్షన్ 25 ప్రశ్నలు–25 మార్కులు, గ్రామర్, యూసేజ్ 15 ప్రశ్నలు–15 మార్కులకు ఉంటాయి.

ఏఐఎస్‌టీ పీజీ పరీక్ష

ఎంబీఏ, ఎంబీఏ(ఆర్ఎఫ్ఎం) కోర్సులకు నిర్వహించే పరీక్ష కూడా నాలుగు విభాగాలుగా 200 మార్కులకు ఉంటుంది. ఇందులో సెక్షన్–ఎ అనలిటికల్ ఎబిలిటీ 25 ప్రశ్నలు–50 మార్కులకు, సెక్షన్–బి ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్ 50 ప్రశ్నలు–50 మార్కులకు, సెక్షన్–సి జీకే అండ్ కరెంట్ అఫైర్ 50 ప్రశ్నలు– 50 మార్కులకు, సెక్షన్–డి మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ అండ్ డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 50 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి.

ఉమ్మడి ప్రవేశ ప్రక్రియ

ఏఐఎస్‌టీలో సాధించిన ర్యాంకు ఆధారంగా ఎఫ్‌డీడీఐ 12 క్యాంపస్‌లలోని సీట్లకు ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు. బ్యాచిలర్, పీజీ స్థాయి ప్రోగ్రామ్‌లకు వేర్వేరుగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థుల ర్యాంకు, రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుంటారు. సీటు ఖరారు చేసుకున్న అభ్యర్థులు నిర్దేశిత తేదీలోపు తమకు సీటు లభించిన క్యాంపస్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

షైనింగ్ కెరీర్స్

ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లలో ప్రవేశం పొంది కోర్సు పూర్తి చేసుకున్న వారు చక్కటి కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఆదిత్య బిర్లా గ్రూప్, టాటా గ్రూప్, బాటా, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ సంస్థల్లో కొలువులు లభిస్తాయి. స్వయం ఉపాధి దిశగా స్టార్టప్ సంస్థలను నెలకొల్పే అవకాశం కూడా ఉంది.

భారీగా వేతనాలు

ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లలో బ్యాచిలర్, పీజీ ఉత్తీర్ణులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా రూ.లక్షల వేతనంతో కొలువులు ఖరారవుతున్నాయి.గత మూడేళ్ల క్యాంపస్ ప్లేస్‌మెంట్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఎనభై శాతం పైగా విద్యార్థులకు ఆఫర్లు లభించడమే కాకుండా..సగటు వేతనం రూ. 8 లక్షలుగా నమోదవుతోంది. అడిడాస్ ఇండియా, ప్యూమా, ఆలైన్ అపారెల్స్, ఆదిత్య బిర్లా తదితర ప్రముఖ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి.

విభిన్నమైన జాబ్ ప్రొఫైల్స్

ఎఫ్‌డీడీఐ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫుట్‌వేర్ డిజైనర్, ప్రొడక్ట్ డెవలపర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, క్వాలిటీ కంట్రోలర్, ఫుట్‌వేర్ టెక్నాలజిస్ట్, మెర్చెండైజర్, మార్కెటింగ్, ప్లానింగ్ ఎగ్జిక్యూటివ్, ట్రెండ్ అనలిస్ట్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ మ్యానుఫాక్చరింగ్ ఆపరేషన్స్, స్టోర్ మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, ఏరియా మేనేజర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ముఖ్య సమాచారం

✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2025, ఏప్రిల్ 20
✦ ఏఐఎస్‌టీ పరీక్ష తేదీ: 2025, మే 11
✦ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://fddiindia.com/admissionprocess

రాత పరీక్షలో రాణించేలా

అనలిటికల్ ఎబిలిటీ

అభ్యర్థుల్లోని మ్యాథమెటికల్, అర్థమెటికల్ నైపుణ్యాన్ని పరీక్షించే విభాగం ఇది. అర్థమెటిక్–రేషియో, మిక్చర్స్, వర్క్, యావరేజ్, పర్సంటేజ్, టైమ్ అండ్ స్పీడ్, ప్రాఫిట్ అండ్ లాస్, ఇంటరెస్ట్, బేసిక్ స్టాటిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా నెంబర్ ప్రాపర్టీస్, ప్రాబబిలిటీ, కౌంటింగ్ ప్రిన్సిపల్స్, జామెట్రీ, డెరివేటివ్స్ (మ్యాగ్జిమా–మినిమా) వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

వెర్బల్ ఎబిలిటీ

ఇది ఇంగ్లిష్ నైపుణ్యాన్ని పరిశీలించే విభాగం. ఇందులో రాణించడానికి ఇంగ్లిష్ గ్రామర్‌తో పాటు, లాజికల్ రీజనింగ్ అంశాలు, సీటింగ్ అరేంజ్‌మెంట్, సీక్వెన్సెస్, బ్లడ్ రిలేషన్స్, కోడింగ్, డీ–కోడింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

కరెంట్ అఫైర్స్‌తోపాటు హైస్కూల్ స్థాయి సోషల్ సబ్జెక్ట్‌ను చదివి హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ముఖ్య ఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్

డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి ఏదైనా ఒక ఆకృతిని రూపొందించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి డిజైన్ రంగంలో తాజా పరిణామాలు, మార్కెట్ పరిస్థితులు, టాప్ కంపెనీలు తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

పదజాలానికి అర్థంలో జరిగే మార్పును ఏమంటారు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

అర్థ పరిణామం

భాషలోని వర్ణాలు, ధ్వనులు, వాక్య నిర్మాణం , వ్యాకరణ నిర్మాణం మారినట్లుగానే అర్థాలు కూడా మారడం సహజం. నన్నయ భారతంలో 'కంపు' అనే పదాన్ని వాసన అనే అర్థంలో వాడారు. నేటి భాషలో అది చెడు వాసన అనే అర్థంగా మారింది. ప్రతి పదానికీ చరిత్ర ఉంది. ఒక మాటకు ఒకే అర్థం కాకుండా అనేకార్థాలుంటాయి. కొత్త కొత్త భావాలు, ఆలోచనలు, అవసరాలు వచ్చినప్పుడు ఉన్న పదాలనే కొత్త సందర్భాల్లో వాడటం వల్ల కొత్త అర్థాలు ఏర్పడటం సహజం. పాతకాలంలో ఇల్లు అంటే పూరిల్లు అనే అర్థం ఉండేది. ఆధునిక కాలంలో ఇల్లు అంటే పెంకుటిల్లు, డాబా, మేడ, అపార్ట్‌మెంట్ అనే అర్థాల్లో రూఢమైంది.

అర్థ పరిణామానికి హేతువులు

అర్థ పరిణామానికి స్థూలంగా ప్రధానమైన ఐదు కారణాలను పేర్కొనవచ్చు. అవి..

- నాగరికతలో మార్పు రావడం
- చారిత్రక కారణాల వల్ల కొన్ని పదాలు ప్రసిద్ధిలోకి వచ్చి అర్థాంతరంలో ఉపయోగించడం వల్ల
- అలంకారిక ప్రయోగం
- పరిసరాల్లో మార్పు రావడం
- భావాభివ్యక్తిలో మార్పు
- ఇవేకాకుండా ప్రకరణార్థాలు, నానార్థాలు, శ్లేషార్థాలు, పలుకుబడులు, జాతీయాలు, వ్యాకరణార్థాలు, పర్యాయపదాల వల్ల అర్థాల్లో మార్పు వస్తుంది.

అర్థ పరిణామ భేదాలు

భాషావేత్తలు.. అర్థ వ్యాకోచం, అర్థ సంకోచం , అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం, అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష, లక్ష్యార్థాలు, కేవల సంకేతార్థాలు, వస్తు పరిణామం, అలంకారిక ప్రయోగం, లోక నిరుక్తి వంటి భేధాలను పేర్కొన్నారు. వాటిని పరిశీలిద్దాం..

అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతి

ఒక పదం పాతకాలంలో పరిమితార్థంలో ఉండి, తర్వాత కాలంలో విశాలార్థంలో విస్తృతం కావడాన్ని అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతిగా పేర్కొనవచ్చు. ఆంగ్లంలో దీన్ని Extention of the meaning అంటారు. అర్థ వ్యాకోచానికి కొన్ని ఉదాహరణలు..

- **చెంబు:** రాగి లోహంతో చేసిన దాన్నే ప్రాచీన కాలంలో చెంబు అనేవారు. నేడు ఏ లోహంతో చేసినా చెంబు అంటున్నారు. ప్రత్యేకార్థం నుంచి విస్తృతార్థంలో ఇత్తడి చెంబు, ప్లాస్టిక్ చెంబు, వెండి చెంబు అని వ్యవహరిస్తున్నారు.
- **నూనె:** ప్రాచీన కాలంలో నువ్వుల నుంచి తీసినదాన్నే నూనెగా పరిమితార్థంలో వ్యవహరించేవారు. ప్రస్తుతం వేరుశెనగ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ నుంచి తీసిన వాటిని కూడా నూనెగానే సామాన్య అర్థంలో వాడుతున్నారు.
- **అష్టకష్టాలు:** ప్రాచీన కాలంలో ఎనిమిది రకాలైన కష్టాలను పేర్కొన్నారు. అవి.. 1) దేశాంతర గమనం (విదేశాలకు వెళ్లడం) 2) భార్యా వియోగం 3) ఆపదల్లో బంధు దర్శనం 4) శత్రుస్నేహం 5) నీచ ఉచ్ఛిష్ట భోజనం 6) పరాన్న భోజన ప్రతీక్షణం 7) అప్రతిష్ఠ 8) దారిద్ర్యం. నేడు వీటినే అసంఖ్యాకమైన కష్టాలు అనే అర్థంలో వాడుతున్నారు.
- **అవధాని:** ప్రాచీన కాలంలో అవధానం చేసే వ్యక్తినే అవధాని అనేవారు. నేడు బ్రాహ్మణుల పేర్ల చివర అవధాని చేరుతోంది. ఇక్కడ అర్థ విస్తృతి జరిగింది.
- **కమ్మలు:** ప్రాచీన కాలంలో తాటి ఆకులతో చేసి చెవులకు ధరించే ఆభరణాలనే కమ్మలనేవారు. నేడు చెవులకు ధరించే బంగారం, వెండి, ప్లాస్టిక్ ఆభరణాలన్నింటినీ విస్తృతార్థంలో కమ్మలంటున్నారు.

అర్థ సంకోచం

ప్రాచీన కాలంలో విస్తృతార్థంలో ఉండి నేడు పరిమితార్థానికి వచ్చిన పదాలను అర్థ సంకోచం అంటారు. అర్థం కుంచించుకుపోవడమే అర్థ సంకోచం.

ఉదాహరణ:

- ప్రాచీన కాలంలో స్త్రీ, పురుషులిద్దరూ ధరించే వస్త్రాలను చీర, కోక అనేవారు. ఇప్పుడు కేవలం స్త్రీలు ధరించే వస్త్రాలు అనే అర్థంలో పరిమితమయ్యాయి.
- పూర్వం అవ్వ అనే పదాన్ని స్త్రీ అనే సామాన్య అర్థంలో వాడేవారు. ఇప్పుడు కేవలం వృద్ధ స్త్రీ అనే అర్థానికే పరిమితమైంది.
- పని, ప్రయత్నం అనే అర్థంలో ప్రాచీనకాలంలో ఉద్యోగం అనే పదం వాడేవారు. నేడు కేవలం ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక సంబంధమైన సంస్థల్లో చేసే ఉద్యోగం అనే అర్థంలో పరిమితమైంది.
- **శ్రాద్ధం:** దీనికి పూర్వం శ్రద్ధతో చేసే పని అనే అర్థం ఉండేది. ఇప్పుడు చనిపోయిన వారికి నిర్వహించే కర్మకాండగా రూఢమైంది.
- **అర్థ సంకోచం జరిగిన కొన్ని పదాలు:** వ్యవసాయం, మృగం, ఆరాధ్యుడు, సంభావన, నెయ్యి, సాహెబ్, జంగమ, కర్మ.

అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం లేదా అర్థోత్కర్ష

పూర్వకాలంలో నిందార్థంలో వాడిన పదాలు కాలక్రమంలో విశిష్టార్థ బోధకాలై వాటికి అర్థ గౌరవం కలిగినప్పుడు వాటిని అర్థ సౌమ్యత లేదా అర్థోత్కర్ష అంటారు.

ఉదాహరణలు:

- **సభికులు:** ప్రాచీన కాలంలో జూదగాళ్లు అనే అర్థంలో వాడేవారు. నేడు సభలోని వారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.
- **వైతాళికులు:** పూర్వం రాజును నిద్రలేపే వారు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం సంస్కర్తలు, మూఢాచారాలపై అవగాహన కలిగించేవారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.
- **ముహూర్తం:** గతంలో నిమిష కాలం, అల్పకాలం అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పవిత్రమైన శుభకార్యాలు నిర్వహించే కాలం అనే అర్థంలో రూఢమైంది.
- **మర్యాద:** 'హద్దు' అనే అర్థంలో ఉండేది. నేడు గౌరవం అనే అర్థంలో వాడుతున్నారు.
- **అదృష్టం:** కనిపించనిది అనే అర్థం ఉండేది. నేడు సంపద, భాగ్యం అనే అర్థంలో ఉంది.
- **అంతస్తు:** మేడ పై భాగం అనే అర్థంలో పూర్వం వాడేవారు. ప్రస్తుతం పరువు, ప్రతిష్ఠ అనే అర్థ గౌరవాన్ని సంతరించుకుంది.
- ఆంగ్లంలో Knight అనే పదం Servant అనే అర్థంలో పాతకాలంలో ఉండేది. ప్రస్తుతం ప్రజ్ఞాశాలి అనే అర్థంలో వాడుతున్నారు.
- nice అనే పదం stupid అనే అర్థంలో ఉండేది. నేడు అందమైన అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష లేదా అర్థ న్యూనత

ప్రాచీనకాలంలో గౌరవార్థంలో ఉండి కాలక్రమంలో నిందార్థంలో ప్రయోగిస్తున్న పదాలను అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష అంటారు.

- **కంపు:** ఒకనాడు సువాసన అనే అర్థం ఉండేది. ప్రస్తుతం దుర్వాసన అనే అర్థంలో వాడుతున్నారు.
- **ఛాందసుడు:** పూర్వకాలంలో వేద పండితుడు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం అమాయకుడు, లోకజ్ఞానం లేనివాడు అనే నిందార్థంలో వాడుతున్నారు.
- **కర్మ:** పూర్వం పని అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పితృకర్మ అనే అర్థానికి పరిమితమైంది.
- **దేవదాసి:** ఒకప్పుడు దేవాలయాల్లో నృత్య గానాదులు నిర్వహించే స్త్రీ అనే అర్థం ఉండేది. ప్రస్తుతం వేశ్యకు పర్యాయపదంగా మారింది.
- **సాని:** పూర్వం రాణి, దొరసాని అనే గౌరవార్థంలో వాడేవారు. ప్రస్తుతం వేశ్య, వ్యభిచారిణి అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థాపకర్ష జరిగిన కొన్ని పదాలు: కళావంతులు, కైంకర్యం, పూజ్యం, ఘటం మొదలైనవి.

లక్ష్యార్థ సిద్ధి

పదాలకు అసలు అర్థాలతోపాటు కొన్ని లక్ష్యార్థాలు ఏర్పడి రూఢికెక్కాయి. లక్ష్యార్థాలకు అనేక మూలాలుంటాయి. లక్ష్యార్థాలు ఏర్పడేందుకు 1) ఆధార ఆదేయ సంబంధం 2) కార్యకారణ సంబంధం 3) అశాంశి సంబంధం ఉంటుంది.

1. **ఆధార ఆదేయ సంబంధం:** ప్రాచీనార్థం, ముష్టి - పిడికిలి, నేడు భిక్ష, భిక్షం ఆధారమైంది. పిడికిలి కాబట్టి భిక్ష అనే లక్ష్యార్థం ఏర్పడింది.
2. **కార్యకారణ సంబంధం:** పూర్వం దాహం అనే పదానికి దహించడం, తపించడం అనే అర్థాలు ఉన్నాయి. కార్యకారణ సంబంధం వల్ల దప్పిక, దాహం అనే లక్ష్యార్థాలు ఏర్పడ్డాయి.
3. **లక్ష్యలక్షణ సంబంధం:** ప్రాచీనార్థంలో సూది.. వస్త్రాలు కుట్టేందుకు ఉపకరించేది. ప్రస్తుతం డాక్టర్లు వాడే ఇంజక్షన్ అనే లక్ష్యార్థంలో సూది వాడుతున్నారు.

కేవలం సంకేతార్థాలు

ఒక పదానికి జన వ్యవహారంలో ఒక అర్థం ఉండగా, ఒక వృత్తి, విజ్ఞాన శాస్త్రపరంగా ఆ పదాన్ని ప్రత్యేక అర్థంలో వాడతారు. ఇలాంటి వాటిని సంకేతార్థాలు అంటారు.

1. **వాయువు:** సామాన్యార్థం గాలి (ప్రాచీనకాలం), నేడు పశువైద్యులు, పశువులకు వచ్చే వ్యాధిని గాలి అంటున్నారు. ఇది సంకేతార్థం.
2. **ద్రవ్యం:** ప్రాచీనార్థం.. ధనం, డబ్బు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు, పదార్థం అనే సంకేతార్థంలో వాడుతున్నారు.
3. **ఇంధనం:** ఇంతకుముందు వంట చెరకు, చిదుకులు, పెట్రోలు వంటి అర్థాల్లో వాడేవారు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ఉష్ణశక్తినిచ్చే చమురు, బొగ్గు వంటి వాటికి సంకేతార్థంగా వాడుతున్నారు.

వస్తు పరిణామం

ఒక పదం ప్రాచీన కాలంలో సూచించే వస్తు రూపం, నిర్మాణం మొదలైన వాటిలో కాలక్రమంలో వచ్చిన భేదాన్ని సూచించే విస్తృతిని వస్తు పరిణామం అంటారు.

1. లక్కపిడతలు అంటే పూర్వం పిల్లలు ఆడుకొనే లక్కతో చేసిన బొమ్మలు. ప్రస్తుతం లక్కబొమ్మలే కాకుండా కర్ర, లోహంతో చేసిన బొమ్మలను కూడా లక్కపిడతలు అంటున్నారు. ఇది వస్తు పరిణామం.
2. **ఆయుధం:** ప్రాచీన కాలంలో విల్లు, గద, కత్తి వంటివి ఆయుధాలు. నేడు తుపాకీ, రైఫిల్, ఫిరంగి, అణ్వస్త్రాలు వంటి వాటిని ఆయుధాలుగా పిలుస్తున్నారు. ఇది వస్తు పరిణామం.

అలంకారిక ప్రయోగం

అలంకారికమైన పోలికను చెప్పడం వల్ల జరిగే అర్థ పరిణామాన్ని అలంకారిక ప్రయోగం అంటారు.

ఉదా।। ఆమె రంభ, వాడు మన్మథుడు

1. రంభ, మన్మథుడు వంటి ఉపమానాల ద్వారా వారు సౌందర్యవంతులనే అర్థం స్ఫురిస్తుంది.
2. **ఎండ నిప్పులు చెరుగుతోంది** - ఎండ తీవ్రతను సూచించేందుకు నిప్పు ఉపమానాన్ని జోడించినందున ఇది అలంకారిక ప్రయోగం.
3. **చూపుల వెన్నెలలు:** చూపుల చల్లదనాన్ని సూచించేందుకు వెన్నెల ఉపమానాన్ని ప్రయోగించినందున ఇది అలంకారిక ప్రయోగం.

- తీపి మాటలు, చేదు నిజం, పచ్చి అబద్ధం, వంటివి అలంకారిక ప్రయోగాలు.

లోక నిరుక్తి

కొందరు తమకు పరిచయమున్న పదాలను తమకు పరిచయం లేని పదాలస్థానంలో వాడతారు. కాలక్రమేణా అవి జన వ్యవహారంలో బహుళ ప్రాచుర్యం పొందుతాయి. అలాంటి పదాల మార్పును లోక నిరుక్తి అంటారు.

1. నారద సింహాచలం: జన వ్యవహారంలో నార్త్ సింహాచలం నారద సింహాచలంగా మారింది. నార్త్ సింహాచలం ఒక రైల్వే స్టేషన్ పేరు. అది తెలియనివారు నారద సింహాచలంగా పిలవడంతో అలాగే ప్రసిద్ధి చెందింది. అదేవిధంగా బోరన్ మిఠాయి, మొక్కజొన్న, చక్రకేళి, మధురవాడ వంటి పదాలు లోక నిరుక్తికి ప్రసిద్ధాలు.

గత పోటీ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అర్థ సంకోచం జరిగిన పదాలు? (టెట్, జనవరి 2012)
   1) చందమామ, వస్తాదు, కోక
   2) ఛాందసుడు, కైంకర్యం, పత్రం
   3) సీసా, నూనె, ముష్టి
   4) ఆరాధ్యుడు, సీసా, పత్రం
2. దివంగతులగు, శివైక్యం చెందు మాటల్లో జరిగిన అర్థ పరిణామం? (టెట్, జనవరి 2012)
   1) అర్థ సంకోచం 2) లోక నిరుక్తి
   3) లక్ష్యార్థ సిద్ధి 4) సభ్యోక్తి

సమాధానాలు: 1) 4 2) 4

మాదిరి ప్రశ్నలు

1. పదజాలానికి అర్థంలో జరిగే మార్పును ఏమంటారు?
   1) ధ్వని పరిణామం
   2) శబ్ద పరిణామం
   3) అర్థ పరిణామం
   4) వ్యాకరణ పరిణామం
2. నన్నయ భారతంలో వాడిన కంపు పదంలో ప్రస్తుతం జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ న్యూనత 2) అర్థాపకర్ష
   3) అర్థ గ్రామ్యత 4) పైవన్నీ
3. తెలుగులో అర్థ పరిణామాన్ని గురించి మొట్టమొదట పరిశోధన చేసిన భాషావేత్త?
   1) ఆచార్య దొణప్ప
   2) ఆచార్య జి.ఎన్.రెడ్డి
   3) ఆచార్య యల్.చక్రధరరావు
   4) ఆచార్య చేకూరి రామారావు
4. కింది పదాల్లో అర్థ వ్యాకోచానికి ఉదాహరణలు?
   1) కంపు, సంభావన, మృగం
   2) ధర్మరాజు, కమ్మ, పత్రం
   3) చెంబు, నూనె, ధర్మరాజు
   4) ఛాందసుడు, సాని, కమ్మ
5. ప్రాచీనకాలంలో విస్తృతార్థంలో ఉండి ఇప్పుడు పరిమితార్థానికి పరిమితమైతే అది ఏ అర్థ పరిణామం?
   1) అర్థ వ్యాకోచం 2) అర్థ సంకోచం
   3) అర్థ గ్రామ్యత 4) లోక నిరుక్తి
6. ప్రాచీన కాలంలో గౌరవార్థంలో ఉండి ప్రస్తుతం నిందార్థానికి దిగజారితే దాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ సౌమ్యత 2) వస్తు పరిణామం
   3) అర్థోత్కర్ష 4) అర్థ సంకోచం
7. సాని, కైంకర్యం, కర్మ, దేవదాసి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ సంకోచం 2) అర్థ న్యూనత
   3) సభ్యోక్తి 4) మృదూక్తి
8. తుపాకీ, రైఫిల్, ఫిరంగి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) లోక నిరుక్తి 2) అలంకార ప్రయోగం
   3) వస్తు పరిణామం 4) అర్థ సంకోచం
9. వాచ్యం చేయకూడని పదాల అర్థాన్ని నూతన పద బంధాలతో చెప్పడాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ గ్రామ్యత 2) సభ్యోక్తి
   3) మృదూక్తి 4) అర్థోత్కర్ష
10. సభికులు, అంతస్తు, అదృష్టం పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ సంకోచం 2) అర్థ వ్యాకోచం
    3) అర్థోత్కర్ష 4) లోక నిరుక్తి
11. ముష్టి - ఇంజక్షన్, దాహం వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామాన్ని ఏమంటారు?
    1) వస్తు పరిణామం 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి 4) అర్థ సంకోచం
12. చనిపోవు, కులాల పేర్లు, గర్భవతి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ గౌరవం 2) అర్థ గ్రామ్యత
    3) సభ్యోక్తి 4) మృదూక్తి
13. దీపం కొండెక్కింది, నల్లపూసలు పెరిగిపోయాయి వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) మృదూక్తి
    3) అర్థ గౌరవత 4) అర్థ సంకోచం
14. మొక్కజొన్న, నారద సింహాచలం, చక్రకేళి, వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి 4) అర్థ గౌరవం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2; 6) 3; 7) 2; 8) 3; 9) 2; 10) 3; 11) 2; 12) 3; 13) 2; 14) 3.

రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టకపోవడానికి కారణం?

రక్త ప్రసరణ వ్యవస్థ

తెల్ల రక్త కణాలు (ల్యూకోసైట్స్ / డబ్ల్యూబీసీ)

తెల్ల రక్త కణాలను ఫాగోసైట్స్, శరీర రక్షక భటులు (బాడీ సోల్జర్స్), శ్వేత రక్త కణాలు అని కూడా అంటారు. రక్తంలోకి వచ్చిన సూక్ష్మజీవులను తెల్ల రక్తకణాలు చంపి దేహాన్ని కాపాడతాయి. కాబట్టి వీటిని శరీర రక్షక భటులు, లేదా రక్తంలోని పారిశుద్ధ్య పనివారు అని అంటారు.

- ల్యూకోపాయిసిస్ అంటే తెల్ల రక్తకణాల ఉత్పత్తి.
- ల్యూకోలైసిస్ అంటే తెల్ల రక్తకణాల విచ్ఛిత్తి.
- ల్యూకోపేనియా అంటే తెల్ల రక్తకణాల సంఖ్య అసాధారణంగా తగ్గడం.
- ల్యూకేమియా (ల్యూకోసైథీమియా) అంటే తెల్ల రక్తకణాల సంఖ్య విపరీతంగా పెరగడం (బ్లడ్ క్యాన్సర్).
- శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మజీవులను ఎదుర్కొనే క్రమంలో చనిపోయిన తెల్ల రక్తకణాలు చీము రూపంలో బయటకు విసర్జితమవుతాయి.
- డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్‌కు తెల్ల రక్తకణాలను ఉపయోగిస్తారు.
  ఉపయోగం: నేర పరిశోధన, మాతృ, పితృత్వ వివాదాల పరిష్కారం.
- తెల్ల రక్తకణాలు గుండ్రంగా ఉంటాయి.
- వీటిలో కేంద్రం ఉంటుంది.
- కాలేయం, ప్లీహం (లింఫ్ గ్రంథి), థైమస్ గ్రంథి (బాల గ్రంథి),దీర్ఘ అస్థిమజ్జ నుంచి తెల్లరక్త కణాలు ఉత్పత్తి అవుతాయి.
- క్యూబిక్ మి.లీ. రక్తంలో ఉండే తెల్లరక్త కణాల సంఖ్య 5000–9000 ($5–9 \times 10^3$)
- ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాల నిష్పత్తి 500 : 1
- తెల్ల రక్తకణాలు కాలేయం, ప్లీహంలో విచ్ఛిన్నమవుతాయి.

తెల్ల రక్తకణాలు ప్రధానంగా రెండు రకాలు. అవి..

ఎ)గ్రాన్యులోసైట్స్, బి) ఎగ్రాన్యులో సైట్స్

గ్రాన్యులోసైట్స్

ఈ డబ్ల్యూబీసీల జీవ పదార్థంలో రేణువులు (గ్రాన్యుల్స్) ఉంటాయి. మొత్తం డబ్ల్యూబీసీల్లో గ్రాన్యులోసైట్స్ 70 శాతం వరకు ఉంటాయి. వీటిలో కేంద్రకం భిన్న రూపాల్లో ఉంటుంది. కాబట్టి వీటిని బహురూపక కేంద్రక తెల్ల రక్తకణాలు అంటారు. గ్రాన్యులో సైట్స్‌ని తిరిగి మూడు రకాలుగా వర్గీకరిస్తారు.

1) ఇసినోఫిల్స్ (అసిడోఫిల్స్)
2) బేసోఫిల్స్ 3) న్యూట్రోఫిల్స్

ఇసినోఫిల్స్

ఈ కణాలు ఆమ్ల రంజకాలతో రంగును సంతరించుకుంటాయి. వీటి కేంద్రకంలో రెండు తమ్మెలు ఉంటాయి. జీవ పదార్థంలో అతిపెద్ద కణికలుంటాయి. మొత్తం తెల్ల రక్తకణాల్లో వీటి సంఖ్య 2 నుంచి 8 శాతం వరకు ఉంటుంది. ఇసినోఫిల్స్ జీవిత కాలం 7 నుంచి 12 రోజులు.

విధులు

- ఇసినోఫిల్స్ ఎలర్జీ ప్రతిచర్యలను తగ్గిస్తాయి.
- శరీరంలో ప్రవేశించిన విషపదార్థాలను నాశనం చేస్తాయి.
- ఎలర్జీ కారకాలకు వ్యతిరేకంగా పోరాడుతాయి. ఈ సమయంలో ఇసినోఫిల్స్ సంఖ్య విపరీతంగా పెరగడాన్ని ఇసినోఫిలియా అంటారు.
- ఎలర్జీని కలిగించే మొక్కలు
  1) అర్టికేరియా
  2) పార్థీనియం హిస్టిరోఫోరస్ (వయ్యారి భామ/కాంగ్రెస్ గడ్డి)
- ఈ మొక్కల పరాగ రేణువుల వల్ల వచ్చే జ్వరాన్ని హైఫీవర్ అంటారు.
- ఎలర్జీని కలిగించే కారకాన్ని ఎలర్జీన్ అంటారు.
  ఉదా: పరాగరేణువులు, దుమ్ము, సెంట్, లిప్‌స్టిక్ మొదలైనవి.

బేసోఫిల్స్

ఈ కణాలు క్షార రంజకాలతో రంగును సంతరించుకుంటాయి. కేంద్రకం ఎస్ (S) ఆకారంలో ఉంటుంది. తెల్ల రక్తకణాలన్నింటి కంటే వీటి సంఖ్య చాలా తక్కువ (0.4 శాతం).

- వీటి జీవిత కాలం 12 నుంచి 15 రోజులు
- పుండ్లు, గాయాలను మాన్పడంలో ఈ కణాలు తోడ్పడుతాయి.

న్యూట్రోఫిల్స్

ఈ కణాలు తటస్థ రంజకాలతో రంగును సంతరించుకుంటాయి. కేంద్రకం అనేక తమ్మెలను (ఐదు లేక ఆరు) కలిగి ఉంటుంది.

- తెల్ల రక్తకణాలన్నింటి కంటే వీటి సంఖ్య చాలా ఎక్కువ (60–65 శాతం).
- వీటి జీవిత కాలం 2 నుంచి 5 రోజులు.
- శరీరంలోకి వచ్చిన బ్యాక్టీరియాలను చంపడం వల్ల వీటిని సూక్ష్మ రక్షక భటులు (మైక్రో పోలీస్ మెన్) అంటారు.
- బ్యాక్టీరియాల నుంచి శరీరాన్ని రక్షించడం వల్ల వీటిని మొదటి వరుస రక్షకులు అంటారు.
- డబ్ల్యూబీసీల్లోని ఏ ఇతర కణాన్ని అయినా ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంటుంది. కాబట్టి న్యూట్రోఫిల్స్‌ను బహు రూపక తెల్ల రక్తకణాలు (ప్లియోమార్ఫిక్ సెల్స్) అంటారు.
- బేసోఫిల్స్, న్యూట్రోఫిల్స్, మోనోసైట్స్ భక్షణ క్రియలో పాల్గొని లైసోసోమ్స్ అనే కణాంగాల సహాయంతో సూక్ష్మజీవులను చంపే (భక్షణ) ప్రక్రియను ఫాగోసైటాసిస్ అంటారు.

ఎగ్రాన్యులో సైట్స్

ఈ కణాల జీవపదార్థంలో రేణువులు (గ్రాన్యుల్స్) ఉండవు. ఇవి తిరిగి రెండు రకాలు..
1) లింఫోసైట్స్ 2) మోనోసైట్స్.

లింఫోసైట్స్

తెల్ల రక్త కణాలన్నింటిలోకి అతి ప్రధానమైనవి. ఇవి మిగతా తెల్ల రక్తకణాల విధులను నియంత్రిస్తాయి. ఇవి శరీరంలోకి వచ్చిన ప్రతి జనకాల (యాంటీజెన్)ను గుర్తించి వాటికి వ్యతిరేక ప్రతిరక్షకాల(యాంటీబాడీస్)ను ఉత్పత్తి చేసి అసంక్రామ్యత (రోగనిరోధక శక్తి)ని పెంచుతాయి. కాబట్టి వ్యాధి నిరోధక శక్తిని పెంచే అతి ముఖ్యమైన కణాలుగా లింఫోసైట్లను పరిగణిస్తారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
బయాలజీ

- మొత్తం తెల్ల రక్తకణాల్లో ఇవి 25–28 శాతం వరకు ఉంటాయి.
- డబ్ల్యూబీసీల్లో అతి చిన్న రక్తకణాలు లింఫోసైట్లు. ఇవి గుండ్రంగా ఉంటాయి. కేంద్రకం చాలా పెద్దగా ఉంటుంది.
- వీటి జీవిత కాలం రెండు గంటల నుంచి కొన్ని రోజులు.
- లింఫోసైట్స్ రెండు రకాలు..
  1) బి–లింఫోసైట్స్ 2) టి– లింఫోసైట్స్

బి – లింఫోసైట్స్

- ఇవి దీర్ఘ అస్థిమజ్జ నుంచి ఏర్పడతాయి.
- వీటి జీవిత కాలం 12 నుంచి 24 గంటలు. కొన్ని మాత్రం నెల వరకూ జీవిస్తాయి.
- ఇవి అసంక్రామ్యతను కలిగిస్తాయి.
- వీటిని CD_8 కణాలు అంటారు.

టి– లింఫోసైట్స్ (CD_4 / T_4)

- ఇవి థైమస్ గ్రంథి నుంచి ఏర్పడతాయి.
- రక్తంలోకి ప్రవేశించిన వ్యాధి కారకాన్ని ఇవి గుర్తిస్తాయి. అనంతరం వ్యాధి కారకాన్ని భక్షక కణానికి అందిస్తాయి.
- వ్యాధి కారకాన్ని గుర్తించిన కొన్ని టి – లింఫోసైట్స్, బి–లింఫోసైట్స్‌ని ప్రేరేపిస్తాయి.
- హెచ్ఐవీ వైరస్ లేదా రిట్రో వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత మొదట T_4 లింఫోసైట్స్‌పై దాడిచేసి నాశనం చేస్తుంది. దీంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఎయిడ్స్ వ్యాధి వస్తుంది.
- ఎయిడ్స్ వ్యాధిని 1981లో యూఎస్ఏలో మొదటి సారి గుర్తించారు. భారతదేశంలో 1986లో చెన్నైలో గుర్తించారు.



మోనోసైట్స్

ఇవి తెల్ల రక్తకణాలన్నింటిలో కెల్లా అతిపెద్దవి. ఈ కణాల కేంద్రకం మూత్రపిండాకారం (కిడ్నీ)లా ఉంటుంది. ఇవి అంటు రోగం (వ్యాధి గ్రస్తభాగం) వద్దకు వెళ్లి బ్యాక్టీరియాలను చంపుతాయి. ఈ మోనోసైట్స్ సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల బ్లడ్ క్యాన్సర్ వస్తుంది. మోనోసైట్స్‌నే రక్తం నిజమైన పారిశుద్ధ్య కార్మికులు అంటారు. వీటి జీవిత కాలం 2 నుంచి 5 రోజులు.

రక్త ఫలకికలు

ఈ కణాలు అస్థిమజ్జలోని మెగా క్యారియోసైట్స్ అనే కణాల నుంచి ఏర్పడతాయి. ఇవి పూర్తిస్థాయి రక్తకణాలు కావు. ఇవి ద్వికుంభాకారంలో బల్లపరుపుగా ఉంటాయి.

- ఈ కణాల్లో కేంద్రకం ఉండదు.
- వీటి సంఖ్య 2 నుంచి 4 లక్షలు / క్యూబిక్ మి.లీ. రక్తం.
- వీటి జీవిత కాలం 3 నుంచి 10 రోజులు.
- క్షీరదాల్లో మాత్రమే రక్త ఫలకికలుంటాయి.
- డెంగ్యూ, ఎబోలా వ్యాధుల్లో వైరస్ ప్రభావం వల్ల రక్త ఫలకికల సంఖ్య విపరీతంగా తగ్గి రోగి మరణిస్తాడు.
  రక్తఫలకికల విధి: రక్తాన్ని గడ్డకట్టించడం (రక్త స్కందనకు తోడ్పడుతాయి. కాబట్టి వీటిని థ్రాంబోసైట్స్ అంటారు (థ్రాంబస్ అంటే రక్తం గడ్డకట్టడం అని అర్థం).
- గాయమైనప్పుడు ఆ ప్రాంతంలోని రక్త ఫలకికలు విచ్ఛిన్నం చెంది థ్రాంబోప్లాస్టిన్ (థ్రాంబోకైనేజ్) అనే రసాయనాన్ని స్రవిస్తాయి.
- రక్త స్కందనకు నాలుగు కారకాలు అవసరం. అవి..

1. రక్తం గడ్డ కట్టడానికి తోడ్పడే ఎంజైమ్..థ్రాంబోప్లాస్టిన్ / థ్రాంబోకైనేజ్.
2. హార్మోన్..ప్రోథ్రాంబిన్ లేదా ఫైబ్రినోజన్.
3. విటమిన్..K.
4. మూలకం.. Ca^{+2} (కాల్షియం అయాన్లు).

- రక్త స్కందనకు 13 కారకాలు అవసరమని ఇటీవల గుర్తించారు.
- రక్తం గడ్డ కట్టే యాంత్రికాన్ని వివరించింది బెస్ట్, టేటర్.
- రక్తం గడ్డ కట్టే యాంత్రికంలో మూడు దశలు ఉంటాయి.
  I) థ్రాంబోప్లాస్టిన్ విడుదల
- దెబ్బతిన్న రక్త ఫలకికల నుంచి థ్రాంబోప్లాస్టిన్ విడుదలవుతుంది.
  II) ప్రోథ్రాంబిన్ థ్రాంబిన్‌గా మారడం
  III) ఫైబ్రినోజన్ ఫైబ్రిన్‌గా మారడం
- ఫైబ్రిన్ రక్తంలో కరిగి ఉన్న ఫైబ్రినోజన్‌ను ఫైబ్రిన్ పోగులుగా మారుస్తుంది. తర్వాత ఈ ఫైబ్రిన్ పోగులు సంక్లిష్టమైన వలను ఏర్పర్చి గాయం లోపలి తలాన్ని అంటిపెట్టుకొని బిరడా వలె మూసి రక్తాన్ని బయటకు రానీయదు.

రక్త స్కందన నివారణ పదార్థాలు

- రక్తం రక్తనాళాల్లో O_2ను రవాణా చేస్తున్నప్పుడు రక్తం గడ్డ కట్టకుండా హిపారిన్ తోడ్పడుతుంది. దీన్ని కాలేయం స్రవిస్తుంది.
- బ్లడ్ బ్యాంకుల్లో రక్తం గడ్డ కట్టకుండా ఉండటానికి సోడియం, పొటాషియం, అల్యూమినియం సిట్రేట్స్, ఆక్సలేట్స్‌ను కలుపుతారు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. శిశువు పితృత్వాన్ని నిర్ధారించడానికి ఉపయోగించే పరీక్ష? (సివిల్స్, 2010)
   1) అమ్నియో సెంటాసిస్
   2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
   3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
2. అర్టికేరియా అనేది ఒక రకమైన? (గ్రూప్–4, 1989)
   1) వ్యాధి కలుగజేసే మొక్క
   2) ఎలర్జీ మొక్క 3) రసాయనం
   4) ఏదీకాదు
3. మానవ శరీరంలోని ఏ అవయవంలో లింఫోసైట్స్ ఉత్పత్తి అవుతాయి? (సివిల్స్, 2004)
   1) కాలేయం 2) ప్లీహం
   3) దీర్ఘ అస్థి 4) క్లోమం
4. వ్యాధి నిరోధకతను పెంచే రక్త కణాలు? (ఆర్‌డీవోస్ 1992 / వాటర్ వర్క్స్, మెయిన్స్, 2008)
   1) ల్యూకోసైట్స్ 2) మోనోసైట్స్
   3) లింఫోసైట్స్ 4) న్యూట్రోఫిల్స్
5. కొన్ని రకాల పుష్పించే మొక్కలు ఎలర్జీని ఉత్పత్తి చేసే పుప్పొడి రేణువులను కలిగి ఉంటాయి. అలాంటి వాటికి ఉదాహరణ?
   1) పార్థీనియం హిస్టిరోఫోరస్
   2) స్థూలకాయ కోడి
   3) స్పైని అమరాంథస్ 4) పైవన్నీ
6. రక్తంలోని ప్రతిజనకం అనేది? (సివిల్స్, 2001)
   1) హానికర బ్యాక్టీరియాలను నిర్మూలిస్తుంది
   2) విషానికి వ్యతిరేకంగా పనిచేస్తుంది
   3) శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది
   4) యాంటీబాడీల ఏర్పాటులో కీలకపాత్ర
7. మానవ రక్తంలో అధికంగా ఉండే డబ్ల్యూబీసీలు? (అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్ ఏపీ ట్రైబల్, 2002)
   1) ఇసినోఫిల్స్ 2) బేసోఫిల్స్
   3) న్యూట్రోఫిల్స్ 4) మోనోసైట్స్
8. తెల్ల రక్తకణాల జీవిత కాలం? (ఏపీపీఎస్సీ టౌన్ ప్లానింగ్, 2012)
   1) 12–13 రోజులు 2) 16–18 రోజులు
   3) 11–12 రోజులు 4) 10–12 రోజులు
9. రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టకపోవడానికి కారణం? (గ్రూప్–1, 1994)
   1) ఫైబ్రిన్ లేకపోవడం
   2) ఫైబ్రినోజన్ ఉండటం
   3) Ca^{+2} ఉండటం
   4) థ్రాంబో ప్లాస్టిన్ లేకపోవటం
10. మానవుడిలో రక్తం గడ్డ కట్టేందుకు ఎంత సమయం పడుతుంది? (గెజిటెడ్, 2006)
    1) 10 నిమిషాలు 2) 8 నిమిషాలు
    3) 7 నిమిషాలు 4) 3–5 నిమిషాలు

సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 3; 5) 4; 6) 4; 7) 3; 8) 1; 9) 1; 10) 4.

How is Raju related to Rani?

Model Questions

BANK EXAMS
REASONING

Directions (Q.No.1-5) Study the following information carefully and answer the questions given below.

Suman had put a password to his Gmail account which consists of seven characters. There were three numbers 1, 2 and 3 and four alphabets B, V, S and A in the password. He forgot the password and could only remember the following data about his password. (Take directions as per your left right)

I) S was 3rd to the right of 1.
II) 3 was 2nd to the left of B.
III) B and 2 were at a gap of 3 characters
IV) V was next to 2
V) 2 was not at either of the extreme ends.

1. Which of the following was the leftmost character?
   a) A b) 3 c) 1
   d) V e) Can't be determined
2. What was the position of 3 with respect to S?
   a) Immediate left
   b) Third to the right
   c) Second to the left
   d) Immediate right
   e) Second to the right
3. Which of the following character was exactly in the middle?
   a) 1 b) S c) 2
   d) 3 e) 4
4. How many characters were there to the left of 2?
   a) None b) One c) Two
   d) Three
   e) Cannot be determined
5. How many characters were there between V and 3?
   a) None b) One c) Two
   d) Three
   e) Cannot be determined

Directions (Q.No.6-10): Answer these questions based on the following information.

In a certain code:
"Winter water bottle" is coded as "yon wat bob"
"Win Wow water fat" is coded as "din foa wat dit"
'Wow fat summer", is coded as "foa dit yom"
"Bottle money underground" is coded as "bob wan fud"

6. What maybe the code for "bottle fat"?
   a) foa dit b) dit yon
   c) yon foa d) bob dit
   e) dit foa
7. What is the code for "water summer"?
   a) wat foa b) wat yom
   c) wat dit d) dit wat
   e) dit yom
8. What is code for "underground"?
   a) bob b) wan c) fud
   d) Either bob or wan
   e) Either wan or fud
9. What could be the code for "Win money"?
   a) wan dit b) din wan
   c) foa bob d) din wam
   e) None of these
10. What can be the code for "sister"?
    a) sis b) sit c) yos
    d) dis e) Can't be determined

Directions (Q.No. 11-15): Study the following information carefully and answer the questions given below.

Tamas, Tanoj, Tanuj, Taru, Taporaj, Tarak, Tausiq, Tej and Thaman live in a five floored apartment (from the first floor to fifth floor). In any floor, maximum two people can live and no floor is vacant. The first floor is considered as the lowermost floor.

1) Taporaj lives above Taru and below Tanuj.
2) Tanoj lives exactly between Tamas and Tanuj. It does not necessarily means that they live on consecutive floors.
3) Taporaj lives alone in his floor but not at the lowermost floor.
4) Tej lives above Tausiq and there are two floors in between them.
5) Thaman lives below Tarak and Taru. Floor Gap between Taru and Tej is same as that between Tanuj and Tanoj.

11. Who among the following lives on the third floor?
    a) Taporaj b) Tanoj
    c) Tarak d) Tamas
    e) Tausiq
12. At which floor does Tausiq live?
    a) First floor b) Second floor
    c) Third floor d) Fourth floor
    e) Fifth floor
13. At which floor does Tamas live?
    a) First floor b) Second floor
    c) Third floor d) Fourth floor
    e) Fifth floor
14. Who lives at the floor at which Taru lives?
    a) Tej b) Tanuj c) Tanoj
    d) Taporaj e) Tamas
15. Who lives just below the floor at which Taporaj live?
    a) Tej b) Thaman c) Tamas
    d) Tanoj e) Tanuj

Directions (Q.No. 16-18): Study the following information to answer the given questions.

Mahesh, Balu, Ravi, Vijay, Yogi are sitting around a circular table facing away from the centre. They have different number of books with them. Mahesh sits 2nd to the right of the one who has highest number of books. Yogi has more books than Balu and Vijay, but not the highest. The one who has least number of books sits immediate right to Mahesh, who is not next to Balu. The one who has the 2nd least sits 2nd left to the one who has 2nd highest number of books. Balu does not have the least number of books.

16. If Mahesh has 55 books then what may be the number of books with the one who sits 2nd left to Ravi?
    a) 75 b) 80 c) 31
    d) 74 e) 95
17. If the all the persons except Ravi are made to sit in decreasing order of the number of books they have from left of Ravi, then who will sit 3rd to the right of Ravi?
    a) Mahesh b) Balu
    c) Vijay d) Yogi
    e) Can't be determined
18. Who among the following has the 3rd lowest number of books?
    a) Ravi b) Balu c) Vijay
    d) Yogi e) Mahesh

Directions (Q.No. 19-20): The following questions are based on the three-digit numbers given below:

342 783 617 584 287

19. If 1 is added to the second digit of each of the numbers how many numbers thus formed will be divisible by three?
    a) None b) One c) Two
    d) Three e) None of these
20. If all the digits in each of the numbers are arranged in descending order within the number which of the following will be the second highest number in the new arrangement of the numbers?
    a) 342 b) 783 c) 617
    d) 287 e) 549
21. In a family of six members having two generations. There are two married couples. Vamsi is the father-in-law of Rani. Latha is the sister-in-law of Priya, who is the mother of Madhu. Raju is the brother of Madhu, who is unmarried. Rani has no sister-in-law. Then how is Raju related to Rani?
    a) Brother-in-law b) Wife
    c) Husband d) Father
    e) None of these

Directions (Q.No. 22-24): In each of the questions below are given some statements followed by some conclusions. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts. Read all the conclusions and then decide which of the given conclusions logically does not follow from the given statements, disregarding commonly known facts. Give answer

22. Statements:
    All Bus is Car.
    Some Car is Red.
    All Red is Pop.
    Some Pop is not Boss.
    Conclusions:
    I. Some Pop is Car.
    II. Some Red is not Boss.
    III. All Boss is Pop is a possibility.
    a) Both I and II
    b) Only I
    c) Both II and III
    d) Only II e) All follows
23. Statements:
    Some Days are Hour.
    Some Hour is Seconds.
    Only watches are Seconds.
    Some watches are Dial.
    Conclusions:
    I. Some Dial is not Hour is a possibility.
    II. Some Seconds are Days.
    III. All Days are watches.
    a) Both I and II
    b) Only I
    c) Both II and III
    d) Only II
    e) Both I and III
24. Statements:
    All Lenovo is Honor.
    Some Honor is Moto.
    All Moto is Samsung.
    Some Moto is Huawei.
    Conclusions:
    I. Some Lenovo is Huawei.
    II. Some Samsung is not Huawei.
    III. Some Lenovo is not Honor is a possibility.
    a) Both I and II
    b) Only I c) Both II and III
    d) Only II e) None of these

Key with Solutions

(1-5):

1 V 2 S 3 A B

1) c; 2) d; 3) b; 4) c; 5) c

(6-10):

Winter	Yon
Water	Wat
Bottle	Bob
Win	Din
Wow	dit/foa
Fat	dit/foa
Summer	Yom
Money	wan/fud
Underground	wan/fud


6) d; 7) b; 8) e; 9) b; 10) e

(11-15):

Floor	Person	
5	Tanuj	Tej
4	Taporaj	
3	Tanoj	Taru
2	Tausiq	Tarak
1	Tamas	Thaman

11) b; 12) b; 13) a; 14) c; 15) d

(16-18):




Ravi > Yogi > Mahesh > Balu > Vijay

16) c; 17) a; 18) e;


19) 342 783 617 584 287
352 793 627 594 297
627, 594, 297 are divisible by 3
Ans: d

20) 342 783 617 584 287
432 873 761 854 872
Ans: d


21) Latha⁻ ← Vamsi+ <=> Priya⁻
↓
Madhu+ → Raju+<=> Rani⁻
Ans: c

22)


Ans: e

23)


Ans: d

24)


Ans: c